# కథా - పేథ

వి.ఆర్. నార్ల

894.8274
VEN

. B. R. AMBEDKAR
PEN UNIVERSITY

LIBRARY

HYDERABAD-500 033.

Dr. B R.A.O.U. LIBRARY

ACC. NO... N-8751

Date. .....

Call No 894.5934

వెంకటే

# పేర్ల మార్పు

ఉత్తర ప్రదేశ్ అటవీశాఖవారిది ఆటవిక మనస్తత్వం కాబోలు! కాకపోతే, సార్‌నాథ్‌లోని "మృగదావం" పేరును "విశ్వనాథ్ నికుంజ్" గా మార్చివేయడానికి వారు సాహసించేవారా? ఈనాటిదా నిన్నటిదా "మృగదావం" అనే పేరు? సిద్ధార్థుడు బుద్ధత్వాన్ని పొందకపూర్వంనుంచీ ఆ వనానికి అదే పేరు! నిరంజన నదీ తీరంలో, అశ్వత్థ వృక్షచ్ఛాయలలో, "మహా సంబోధి" ఘట్టం తర్వాత దుఃఖమయ ప్రపంచానికి తన నూతనధర్మాన్ని, తన కారుణ్యసందేశాన్ని చాటడానికై బయల్దేరిన గౌతమ బుద్ధుడు తన పూర్వ శిష్యపంచకాన్ని తిరిగి కలుసుకొన్నది "మృగదావం" లోనే. అక్కడనే ఆయన తన ప్రథమ ధర్మోపన్యాసం చేశాడు; అక్కడనే ఆయన పూర్వశిష్యులైదుగురు ప్రప్రథమ బౌద్ధభిక్షువులైనారు. "ధర్మ చక్రప్రవర్తనం" అక [illegible] యితం దాని పేరును "బుద్ధవనం" గానో [illegible] కి ప్రయత్నించలేదు. బుద్ధునితో, బౌద్ధమ [illegible] ని పురస్కరించుకొని అట్టి మార్పును [illegible] వుండేది. అశోకచక్ర వర్తి సయితం చేయ [illegible] అటవీశాఖాధికారులు

DR. B.R. AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N8751

సాహసించారు.

బౌద్ధమత సంస్థాపన దాదాపు రెండున్నర వేల సంవత్సరాల క్రితం జరిగింది. అంతకు ఎన్ని వందల సంవత్సరాలకు పూర్వంమృగదావానికి ఆ పేరు వచ్చిందో, ఎవరు దాన్ని పెట్టారో మనకు తెలియదు. అయినా, ఈనాడు దాన్ని చెరిపి వేయడానికి మూర్ఖులు కొందరు ముందుకు వచ్చారు! తమది హిందూమతం కావచ్చు; కాశీ విశ్వనాథునిపట్ల తమకు భక్తిప్రపత్తు లుండవచ్చు. అంత మాత్రం చేత బౌద్ధానికి అపచారం చేయవలెనా, దాన్ని అగౌరవ పరచవలెనా? బౌద్ధం మన దేశంలో అంతరించినా, ఈనాటికీ ప్రపంచప్రజలలో అత్యధిక సంఖ్యాకులు బౌద్ధులే! ఆ కోటానుకోట్ల బౌద్ధులకు తథాగతుడు జననమందిన లుంబినీవనంవలె, చాతుర్మాస్యానికై ఆయనకు అనాథపిండకుడు భక్తితో బహూకరించిన జేతవనంవలె, ఆయన నిర్యాణం చెందిన సాలవనంవలె, మృగదావంకూడా ఎంతో పవిత్రమైన వనం! తక్కిన వనాలు పోగా, మిగిలింది ఈ మృగదావమే! దీని పేరును "విశ్వనాథ్ నికుంజ్" గా మార్చడం విశ్వనాథుని గౌరవించడం కాకపోగా, శాక్యసింహుని పవిత్రస్మృతిని అగౌరవపరచడమే, దేశదేశాల బౌద్ధమతస్థుల మనస్సులను నొప్పించడమే!

పరమతాన్ని నిరసించడం దాన్ని న్యూనపరచడం స్వమతాన్ని అభిమానించడం కాదు, దాన్ని అవమానపరచడం! అయినా హిందూమత దురభిమానులు చిర కాలంగా ఈ పని చేస్తూనే వస్తున్నారు. అశోకచక్రవర్తికి ఒక ప్రసిద్ధనామం "దేవానాంప్రియుడు" అని. ఈమాటకు "మూర్ఖుడు" అనే దురర్థాన్ని కల్పించడం అశోక చక్రవర్తిని, ఆయన పరిపోషించిన బౌద్ధాన్ని నిందించడానికి కాదా? "శ్రమణుడు" అనే బౌద్ధ పారిభాషికపదానికి "నింద్యజీవనము గలవాడు" అనే దుష్టార్థాన్ని కల్పించడం బౌద్ధాన్ని నిరసించడానికి కాదా? వ్యుత్పత్తి ప్రకారం "ప్రబుద్ధుడు" అంటే "తెలియబడినవారిలో శ్రేష్ఠుడు" కావాలి. అయినా, దాన్ని పరమ మూర్ఖునికి ఒక పర్యాయపదాన్ని చేయడం తిరిగి బుద్ధునిపట్ల కంటగింపుతో కాదా? గుడివాడ, ఘంటసాల, చినగంజాం, అమరావతి మొదలైన చోట్ల బౌద్ధ చైత్యాలను, విహారాలను పూర్తిగా ధ్వంసం చేసి, వాటికి "లంజదిబ్బ" లని పాడుపేరు పెట్టడమైనా బౌద్ధంపట్ల విద్వేషంతో కాదా?

ఉత్తరప్రదేశ్‌లో వలె మత దురభిమానంవల్ల కానివ్వండి, మరొక కారణంవల్ల కానివ్వండి-ప్రసిద్ధమైన, ప్రాచీనమైన పేర్లనుసయితం మార్చి వేయడం మన దేశంలో ప్రస్తుతం విశేషంగా జరుగుతున్నది. ఈ మార్పులలో కొన్ని సముచితమైనవే.

AOUA102B124



తమకు నోరు తిరగకపోతేసరి, ఏ వూరు పేరునైనా చిత్తం వచ్చినట్టు మార్చి వేయడం ఇంగ్లీషువారికి పరిపాటి. ఊళ్ళపేర్లనేకాదు, పట్టణాల పేర్లనే కాదు, ప్రపంచప్రసిద్ధి కెక్కిన మహానగరాల పేర్లనే ఈ విధంగా వారు మార్చివేశారు. "ప్యారీ"ని వారు "పారిస్" చేశారు. "రోమా"ను "రోమ్" చేశారు. "వెనీజియా"ను "వెనిస్" చేశారు. "వీన్"ను వియన్నా చేశారు; "మస్కావ్"ను "మాస్కో" చేశారు; "జెనివీవ్"ను "జెనీవా" చేశారు. కొంతకాలంపాటు వీలుబడి తమ దైనందున మన దేశంలో మరింతగా ఈ పుణ్యాన్ని వారు కట్టుకొన్నారు. మధురను "మత్రా"గా, అయోధ్యను "ఔడ్"గా, తిరుచిరపల్లిని "త్రిచునాపలి"గా వారు మార్చారు.మన తెలుగు పట్టణాలలో కొన్నింటికి సయితం ఈ దౌర్భాగ్యం తప్పలేదు. వారి నోటపడి కాకినాడ "కోకనాడ" అయింది; మచిలీపట్నం ; "మసులా" అయింది. రాజమహేంద్రవరం "రాజమండ్రి" అయింది; విశాఖపట్నం "వైజాగ్" అయింది. ఇంగ్లీషువారు ఇంతగా వికృతం చేసిన ఈ పేర్లను మార్చి వేయడంలో తప్పలేదు.

అయితే, ఇట్టివాటిలో సయితం పూర్తిగా రూఢమైపోయిన పేర్లను మార్చే ప్రయత్నం మాత్రం వాంఛనీయం కాబోదు. కలకత్తాను "కాళీఘట్టం"గా, మద్రాసును "చెన్నై"గా, లక్నోను "లక్ష్మణపురం"గా, హైదరాబాదును "భాగ్యనగర్"గా, ఏలూరును "హేలాపురి"గా, నెల్లూరును "సింహపురి"గా ఈనాడు మనం మార్చితే, అది విజ్ఞత కాబోదు.

అయినా, ఈ విధమైన మార్పులు కొన్ని జరుగుతూనే వున్నాయి. వీటిలో ప్రత్యేకించి పేర్కొనవలసినట్టిది బెజవాడను "విజయవాడ"గా మార్చడం. ఇంగ్లీషువారి నోరు తిరగని కారణాన బెజవాడ "విజయవాడ" కాలేదు; ఆదినుంచీ బెజవాడ బెజవాడే! క్రీస్తుశకం 820 ప్రాంతంనాటి యుద్ధమల్లుని శాసనం ఈ పట్టణాన్ని "బెజవాడ" అనే పేర్కొన్నది. మల్లేశ్వరస్వామి ఆలయంలో వున్న ఈ శిలాశాసనం "బెజవాడ గొమరసామికి" అని, "బెజవాడ జాత్రకు వచ్చి" అని, "బెజవాడ కెల్ల" అని మూడు చోట్ల ఈ పట్టణ ప్రసక్తిని తెచ్చి, అన్నిసార్లు దీన్ని బెజవాడే అన్నది. ఇంద్రకీలాద్రి కిందిభాగంలో ఖిలమై వున్న మండపంలోగల 1046 నాటి శాసనంకూడా దీన్ని బెజవాడే అన్నది. ఇంత ప్రాచీనమైన ఈ పేరును ఎందుకు మార్చవలసి వచ్చిందో ఆ మార్చినవారికే తెలియాలి. "విజయ" వచ్చి సంస్కృతం; "వాడ" అచ్చతెనుగు. ఈ రెండింటిని చేర్చగా వచ్చిన వికృత మిశ్రసమాసం "విజయవాడ". "అయ్యవార్లంగారిని చేయబోయి కోతిని చేయడం"

అంటే ఇదికాక మరేమిటి?

తెలిసో, తెలియకో మునిసిపాలిటీలు ఇట్టి పిచ్చిపని చేయబోతే, రాష్ట్రప్రభుత్వం జోక్యం కలిగించుకోవాలి. కుంభకోణం పేరును "కుడన్‌తై"గా మార్చడానికి ఈ మధ్యనే ఆ పురపాలక సంఘం తీర్మానించింది. కుంభకోణం మోసానికి ఒక నుడికారమైందట. ఈ దుష్టార్థంతో "ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు డిక్షనరీ"లో కుంభకోణం నమోదు అయిందట. అందువల్ల ఆ పేరు పోవాలట, కొత్తదాన్ని పెట్టుకోవాలట. రెండు, మూడు దశాబ్దాలుగా కుంభకోణంవారిలో కొందరు ఈ ఆందోళన కానసాగిస్తున్నారు. దీన్ని పరిగణించే కాబోలు, "ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు డిక్షనరీ" కొత్త ముద్రణలో నుంచి, (ఈ మాటను నేను కచ్చితంగా చెప్పలేనుగాని, నిశ్చయంగా "కన్‌సైజ్డ్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ" నుంచి) కుంభకోణం పదాన్ని యెత్తివేశారు. అయినా వచ్చిన వాదు రానేవచ్చిందని కాబోలు, మార్పుకే పురపాలక సంఘం మొన్న తీర్మానించింది.

బెజవాడవలె కుంభకోణం అతిప్రాచీనమైన పేరు. దాన్ని మార్చాలంటే "కుడన్‌తై"గా ఎందుకు మార్చాలని, "కుడమూకు" ఎందుకు కారాదని కొందరు ప్రశ్నిస్తున్నారు. కుంభకోణానికి ఒక పర్యాయపదంగా"కుడన్‌తై" ఇటీవలి సాహిత్యంలో కానరాగా, కొన్ని పురాతన గ్రంథాలు దాన్ని "కుడమూకు"గా పేర్కొన్నవట! ఏమైనా ఈ రెండు పేర్లకంటె కుంభకోణమే చెవికి ఎంతో యింపుగా వున్నది! సగం సగం పనికి "తిరుపతిక్షవరం" ఒక నుడికార మైనందున తిరుపతి పేరును మార్చడం సబబు కాగలదా? అనవసరమైన వాక్కలహానికి "తుని తగవు" ఒక పలుకుబడిగా పరిణమించిందని తుని పేరును మార్చడం సబబు కాగలదా? "చిదంబర రహస్యం", "శ్రీరంగనీతులు" అనే నుడికారాలను పురస్కరించుకొని, ఆ నగరాల పేర్లను మార్చడం సబబు కాగలదా? తమ ఊరుపేరు ఒక నుడికారం, లేదా ఒక పలుకుబడి పుట్టడానికి మూలమైతే, అందుకు సంతోషించలేక, ఉడికిలడం ఉదాత్తలక్షణం కాదు. బిల్లింగ్స్‌గేట్ లండన్‌లో ఒక చేపల మార్కెట్టు పేరు. బూతులకు, బండలకు అది నుడికారమైంది. అయినా, ఆ మార్కెట్టు వారు సమావేశమై, దాని పేరు మార్చాలని తీర్మానించబోవడంలేదు.

ఉడుకుబోతుతనంకొద్ది పాత పేరును మార్చివేసుకొన్నా, దానికి సంబంధించిన వాసన పోతుందని నే ననుకోను. "పిల్లి పోయినా, పురిటికంపు పోదు" అనే సామెత ఊరికే పుట్టలేదు. వెనకటికి ఒక తిక్కయ్య తనకు అమ్మా నాన్నా పెట్టిన ఆ పేరు బాగా లేదని "శంకరయ్య" అనే కొత్త పేరును యెన్నుకొన్నా

డట. సర్కారువారికి కట్టవలసిన ముడుపు కట్టుకొని, సర్కారు రికార్డులలో ఈ మార్పును నమోదు చేయించుకొన్నాడట. తీరా ఇంత హైరానపడిన తర్వాత అతడిని లోకులు "తిక్కశంకరయ్య" అని పిలవడం ప్రారంభించారట! కుంభ కోణం విషయంలో ఇంతే జరగదని ఎవరు చెప్పగలరు? ఏమైనా పేరు మార్పువల్ల ఏవో పరువు మర్యాదలు రాగల వనుకోవడం మనలను మనం "కుంభకోణం" చేసుకొనడమే!

*

# అత్తా కోడళ్ళు

చాలా చెదురుగా తప్ప అత్తకు కోడలితో పొత్తు కుదురదు; కోడలికి అత్త పొడకిట్టదు. ఒకరు యెడ్డె మంటే మరొకరు తెడ్డె మంటారు; ఒకరు మూతి ముడిస్తే, మరొకరు ముక్కు విరుస్తారు; ఒకరు బుగ్గలు నొక్కుకుంటే, మరొకరు ముక్కుపై వేలువేసుకుంటారు. కాకిమీదపెట్టి, పిల్లిమీదపెట్టి, ఒకరినొకరు అనుకునే సూటిపోటి మాటులకు అంతూ పొంతూ వుండదు. కోడలు చాయతక్కువైనదైతే, ఎదురుగోడపై కూర్చుని "కా! కా! అంటున్న కాకమ్మను చూచి, కోడలు వినేటట్టు, "ఎందుకమ్మా అంత పొంగు, అందం కారిపోతున్నదనా?" అని అత్తఊడ వేస్తుంది. అప్పటికి తనను కాదన్నట్టు ఊరుకున్నా, మరి కాసేపటికో, కూసేపటికో, కోడలు తానూ కాకినే అడ్డం పెట్టుకుని "నీ కేమి పాయ్యేకాలమే! అలా అరుస్తున్నావ్! ఇంతకీ నోరు పెట్టుకు బ్రతుకనేర్చావ్" అని బదులు తీర్చుతుంది. "నాకు పాయ్యేకాల మంటావటే! నీ బాబుకు పాయ్యేకాలం, నీ అమ్మకు పాయ్యేకాలం" అని అత్త అందుకున్నదంటే, ఆ పూట జగడం తప్పదు. మాటలు ముదిరినతర్వాత తానే తగ్గవలసివస్తే, అత్త ఒకమూలకు తప్పుకుని తన వెనిమిటిని, తన కొడుకును నాలుగు సాధిస్తుంది; కోడలే

తగ్గవలసివస్తే, పాపపుణ్యాలెరగని తన బిడ్డలను యెడపెడా నాలుగు ఉతుకుతుంది. అందుకు చేతులు రాకపోతే, "అత్తమీద కోపం దుత్తమీద" చూపుతుంది. పోట్లాడి పోట్లాడి, అలసిపోయిన వెనక అత్త చింకిచాప పరచుకోగా, కోడలు కుక్కిమంచం వాల్చుకుంటుంది. ఇక ఆ రోజుకు ఇంటిల్లిపాదికీ కూడూకుమ్మా వుండవు. మరి కొందరు అత్తా కోడళ్ళమధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది! సాధింపు లతో ఆగక, వాళ్ళ జగడం సిగపట్లగోత్రం వరకు వెళ్ళడం కద్దు. ఆ తర్వాత "అత్తకూ, నాకూ అరుంబాతిక, అత్తను ఎత్తుకు వెళ్ళవే ముత్యాలమ్మా! " అని కోడలు దణ్ణాలు పెట్టుకోగా, "కొడుకు బాగుండవలె, కోడలు ముండమొయ్యవలె" అంటూ అత్త ముక్కోటి దేవుళ్ళకు మొక్కుకుంటుంది.

"కొంపలో ఈ రభస తగు నటమ్మా?" అని ఏ మామగారో కోడలిని మందలిస్తే, వెంటనే ఆమె "అంతేలెండి, అత్త చేసిన పనులకు ఆరళ్ళు లేవు" అంటుంది. "ని న్నేమి ఆరడి పెడుతున్నది? మంచిగానే చూస్తున్నదే!" అంటే "అత్త మంచి, వేముల తీపూ లేదు" అని మరొక సామెత ఏకరవు పెడుతుంది. ఇంకా కటువుగా మాట్లాడాలంటే "కత్తి మెత్తనా, అత్త మంచి లే" దన్న లోకోక్తినే ప్రయోగిస్తుంది. "పోనీ, పెద్దదానివి - నువ్వైనా సర్దుకు పోరాదా?" అని అత్తకే చెబితే, "ఏం చెప్పమంటారు నా బ్రతుకు? కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది" అని మెల్లగా ప్రారంభించి, చదవవలసిన నాలుగూ చదువుతుంది. తన పని "నోరు మూస్తే మూగ, నోరు తెరిస్తే రాగ" అంటుంది. "ముందు వచ్చిన చెవులకంటె వెనక వచ్చిన కొమ్ములు వాడి" అంటుంది. "కూతుళ్ళను కన్నమ్మకు కురిచి పీటలు, కొడుకులను కన్నమ్మకు గోడపంచలు" అని పెద్దలు చెప్పనే చెప్పారని బారలు తీస్తుంది.

అత్తాకోడళ్ళ తగాదాలో తీర్పు చెప్పడం ఆ హరిబ్రహ్మాదులకైనా సాధ్యం కాదు. "అత్తా ఒకరింటి కోడలే". కాని, అత్తరికం చెయ్యవచ్చేసరికి తన కోడరికం మాట పరగడుపు అయిపోతుంది. తనపై తన అత్త చెలాయించిన పెత్తనాన్ని తన కోడలిపై తాను వెలగబెట్టడానికి చూస్తుంది. "అత్త పగలగొట్టిన కుండ అడుగోటి కుండ, కోడలు పగలగొట్టింది కొత్తకుండ" అని ఒకప్పుడు తానే గుడ్లు నీళ్ళు గుడ్లు కుక్కుకున్న సంగతి మరచిపోతుంది. "పెద్ద దానివి, "ఏ పనీ ముట్టుకోవ" ద్దంటే, తనను తోసివేస్తున్నట్టు బాధపడుతుంది. పైపై పని ఏదైనా కాస్త చూడమంటే,అరపై వరహా లిచ్చినా అత్తవంటి బానిస దొరక"దని నలుగుతుంది.

అయితే, నెపాన్ని కేవలం అత్తలపైనే వెయ్యడం శుద్ధతప్పు. కయ్యానికి కనీస

మిద్దరైనా కావాలి. కోడళ్ళ ఉసురు పోసుకునే అత్తలెంద రుంటారో, అత్తలను వేపుకుతినే కోడళ్ళుకూడా కొంచె మించుమించుగా అంద రుంటారు. అయితే, అత్తనోరు వినిపించినంతగా కోడలి నోరు వినిపించకపోవచ్చు. మాటకు మాట అనకుండానే "అనిపించుకోవలెనా, అత్తగారూ? " అని చురక తగిలించడం చాలదటండీ, అత్త మరింత వేటురేగి, నలుగురి నోటా పడ్డానికి! తిట్టకుండా తిమ్మకుండా పొగ పెట్టడంలో మొత్తంపై కోడళ్ళు ఆరిందాలు. అత్తలు ఎంత ఊడిగం చేసిపెట్టినా, "అమర్చిన దాంట్లో అత్తగారు వేలు పెట్టింది" అని వాళ్ళు చులాగ్గా అని వెయ్యగలరు. చాటుమాటుగా అమ్మలక్కలందరినీ చేర్చి –

"ఇరుగు పొరుగూలార! ఓ చేడెలారా!
అత్తగా రారళ్ళు చిత్తగించండి:
పెత్తనం లాగేస్తె వేచీలు పోను"
అని అక్కసు వెళ్ళగక్క గలరు.

అత్తాకోడళ్ళ పోట్లాటలో ముఖ్యంగా నలిగిపోయేవాడు అత్తకు కొడుకు, కోడలికి పెనిమిటి అయినవాడే. అతడు ఆలిని వెనక వేసుకు రాకపోయినా, ఎటూ మాటాడక మెదలకుండా వూరుకున్నా, "పెళ్ళాం బెల్లం, తల్లి విషం" అనే మాట రానే వస్తుంది. అంతటితో సరిపోతే నయమే! కాని, "మీరూ మీరూ ఒక్కటే – నేనే కదండీ పరాయిదాన్ని!" అనే నిష్ఠురాన్ని కూడా వినవలసివ స్తుంది. "చెప్పలోని రాయి, చెవిలోని జోరీగ" అనే పద్యంలో వేమన వేర్కొన్న "ఇంటిలోని పోరు" అత్తాకోడళ్ళ జగడమే అయివుండాలి. ఏమైనా అత్తాకోడ ళ్ళకు నూటికో, కోటికో తప్ప పొసగదు. ఇందువల్ల ఉభయులు పలచబడతారు; ఉభయులు చులక నౌతారు. కాబట్టే——

"అత్తలేనీ కోడలు లుత్తమూరాలూ,
కోడలూ లేనత్త గుణవంతురాలూ"

అన్నారు.

అత్త వెట్టే రాయిడివల్లనే "అత్తవారింటి సుఖం మోచేతి దెబ్బవంటిది" అనే సామెత పుట్టింది. కోడలు వెట్టే కడగండ్లవల్లనే "కోడలు గృహప్రవేశం అత్త గంగా ప్రవేశం" అనే పలుకుబడి ఏర్పడింది. వీరి కలహాలు, వీరి కార్పణ్యాలు, వీరు పాడుకునే దంపుడు పాటలలోకి కూడా ఎక్కిపోయాయి. కోడళ్ళు పాడే పాటలలో అత్తలకు ఆపాదించబడే మన్నీ అవగుణాలే! కోడళ్ళను యిగరబెట్టి,

అత్తలు కంఠ పూర్తిగా మెక్కుతారట. ఈ పాపిష్ఠి పని చేసే అత్తలపై కోడళ్ళు తమ కసి ఎలా తీర్చుకొన్నారో చూడండి:

"అత్తగారన్నది తా పెద్దమనిషి
కోడలికి దుడ్డెట్టి తా గెడ్డ తినెను.
గెడ్డలు తిన్నత్త గెడ్డలపాలాయె,
దుడ్డుతిన్న కోడలు దుడ్డల్లె వుండె."

కోడళ్ళను తప్ప లెన్నడమే అత్తలు పనిగా పెట్టుకొంటారట. ఎంతగా రెక్కలు విరుచుకున్నా –

"దంచకా నలగవే ధాన్యరాసుల్లు
వంచకా వంగరే వనిత కోడళ్ళూ!"

అని సాధిస్తారట. ఏవో తప్ప లెన్నాలన్న తాపత్రయం కొద్దీ అడుగడుగుకు అత్తలు, తమ తెలివితక్కువ బయటబడవేసుకొంటారట కూడా.

"కోడలా కోడలా కొడుకు పెండామ!
పచ్చిపాలామీద మీగ డేదమ్మ?
వేడి పాలామీద వెన్న యేదమ్మ?"

"అత్త! నీ చేత ఆరళ్ళెగాని
పచ్చిపాలా మీద మీగ డుంటుందా?
వేడి పాలామీద వెన్న వుంటుందా?"

అత్తలు రాచి రంపాన పెడతారు కాబట్టి, అత్తవారిల్లు కేవలం అడవితో సమానమని ధ్వనిస్తున్న పాట మరొకటి వున్నది:

"వెంకటప్పడి కొండ వెలిసుండవలెను
ఎప్పటికి పుట్టిల్లు కలిగుండవలెను
పుట్టింట దీర్ఘాయు కావలె నటంచు
పున్నమ చంద్రుడికి పూజ నే జేతు"

"అత్తింట దీర్ఘాయు కావలెనటంచు
ఆది నారాయుడికి అర్ఘ్యమ్ము లిత్తు
ఆడవారి నేల కన్నావు తల్లి?
అడవుల పా లేల చేశావు తల్లి?"

కోడళ్ళు ఇంతగా తమను ఆడిపోసుకుంటూ వుంటే అత్తలేనా తక్కువ తిన్న వాళ్లు? కోడళ్ళపై వాళ్లూ కొన్ని పాట లల్లారు. కోడళ్ళు తిండికైతే జాణలట; పనికి దొంగలట.

"పాచి ఊడ్వలేను ఓ యత్తగారు
బాజిబందుల చేయి పైకెత్తలేను!
పేడ తియ్యాలేను ఓ యత్తగారు
పెదగేదె పెరుగు నే తాగగల్దు !
వడ్లు దంచాలేను ఓ యత్తగారు
ఒప్పైన వరికూడు నే తినాగల్దు"

అత్తల అదుపాజ్ఞలలో పెరగకపోతే, కోడళ్లు హద్దుమీరి పోతారట.

"అత్తింటి కోడలవు కావుగావున్నె,
ఆజ్ఞసిగ్గులు నీకు లేవుగావున్నె!
వీపునిండా కొంగేదె? ఇల వరసలేవె?
మడమ తిరగ బట్టేదె? మాట తీరేదె?"

"నా కాలం తీరిపోయింది. కన్న తల్లివలె నువ్వే ఇక నన్ను కడుపులో పెట్టుకోవాలి" అని కోడలికి చేయత్తి అత్తదణ్ణం పెడితే---

"చాలు చా లత్తయ్య చ లత్తగారూ
నీ కొడుకు వేయిళ్ళ మొదలు కావాలీ
నీ కోడలు పట్టంపురాణి కావాలీ
నువ్వెళ్ళి పంచల్లపాలు కావాలీ"

అని దీవిస్తుందట. అత్త మామలపై కోడిలికి ఏ కోశానా ప్రేమాదరాలు వుండవట. అత్తమామలు పోయినప్పుడు కోడలు కన్నీరు మున్నీరుగా యేడ్చినా, అది కల్లబొల్లి యేడ్పు తప్ప వేరు కాదట.

"అత్త చచ్చిన కోడ లేమనీ యేడ్చు?"
"పాయికాడ చీద్రమ్ము పోతివా అత్త!"
"మామ చచ్చిన కోడ లేమనీ యేడ్చు?"
"మంచాల మరణమ్ము పోతివా మామ!"

కోడలి కన్నీళ్ళను మొసలి కన్నీళ్లుగా కొట్టిపారవేసే సామెతలు కొన్ని వున్నాయి కూడా. ఎవరైనా దొంగ యేడుపులు యేడిస్తే, "అత్తచస్తే కోడలు యేడ్చినట్టు" అంటారు. ఇట్టిదే "అత్త చచ్చిన ఆరు మాసాలకు కోడలికంట నీరు వచ్చినట్టు" అనే లోకోక్తి కూడా.

పాటలలోకి, సామెతలలోకి మాత్రమే కాక, పద్యాలలోకి కూడా కోడలిని యెక్కించారు. అత్తింటి కోడలిని గురించిన ఒక చాటు పద్యమిది:

పొరుగిళ్ళ గూర్చుండి ప్రొద్దుపుచ్చగ నేర్చె
నీలాటి రేవున నిల్వ నేర్చె
అత్తాడుబిడ్డల నాడిపోయగ నేర్చె
గూర్చుండి నట్టింట గొణగ నేర్చె
పనిపేళ మూల్గుచు బండకుండగ నేర్చె
జెంపను సున్నంబు నింప నేర్చె
పసిబిడ్డ లేడ్వంగ విసరి కొట్టగ నేర్చె
నొక రెండు పస్తులు నుండ నేర్చె
పెళ్లుపెళ్లున మెటికలు విఱువ నేర్చె
నెవ్వరును నాకు లేరని యేడ్వ నేర్చె
బుట్టినింటికి జెప్పకో బోవ నేర్చె
నవుర! యత్తింటి కోడలి యవగుణములు!

అత్తాగోడల్లమధ్య గుద్దులాటకు అత్యధిక సందర్భాలలో వాళ్ళిద్దరికీ ఆ వావివరుసా కూర్చిన వ్యక్తిపై ఎవరి కెక్కువ హక్కు వుండాలన్న పట్టుదలే. అయితే, ఈ మాటను వా రుభయులు ససేమిరా వొప్పుకోరు. ఈడు వచ్చేసరికి కుమారునికి వివాహం కాకపోతే, తల్లికి తలకొట్టివేసినట్టుగానే వుంటుంది. సంబంధాలను విచారించవలసిందిగా భర్తను తొందరపెడుతుంది. పెళ్ళి రాయబారాల కెవరైనా వస్తే కాబోయే కోడలిని పసందు చెయ్యడానికి తానే బయల్దేరుతుంది. "కోడలు నలుపైతే కులమంతా నలుపే" అని పుత్తడి బొమ్మకోసం వెదుకుతుంది. చెంపకు చేరడేసి కళ్లు,కోటేరువంటిముక్కు, దానిమ్మగింజలలాంటి పలువరుస, రూపాయం తటి బొట్టు పెట్టుకోవడానికి తగుపాటి పెద్దనుదురు -- ఇలాంటి సల్లక్షణాలన్నీ వుండాలని గొంతెమ్మ కోరికలు కోరుతుంది. పెళ్ళికూతురుకు చదువు, సంగీతాలు వచ్చునా అని విచారిస్తుంది. మాట్లాడించి, గొంతు సన్ననిదా, పెద్దదా,మాటలో

నత్తి తొస్సే లేవుగదా అని ఎన్నో పరీక్షలు చేస్తుంది. ఏదో వంక కల్పించి నాలుగడుగులు నడిపించికూడా చూస్తుంది. అంతటితోనైనా ఆగక, కాబోయే వియ్యాలవారి కుటుంబ మర్యాదలను, సంప్రదాయాలను ఆరా తీస్తుంది. వారి బంధుమిత్రులెవరని భోగట్టా చేస్తుంది. అన్నీ నచ్చి, ఆ మూడు ముళ్లూ పడిన తర్వాత పల్లకీనుంచి పెళ్లికొడుకుతోపాటు కోడలు తొలిసారిగా తన గుమ్మంలో పాదం పెడుతుండగా, దిష్టి తీసి, హారతులిచ్చి, అటు పిమ్మటనే లోపలికి తీసుకు వెడుతుంది. "ఇదిగో! పుల్లమ్మపిన్నీ! ఒకసారొచ్చి మనమరాలిని చూచిపో!" అని, యల్లమ్మక్కా! కోడలిని చూడ్డానికి రానేలేదే మమ్మా?" అని ఇరుగు పొరుగు అమ్మలక్కలందరినీ పిలుచుకు వస్తుంది. ఇంత తహతహలాడి, ఇంత పసందు చేసి, ఇంత ఆప్యాయంగా కోడలిని ఏరి కోరి తెచ్చుకున్నా, ఏడాది గిర్రున తిరిగిరాక ముందే తాను బొందనుపడ్డానని గోలపెడుతుంది. కోడలు ఒకసారికి రెండుసార్లు దిద్దుకుంటే, అద్దంముందే కూర్చుంటుందా, ఇవతలి పుల్ల అవతల పెడుతుందా!" అని విసుక్కుంటుంది. పుస్తకం పుచ్చుకు కూర్చున్నా, వీణనో, ఫిడేలునో బయటకు తీసినా, "వేళాపాళా లేదటే?" అని సన్నాయి నొక్కునొక్కుతుంది. అన్నీ కట్టిపెట్టి బండచాకిరి చేస్తుంటే "ముద్దూమురిపెం లేదు. పెళ్ళి చదువులు, పెళ్ళి సంగీతాలు!!" అని పెదవి విరుస్తుంది. వియ్యాలవారు అంత ఘనులని, ఇంత ఘనులని పెళ్ళికి ముందు చెప్పకున్న గొప్పలన్నీ పూర్తిగా మాయమైపోతాయి. వియ్యాలవారి పెట్టుపోతలు తగ్గినవని—

"వేసంకాలం వచ్చె వలువల్లు చిరిగె
వనిత నీ పుట్టింటి వా రేల రారు?
మారుకాలం వచ్చె మడతలూ చిరిగె
మగువ నీ పుట్టింటి వా రేల రారు?"

అని ఆడిపోసుకుంటుంది.

కోడలు కాపురానికి వచ్చాక, కొద్ది రోజులలోనే అత్తలో ఇంత మార్పు రావడానికి కారణం "అమ్మా! అన్నం వడ్డించవే" అని అడిగే కొడుకు "ఏమే ! అన్నం పెట్టు!" అని దూరాలోచన లేకుండా అనే చిన్నముక్కలోనే వుండవచ్చు. "అమ్మా! ఈ డబ్బు దాచిపెట్టు" అనడానికి మారుగా "ఒసే! ఈ పైకం భద్రం చెయ్యి" అని అనాలోచితంగా పలికే పలుకులోనే వుండవచ్చు. ఇలాంటి మాటలు అడపా తడపా వినవలసివస్తే తన కొడుకు తనకు దూర మౌతున్నాడన్న

బాధ (ఆమెకు తెలియకుండానే) మాతృహృదయంలో ప్రవేశిస్తుంది. దానితో అత్తాకోడళ్ళమధ్య పుండు పుడుతుంది.

తన భర్త ప్రేమలో చివరికి అతని కన్నతల్లికూడా పాలు పంచుకోవడాన్ని సహించలేక అమ్మనుంచి కొడుకును వేరుచెయ్యడానికి కోడలైనా తాను ఆడే నాట కాలను (తెలిసో తెలియకో) ఆడక మానదు. భర్తకు చేయవలసిన సేవలన్నింటినీ పట్టుదలగా తానే చెయ్యడం మొదలు, ఉన్నవీ లేనివీ కలిపి అత్తపై పితూ రీలు చెప్పడం వరకు సమస్తం ఈ "ప్రేమయుద్ధం"లో ఆయుధాలే. తల్లిప్రేమకు, భార్యప్రేమకు ఏమీ సంబంధం లేకపోయినా, ఏ ప్రేమైనా గుడ్డిది కనుక, గుడ్డిగా అవి ఢీ కొనడం వల్ల వచ్చేదే అత్తాకోడళ్ళ వివాదం. అత్త గయ్యాళిగంప కాకపో యినా కోడలు నాలిముచ్చు కాకపోయినా, వారిద్దరికీమధ్య పొరపులు పుడ్డటంలోని రహస్యం చాలా వరకు ఇందులోనే వున్నది.

అయితే, "అల్లుని మంచితనంబును..... తెల్లని కాకులును లేవు తెలియర సుమతీ!" అన్నట్టు కజ్జాలు పెట్టుకోని, కలహాలకు దిగని అత్తాకోడళ్ళు మచ్చుకైనా లే రనలేము. నడిస్తే కందిపోగల దన్నట్టు కోడలిని ప్రేమగా చూచుకొనే అత్త లున్నారు; కన్నతల్లికంటె మిన్నగా అత్తను పువ్వులలో పెట్టి పూజించే కోడళ్ళూ వున్నారు. కోడ లంటే ప్రాణమిచ్చే ఒక అత్తగారే--

"కొడుకంటూ పుట్టాడు కొంటెకోణంగి
కోడలంటూ వచ్చింది రవ్వల్ల రాణి"

అని మనసారా అనగలిగింది. అత్తపై మమకారమే ఒక కోడలిచేత--
"మన్నరాజు వంటివాడు మామ గురవయ్య
అధిక చక్కనిదమ్మ అత్త గురవమ్మ"

అనిపించింది.

*

# ఇంటి దొంగ

పాపం! ఆమె ఎంతగా కలతపడిందో ! కన్నీరు మున్నీరుగా ఎంత విలపించిందో! కంటికి నిద్ర దూరం కాగా, ఎన్ని ఆలోచనలు, మరెన్ని అనుమానాలు ఆమెను సంక్షోభపెట్టినవో!

మధ్యప్రదేశ్‌లోని ఖండ్వానుంచి నిన్న వచ్చిన వార్త ఆమె ఊరుపేరు పోల్కార్ అని చెప్పినా, ఆమె పేరేమిటో చెప్పలేదు. ఆమెకు బిడ్డాపాపా వున్నారో, లేరో చెప్పలేదు. పాలమూ పుట్రా వున్నాయో, లేదో చెప్పలేదు. నగల సంగతి, నగదు సంగతి మాత్రమే చెప్పింది. ఆ నగల విలువ అయిదారు వందలు మాత్రం; ఆ నగదైనా 340 రూపాయలే. కూడు గుడ్డలకు లోపం లేకపోయినా, ఆమె స్థితిగతులు అతిసామాన్యమైనవని దీన్నిబట్టి మనం అనుకోవాలి. తనకు వచ్చిన ఆపదను గురించి తానే స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి మొరపెట్టుకొన్నందున మగదిక్కులేదనే ఊహించాలి. పిల్లాపీచూ వున్నా, అందివచ్చిన వారు కారని తీర్మానించుకోవాలి.

ఇంతవరకు ఊహ చేసిన తర్వాత మిగిలిన కథను మన మనోనేత్రంతో స్పష్టంగానే చూడవచ్చు. కోడికూతతో లేచి, కళ్లు నులుముకొంటూ, ఒళ్లు విరుచుకొంటూ,

N-8751



Dr. BRAOU LIBRARY Acc. No: 64.8274 Class No: పెళ్ళికి

"హే రామ్! హే రామ్!" అంటూ భగవన్నామస్మరణ చేస్తూ, అనవాయితీ ప్రకారం తలగడకిందకు పోనిచ్చిన చేతికి రాత్రి అక్కడ పదిలపరచిన గుడ్డసంచి తగలకపోయేసరికి ఆమె గుండె గుభేలు మనింది. అంతలో కొయ్యబారిన మనిషి అంత లోనే తెప్పిరిల్లి, తత్తరపాటుతో దిండును ఒక పక్కకునెట్టి, పక్క గుడ్డలను చిందర వందర చేసి, హడావుడిగా వెదుకులాడింది. అప్పటికీ సంచి కనబడకపోగా, మంచం క్రిందికి తొంగిచూచింది. అంతటితో సంతృప్తిపడక, ఒక్క ఊపుతో మంచాన్ని పైకెత్తి, తనను, తన ప్రారబ్ధాన్ని తిట్టుకొంటూ, మరింత గాలించింది. ఈ లోపల ఆమెకు ముచ్చెమటలు పోసుకువచ్చాయి. చెక్కిళ్ళవెంట కన్నీళ్లు కాల్వలై, వాగులై, యేరులై పరుగులెత్తాయి.

కనుచీకటి పడగానే తాను పిల్లలకు అన్నాలు పెట్టి పడుకోబెట్టింది. తర్వాత తాను కూడా నాలుగు మెతుకులు నోటిలో వేసుకొన్నది. వంటిల్లు సర్ది, దీపపు బుడ్డి చేతబట్టుకొని, తలుపులకు గడలు వేసింది. వేసిన గడలు సరిగా పడినవో, లేవో అని తలుపులను ఒకసారి లాగి చూచింది. తన పెళ్ళినాడు కన్నవా రిచ్చిన చందువా పెట్టెలో వున్న చేతిసంచిని తీసి, ప్రతిరాత్రి చేస్తున్నట్టు, ఆ రాత్రి కూడా తలగడ కింద దాన్ని భద్రం చేసింది. మంచం పక్కనే వున్న కుర్చీ పీటపై దీపపు బుడ్డిని పెట్టి, కాసేపు కృష్ణా, రామా అనుకొన్నది. పగలంతా ఇంటి పనులు చక్కబెట్టుకొన్నందున అంతలోనే నిద్ర తూగివచ్చింది. అప్పుడు దీపాన్ని కొండెక్కించి, పక్కకు వొత్తిగిలి, కళ్లు మూసుకొంటూ, దిండుకిందికి చేయి పోనిచ్చి, గుడ్డసంచి భద్రంగా వున్నట్టు ధ్రువపరచుకొన్నది. మరి తెల్లవారే సరికి ఆ సంచి ఏమైపోయినట్టు?

చటుక్కున తనకు నిద్ర పట్టేమాట నిజమే. అయినా తనది కోడినిద్ర. కాస్త అలికిడి తగిలినా అంతలో మెలుకువ వస్తుంది. రాత్రి అలికి డన్నమాటే లేదే? పోనీ, ఆదమరచి నిద్రపోవడంవల్ల దొంగలు పడ్డారని అనుకుందామా అంటే, వేసిన తలుపులు వేసినట్టే వున్నాయి. అయితే మరి దిండుకింది గుడ్డసంచి ఎలా గల్లంతు అయినట్టు? ఇంటి దొంగలనే అనుకొందామా అంటే తాను, తన పిల్లలు తప్ప మరొకరు లేరయ్యే! ఆ పసికందులు తన సంచి జోలి కెందుకు పోతారు? పెద్ద సన్నాసికి కాస్త చెయ్యి ఆడించే గుణం వున్నా, రూపాయో, అర్థో కాజేస్తాడు గాని, మొత్తం సంచినే కొట్టివేస్తాడా? ఎంత పాపం మాటు? వడసారం పదేళ్లు లేని ఆ గున్నకు చీకటంటే తెగభయం . అర్ధరాత్రివేళ, అపరాత్రివేళ మెలకువ వస్తే, "అమ్మా" అంటూ బావురు మంటాడు. ఇది ఇంటిదొంగ పని కానే

కాదు. అయితే, మరి నంచి ఏమైపోయినట్టు? కాళ్లు వచ్చి నడిచిపోయినంత చిత్రం జరిగిందేమిటో?

ఆ నంచి దొరక్కపోతే, తన గతి ఏమి కాను? ఆయన పోయిన తర్వాత ఆ రెండెకరాల మెరకను సాగుచేసే దిక్కు లేకపోగా, కట్టుబడికి పుచ్చుకొన్నవాడు మగతాకు ఎగనామం వెడుతూపోగా, ఆ కొండ్రను కాస్తా తెగనమ్మి, ఆ వచ్చిన వెయ్యి రూపాయలనే తాను వడ్డీపై తిప్పతున్నది.తన సంసారం వెళ్ళమారడానికి ఆ వడ్డీ డబ్బులే దిక్కు! అవైనా తిన్నగా చేతికి వస్తేనే. నిరుడుమట్టుకు నిరుడు "పంటలలో తిరిగి నీ డబ్బు నీకు – నువ్వు పిల్లలు గలదావివి – అసలు ఫాయిదాలతో అత్తారుబత్తంగా అప్పగించకపోతే, పురుగులు పడి చావమా?" అంటూ అప్ప పట్టుకుపోయిన ఆ పల్లపు వీధి దొడ్డికాళ్ళ వెధవ కాళ్లార జాపి కూర్చున్నాడు. బిళ్ళకుడుములలాంటి రూపాయలు ఒళ్ళో పోసుకుపోయాడు! ఎట్టాటి యేగాణీ అయినా వెనక్కి రాలేదు. వాడి మాయ మాటలు నమ్మి, తానేమో తనఖా వ్రాయించుకోలేదు. ఆదెబ్బ తర్వాత తాను ఎంతో జాగ్రత్తగా వుంటుంటే, ఇప్పుడు, సర్వమంగళమే అయిపోయింది.

సంచి పోతే రేపటినుంచి పొయ్యిలో పిల్లి లేవకపోవడం మాట అటుంచి, ఊరూ నాడూ ఏకమై తన కొంపపైకి వచ్చిపడరూ? పాక పీకి పందిరి వెయ్యరూ? సంచిలోని ఆ నగలు తనవా? అవి తాను తాకట్టు పెట్టించుకొన్నవయ్యే! అవి పోయినట్టు తెలియగానే యాభైరూపాయల వస్తువు నూరురూపాయ అనరూ? వాటి ఖరీదు కక్కమనరూ? కొంపాగోడూ వేలం వేసుకుపోరూ? అప్పుడు తనకు, తన పిల్లలకు తల దాచుకోడానికి ఇంత నీడైనా దొరకదు! పిసరంతగానైనా ఈ మాటను బయటికి పొక్కనివ్వరాదు. ఖండ్యాకు వెళ్లి, పోలీసువాళ్ళకు చెప్పుకోవాలి. నీటముంచినా పాల ముంచినా వారే మరి తనకు దిక్కు.

దుఃఖం పొంగి పొరలి వస్తున్నా దాన్ని దిగమింగి, పిల్లలను లేపి, వాళ్లకు చద్ది పెట్టి, బడికి పంపించి, ఆమె ఖండ్యాకు పరుగెత్తింది. పోలీసుస్టేషన్ ఎక్కడని వాకబు చేస్తూ వెళ్లి, తన కష్టకథను చెప్పుకొంది. ఆమె రోజులు బాగుండబట్టి, "మీ వూరు మా స్టేషన్ యిలాకాలో లేదు" అని ఆమెను పంపివేయకుండా, "సరే, ఈ పూట ఫిర్యాదు నమోదు చేసుకుంటున్నాము: రేపో, మాపో వచ్చి విచారిస్తాము" అని వాయిదా వేయకుండా, పోలీసు అధికారి ఆమె వెంటనే జవానులిద్దరిని పోల్కార్ పల్లెకు పంపించాడు. పోలీసువారిని చూడగానే నాలుగ వైపుల నుంచి జనం చుట్టు ముట్టారు. సంచి పోయినట్టు విన్నారు. అది

ఏమైపోయి వుంటుందంటే, ఏమైపోయి వుంటుందని అందరి నోట ఒక్కటే మాట! మూగుతున్న జనాన్ని పొమ్మని కసిరి, పోలీసులు ఇల్లు నాలుగు మూలల కలయబార జూచారు. లాభం లేకపోగా బయటికి వెళ్లి చూస్తే, అక్కడ పెద్ద ఎలుకకన్నం కనబడింది. ఎందుకైనా మంచిదని ఒకసారి తొంగిచూడగా నగదుతో, నగలతో దానిలో గుడ్డసంచి! "పరాయిదొంగ కాదు! మీ ఇంటి దొంగే!" అంటూ ఆమె సంచిని ఆమెకు అప్పగించి, వచ్చిన దారినేఆ పోలీసులు చక్కా వెళ్లారు.

ఇది కట్టుకథకాదు : పిట్టకథకాదు : యథార్థంగా జరిగిన కథ. అయినా, కల్పిత కథలవలె ఇది కూడా కంచికి వెళ్లవలసిందే, మనం ఇంటికి రావలసిందే!

*

# మూగ నోము

అన్ని నోములలోను మూగనోము చాలా తేలికైనదిగా కనిపించవచ్చు. దాన్ని పట్టడానికి ఒంటిపూట లుండనక్కరలేదు; ముప్పొద్దుల కంఠపూర్తిగా మెక్కుతూనే దాన్ని పాటించవచ్చు. మంత్రతంత్రాలతో దానికి పనిలేదు : పూజాపురస్కారాలతో నిమిత్తము లేదు. పెట్టుకున్న గడువులోపల పెదవి మెదపకుండా కాలక్షేపం చేస్తే చాలు-దాని వల్ల దక్కే పుణ్యమేమైనావుంటే అసలు ఫాయిదాల నమేతంగా దఖలు పడుతుంది. కిమ్మినాన్నాస్తిగా కాలక్షేపం చేయడం పెద్ద కష్టమైనపని కానట్టు పైకి కనబడినా, నిజానికి అంతకంటె కష్టమైంది మరి లేదు. జీవ శాస్త్రజ్ఞుల దృష్టిలో తక్కిన జంతువులవలె నరుడుకూడా ఒక జంతువే. అయితే, అతడు మాటాడనేర్చిన జంతువు. తక్కిన జంతుజాలం నుంచి మానవుని వేరు చేసే ప్రధాన లక్షణాలలో ఓం ప్రథమంగా పేర్కొనదగింది చేతులుండడం కాగా, రెండవది మాటాడగల నేర్పే! మాటాడ నేర్చిన పిదపనే మానవుడు నిజానికి మానవుడై నాడు. మాటాడ్డమే మానవతకు ఒక ప్రధానలక్షణ మైనప్పుడు, నోరు కట్టివేసుకోవడం మాటలా?

మూగనోము పట్టడం ఎంతో కష్టం కనుకనే నూటికో కోటికోతప్ప - దాన్ని పట్టేవారు కనబడరు. అతడిలో ప్రత్యేక ప్రతిభ ఏమీ లేకపోవచ్చు. ఎన్నదగు

మాహాత్మ్యం ఏమీ లేకపోవచ్చు; నోరు విప్పితే అతడి బండారం అంతలోనే బయ టపడవచ్చు.అయినా, నిష్ఠగా మూగనోము పట్టినంత మాత్రానే బ్రహ్మర్షిగా అతడు వూబలందుకొనవచ్చు. మౌనవ్రతం మాటలు కాదన్న సంగతిని మనకు తెలి యకుండానే కూడా మనం గుర్తిస్తున్నా మనడానికి ఇదొక చక్కని తార్కాణం. కాలధర్మం చెందినవారి ఆత్మశాంతికోసం, లేదా, ఏదైనా అతి విషాద సంఘ టన సంస్మృత్యర్థం పాటించే మౌనాన్ని ఒకటి, రెండు నిమిషాలకు మాత్రమే పరిమితం చేయడం మౌనవ్రతం మాటలు కాదన్న ఆకళింపుతోనేకావచ్చు.

అలిగి, అప్ప డప్పుడు ఆలుమగలు మూగనోము పట్టడం కల దనుకోండి. ఇది నెలల తరబడి కొనసాగడం కూడా కల దనుకోండి. అయితే, వారిద్దరి మధ్యనే ఈ నోము; ఇతరులతో వారు మాట్లాడుతూనే వుంటారు. ఏ కాకితోనో, గాలితోనో మాట్లాడుతున్నట్టు నటిస్తూ, వారిద్దరు మాట్లాడుకొనడం కద్దుకూడా, అప్పుడ ప్పుడు తడికను అడ్డుపెట్టుకొనడం కూడా జరుగుతుంది. "కొర్రకూర తెచ్చాను, గోంగూర తెచ్చాను, వండమని చెప్పవే తడికా, !తడికా, !" అనే జానపద గేయం ఉత్తినే పుట్టలేదుగదా!

ఒకప్పుడు కాకపోతే, ఒకప్పుడైనా మూగనోము పట్టడం ఇతరులకైనా కొంతవ రకు సాధ్యమేమోకాని, రాజకీయవేత్తలకు అది దాదాపు అసాధ్యం . కేవల మొక రాజకీయవేత్తకాక, రాజర్షి కనుకనే వారానిక కొకనాడు (ప్రతిసోమవారం) మౌన వ్రతం పట్టడం గాంధీజీకే చెల్లింది. అయితే ఆయనైనా మూగనోము పాటిస్తూ వచ్చింది. పెదవి కదపకపోవడం వరకు మాత్రమే. వ్రతసమయంలో కూడా వ్రాతమూలకంగా ఆయన స్వీయాభిప్రాయాలను వ్యక్తీకరిస్తూ వుండేవారు. ఎవరో రావడం, ఏమేమో అడగడం, పలకవైన ఆయన సమాధానాలను వ్రాసి చూపిం చడం - ఈ తంతు సాగుతూనే వుండేది.

రాజకీయాల కున్న వెక్కు నిర్వచనాలలో "ఇతరుల వ్యవహారాలలో వేలు పెట్టడం" అనేది సత్యానికి చాలా చేరువగా వస్తుందేమో! అన్యుల వ్యవహారాలలో జోక్యానికి, మౌనవ్రతానికి పొద్దెదురు. రాజకీయాలంటేనే నూటికి తొంభైపాళ్ళు నోటికి పని పెట్టడం! "నోరుగలవానిదే రాజ్యం" అనే సామెత ఈనాడు పుట్టింది కాదు: రాజకీయాలతోనే అది పుట్టింది. ఇక, రాజ్యం ప్రజాస్వామ్యమైతే చెప్పనక్కరలేదు. ఎంత పెద్దనో రుంటే అంతగా కలిమీ, బలిమీ, ! పార్లమెం టును "టాకింగ్ షాప్స్" అని కొందరు చేసే హేళనలో కొంత నిజం లేకపోలేదు. పార్లమెంటరీ వ్యవస్థకు మాతృపీఠంగా ప్రసిద్ధి కెక్కిన కామన్సు సభ సయితం ఈ

హేళనకు అతీతమైంది కాదు. లండన్‌లో ఒక బస్సు కండక్టరు కామన్సు సభాభవనం సమీపించే సరికి "గ్యాస్ వర్క్సువద్ద దిగే వారెవరైనావున్నారా?" అని గావుకేక పెట్టాడట!

రాజకీయవేత్త లైనవారు మూగనోము పట్టలేరని తెలియబట్టే కావచ్చు, తాము పట్టదలచుకున్న ఈ నోముకు మన ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్యగారు నిన్న రెండు పరిమితులను పెట్టారు. ఆయన "నోటిమూత" రాష్ట్రరాజకీయాలకు సంబంధించినంతవరకే, అదీ కొద్ది రోజులవరకే, ఈ పరిమితుల మధ్యనైనా తమ ప్రతాన్ని పూర్తిగా పాలించడం శ్రీ సంజీవయ్యగారికి సాధ్యమైనట్టు తోచదు. రాష్ట్ర రాజకీయాలనుగురించి వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించినట్టు నిన్న వచ్చిన వార్తతోపాటుగానే కాంగ్రెస్ అధిష్ఠానువర్గం సమ్మతిస్తే మంత్రివర్గ విస్తరణ ఇప్పటికీ ముఖ్యమంత్రి అభిమతమని అభిజ్ఞవర్గాల ద్వారా తెలుస్తున్నదనే సమాచారం వచ్చింది. "అభిజ్ఞవర్గాలు", "విశ్వసనీయ వర్గాలు" వగైరా వగైరాలు జర్నలిజంలో "తడిక అడ్డాలు" తప్ప మరేమీ కావు. " నా పేరు బయటపెట్టవద్దు సుమీ!" అని పెచ్చరిస్తూ మంత్రి తెలిపిన విషయమే తరచు "అభిజ్ఞవర్గాల" ద్వారా తెలిసిన విషయ మౌతుంది! లేదా, దాని పితృత్వానికి "విస్వసనీయవర్గాలు" బాధ్యత వహించవలసి వుంటుంది.

ఏమైనా, రాజకీయవేత్త "నోరు పెట్టుకొని" బ్రతకవలసిన వాడే! నోరు విప్ప వద్దని సలహాచెప్పడం అతడిపట్ల క్రూరత్వాన్ని చూపడమే కాగలదు. ఏ గుణాన వున్నాడో కాని, జాన్ మార్లీ ఒకానొక సందర్భంలో ఒక రాజకీయ వేత్త కిట్టి సలహా చెప్పి నిర్దాక్షిణ్యంగానే ప్రవర్తించాడు. అది 1892వ సంవత్సరం. గ్లాడ్‌స్టన్ తన చివరి మంత్రివర్గాన్ని నిర్మిస్తున్నాడు. మంత్రులను ఎన్నుకొనడంలో చివరి ఒక రిద్దరి విషయమే తలనొప్పి తెప్పిస్తూ వుంటుంది. ఈ సందర్భంలోను ఇంతే జరిగింది. చిట్టచివరి స్థానమైనా తనకు దక్కగలదని నోటిలో వేలు వేసుకొని కూర్చున్న ఒక వ్యక్తి, తన అవకాశాలు అంతకంతకు సన్నగిల్లుతున్నట్టు ఆందోళన చెంది, మార్లీ సలహా కోసం వెళ్ళాడు. కొంచెంగా మార్లీ ఆయన కిచ్చిన సలహా "మీరు మంత్రివర్గంలో ప్రవేశించడమే జరిగితే, నామాటవిని, మీ రెన్నడు నోరు విప్పరాదు" అని. అందుపై "చెప్పదగింది ఏదైనా వుంటే తప్ప నేను నోరు విప్పనులెండి" అంటూ ఆ మానవుడు అమాయకంగా హామీ ఇచ్చాడు. అంతటితో విడిచిపెడితే, తిక్కపుట్టినప్పుడు ఒక చురక తగిలించగల మార్లీ, మార్లీ కాడు గదా! అందువల్ల "మీరు నోరు మరింత గట్టిగా మూసుకోవలసింది చెప్పగ

లిగింది ఏదో వున్నట్టు మీకు తోచినప్పుడే సుమీ!" అని హెచ్చరించాడు!

మార్లీ సలహా నిస్సందేహంగా కటువైనదే! అయినా, దాన్ని మన మంత్రులు ఎంత తరచుగా పాటిస్తే అంత త్వరగా మన రాజకీయాలు చక్కబడగలవేమో, అందువల్ల మంత్రులవేరు ప్రతిష్ఠలు కూడా పెరగగలవేమో! "ఈ సభలో పాల్గొనడానికి నాకు అర్హతలేదు. అయినా, నన్ను పిలిచారు కాబట్టి...." అంటూ ప్రారంభించి పక్కా మూడుగంటలు తెంపు లేకుంటా చేసే ఊకదంపుడు ఉపన్యాసాల బెడదైనా అప్పుడప్పుడు వారు మూగనోము పట్టగిలిగితే, ప్రపంచానికి తప్పుతుంది.

*

# మతి మరపు

## "మీ అత్తవారి వూ రేది?"

నమ్మండి, నమ్మకపోండి - ప్రసంగవశాత్తు పదేళ్ళనాడు ఎవరో నన్ను ఈ ప్రశ్న వేసేసరికి జవాబు చెప్పలేకపోయాను. ఇందుకు ఆయన విస్తుపోగా, నేనేమో సిగ్గుపడ్డాను. ఊళ్ళ పేర్లు, మనుష్యుల పేర్లు జ్ఞాపకం పెట్టుకొనలేని లోపం నాలో వున్నా, అత్తవారి వూరి పేరునే మరచిపోవడమా! అది వంద గడపైనా లేని పల్లె కావచ్చు; కాల్వగట్టు పుచ్చుకొని కొంతదూరం వెళ్ళిన తర్వాత, గట్టుదిగి, మిట్టపల్లాల డొంకగుండా కొన్ని ఫర్లాంగులు నడిస్తే తప్ప చేరుకొనలేని కుగ్రామం కావచ్చు; "అంగడి యూరలేదు" అనే శ్రీనాథుని వాక్కు దాని విషయంలో అక్షరాలా నిజం కావచ్చు. ఎప్పుడైనా గాని ముమ్మూరు మాత్రమే నేను ఆ వూరు వెళ్లివుండవచ్చు; అదైనా ఒక పుష్కరం క్రితం మాట అయివుండవచ్చు; అక్కడ నా మొత్తం మకాం మూడు రోజుల ఒక పూటమాత్రమే కావచ్చు. అయినా , అత్తవారి వూరుపేరు చెప్పలేక నత్తికొట్టడమా!

ఎంత విద్దూరమైనా, నేను తరచు ఈ విధమైనా సంకటస్థితిలో పడుతూ వుంటాను. నాకు జ్ఞాపకశక్తి బొత్తిగా తక్కువా అంటే, కాదనే చెప్పాలి. నేను

ఏకసంతగ్రాహిని కాకపోవచ్చు. అష్టావధానుల ధారణాపటిమ నాకు లేకపోవచ్చు. అయినా, సిరాను అసలే పీల్చని పాత అద్దుడు కాగితం కాదు, నా మెదడు. విన్నవి, కన్నవి, చదువుకొన్నవి - అవి చిన్న, పెద్ద విషయాలైనా, చిల్లర మల్లర సంగతులైనా బాగనే జ్ఞాపకం పెట్టుకోగలను. చదివిన వందలాది పుస్తకాలలో ఏ విషయం ఏ పుస్తకంలో వున్నదో ఇట్టే జ్ఞప్తికి వస్తుంది. ఇంతేకాదు, పుట సంఖ్య గుర్తులేక పోయినా, ఎప్పుడో చదివిన పుస్తకంలోనైనా నాకు కావలసిన విషయం కుడివైపు పేజీలో వున్నదో, ఎడమవైపు దానిలో వున్నదో స్థూలంగా గుర్తువుంటుంది.ఎంతగా ప్రయత్నించినా, నేను సులభంగా జ్ఞాపకం పెట్టుకోలేనివి ఊళ్ల పేర్లు మనుష్యుల పేర్లు మాత్రమే!

చిత్ర మేమంటే, అన్నీ కాకపోయినా, కొన్ని ఊళ్లపేర్లు, కొందరు మనుష్యులు పేర్లు వాటితో పని పడేవరకు నోటిలో ఆడుతూనే వుంటాయి. మరి అంతలోనే వాటిని మరచిపోవడం ఎలా సంభవిస్తుందో? ఒక వ్యక్తి నామధేయం మనకు జ్ఞాపకం లేదనుకోండి. అప్పుడు "వీరు ఫలానా" అని ఆయనను మరొకరికి పరిచయం చేయడానికి ప్రయత్నించము గదా! అయినా, "మీకు పరస్పర పరిచయం లేదా? వీరు శ్రీ ....." అంత వరకు వచ్చేసరికి నా మనస్సు పాతాళంగా శూన్యమైపోతుంది. చేతిలో అద్దంవుంటే, ఈ ఘట్టంలో నా ముఖం నాకే ఎంత వెలవెలబోతూ కనబడుతుందో? అప్పటి నా ముఖకవళికలు నాకు తెలియకపోయినా, నా మానసికావస్థ మాత్రం పూర్తిగా తెలుసు. కొంత సిగ్గు, కొంత తడబాటు, కొండంత బాధ ఆ క్షణంలో నన్ను కలచి వేస్తాయి.

మరొక చిత్ర మేమంటే, సమయానికి జ్ఞాపకం రాక నన్ను చికాకు పెట్టిన పేరే మరి కాసేపటికో, మరునాటికో, మరొక వారానికో చటుక్కున స్ఫురణకు వస్తుంది. అప్పటికి దాని ఊసే మరచిపోయి వుంటాను; ఏదో మరొక విషయాన్ని గురించి ఆలోచిస్తూ వుంటాను. పిలవని పేరంటంగా అప్ప డది ముందుకు చొచ్చుకు వస్తుంది! అవసర మైనప్పుడు ముఖం ఎందుకు తప్పించినట్టు? "అక్కరకు రాని మిట్టం వలె తర్వాత ఎందుకు వేంచేసినట్టు? నన్ను వెక్కిరించడానికా, వెటకారం చేయడానికా? ఏమైనా, అకస్మికంగా ఈ మరపు, అప్రయత్నంగా ఈ స్ఫురణ - తరచుగా నన్ను చెడ్డ ఇరకాటంలో పెడుతున్నాయి.!

గుంభనగా వుంటే, ఎప్పటికో ఒకప్పటికి మా అత్తవారి వూరుపేరు వాకు జ్ఞప్తికి వచ్చి వుండేది! ఆ పని చేయక, ఆ సాయంత్రం ఇంటికి వెళ్లగానే మా ఆవిడను "అన్నట్టు,మీ పుట్టింటి వూరు పేరేమిటి?" అని తెలివితక్కు

వగా అడిగాను. అప్పటికీ, ఇప్పటికీ ఆ మాట తలచుకొంటేనే మా అవిడ రోషపడుతుంది! తాను పుట్టింది మహాపట్టణం కాకపోవచ్చు; తన పుట్టింటివారు నవనాగరికులు కాక పోవచ్చు. అయినా, వా రున్నది ఊరేకాని, "కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవి" కాదు. పిచ్చిదో, యెచ్చిదో దాని కాక వే రున్నది! ఈ విధంగా ఏమేమో చదివిందే తప్ప, పొరపాటుగా నైనా తమ ఊరు పేరును మాత్రం వెదవిదాటిరానివ్వలేదు! తాను దాన్ని నాకు జ్ఞాపకం చెయ్యడం బెట్టుతక్కువ పని కాదా? ఆవిడ గీర్వాణానికి పోయినా, ఆ మర్నాడు నాకే అది తిరిగి జ్ఞాపకానికి వచ్చింది. ఇప్పుడు కూడా జ్ఞాపకమేనా అని అడుగుతారా? లేకపోతే, మళ్ళీ ఒక చిన్న కుటుంబకలహం చెలరేగదా?

మానసిక శాస్త్రంలో మహాపండితుడైన సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతం ప్రకారం ఊళ్ల పేర్లు, మనుష్యుల పేర్లు మనం మరచిపోవడానికి "అణచివేత" ("రిప్రెషన్") ఒక ముఖ్యకారణం. అప్రియమైన అనుభూతికి సంబంధించిన స్మృతిని అణచివేయడానికి మనకు తెలియకుండానే కూడా మనం చేసే ప్రయత్నంవల్లనే అట్టి స్మృతితో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో లంకె వున్న పేర్లను మనం మరచి పోవడం తటస్థిస్తుంది. అయితే, నేను మిత్రులపేర్లను, హితులపేర్లను, సజ్జనులని భావించేవారి పేర్లను సయితం మరిచిపోవడ మెందుకో! ఇందుకు సంతృప్తికరమైన సమాధానం ఫ్రాయిడ్ రచనలలో నాకు దొరకలేదు.

నేను మరచిపోయేది వ్యక్తుల పేర్లనే, వారి ముఖాలను కాదు. ఇది మరింత బాధకు మూలమౌతుంది. చెదురుగా చూచిన ముఖమైనా అచ్చు గుద్దినట్టు నా మనః ఫలకంపై వుండిపోతుంది. కంఠంకూడా సుపరిచిత మైనదిగానే వుంటుంది. పేరు దగ్గరనే చిక్కు. "మన్నించండి, మీ పేరేమిటి?" అని వారినే అడుగుతామా? అడిగితే నొచ్చుకోరా? ఎదుటివారి పేరైనా తెలియకుండా వారితో సంభాషణ సాగుతుందా? ముక్తసరిగా ఏవో రెండు మాటలు మాట్లాడి సరి పెట్టవచ్చుగాని, గర్విష్ఠి అనుకోరా? "మీ పేరు గుర్తుకు రావడం లే" దని చెప్పి, వారి మనస్సును నొప్పించడంకంటె, "గర్విష్ఠి" అనే నిందారోపణకు గురి కావడమే మంచిది కాదా? లోలోపలనే ఇంత మథనపడుతూవుంటే, నా బాధను తెలుసుకోలేక "పలుకే బంగారం" అన్నట్టు నేను సంచరిస్తానని పెక్కుమంది అనుకోవడం కద్దు; అతిశయానికే తప్ప, అనురాగానికి నా హృదయంలో స్థానం లేదని భావించడం కూడా కద్దు.

తమ పేరు జ్ఞప్తికి తెచ్చుకోడానికి నేను పడే బాధను కనిపెట్టి, "నన్ను

గుర్తుపట్టారా? " అని కొందరు సూటిగా ప్రశ్నిస్తారు. లేదని చెప్పడానికి నోరు రాక " అబ్బే! గుర్తు పట్టకేమి?" అని ఒక చిన్న అబద్ధాన్ని ఆడివేస్తాను. అంతటితో విడిచి పెడితే, సంతోమే! కాని, కొందరు " అయితే, నా పేరేమిటో చెప్పండి!" అని రెట్టిస్తారు. అబద్ధ మాడినప్పుడు నగం చచ్చిన నేను ఈ ప్రశ్న వచ్చే సరికి పూర్తిగా చచ్చినంత పని అవుతుంది.

పేర్లతో పాటు అంకెలను కూడా నేను తరచు మరచిపోతూ వుంటాను. అది తేదీ కానివ్వండి, టెలిఫోన్ నంబర్ కానివ్వండి- అంకెలతో కూడినదైతే, దాన్ని జ్ఞాపకం పెట్టుకొనడం నా కెంతో కష్టం. దేశదేశాలకు చెందిన ప్రసిద్ధ పురుషులలో కనీసం ఒక వెయ్యిమంది జన్మదినాలు ఢిల్లీలోని నీ మిత్రు డొకనికి కంఠస్థం. అయిదారు పట్టణాలలో టెలిఫోన్ నంబర్లలో పదవవంతు నా విజయ వాడ స్నేహితుడొకనికి కంఠోపాఠం. వీరి జ్ఞాపకశక్తి అద్భుతమైనదే; అందుకు సందేహం లేదు. అయినా, వీరిని చూచి, నేను, అసూయపడను. జన్మదినాలను తెలుసుకోవాలంటే, జీవిత చరిత్రలను, లేదా, "హూజ్ హూ" నిఘంటువులను తిరగవేయవచ్చు; టెలిఫోన్ నంబర్లు కావాలంటే, "డైరక్టరీ" ని తిరగవేయచ్చు. పోతే నాలో అసూయను రేకెత్తించేది ఏకాఫీ హౌస్ లోనో, ఏ రైలు ప్రయాణం లోనో, ఏవిందులోనో, వినోదంలోనో ఒకసారి కలుసుకొన్నవారి పేరునైనా కలకాలం గుర్తు పెట్టుకొనగల వారే!

ఎక్కడో, ఎన్నడో, ఏదో సందర్భంలో కలుసుకొన్న వ్యక్తి కనబడినంతనే ఆయన పేరు పెట్టి, ఆయన ఇంటిపేరు పెట్టి పలకరించగలిగితే, ఎంతగా ఆయన ముఖం విప్పారుతుంది! ఎంతగా మనసిచ్చి ఆయన మాట్లాడతాడు! ఆ క్షణంలో ఆయన ఆత్మబంధువుగా మారిపోయి, మనలో లేని సుగుణాలను చూస్తాడు; మనకు లేనిపోని ఘనతో నాపాదిస్తాడు. కాగా, ఆయనను వెంటనే పోల్చుకోలేక "ఈయనను ఎక్కడో చూచినట్టుగా వున్నదే! ఎక్కడ చెప్మా"? అని మన ముఖాన్ని ప్రశ్నార్థకంగా మార్చితే చనువుగా దగ్గరకు రాబోయినవాడైనా చటు క్కున నిలుస్తాడు; వెదవులపై అరవిరిసిన చిరునవ్వు వసివాడిపోతుంది; కళ్లలో వెలిగిన దీపాలు కాంతివిహీనా లైపోతాయి; అంతవరకు మనపట్లగల సద్భావం ఆ క్షణంలో మటుమాయమైపోతుంది. ఒకసారి పరిచయమైనవారి పేరును ఎప్పటికీ మరచిపోనివారె పదిమందిలో పలుకుబడి సంపాదించగలుగుతారు. పలుకుబడి సంపా దనకు ఇదొక్కటే మార్గం కాదు గాని, ఒక ముఖ్య మార్గం, ఒక సులభమార్గం. ఒకసారి మనం చూచినవారినిగురించి తిరిగి వారు కంటబడేవరకు మనం ఆలోచిం

చకపోవచ్చు; వారిసంగతినే మనం పట్టించుకొనక పోవచ్చు. అయినా, ఎదుటువడే సరికి పేరుపెట్టి నోరార పలకరిస్తే, తాము తప్ప మనకు మిత్రులు లేరన్నంతగా, ఆప్తులే లేరన్నంతగా సంతోషిస్తారు. పేరు పెట్టి పిలవడంతోపాటు అన్న, తమ్ముడు, బావ, బాబాయి, తాత మొదలైన వరసలలో దేనినో కలిపి పిలిస్తే, మరింతగా మురిసిపోతారు. "ఏమి సుబ్బయ్యన్నా! మావదిన రత్తమ్మగారు క్షేమమా? పెద్దకోడలు మహాలక్ష్మి పురుడు పోసుకున్నదా"? అని బంధువర్గం యోగక్షేమాలను కూడా పేరు పేరున విచారించగలిగితే, నెత్తిని పెట్టుకొని పూజించడమే జరుగుతుంది!

మన రాష్ట్రనాయకులలో కీర్తిశేషులైన కళా వెంకటరావుగారికి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ సంఘాధ్యక్షులుగా కొంతకాలంక్రిందట పనిచేసిన గొట్టి పాటి బ్రహ్మయ్య గారికి పేరుపెట్టి పిలవడం, వరుస కలిపి పిలవడం ముందు మూడు తరాల వారి, వెనుక యేడు తరాలవారి ప్రసక్తి చమత్కారంగా తీసుకురావడం వెన్నతో పెట్టిన విద్యలు. దేశనాయకులలో ఈ విషయానికి ప్రత్యేకించి చెప్పుకోవలసింది ముందుగా గాంధీజీని. తాను నడిపిన మహోద్యమాల సందర్భంలో గాంధీజీకి కొన్ని లక్షల మందితో పరిచయం కలిగివండాలి. వీ రందరి పేర్లు కాకపోయినా, వీరిలో కొన్ని వేలమంది పేర్లు ఆయనకు జ్ఞాపకం వుండేవి. ఇందరినీ పేరుపెట్టి పిలవడమే కాక, వీరిలో మరింత సన్నిహితులైనవారికి తలొక ముద్దుపేరు ఆయన పెడుతూ వుండేవారు. ఒక్కరికే వేర్వేరు సమయాలలో వేర్వేరు ముద్దుపేర్లను పెట్టిన సందర్భాలు కూడా వున్నాయి. మొత్తం దేశానికే ఆయన "బాపూజీ" కావడానికి ఎందరెందరితోనో ఇంతగా సాధించిన ఆత్మీయత ఒక ముఖ్యకారణం.

పేరుపెట్టి ప్రేమాదరాలతో పలకరించడంలో రాష్ట్రపతి రాధాకృష్ణన్ కూడా ప్రత్యేకించి యెన్నదగువారే! విద్యారంగంమొదలు, రాజకీయరంగంవరకు అన్ని రంగాలలో, అన్ని దేశాలలో కొన్ని వేలమందితో ఆయనకు పరిచయం. అది ఏపాటి. పరిచయమైనా, అందరి పేర్లు ఆయనకు చక్కగా జ్ఞాపకం. వయస్సుతో, పదవితో, ప్రతిపత్తితో నిమిత్తం లేకుండా తనకు తెలిసినవారి నందరిని పేరు పెట్టి, ఎంతో మర్యాదగా, మన్ననగా ఆయన పలకరిస్తారు!

పేర్ల విషయంలో మన ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పరాకు చిత్తగిస్తూ వుంటారని ప్రతీతి. పార్లమెంట్ సభ్యులతో, వారు తన కాంగ్రెసు పక్షం వారైనా, వ్యక్తిగతంగా ఆయన అంతగా పొత్తు పెట్టుకొనకపోవడానికి ఒకరిని మరొకరి పేరుతో ఎక్కడ పలకరిస్తానో అన్న భయమే కారణమైతే కావచ్చు! మీ రెప్పుడైనా విన్నారో, లేదో కాని, ఒకరిని మరొకరి పేరుతో పిలవడాన్ని "గోత్రస్ఖలనం" అంటారు. మన

ప్రధాని తరచు గోత్రస్ఖలనం చేస్తూవుంటారని ప్రతీతి. పార్లమెంట్ పుట్టిననాటి నుంచి దానిలో సభ్యులైన ప్రముఖులలో కొందరిని సయితం వారి పేరొకటికాగా, మరొకటి పెట్టి ఆయన పిలిచాడని నేను విన్నమాట ఎంత వరకు నిజమోకాని, రెండేళ్ళనాడు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీలో ప్రసంగిస్తూ, తనకు సుపరిచితుడైన ఒక ఆంధ్ర ప్రముఖుని పేరు జ్ఞాపకం రాక, వేలితో ఆయన బుర్ర గోకుకొనడం నేను స్వయంగా చూచిన విషయం!

నెహ్రూలో కానవచ్చే ఈ లోపమే నెపోలియన్‌లో కూడా వుండేది. అయితే, ఒక కిటుకు చేసి, దాన్ని ఆయన కప్పిపుచ్చుకొనేవాడు. సైన్యాధికారిగా జీవితాన్ని ప్రారంభించి సర్వసేనానిగా అపూర్వవిజయాలు సాధించి, సమ్రాట్టుగా తన శిరస్సును తానే కిరీటంతో అలకరించు కొన్నవాడు కాబట్టి, నెపోలియన్ కు ప్రధానంగా కావలసింది తన సేనల ప్రేమ గౌరవాలు! వీటిని సంపాదించడంకోసం అయ నొక కిటుకు చేస్తూ వుండేవాడు. సైనికవందనం స్వీకరించడానికి వెళ్ళేముందు నాడు తాను పరామర్శ చేయనున్న సైనికదళాలలో తనకు విశేషకీర్తిని తెచ్చిన తన తొలి యుద్ధాలలో ఈజిప్టులోగాని, ఇటలీలోగాని తనతోపాటు పాల్గొన్న సైనిక లెవ రైనా కలరేమో విచారించేవాడు. నాటి సేవలకు పతకాన్ని పొందనివాని పేరు, ఊరు, హోదాలనే కాక, అతని కుటుంబ స్థితిగతులను సయితం సవివరంగా తెలు సుకొనేవాడు. తర్వాత సైనికవందన స్వీకారానికి వెళ్ళినప్పుడు కావాలని కాక, కాకతాళీయంగా అన్నట్టు, అతడిని సమీపించి, "ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు!" అంటూ పేరుపెట్టి పలకరించే వాడు. "ఫలానా యుద్ధంలో వీరోచితంగా పోరాడినందుకు నీకు పతకం లభించనే లేదా"? అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించి, పతాకప్రదానానికి అక్కడే-అప్పుడే- ఉత్తరువు చేసేవాడు. దానితో అతడే కాక, సైనికు లందరు బ్రహ్మానందపడేవారు; "తన సైన్యంలోని ప్రతి వ్యక్తిని, అత డెంతటి సామాన్యుడైనా, మన చక్రవర్తి గుర్తుపెట్టుకుంటాడు. మన యోగక్షేమాలే తన యోగక్షేమాలుగా భావిస్తాడు" అని పొంగిపోయేవారు!

నెపోలియన్ కిటుకునుగురించి వినకముందే ఒకటి, రెండుసార్లు నేను దాన్ని అమలు పరచడానికి ప్రయత్నించాను. కొత్తవారిని కలుసుకొనడానికి వెళ్ళబోతూ వారిని గురించిన భోగట్టా సేకరించాను. కాని, తీరా వారిని పలకరించబోయేసరికి వారి పేరును మరచిపోయాను!

*

# పూటకూళ్ళ పెద్దమ్మ

అన్నం అమ్ముకొనడం మహాపాతక మన్న నమ్మకం ఇటీవలివరకు మన దేశంలో అతి బలీయంగా వున్నా, చిరకాలంనాడే ఎడమచేత అన్నం పళ్ళెంతో, కుడిచేత గరిటతో, రొండిన డబ్బు సంచితో పూటకూళ్ళమ్మ మన సంఘంలోకి పాదం పెట్టిన నిదర్శనా లున్నాయి. ఇంచుమించు వెయ్యేళ్ళనాటి "క్రీడాభిరామము" కావ్యాన్నిచూస్తే కాకతీయ రాజధాని ఓరుగల్లులో పూటకూటి యిళ్ళతో ఒక వాడకు వాడే వున్నట్టు తెలుస్తుంది. "ఉడువీథిన్ శిఖరావలంబి యగు నంధ్రో ర్వీశు మోసాలపై గడియారం బున.... రెండెనిమిదుల్ ఘంటా ఘణాత్కారముల్" మ్రోగేసరికి, "కడు నాకొన్నార మిప్పట్టునన్.....పూటకూటింటికిన్ గుడువంబో దమె లెక్కయిచ్చి"? అని మంచన శర్మ, అతనితోపాటు ఏకశిలానగర వీథులలోని వింతలను, విశేషాలను తిలకిస్తున్న టిట్టిభసెట్టి "పూట వంటకంబు పెట్టు బాడ బులవాడ" ను వెతుక్కుంటూ వెడతారు. అప్పటిలో పూటకూళ్ళను పెట్టేవారు విశేషంగా బ్రాహ్మణులే; వారిలోనూ సర్వసాధారణంగా స్త్రీలే; వారిలో మళ్ళీ వితంతువులే. ఇందువల్లే "పూట వంటకంబు పెట్టు బాడబులవాడ" అనడం తట స్థించింది. దాన్ని "అక్కలవాడ" అనడంకూడా కద్దు. "ఆముక్త మాల్యద" లో ఈ ప్రయోగమే వున్నది. దీనికి వ్యాఖ్యానాన్ని చెప్పడంలో వేదం వేంకటరా

యశాస్త్రులవారు లేనిపోని తికమక పడ్డారు. "అక్కలవాడ నర కూళ్ళు మెక్కి" అనే దానికి "వీథులలోనికి పోయి, 'అక్కా, అమ్మా' అని స్త్రీలను మంచివారిని చేసుకుని, సగము గడుపున కన్నము తిని" అని శాస్త్రులవారు వ్యాఖ్యానించారు. జీతనాతాలకు వంటచేసే వనిత "వంటలక్క" అయినట్టు, ఉదర పోషణార్థం పెట్టే పడతి "పూటకూళ్ళక్క"; "పూటకూళ్ళక్క" లుండేది "అక్కలవాడ" దీన్ని వివరిస్తూ "ఆంధ్రుల సాంఘికచరిత్ర" లో సురవరము ప్రతాపరెడ్డిగారు వ్రాసింది బహు దొడ్డగా వున్నది.

ఓరుగల్లు అక్కలవాడలో భోజనం చాలా చక్కగానే అమిరేది. ముఖ్యంగా అక్కడి లక్ష్మణవజ్జుల వారి ఇంటిలో ఒక్క రూపాయి పెడితే-

"కప్పుర భోగి వంటకము
కమ్మని గోధుమ పిండి వంటయున్
గుప్పెడు పంచదారయును
గ్రొత్తగగ్రాచిన యాలనే పెస
ర్పప్పును గొమ్ము నల్లనంటి
పండ్లును నాలుగు నైదు నంజులున్
లప్పలతోడ గ్రొంబెరుగు....."

లభించేవి. అయితే, ఎంతటి భోజన ప్రియుడేనా, లోకానికి వెరచే వాడైతే, ఆ వాడలో కనబడ్డానికి యిచ్చగించేవాడు కాడేమో. ఓరుగల్లు పూటకూటి యింటిని గురించి మంచన శర్మ-

"సంధి విగ్రహయానాది సంఘటనల
బంధకీజారులకు రాయబారి యగుచు
పట్టణంబున నిత్యంబు పగలురేయి
పూటకూటింట వర్తించుబుష్పశరుడు"

అని చెప్పాడు. ఇంతకంటె కూడా పచ్చిగా దాన్ని గురించి " క్రీడాభిరామము" లోనే మరొకరు చెప్పారు. అయితే, మంచనశర్మ, టిట్టిభసెట్టి శిష్య లనదగువారు కారు. వారిద్దరు అల్లరిచిల్లరిగా తిరగనేర్చినవారు. కాకతీయ రాజధానిలో ఎక్కువగా వారి కంట దూరినవి పాములాట, కోళ్ళ పందెం, సానికొంప మొదలైనవే. చెడ్డ వారికి లోక మంతా చెడుగా కన్పించడం సహజం కనుకనే, అక్కలవాడపై వారు అపవాదు వేశారేమో! ఏ వృత్తిలోనైనా దుష్టప్రవృత్తి గలవారు కొందరుండకపోరు,

ఈ నాటి హోటల్సులో కొన్నింట భోజన సౌకర్యంతో పాటు శయ్యాసౌఖ్యాన్ని నయితం కూర్చేవి లేవా? ఇంత మాత్రంచేత ప్రతి హోటల్ను "బ్రాతెల్" కింద జమకట్టడం తగునా? ఖర్మం కాలి, ముక్కు పచ్చ లారకముందే వైధవ్య ముద్ర, "నా" అనేవారు లేనందున ఎవరింటనో వంటలక్కగా కుదిరి, నానా మాటలు పడుతూ నీచపు బ్రతుకు బ్రతకడానికి మనసొప్పక, గౌరవంగా పొట్టపోసుకోడానికి పూటకూటి యింటిని పెట్టుకుంటే, ఆడది, విశేషించి బాలవితంతువు-పై పెచ్చు, పూటకు తన ఇంట పది విస్తళ్ళు లేస్తేనే తప్ప, నాలుగు డబ్బులు కళ్ళబడవు కాబట్టి, వచ్చిన వారి నందరినీ ఆప్యాయంగా పలకరించి, ఆదరంగా చూడవలసిన అనాథ- లేనిపోని నిందలకు లోనుగావడం ఎంత తేలిక! అయితే, అక్కలవాడలోని వారందరు అకలంక చరిత లని నా తాత్పర్యంకాదు. వారిలోనూ నీతిబాహ్యాలు బహుశా కొంద రుండేవారు. కాని, అంతమాత్రం చేతనే మొత్తంవాడను ఇంచు మించు వేశ్యావాటికగా వర్ణించిన మంచన శర్మ కాని, అతడికి రాజవీధి లో తటస్థపడిన విప్రుడు, కాని, క్షంతవ్యులు కారు.

ఓరుగల్లు అక్కలవాడలో లభిస్తూ వచ్చిన పుష్కలాహారం హంపీ, విజయ నగరం అక్కలవాడలో కరవైనట్టు తోస్తుంది. కాకపోతే, "ఆముక్తమాల్యద" లో "అక్కలవాడల నరకూళ్ళు మెక్కి" అని వ్రాయడం జరిగివుండదు. అప్పుడు పుట్టిందో, ఆ తర్వాత ప్రచారంలోనికి వచ్చిందో తెలియదుగాని, "పూటకూళ్ళది పుణ్యమునకు రాదు" అని మనకు ఒక సామెత వున్నది. దీనికి పాఠాంతరం: "పూట కూళ్ళమ్మ పుణ్య మెరగదు". ఉడికీ ఉడకని కూటిని పెట్టడం, వేడి వంటకాలలో పాచినవాటిని కలపడం, మారు అడగకుండా కూరలలో చేరెడుకు మరొక చేరెడు గొడ్డుకారం కొట్టడం. కల్తీనేతిని వడ్డించడం, అదైనా మళ్ళొక చుక్కరాలకుండా గరటితో గారడీ చెయ్యడం, ముంతెడు మజ్జిగలో కడివెడు నీళ్ళు కలపడం-ఇలాంటి అపభ్రంశపు పనులు పూటకూటి యిళ్ళలో జరగడం కద్దు కాని, "పిండికొద్ది రొట్టె" అన్నట్టు, "డబ్బు కొద్ది పెట్టు" అని మనం మరచిపోరాదు. కాకతీయులకాలంలో రూపాయి ఈనాటి పదిపేను రూపాయలకు (అదీ కనీన షక్షంగానే) సమానం. ఇందువల్ల రూపాయి పుచ్చుకొని లక్ష్మణవజ్జుల సన్నబియ్యం (కప్పురభోగి) అన్నాన్ని, కమ్మని గోధుమపిండి వంటల సమేతంగా, గుప్పెడు పంచ దారతోను, కొత్తగా కాచిన ఆవునేతితోను, గడ్డవంటి పెరుగుతోను, నాలుగైదు పచ్చళ్ళు వగైరాలతోను పెట్టినా, ఖర్చులన్నీ పోను ఏ పావలా డబ్బులో మిగి లేవి. ఆపాటి లాభం మిగిలే దారి వుంటే, ఏ కాలంలోనైనా పూటకూళ్ళమ్మ

సుష్ముగానే భోజనం పెడుతుంది. కాకతీయులనాటి రూపాయి విలువ విజయనగర కాలం నాటికి తగ్గిపోయి వుండాలి. అయినా, రూపాయి పుచ్చుకొని, కోరినన్ని ఆధరువులతో కమ్మని భోజనాన్ని పెట్టుమంటే, విజయనగరం పూటకూళ్ళమ్మ ఎవరి కొంపనైనా దోచుకురావలి!

ఏమంత గిట్టినా, గిట్టికపోయినా, ఎక్కడో కొందరు దురాశాపరురాళ్ళు తప్ప, మొత్తంపై పూటకూళ్ళమ్మలు, మూడు కూరలు, నాలుగు పచ్చళ్ళు లేకపోయినా, కడుపునిండుగా కూడు పెట్టేవారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి స్వీయచరిత్రను బట్టి, 1882 లో ఆయన నర్సాపురంలోని మిషన్ స్కూలులో అప్పర్ ఫోర్త్‌క్లాసులో చేరడానికి వెళ్ళినప్పుడు తటవర్తి శేషమ్మగారి పూటకూటి యింటికి కట్టుకున్నది నెలకు మూడు రూపాయలు. నలభై సంవత్సరాల పిమ్మట 1922 లో నేను గుడివాడ బోర్డు హైస్కూల్‌లో థర్డ్ ఫారంలో ప్రవేశించినప్పుడు పూటకూళ్ళ రామమ్మకు చెల్లించింది నెలకు తొమ్మిది రూపాయలు. ఈ చిన్న మొత్తాలకు రోజుకు రెండు పూటలు కడుపు నిండుగా అన్నం పెట్టేవారు. అర్ధాకలితో లేచిపొమ్మంటే పాపం చుట్టుకొంటుందన్న నమ్మకం ఇటీవలివరకు అందరికీ వుండేది. గిట్టుబాటు కాదేమోనని అనుకుంటే, చార్జీకి రెండు చార్జీలు తెమ్మని అడిగేవారు తప్ప, సగం కూడుపెట్టి లేచి పొమ్మనే వారు కారు. 1928 ప్రాంతాల నేను గుంటూరులో చదుకునే రోజులలో అక్కడి హోటల్స్‌లో వల్నాటి వారిని (వారు మంచి తిండిపుష్టి కలవారు కాబట్టి) మామూలు రేటుకు రెట్టింపు చెల్లించ మనడం నాకు బాగా జ్ఞాపకం.

ఈ నాటివి పూటకూటి యిళ్ళు కావు; హోటల్సు, కేఫేలు, రెస్టారెంటులు. ఈ మార్పు వేరులోనే కాదు; తీరులోకూడా. ఇప్పుడు వాటి నిర్వహణ జీవికగా మాత్రమే కాదు, భారీ వ్యాపార కేంద్రాలుగా. "ఎక్‌స్ట్రా" ప్రాతిపదికగా ఈ కేంద్రాలు నడుస్తాయి. మరొక ధార నెయ్యి అడిగితే ఎక్‌స్ట్రా; తాగడానికి చల్లటి నీళ్లు అడిగినా ఎక్‌స్ట్రా. డబ్బును మనం గిరాటు కొడితే, తిండిని అవి గిరాటు కొడతాయి. అంతకు మించిన అనుబంధం మనతో వాటికి, వాటితో మనకు వుండదు. ఎక్‌స్ట్రాలు లేనప్పుడు పెట్టే ఆ చప్పటి మెతుకులను కూడా ముళ్ళపై కూర్చున్నట్టు గొంతులో వేసుకు రావాలి. ఆ కబుర్లు, ఈ కబుర్లు చెప్పకుంటూ ఆలస్యం చేస్తే పరువు దక్కదు. భోజనానికై కాచుకు కూర్చున్న తక్కినవారు, స్కూలుకు వేళదాటుతున్నదనో ఆఫీసుకు టైమ్ మించిపోతున్నదనో, కోర్టు వ్యవహారం తగులబడి పోతుందనో, రైలు తప్పిపోగలదనో విసుక్కుంటారు. అందువల్ల

ఆదరాబాదరాగా నాలుగు ముద్దలు నమలకుండానే మింగి, లేచి చక్కాపోవాలి. మనం ఆలస్యం చేద్దామన్నా, అక్కడి వడ్డనపద్ధతి ఆలస్యం జరగనీయదు. ఇంకా పప్పు కలుపుకొనకముందే పులుసు తెచ్చి, పులుసులో వుండగానే మజ్జిగ పోసి, వడ్డన చేసే వారు తొందర పెడతారు. శరీరబాధలలో ఒకటైన ఆకలిబాధను చంపుకొనడం కోసమే అన్నట్టు హోటల్‌కు వెళ్ళిరావాలి. ఇందుకు భిన్నమైనవి కూడా అక్కడక్కడ కొన్ని భోజనశాలలు వున్నా యనుకోండి. కాని, అవి కేవలం లక్ష్మీపుత్రులకే తప్ప అందు బాటులో వుండవు.

ఇప్పుడు ఫక్తు అన్నవిక్రయశాలలుగా పరిణమించినా, ఒకప్పుడు-పూట కూళ్ళమ్మ కూడా పుట్టుకుమునుపు-పేదరాశి పెద్దమ్మ పీఠం పెట్టి వున్నప్పుడు-మన హోటళ్ళలో కవితాకన్య, రసాధిదేవత చెట్టాపట్టాలు వేసుకుని నర్తిస్తుండేవి. వాటిలో విడిదికి సామాన్యులు వచ్చేవారు కారు; మారు వేషాలలో రాజులో, రాకుమారులో వస్తుండేవారు; సామాన్యుని కడుపున పుట్టినా, ఏ చెట్టు కిందనో నిద్రిస్తుండగా ముఖాన ఎండ పడకుండా ఏ కృష్ణసర్పమో పడగ పట్టినందువల్ల రాజాంశ అబ్బిన వారైనా వస్తుండేవారు. లేదా, వారి పేరు చెబితేనే పరగణాలకు పరగణాలే గజగజ లాడవలసిన గజదొంగలు వస్తుండేవారు. ఎవరు వచ్చినా వారు వేసే మొదటి ప్రశ్న: "పేదరాశి పెద్దమ్మా, పేదరాశి పెద్దమ్మా! పట్టణంలో విశేషాలేమిటి?" అని. పురంలోని విశేషాలే కాకుండా అంతఃపురంలోనివి కూడా క్షుణ్ణంగా పేదరాశి పెద్దమ్మకు తెలిసే వుండేవి. పూస గుచ్చినట్టు వాటిని ఆమె చెప్పేది. "మా రాజుకు సంతు లేదు. ఆయనకు వృద్ధాప్యం వచ్చింది. ఎవరికైనా పట్టం కట్టి, తాను 'కృష్ణా రామా' అనుకోవాలని చూస్తూన్నారు. ఇవ్వాళ పట్టపు టేనుగుకు పన్నీటి కలశ మిచ్చి పుష్పహార మిచ్చి ఊరేగిస్తారు. అది ఎవరిని పన్నీటితో అభిషేకించి, ఎవరి మెడలో పూలమాల వేస్తుందో వారికి పట్టం కడతారు" అని చెప్పేది. లేదా "మా ప్రభువులుంగారు దీర్ఘ వ్యాధిగ్రస్తులై వున్నారు. రాజవైద్యులు మరి లాభం లేదన్నారు. సప్తసముద్రాలు దాటి, సప్తప్రాకారాలు గడచి, సప్త గుహలగుండా వెళ్ళి, సప్తరాక్షసులను సంహరించి, సప్తసర్పాలను తెగటార్చి, అక్కడి మట్టిచెట్టు తొట్టిలోని పసిడి పంజరంలో గల పంచవన్నెల రామచిలుకను పట్టుకువస్తే తప్ప ఈ గండం గడవదట. దాన్ని తీసుకురాగల వారికి అర్ధరాజ్యం ధారాదత్తం చెయ్యడమే కాక, రాజకుమారి నిచ్చి పెండ్లి చేస్తామని దండోరా వేయించారు." అని చెప్పేది. ఇలాంటి భోగట్టాను చెప్పడమేకాక, కలలో కనబడిన ఏ ప్రియుని కోసమో పలవరిస్తున్న రాకుమారికి,

ఆమెను వలపించిన రాకుమారునికి మధ్య రాయబారాలు నడిపేది. అప్పుడప్పుడు దొంగసొత్తును దాస్తూ దోపిడీ దార్లతో షరీకు అయ్యేది. ఆమె మాటసాయానికి మెచ్చి, వరహాలు, మూడలు వగైరాలనే కాక పచ్చలు, నీలాలు, రత్నాలు, కెంపులు ఇత్యాదులను సయితం ఆమె ఇంట బస చేసిన వారు ఆమెకు పారితోషికంగా యిచ్చి వెళ్ళేవారు. అయినా, పేదరాశి, పెద్దమ్మ పేదరాలుగానే వుండేది. వండి, వార్చి, వడ్డించడంలో ఆమె వితరణే ఇందుకు కారణమేమో! మూట కట్టింది ఏమీ కనబడకపోయినా, గిట్టనివారినుంచి "పేరాశి పెద్దమ్మ" అనే నింద మాత్రం తప్పేది కాదు!

కేవలం అన్నవిక్రయ కేంద్రాలైన పిమ్మట ఎన్నెన్నో ఆకర్షణలను కోల్పోయినా, హోటళ్ళవల్ల మన సంఘానికి జరిగిన ఒక పెద్ద మేలు లేకపోలేదు. కుల తత్వాల కరుకుతనాన్ని కొంతవరకు అవి బండబార జేశాయి. భోజనంవద్దకు వచ్చే నరికి మనిషికి మనిషికి మధ్య మడులు, దడులు కట్టి తీరాలనే ఛాందసులు ఇదివరలో అసలు హోటలు దరిదాపులకైనా వెళ్లేవారు కారు. హోటలునుంచి తెచ్చినవని చెబితే, పచ్చి మంచినీళ్ళయినా ముట్టుకునే వారు కారు. జనం హోటళ్ళను మరగడం వల్ల "సర్వం జగన్నాధం" అయిపోతున్నదని గోలకెత్తేవారు. వ్యయంపా కానికి దారిలేక, పళ్లు ఫలాలతో కాలక్షేపం చెయ్యలేక, గత్యంతరం లేని పరిస్థితిలో హోటలులో తాము పరిషేచను చెయ్యవలసివస్తే కులం చెడినంతగా బాధపడేవారు. ఇట్టివారు ఈనాడు చెదురు కావడం హోటలు సాధించిన విజయమే!.

*

# నవ కవులు

ఏటి కొక బిడ్డచొప్పున కనే తల్లికైనా తన పిల్లలను ఎవరైనా మెచ్చుకొంటే కొండంత సంతోషం కలుగుతుంది. "చెంపకు చారెడేసి కళ్ళు" అనే మెప్పు రాక పోవచ్చు; "కోటేరువంటి ముక్కు" అనే పొగడ్త రాక పోవచ్చు; "చిదిమి దీపం పెట్టుకోవచ్చునమ్మా! "అనే ప్రశంస రాకపోవచ్చు. ఇవేమీకాక, "నలుపైనా కళగల ముఖ"మని, నొసలు చిన్నదైనా, నోరు ముద్దువస్తున్నే "దని అలాంటి మాటలన్నా ఆమె సంబరపడుతుంది "ఏమోలే అమ్మా! అందాన్ని కొరుక్కుతింటామా? ఎలాగో ఒకలా చల్లగా బతకనీ!" అనే ఆశీస్సులతో సరిపెట్టినా, ఆమె పెదవులపైకి చిరు నవ్వులు రాకనూ మానవు; కళ్ళలో నిండువెల్గులు చిందకనూ మానవు.

కడుపెడు బిడ్డలున్న తల్లినే సంతానం ప్రశంస ఇంతగా సంతోషపరచగా, ఇక కొత్తగా ఒక కొడుకునో, కూతురునో యెత్తిన భాగ్యశాలిని గురించి వేరే చెప్పాలా? ఆమె ఇతరుల ప్రశంసల కొసం ఆగదు; వాటిని తనకుతానై ఆహ్వానిస్తుంది. కన్న వారింటివద్ద పురుడుపోసుకొనివుంటే, తండ్రిని పిలిచి (తనకు కలిగింది కొడుకైతే) "న్నానా! వీడి ముఖం చూడు-ఎంత ముద్దొస్తున్నదో!" అంటుంది. తల్లినికే కనేసి, "వీడునవ్వుతుంటే బుగ్గలుచొట్టలు పడ్డంలేదటే?" అంటుంది. తనలో తాను బహుశా "అచ్చం ఆయన రూపమే" అనుకొంటుంది; లేదా అన్నీ "నా

పోలికలే" అనుకొంటుంది. రెండవ మాటే అనుకొంటే " కొడుకుకు తల్లి పోలికలు, కూతురుకు తండ్రి పోలికలు వస్తే, అదృష్ట జాతకం కాగల" దన్న మాటను జ్ఞాపకం తెచ్చుకొంటుంది. స్వీయాభిప్రాయంపై విశ్వాసం నిలపలేక, అన్నయ్యలను, అక్కయ్యలను, వదినెలను, మరదళ్ళను, ఇరుగుపొరుగు అమ్మలక్కలను-అందరినీ తన బిడ్డయెలాంటివాడని, బయటపడి అమాయకంగా, అపేక్షగా అడుగుతుంది. లేకపోతే, కళ్ళ చూపులతోనే, మాటలద్వారా కంటె కూడా మిన్నగా, నిలవేసి రెట్టించి, రెట్టించి అడుగుతుంది.

కొత్తగా బిడ్డ నెత్తిన తల్లిని పోలినవాడే కొత్తగా కలం పట్టిన రచయితకూడా. మిత్రులకే కాక పరచితులకు పరిచితులకు, పరిచితులకే కాక అపరిచితులకు ఎవరికైనాసరే- వారు వింటారని తోస్తే చాలు- అతడు తన రచనను చదివి వినిపిస్తాడు. చదువుతూ మధ్య మధ్య యెదువాటివాని ముఖకవళికలు గమనిస్తూ వుంటాడు. వాటిలో హర్షామోదాలు కనబడితే ఉబ్బితబ్బిబ్బులౌతాడు; నిరసన ద్యోతకమైతే, పాతాళానికి క్రుంగిపోతాడు; అసలు చలనమే లేకపోతే, అయోమయ స్థితిలో పడిపోతాడు. ఈ అన్ని పరిస్థితులలో కూడా తన పఠనానంతరం యెదుటివాని అభిప్రాయం కోసం అన్నట్లు, ఒక క్షణం నిశ్శబ్దంగా వుంటాడు. ఆ క్షణం అతని కొక యుగంగా వుంటుంది. అప్పటికీ పలుకూ ఉలుకూ లేకపోతే, ఆ సరికే యెదుటివాని అభిప్రాయాన్ని తాను పసికట్టివున్నా, "ఏమండీ! ఎలా వున్న?" దని ప్రశ్నిస్తాడు. అప్పుడు వచ్చే జవాబుపైనే తన మనుగడ ఆధారపడగల దన్నట్టు కనీసం ఆ క్షణంలో భావిస్తాడు.

కొత్తగా కలం పట్టి, తమ రచనలను చదివి వినిపించి, వాటిపై లోకుల అభిప్రాయాలను తెలుసుకోవాలని ఉబలాటపడేవా రందరి మనస్తత్వ్ం ఇంచు మించు ఒకే మూసలో పోసినట్టుగా వుంటుంది. కాని, ఉన్నతాసనంపై వీరు కూర్చోబెట్టే వారిలో మాత్రంఎన్నో వికారా లుండడం కద్దు. కొందరు నోటితో మెచ్చుకొంటూనే నొసలితో వెక్కిరిస్తారు; మరికొందరు కైలాస వైకుంఠాలనుంచి దిగి వచ్చిన శివకేశవులవలె " వత్సా! నీ తపస్సుకు మెచ్చితిని! నీ కేమి వరము కావలయునో కోరు కొనుము!" అన్నట్టు మాట్లాడతారు. ఈ రెండవ వర్గానికి చెందిన వారిలోనే కొందరు, నోరువిప్పితే నోటి ముత్యాలు రాలిపోగల వన్నట్టు, నవ్వీ నవ్వకుండా చిరునవ్వు నవ్వుతారు. వారికంటెకూడా ఘనులు "బాగానే వుంది" అని ఒక్క ముక్కలో తేల్చి వేస్తారు.

"బాగానే వుంది" అనే ఈ ముక్కకు రూపాంతరా లున్నాయి. స్థాయీభే

దాలున్నాయి. "బాగానే వుంది" అంటే ఒకఅర్థం; "బాగావుంది" అంటేమరొకటి; " చాలాబాగావుంది" అంటే ఖంకొకటి! " బాగు బాగు"అంటే వేరొకటి వీటి తలదన్నినట్టి స్థాయీ భేదాలు. " బాగావున్నది" అనే దానిలో అన్ని అక్షరాలను తేల్చి వేస్తే, "నీ మొఖంలానే వున్న" దని తాత్పర్యం; అన్ని అక్షరాలను నొక్కి పలికితే అది ప్రశంస కావచ్చు; లేదా, " నేను చెబుతున్నది అబద్ధమని నీకు మాత్రం మనసులో తెలియదటోయ్!" అనడమైనా కావచ్చు. పోతే, "చాలా బాగు", "మహాబాగు", "బాగు బాగు" మొదలైన వాటికి ఆ పదాలను ఉచ్ఛరించే సవాలక్ష పద్ధతులనుబట్టి సవాలక్ష అర్థాలు!

ఏమాట కామాట- "కాస్త నా రచనను విని నీ అభిప్రాయం చెప్పవయ్యా!" అని ఆహూతులైన వారందరు ఇలాగే చెయ్యరు. కొందరు మన సిచ్చి, తమకు తోచిన మంచి చెడ్డలను చెబుతారు. ఎటొచ్చీ, కనకపు సింహాసనాన్ని యెక్కించినంతనే శునకపు బుద్ధిని ప్రదర్శించే వారితోనే చిక్కు. అయితే, ఇది చదివి వినిపిస్తామనేవారిని వెనక వేసుకు రావడంకాదు సుమండీ! కాకి బిడ్డ కాకికి ముద్దుగా వుండవచ్చు; అందరికీ అది ముద్దుగా వుంటుందా? అయినా, కాకి "నా బిడ్డను మెచ్చుకొనేది నువ్వా! నువ్వా" అని కనబడినవారందరిని వేధించడం ఏమి బాగుంటుంది? తన అమూల్యాభిప్రాయాల ప్రచారానికై ఇంగ్లీషులో ఒక దిన పత్రికను ప్రారంభించి, కొద్దికాలంపాటు దాన్ని నడిపిన ఒక ప్రబుద్ధునివద్దకు (అతడొక శ్రీమంతుని సుపుత్రుడు) నా ఖర్మం కాలి ఎవరి విషయంలోనో ఏదో సిఫార్సు చేయడానికి వెనకెప్పుడో నే నొకసారి వెళ్ళవలసివచ్చింది. సరిగా ఆ వేళకు అతడు తన సుదీర్ఘ సంపాదకీయం ప్రూఫులను దిద్దుతున్నాడు. వందన ప్రత్యభివందన లాంఛనాలు పూర్తికావడమే తడవుగా "ఎంత నిష్కర్షగా, నిర్భయంగా ఈనాడు వ్రాశానో చూశారా!" అంటూ మొదటినుంచి చివరివరకు తాను వ్రాసినదాన్ని, లక్షమంది వున్న మహాసభలో మహోపన్యాసం చేస్తున్న ధోరణిలో, చదివి వినిపించాడు. వ్యర్థపదాడంబరం తప్ప దానిలో ప్రత్యేక విశేష మేమీ నాకు కనబడలేదు. కార్యార్థినై వెళ్ళినందున ఊగనొల్లని తల నూపుతూ, రాని చిరునవ్వులను తెచ్చుకొంటూ, చివరివరకు దాన్ని వినక తప్పలేదు. చదవడాన్ని అతడు ముగించేసరికి నేను వెళ్ళిన పనిమాట చెప్పబోయాను. దాన్ని వినిపించుకోకుండానే అతడు "నేటి సంపాదకీయంలోని స్వారస్యాన్ని అర్థం చేసుకోవా లంటే, మొన్న వ్రాసినదాన్ని మీరు వినాలి" అంటూ, తన పత్రిక ఫైల్ అందుకొని, మరొక సంపాదకీయాన్ని ఒక్క అక్షరమైనా విడవకుండా నాకు వినిపించాడు.

ఈ రెండవ ముట్టడినుంచి నేను తేరుకొనకముందే "ఈ రెండు సంపాదకీయా లకు మూలం మరొకటి వుంది" అంటూ దాన్నికూడా ఆసాంతం పఠించాడు. ఈ "హరికథాకాలక్షేపం" మరెంతసేపు జరుగుతుందో అని తల్లడిల్లి, అతడు తన నాల్గవ సంపాదకీయం ప్రసక్తియెత్తక మునుపే నేను వెళ్ళిన పనిని వివరించాను. అది తనవల్లకాదని ఒక్కమాటలో అతడు తేల్చివేశాడు. వెళ్ళినపని కాస్తా కాక పోగా, పుట్టెడు తలనొప్పితో నేను తిరిగి రావలసి వచ్చింది. గుప్పడానికి డబ్బు కొల్లలుగానే వున్న, అతడిపత్రిక అట్టేకాలం నిలువకపోవడం నామట్టుకునాకు ఆశ్చ ర్యాన్ని కలిగించలేదు.

తాము వ్రాసినదాన్ని చదివి వినిపించడాన్ని ప్రారంభించి,"విన్న తర్వాత మీ అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పండి" అంటూనే మెచ్చుకోలునుమాత్రమే ఆశించేవారుంటారు. తాము ఆశించిన ప్రశంస ఆశించినంతగా రాకపోతే, తెగబడి పైకి అనకపోయినా "ఆ! చచ్చుదద్దమ్మ! వీడి కేమి తెలుసులే! అని లోలోపల వీరు అనుకొంటారు. లేదా, అసూయవల్లనే తనను మెచ్చుకోలేక పోతున్నాడని తీర్మానించు కొంటారు. అంతేకాదు, "ఇతడు విషపుపుచ్చె! మరొకరు పైకి వస్తుంటే సహించలేడు." అని దుష్ప్రచారం చేస్తారు. ఇది స్వానుభవంతో చెబుతున్నమాటే. ప్రథమ ప్రయత్నంగా తాను వ్రాసిన నాటకాన్ని ఒకప్పుడొక యువకుడు నాకు చదివి వినిపించాడు. మొత్తంపైనా కది నచ్చలేదు. అతడి హితాన్ని కోరి, ఎక్కడెక్కడ నచ్చలేదో, ఎందుకు నచ్చలేదో దాపరికం లేకుండా అతడికి వివరించాను. అందుపై తన నాటకంలో ఏవో కొన్ని మార్పులు అతడు చేసుకొనకపోలేదు. అయినా, నా విమర్శ ఈర్ష్యాప్రేరితమైనదని అతడు అను మానించాడు. ఆ సంవత్సరం తన నాటకానికి ఆంధ్ర నాటకకళా పరిషత్తువారి ప్రథమ బహుమానం లభించేసరికి అతడి అనుమానం పూర్తిగా బలపడింది. బహు మాన ప్రదానసభలో అతడు నాపేరెత్తి "రసజ్ఞులైన మీరు మెచ్చిన ఈ నాటకం ఆయనకు నచ్చలేదు. ఆయనకు దీనిలో దోషాలే తప్ప గుణాలు కనబడలేదు" అంటూ నాపై కొన్ని విసురులు విసిరినట్టు అప్పటిలో విన్నాను. ఈనాడు ఆ నాటకాన్ని, ఆ నాటకకర్తను తలుస్తున్నావారే లేరనుకోండి. కాని, అది వేరే విషయం! అప్పటిలో తనను ఇబ్సెన్‌తోను, తన నాటకాన్ని "డాల్స్ హౌస్" తోను అతడు పోల్చుకొన్నాడు!

తర్వాత తర్వాత అమరకీర్తి నార్జించుకొన్న ప్రతిభావంతులలో సయితం కొందరు తాము కలం పట్టిన కొత్తలో తమ రచనలను ఇతరులకు చదివి విని

పించడానికి ఉబలాటపడినవారే. ఉదాహరణకు శ్రీనాథ మహాకవినే చూడండి. ఆయన "చిన్నారి పొన్నారి చిఱుతకూకటినాడు" మరుత్తరాట్చరిత్రను వ్రాసి వుండవచ్చు. "నూనూగు మీసాల నూత్న యౌవనమున"శాలివాహన సప్తశతిని రచించి వుండవచ్చు. అయినా, "నిండు జవ్వనమున" తెనిగించిన హర్షనైషధకావ్యాన్ని ఒకసారి పోతన్న బావగారికి చదివి వినిపించకుండా ప్రకటించడానికి ఆయనకు మన సొప్పలేదు. దాన్ని బావగారింటికి తీసుకువెళ్ళగా, మేనల్లుడు మల్లన యెదురై "నాన్నగారు ఏదో పనిమీద వెళ్ళారు; త్వరలో తిరిగి వస్తా" రని చెప్పాడు. ఆయన కోసం యెదురు చూస్తూ, శ్రీనాథుడు తన కావ్యపుటలను తిరుగవేస్తూ వుండగా మల్లన "ఏమి పుస్తక మది మామయ్యా!" అని ఆప్యాయంగా ప్రశ్నించాడు. మేనల్లుడు తనకంటె వయస్సులో ఏమంత చిన్నవాడు కాకపోయినా, అతనిపట్ల, అతని పాండితిపట్ల నిర్లక్ష్య భావంతో "నైషధములే!" అని శ్రీనాథుడు ముక్తసరిగా జవాబు చెప్పాడు. మల్లన సామాన్యుడా? అప్పటికే బాగా చదువుకొన్నవాడు; అటు తర్వాత "రుక్మాంగద చరిత్ర" రచించి, ప్రౌఢకవిగా పేరందినవాడు. మేనమామ తనను చులకన చేసి నందుకు కినిసి, ఆయనను ఊపి చూడాలనుకొన్నాడు. "అయితే, మామయ్యా! నైషధాన్ని ఇప్పుడు చదువుకొంటున్నావా?" అని కొంటె ప్రశ్న వేశాడు. ఇందుకు మనస్సు చివుక్కుమన్నా తమాయించుకొని, "నైషధానికి ఇదినా తెనిగింపు" అంటూ తల యెత్తకుండానే శ్రీనాథుడు సమాధానం చెప్పాడు. మేనమామకు తాటాకులు కట్టాలన్న పట్టుదల మల్లనలో మరింత పెరిగింది. అందువై "నువ్వుకూడా తెనిగించావన్న మాట!" అంటూ ఆశ్చర్యాన్ని నటించాడు. ఆ మాట వినగానే తాను పడిన శ్రమ వృధా అయిపోయిందన్న ఆందోళనతో "అయితే, మరొకరుకూడా తెనిగించారా? ఎవరది?" అని శ్రీనాథుడు ప్రశ్నించాడు. "ఎవరా? మా నాన్నగారు" అని మల్లన బుకాయించగా, పోతనగారి అనువాదాన్ని శ్రీనాథుడు చూడగోరాడు. "నాన్నగారు దాన్ని యెక్కడ భద్రం చేశారో నాకుతెలియదు గాని, దానిలో కొన్ని పద్యాలు నాకు కంఠస్థంగా వచ్చు "నంటూ మల్లన తన నాటకాన్ని మరింత సాగించాడు. "అయితే, దమయంతీ విరహాగ్లాని వర్ణన ఘట్టంలో ఒక పద్య వినిపించు" అని మేనమామ కోరగా, మేనల్లుడు అప్పటి కప్పుడు ఆశువుగా కింద పద్యం వినిపించాడు:

కాంత కలదిన చందన కర్దమంబు
ఉగ్ర విరహాగ్నిదుకదుక నుడికి చెదరి

చెంతనున్నట్టి దమయంతి చెలిమికత్తె
మెఱుగు పాలిండ్ల పైబడి మిట్టిపడియె:

తన కంటె ముందుగా తన బావగారు నైషధాన్ని ఆంధ్రీకరించినా రన్న విషయంలో మరి సందేహం లేదనుకొని, శ్రీనాథుడు దిగాలుపడి కూర్చుని వుండగా పోతనా మాత్యుడు ఇంటికి తిరిగి రావడం, మళ్లన ఆడిన నాటకం వెల్లడికావడం జరిగింది:

పోతన, శ్రీనాథులు సమకాలికులు కారని, వారి బంధుత్వంకూడా కల్పితమని చెప్పే చారిత్రక పరిశోధకులు దీన్ని కట్టుకథగా త్రోసివేయ వచ్చు. ఇది కల్పిత కథ అయినప్పటికీ, కొత్తగా కలంపట్టే రచయితల మస్తత్వాన్ని చక్కగా వివరించే కథ; అహంకారంతో ప్రవర్తిస్తే ఎంతటి ప్రతిభావంతుడైనా అల్లరి పడగలడని నిరూపించే కథ. ఇట్టి కథలను ఎన్నింటిని మనం చెప్పినా, తమ రచనలును మెచ్చుకో వలసిందిగా రచయితలు, తమ బిడ్డలను పసందు చేయవలసిందిగా తల్లులు అడుగుతూ పోతూనే వుంటారు!

*

# ఊతపదాలు

ఊతపదాలతో కొందరు మనలను ఉక్కిరి బిక్కిరి చేస్తూవుంటారు. పోని "ఆపళంగా", "అదీ గాకుండా," "మరేం", "మరి గంటే", మరి గత్తే"- ఇలాంటి వాటితోనే సరిపెడితే ఏదో ఒక విధంగా భరించవచ్చు. ఇంతటితో ఆగకుండా వీరిలో కొందరు బూతులు బండలనే ఊతపదాలుగా వాడతారు. వీటిలో ముతక తక్కువ మాట "నా యాల". ఇందుకు మనం లోలోపల నొచ్చుకొన్నా, పైకి నొచ్చు కొన్నా ఫలిత మొక్కటే! మనలను నొప్పించాలని ఈ ముతక మాటలను, ఈ మోటు మాటలను వీరు వాడరు. సాంగత్య దోషంవల్లనో, సంస్కృతి లోపంవ ల్లనో తమకు తెలియకుండానే ఇలాంటి ఊతపదాలకు వీరు అలవాటు పడిపోతారు. ఉచితానుచితాలను, సమయాసమయాలను గమనించకుండా, సందర్భశుద్ధిని పాటిం చకుండా ఎప్పుడు, ఎవరితో, ఏమి మాటాడినా ఇవి దొర్లవలసిందే! సహించలేక మనం గొణిగినా, సణిగినా "ఏదో మాటవరసకంటే, ఈపాటికే-నాయాల!-ఇంత పట్టింపు పట్టాలా?" అని మరి కొంత నొప్పించడమే జరుగుతుంది!

ఒకప్పుడు బూతులు బండలనే ఊతపదాలుగా పెచ్చుగా వాడుతూ వుండేవారు. విద్యావ్యాప్తివల్ల కానివ్వండి, పట్నవాసంవల్ల కానివ్వండి, రాను రాను పచ్చి బూతు లను ఊత పదాలుగ వినియోగించడం చాలావరకు తగ్గింది. అంతమాత్రం చేత

అసలు ఊతపదాల ప్రయోగమే తగ్గిపోయిందని చెప్పలేము. ఇప్పటికీ చాలామంది ఏదో ఒక ఊతపదం ఊపు నివ్వనిదే పెదవి మెదపనైన లేరు. వారివంక మనం చూస్తునే వుంటాము; అయినా, "ఇదుగో చూడండి!" అని వారు మనను పెచ్చ రిస్తూ వుంటారు. వారు చెబుతున్నది మనం వింటూనే వుంటాము; అయినా "ఇది విన్నారా?" అని మనను ప్రశ్నిస్తూనే పోతారు. అంతకుముందు వారు చెప్పింది ఏమీ వుండదు; అయినా "ఇంకేమి టంటే" అంటూ సంభాషణ ప్రారంభిస్తారు. వారి మాటలను ఆలకించడమే తప్ప, మనం వేసిన ఎదురు సవాలే వుండదు; అయినా "ఎందుకంటారా?" అని వృచ్ఛచేస్తారు!

ఈ ఊతపదాల జాడ్యం కేవలం మన తెలుగువారికే లేదు; అన్ని భాష లవారికున్నది; అన్ని దేశాలవారికున్నది. హిందీవారినే చూడండి. మధ్య మధ్య "క్యాబాత్ హై!" అంటూ వుండకపోతే వారిలో చాలామంది సంభాషణ కొనసా గించలేరు. బెంగాలీలైతే అదే పనిగా "బుజ్లీన్" ("తెలిసిందా?") అని రెట్టిస్తారు. ఇంగ్లీషు వారిలో చాలామందికి "యూసీ", "ఐ మీన్" లేకుండా మాటలు దొర్లవు. ఇంగ్లీషు నేర్చిన మనవారు కూడా ఆభాషలోని ఈ ఊతపదాలను యధాతధంగా ప్రయోగించడం తరచు జరుగుతుంది. "తెలిసిందా?" అనేది బహుశా "యూ సీ" అనే ప్రయోగానికి తర్జుమా. "అర్థమైందా"? అనే ప్రశ్న "యు అండర్‌స్టాండ్"? ఊతపదానికి అనువాదం. "నిజం చెప్పాలంటే" అనే ఉపోద్ఘాతం "టు టెల్ యుది ట్రూత్" అనేదానికి భాషాంతరీకరణం.

కాలాన్నిబట్టి అన్నీ మారినట్టే, ఊతపదాలు కూడా మారుతూవుంటాయి. ఇదివరలో "దేవుడు మేలు చేస్తే" ఊతపదాన్ని అతి విశేషంగా వాడుతూవుం డేవారు. ఇప్పుడైనా, ఇది పూర్తిగా మాయమైపోలేదుగాని, దైవభక్తి తగ్గినట్టే దీని వినియోగం కూడా చాలావరకు తగ్గింది. కాలప్రభావాన్నిబట్టి ముమ్ముందు "మంత్రి మేలు చేస్తే" అనేది ఒక ఊతపదంగా వ్యాప్తిలోకి వచ్చినా రావచ్చు. లేదా, "మంత్రి మిత్రుడో, మిత్రురాలో మేలు చేస్తే" అనేది ఊతపదమైనా అంతగా ఆశ్చర్యపడనక్కరలేదేమో! రేపటి మాటకేమిగాని, ఇప్పుడు మాత్రం "ఆరి నీ తస్సాగొయ్యా!" అంటూ మన తస్సును తమకు మక్కువైన ఊతపదంతో ఊచకోత కోసేవారు క్రమక్రమంగా తగ్గిపోతున్నారు. "ఐసరు బొజ్జ" ప్రస్తుతం మన పల్లెలలోనైనా అంతగా వినబడ్డం లేదు. "ఏతావాతా" కూడా చెదురుగా తప్ప చెవికి సోకడం లేదు.

అవి అసలైన, సిసలైన ఊతపదాలు కాకపోయినా ఒట్టులను, తిట్టులను ఊత

పదాలుగా కొందరు సంధిస్తూ వుంటారు. బహుశా తమ మాటపై తమకే పూర్తిగా నమ్మకం లేనందువల్లనే కావచ్చు, ప్రతి పది వాక్యాలకు నాలుగైదు పర్యాయాలైనా "నీ తోడు", "నా తోడు," "అమ్మతోడు". "తల్లితోడు", "దైవంతోడు" అని వీరు ఏదో ఒట్టు వేసుకొంటారు. మన ముఖంచూచి చెబుతున్నా "దేవుని ముఖంచూచి చెబుతున్నాను" అంటారు. మళ్ళీ మాట్లాడితే (ఇది కూడా ఒక ఊతపదమే) "గుళ్ళో దీపం ఆర్పినట్టే" వరకు వెడతారు. "అంతవరకు వెళ్ళడం దేనికి ?" అని మౌనంగా నైనా సరే మనం ప్రశ్నిస్తున్నట్టు తమకు తోస్తే, మనలను నిలువునా చంపినంత పనిచేస్తూ, "నిన్ను చంపుకు తిన్నట్టే?" అని మరొక వొట్టు!

తిట్లనే ఊతపదాలుగా ప్రయోగించేవారు లోకులను శుద్ధ చవటలను చేస్తారు. చచ్చు దద్దమ్మలను చేస్తారు, పింజారీ వేధవలను చేస్తారు, కుళ్ళు పీనుగులను చేస్తారు. అదే ఆడవారైతే ఊపపదాలుగా వారు చీటికి మాటికి వాడే తిట్లు ఇంత సూటిగా కాక, డొంక తిరుగుడుగా వుంటాయి. "నువ్వు నాశనం కావాలి!" అని వారనరు. "నీ దుంప తెగ!" అంటారు. "నీకు షక్షవాతం రావాలి!" అనరు; "నీ నోరు పడ!", లేదా "నీ వాయిపడ!" అంటారు. "నువ్వు చావాలి!" అనరు; "నీ శిరస్సు వద్ద దీపం పెట్ట!" అంటారు. ఇంతేకాక, అమ్మకడుపు కాల్చడం, ఇంటిలో జిల్లేళ్లు, పల్లేళ్లు మొలిపించడం, ఒలికిలో పాలు పిండడం, చెరు వుగట్టున తాడు పుటుక్కున త్రెంచడం మొదలైనవి ఎన్నో వున్నాయి. ఇంతగా కీడుకోరే ఈ తిట్లను ఊతపదాలుగా చేసుకొనేవారు నిజంగా కీడు కోరేవారేనా? ముమ్మాటికీ కాదు. అయినా, నోటి కెంత వస్తే అంత తిట్టడం అనాలోచితం గానే, అప్రయత్నంగానే!

అనాలోచితంగానే, అప్రయత్నంగానే ప్రయోగించేవే ఊతపదాలు కాబట్టి, వాటికి అలవాటుపడిన వారిని సరిదిద్దలేము. నా వద్ద పని చేసిన ఒక సబ్ ఎడిటర్ ప్రతి రెండవ వాక్యాన్ని ఒక "కాని"తో ప్రారంభిస్తూ వుండేవాడు. ఒకే వాక్యంలో మూడు, నాలుగు "కానులు" దొర్లుతూ వుండేవి కూడా. మాటలలోనైనా ఊత పదాలను సహించవచ్చు గాని, వ్రాతలో వాటిని సహించలేము, అయినచోట, కానిచోట ఈ "కాని" దేనికని ఆ సబ్ ఎడిటర్‌ను ఎన్నిసార్లు హెచ్చరించినా ఎంతమాత్రం ప్రయోజనం లేకపోయింది. అందువల్ల అవసరమైనచోట కూడా "కాని" లేకుండా ఆయన వ్రాసి తీరాలని శాసించాను; దీని ఫలితం అంతర్ధాన మైన "కాని" స్థానంలో "అప్పుడు" ప్రత్యక్షం కావడం, దాన్ని సయితం వెలివేసే

సరికి "అయినా" కాబోలు సాక్షాత్కరించింది. ఆ మాట పైకూడా నేను ఆంక్ష విధిస్తే మరేది దాని స్థానాన్ని స్వీకరించేదో తెలుసుకొనే అవకాశాన్ని నేను మిగుల్చుకోలేదు గాని, ఆయన విషయంలో కొంత తొందర పడ్డానేమోనని ఇప్పటికీ నా మనస్సు కొంచెం పీకుతూనే వుంటుంది.

వ్యవసనం బలీయమైనప్పుడు దాన్ని ముఖాముఖిగానే యెదుర్కొని, జయమో, పరాజయమో తేల్చుకోవాలి. ఇందుకు మారుగా ఒక వ్యసనాన్ని మరొకదానితో నిర్జించగల మనుకొనడం భ్రమ, సిగరెట్లను మానడానికి పొడుం మొదలు పెట్టడం, పొడుం పీడ వదిలించుకోడానికి వక్కాకును దిక్కు చేసుకోవడం ఒక వ్యసనానికి మారుగా మరొకదానికి లొంగిపోవడమే! ఒక ఊతపదం పిడికిలిలోనుంచి తప్పించుకోడానికి మరొకదాన్ని ఆశ్రయించిన నా సబ్ ఎడిటర్ సరిగా ఈ పొరపాటే చేశాడు. నేను మరి కొంత కాలంపాటు ఓపిక పట్టివుంటే ఆయన సరైన దారికి వచ్చేవాడేమో!

ఏమైనా, ఆ సబ్ ఎడిటర్‌తో నా అనుభవం తర్వాత నేను వ్రాసే దానిలో నాకు తెలియకుండానే ఊతపదాలు దొర్లవచ్చునన్న భయంతో ఏయే మాటలను వాడు తున్నానో, ఎన్నిసార్లు వాటిని వాడుతున్నానో, అప్ప డప్పుడు శ్రద్ధగా పరిశీలించు కొనడం, ఊతపదం స్థాయికి దిగజారి పోయినట్టుగా తోచిన వాటిని మెడపట్టి ఆవలికి గెంటడం-- ఇది నాకు పరిపాటి అయిపోతుంది. ఇంత జాగ్రత్త పడుతున్నా "నీ రచనలో ఊతపదాలు మచ్చుకైనా వుండవా?" అని నిగ్గదీస్తే, నీళ్ళు నమలవలసిందే తప్ప ఖచ్చితంగా ఏమీ చెప్పలేను. గురువింద గింజకు తన నలుపును తాను తెలుసుకొనడం ఎంత సాధ్యమో, మన ఊతపదాలను మనమే పట్టివేసుకొనడం అంతే సాధ్యం.

నాబోటి సామాన్య రచయితలను విడిచి పెట్టండి; మహాకవులైనా వారే ఊత పదాల ఉచ్చులో చిక్కుకొనడం కద్దు. తాపీ ధర్మారావు నాయుడుగారు ఒక వ్యాసంలో వివరించినట్టు, "తో", "తోడ" అనే అర్థంలో తిక్కన "మెయి" ఎక్కువగా వాడతాడు. నన్నయ్యగారి ఊతపదం "తొట్టు". "మొదలుకొను" అనే దానికి పర్యాయపదంగా దీన్ని ఆయన పదే పదే ప్రయోగిస్తాడు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీవారు ప్రచురించిన "నన్నయ పద ప్రయోగకోశము" చూడగా, ఇరవై మూడుసార్లు ఆయన దీన్ని వాడినట్టు కనబడింది. ఇంతకంటెకూడా "తొల్లి" అంటే ఆయనకు చాలా మోజు. దాన్ని ఆయన 124 సార్లు వాడాడు. "మఱి", "మఱియు", "మఱియున్", "మరియును" కొన్ని వందలసార్లు ప్రయో

గించాడు. తనది పసగల కవిత్వమన్న నమ్మకంతో కాబోలు, పింగళి సూరన "పస"ను ఊతపదంగా చేసుకొన్నాడు. నాయుడుగారు పేర్కొన్నట్టు, "కళాపూర్ణోదయము"లో "ఎవ్వరు సాటి విచిత్ర శౌర్యసంపద పస నారసింహ విభుపట్టికి, నారన్నపాలమౌళికిన్" అని, "సురూపత పస నీకు జోడయిన భవ్యుడు దుర్లభు డెల్ల సృష్టిలోన్" అని, "పడసి యోడు దీవుల నాట పస నెరపుచు" అని తన పస కనబరచడానికి ప్రయత్నించాడు.

ఇతర రచనలకు, రచయితలకు ఊతపదాలు విషగుళికలు కాగా, నాటకాలకు నాటకకర్తలకు అవి సుధాస్రవంతులు. సజీవ ప్రాత్రలను సృష్టించడమే నాటకరచనలో అతి క్లిష్టమైన ఘట్టం. వాటిని సృష్టించగలిగితే నాటకాన్ని అవే నడిపించుకు పోతాయి. రచయితతో మరి నిమిత్తం లేకుండా అవి నాటకాన్ని తమ చిత్తం వచ్చిన చోటుకు నడిపించడంకూడా కద్దు. గిరీశం, రామప్ప పంతులు, లుబ్ధావధానులు, మధురవాణి మొదలైన ప్రధాన పాత్రలనే కాక, వెంకటేశం, బుచ్చమ్మలను పోలిన చిన్నచిన్న పాత్రలను కూడా జీవం ఉట్టిపడేలా గురజాడ అప్పారావు గారు సృష్టించ గలిగిన తర్వాత ఆయనను ఒక పక్కకు నెట్టివేసి, ఆ నాటకాన్ని ఆ పాత్రలు నడుపుకు పోయినందునే "కన్యాశుల్కం" ఒక చాట భారతమై పోయింది. ఇంతగా సజీవమైన పాత్రలను సృష్టించడంలో ఊతపదాలు అప్పారావుగారికి ఎంతగానో తోడ్పడ్డాయి. "మైడియర్", "డామిట్" వగైరా ఊతపదాలను వాడినంతనే మరొక గిరీశం అవతరించ డనుకోండి. అందుకు ఎంతో ఉపజ్ఞ కావాలి, ప్రతిభ కావాలి. ఆయినా, ప్రతి నాటకకర్తకు పాత్రల స్వభావాలను సులభంగా వ్యక్తీకరించడానికి ఊతపదాలు ఉపకరిస్తాయి. అతి వినయాన్ని, లేదా, సేవకప్రవృత్తిని చిత్రించడానికి "చిత్తం చిత్తం" అనే ఊతపద మొక్క టేచాలు. డాబును, దర్పాన్ని వెల్లడించడానికి "మనమాట", "మనసంగతి", "మన ప్రతాపం" వంటివి సరిపోతాయి. నాటక రచయిత సిద్ధహస్తుడైతే ఒకే ఊతపదంద్వారా ఒక లక్ష ప్రయోజనాలను సాధించగలుగుతాడు. ఉదాహరణకు, "చిత్తం" అనే మాటను అతి వినయాన్నో, సేవక ప్రవృత్తినో చిత్రించడానికే కాక, అవహేళనసూచకంగా వాడవచ్చు; మూర్ఖత్వ నిరూపణ కోసం వాడవచ్చు; నిస్సహాయత్వాన్ని వ్యక్తీకరించడానికి వాడవచ్చు; మరెన్నింటికైనా వాడవచ్చు. నాటక రచనలో వలె ఏదో ఒక ప్రయోజనాన్ని కోరికాక, పరిపాటిగానో, వ్యసనంగానో ఊతపదాలను వాడినప్పుడే అవి మనను ఊదర పెడతాయి.

# మత్కుణ ప్రతాపం

ఒక్కసారిగా మత్కుణం ప్రతిపత్తి ఎంత పెచ్చింది, దాని ప్రతిష్ఠ ఎంత పెరిగింది! ఇది వరలోనే దాని పొంగు, దాని ప్రల్లదనం ఇంతంత కావు. ఇక మీదట అది మరెంతగా విజృంభిస్తుందో, మరెంతగా తన ప్రతాపం చూపుతుందో! ఔను మరి! మొన్న దానికి జరిగిన మర్యాదమన్ననలు సామాన్యమైనవా? మూడు కోట్లమందికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ విధానసభలో దాని ప్రస్తావన వచ్చింది. కేవలం ప్రస్తావన రావడమే కాదు; దాని ప్రస్తుతి జరిగింది. ఒక మంత్రి, ఒక ప్రతిపక్ష నాయకుడు, ముగ్గురు, నలుగురు శాసనసభ్యులు: ఇంతమంది ప్రముఖులు మత్కుణంపై ప్రశ్నోత్తరాలను ప్రారంభించి, తర్జనభర్జనల తర్వాత "మత్కుణం అజేయమైంది" అనే సారాంశాన్ని తేల్చారు! సర్వసత్తాక ప్రతిపత్తితో కూడిన ఒక ప్రజాస్వామ్యసంస్థ తన ధైర్య, శౌర్య ప్రతాపాలను ఇంతగా గుర్తించిన తర్వాత మత్కుణం గర్వం నిజంగానే మరింత బలిసిపోతుంది; దాని కళ్లు మరింతగా నెత్తి కెక్కుతాయి; దాన్ని పట్టడానికి మరి పగ్గాలే వుండవు.

సంస్కృతపదాలతో అంతగా పరిచయం లేనివారు నిఘంటువును అందుకోబోతారేమో! అంత శ్రమపడ నక్కరలేదు. "మత్కుణం" అంటే మరేమీ కాదు; మనిషి పుట్టినప్పటినుంచి, లేదా, మంచం పుట్టినప్పటినుంచి మనలను కొరికి తింటున్న

నల్లి. అచ్చ తెలుగులో "నల్లి" అంటే నల్లి మాత్రమే కావచ్చుగాని, మత్కృణానికి "కొమ్ములు లేని యేనుగు", "నారికేళము" అని మరి రెండు అర్థాలు కూడా వున్నాయి. మత్కృణాన్ని కొద్దిగా మార్చి, "మత్కృణుడు" అంటే, "మీసములేని మగవాడు" కాగలడు.

ఇదే సంస్కృతంలో వచ్చిన పెద్ద చిక్కు. నానార్థాలు లేని పదాలు దానిలో తక్కువ. ఉదాహరణకు "శ్రీ" నే తీసుకోండి. శ్రీ అంటే లక్ష్మి మాత్రమే కాదు; పార్వతీ సరస్వతులు కూడా. "శ్రీ" అంటే ఐశ్వర్యం, సంపద, బుద్ధి, వృద్ధి,కీర్తి, శోభ, అలంకారం, మంగళప్రదమైన మాత్రమే కాదు, అమంగళప్రద మైన విషం కూడా. "శ్రీ" అంటే గౌరవసూచకంగా కొన్ని పదాల ముందు చేర్చేది మాత్రమే కాదు; అది సాలిపురుగు కావచ్చు, మారేడు చెట్టుకావచ్చు; అది త్రివర్ణం కావచ్చు, ఉపకరణమైనా కావచ్చు. పోతే పుంలింగమైతే, అదొక రాగ మౌతుంది (శ్రీరాగం).

సంస్కృత పదజాలం ఇంతగా నానార్థ భూయిష్ఠమైనందువల్లనే కావచ్చు, విభిన్న వ్యాఖ్యాతలు భగవద్గీతకు విభిన్న వ్యాఖ్యానాలను చెప్పగలిగారు. ఆచార్య త్రయాన్ని విడిచి పెట్టండి; అద్వైత, ద్వైత, విశిష్టాద్వైత దృక్పథాలపరంగా వారు భగవద్గీతకు చెప్పిన వ్యాఖ్యానాలను విడిచి పెట్టండి; ఆధునికయుగంలో దానికి అరవిందయోగి, లోకమాన్యుడు, గాంధీజీ చెప్పిన మూడు వ్యాఖ్యానాలు కూడా మూడు భిన్న మార్గాలలో, దాదాపు పరస్పర విరుద్ధధోరణులలో నడిచినట్టివే!

ఆత్మ, పరమాత్మలకు సంబంధించిన విషయాలలోనే సంస్కృతభాష ఎవరికి తోచిన అర్థాన్ని వారు చెప్పుకొనడానికి ఇంతగా అవకాశ మిస్తున్నప్పుడు, రెండు రాజ్యాలమధ్య ఒక సంధిపత్రాన్ని ఆ భాషలో వ్రాయడమే జరిగితే, అది ఎన్ని వ్యాఖ్యలకు, ఎన్ని వివాదాలకు కారణభూతం కాగలదో!!

సంస్కృతంలో కానవచ్చినంతగా కాకపోయినా, ఇంగ్లీషులో కూడా కొంత అస్పష్టతకు అవకాశం లేకపోలేదు. అందువల్లనే అంతర్జాతీయ సంధిపత్రాలను ఇంగ్లీషు, ఫ్రెంచిభాషలు రెండింటిలోను వ్రాసుకొనడం కద్దు. అర్థం విషయమై అనుమానాలు వస్తే, ఫ్రెంచి, పాఠమే రూఢి. తక్కిన ఏ ప్రపంచభాషలో కాన రాని విస్పష్టత ఫ్రెంచికి కలదని ప్రతీతి. నానార్థా లున్న పదాలు దానికి అసలే లేవని కాదుగాని, అవి చాలా తక్కువ. మన తెలుగు విషయంలో కూడా ఇది నిజం. మనం "నల్లి" అంటే "నల్లి" మాత్రమే; అది కొమ్ములులేని యేనుగు

కాదు; కొబ్బరికాయ అసలే కాదు.

"నల్లి"ని నల్లిగానే పేర్కొనడం ద్వారా మన తెలుగుమంత్రి, మన తెలుగు శాస నసభ్యులు తెలుగుభాషపట్ల తమకున్న ప్రేమానురాగాలను వ్యక్తం చేసుకొన్నారు. అయితే, నల్లికి ఈ పేరు ఎంతవరకు నచ్చిందో మనకు తెలియదు. సామాన్య లకు నోరు తిరగనంతటి గంభీరనామధేయం - "మత్కుణం" -- దేవభాషలో తన కుండగా, దాన్ని వాడక, తనను "నల్లి" అని పిలిచే ఈ గీర్వాణం ఈ తెలుగువారికి ఎందుకని అది కళ్ళెట్టి జేసిందేమో! నల్లి ఒళ్లు ఎఱుపే; నేను పరీక్షగా చూడలేదుగాని, దాని కళ్లు కూడా ఎఱ్ఱనివే కావచ్చు. అసలే ఎఱ్ఱనైన దాని కళ్లు, కోపం వచ్చినప్పుడు మరెంత ఎఱ్ఱ వాఅతాయో!

ఆంధ్రప్రదేశ్ విధానసభలో తనను "మత్కుణం" అనక, అచ్చ తెనుగులో "నల్లి" అన్నందుకు ఎంత కోపం వచ్చినా, ఒకందుకు నల్లి పొంగిపోయివుండాలి. వైజ్ఞా నిక శాస్త్రాభివృద్ధి విశేషంగా జరిగిన ఈ కాలంలో కూడా, ఈ శాస్త్రాభివృద్ధి కారణంగా తనకు సిద్ధించిన అపారశక్తిసంపదతో చంద్రమండలంలో పాదం పెట్ట డానికి మానవుడు సన్నద్ధపడుతున్న ఈ కాలంలో కూడా నల్లి ఆజేయంగానే నిలిచినట్టు ఆరోగ్య మంత్రి అచ్చుకొన్నందుకు అది తన వీపును తానే ఒకసారి చరచుకొని వుండాలి. ఎక్కువగా ప్రచారంలోగల ఫ్లిట్, డి.డి.టి.లను మాత్రమే కాక, మరెన్నో క్రిమికీటక సంహారకద్రవాలను ఆధునిక మానవుడు కనుగొన్నాడు; వాటిని విరివిగా వాడుతున్నాడు. ఈ బ్రహ్మాస్త్రాలను, పాశుపతాస్త్రాలను, నారా యణాస్త్రాలను సంధించేసరికి ఇతర క్రిమికీటకాదులు మలమల మాడిపోతున్నా, నల్లిపాలిట ఇవి మల్లెపూలహారా లౌతున్నాయి. ఇంతేకాదు. ఆరోగ్యమంత్రి చెప్పినట్టు, డి.డి.టి.ని చల్లడంద్వారా నల్లులు తగ్గడానికి బదులు మరింత పెరు గుతున్నాయి.

పురుగును కప్ప తింటే, కప్పను పాము ఫలహారం చేస్తుంది. పామును తన్ను కుపోయి, తాపీగా భోజనం చేయ్యడానికి గ్రద్దలున్నాయి. ఇది ప్రకృతి ధర్మం. ఇది హింసాత్మకమైన ధర్మమే కావచ్చు. అయినా, జీవరాసులు విపరీతంగా పెరిగి పోకుండా ప్రకృతిలో "బ్యాలెన్స్"ను కాపాడుతున్నట్టిది ఈ ధర్మమే! ప్రస్తుతం మనం క్రిమికీటక సంహారక ద్రవ్యాలను విశేషంగా వాడుతున్నందు వల్ల ఈ "బ్యాలెన్స్" చెదిరి పోతున్నది. అన్ని క్రిమికీటకాదులు మనకు చెరుపు చేసేవి కావు. కొన్ని ఎంతో మేలుచేస్తాయి కొన్నిరకాల క్రిమికీటకాదులు లేకపోతే, పంటలు పండవు; మరికొన్ని లేకపోతే తేనె లభించదు; వేరొక కొన్ని లేకపోతే....

జీవశాస్త్రజ్ఞులను అడిగితే ఇట్టి వివరాలను మరెన్నింటినో చెప్పగలరు. క్రిమికీటక సంహారద్రవ్యాలు కీడు చేసేవాటికి, మేలు చేసేవాటికిమధ్య విచక్షణ చేయలేవు; వరసపెట్టి దాదాపు అన్నింటిని అవి తుడిచి పెడతాయి. దానితో ప్రకృతిలోని "బ్యాలెన్స్" దెబ్బతింటుంది.

సృష్టిపురోగతి ప్రకృతిలోని "బ్యాలెన్స్"కు భంగం కలగనంతవరకే. దానిలో పెద్ద ఒడుదుడుకులు వస్తే, ముందు మన బడాయి బయటపడుతుంది. అణ్వస్త్రపరీక్షలలోని ఘోరప్రమాదం (వాతావరణానికి సంబంధించినంతవరకు) ప్రకృతిలోని "బ్యాలెన్స్" చెదిరిపోవడమే! అందువల్లనే విజ్ఞులందరు ఆ పరీక్షలను నిరసిస్తున్నారు.

మన ఆరోగ్యమంత్రి ప్రకటన ప్రకారం డి.డి.టి. వాడినందువల్ల నల్లుల విషయంలో ప్రకృతిలోని "బ్యాలెన్స్" దెబ్బతింటున్నది. డి.డి.టి నల్లులను చంపలేకపోతున్నది. కాని, నల్లులను తినే ఇతర జీవులను సంహరిస్తున్నది. ఇందువల్ల నల్లుల వంగడం తామరతంపరవలె మరింతగా పెరిగిపోతున్నది. డి.డి.టితో పాటు ఫ్లిట్ కూడా వాడితే, నల్లులు కొంతవరకు తగ్గతున్నట్టు మొన్న మన విధానసభలో ప్రతిపక్ష నాయకు లొకరు పేర్కొన్నారు గాని, అంత తేలికగా లొంగిపోవడానికి నల్లులకు జిత్తులు తక్కువా? నక్కలకే జిత్తులను నేర్పగల దక్షత వాటి కున్నది.

తెలివి తేటలలో నల్లికి అదే సాటి. దోమనే చూడండి; అదెంత వెట్టి మొగమో! చడీ చప్పుడు లేకుండా నల్లివలె కాటు వేయడానికి మారుగా అది సంగీతం పాడుతూ వస్తుంది! ఈగ కూడా "ఆక లెక్కువ, తెలివి తక్కువ" అన్నట్టు గానే ప్రవర్తిస్తుంది. తీపిపై మోజుతో అది ఏ టీకప్పులోనో, కాఫీ కప్పులోనో గబుక్కున వాలి, దుబుక్కున మునిగి పోతుంది! ఇక, మిడతలమాట చెప్పనక్కరనే లేదు. అవి మంటలలోకి నేరుగా వెళ్ళిపడి, మలమల మాడిపోతూవుంటాయి. నల్లి ఈ పిచ్చిపను లేవీ చేయదు. వేటకై బయల్దేరినప్పుడు తప్ప, మిగతా వేళలలో అది గుప్‌చిప్‌గా ఎక్కడో నక్కి వుంటుంది. నక్కివున్నా అది నిక్కిచూస్తూనేవుంటుంది అదును దొరకడమే తడవుగా అంగపంగలపై ముందుకు సాగుతుంది! ఎటొచ్చీ, దానికి చేతకాని విద్య చిటుక్కున కుట్టనక్కర లేకుండా జలగవలె నెత్తురు పీల్చుకొనలేక పోవడమే! ఆ విద్యలో కూడా ఆరితేరి వుంటే, దాని ప్రతాపం మరెంతగా వెళ్ళేదో!!

ఏమైనా ఇంతగా తెలివితేటలున్న ప్రాణి కాబట్టి, డి.డి.టికి ఏ ఫ్లిట్‌నో జత చేసినా, నల్లి తన జాగ్రత్తలో తాను వుండనేవుంటుంది. మంచం మాత్రమే నల్లికి

స్థావరమని మన భ్రమ. ఈ భ్రమకొద్దీ మనం నులకనో, నవారునో విప్పి, కోడు కోడుచొప్పన మంచాన్ని కూడా విడదీసి, డి.డి.టి; ఫ్లిట్ వగైరాలను ఎంతగా జల్లినా, వాటి ప్రభావం --మత్కుణ దృక్పథంనుంచి చెప్పాలంటే, "వాటి దుష్టప్రభావం" -- తగ్గేవరకు అది ఏ గోడ నెరలలోనో, ఏ తలుపు సందులలోనో, ఏ కిటికీ కన్నాలలోనో తిష్ఠవేస్తుంది. అటు పిమ్మటనే వేటకు బయల్దేరుతుంది. అయినప్పుడు మనం ఏమి మందులు చల్లినా, ఎన్నింటిని చల్లినా, ఫలిత మొక పెద్ద పూర్ణానుస్వారం మాత్రమే!

మందులకు లొంగని నల్లి భరతంపట్టడానికి ఒక పురాతన ప్రక్రియకు చాలింది లేదని ఆరోగ్యమంత్రి మొన్న ఆంధ్రప్రదేశ్ విధానసభలో అన్నారు. నవనాగరి కత బలిసిపోయిన ఈ కాలంవారికి తెలియకపోవచ్చునని కాబోలు, ఈ ప్రక్రియకు సంబంధించిన వివరా లన్నింటిని అయన తెలియజేశారు కూడా. మూడు ఘట్టా లతో కూడింది ఈ ప్రక్రియ. ప్రథమ ఘట్టం -- మంచాన్ని మండుటెండలో మూడు నాలుగు గంటల పాటు పడవెయ్యడం. ద్వితీయ ఘట్టం – సలసల కాగుతున్న నీళ్ళను దానిపై పోయడం. తృతీయ ఘట్టం--బడితతో దాన్ని బాదడం. "నల్లిని గురించి మంచానికి బడితిబాజా" అనే సామెత ఎంత పాతదో, ఈ ప్రక్రియ అంత పాతదే. మరి ఆరోగ్యమంత్రి ఉద్ఘాటిస్తున్నట్టు, ఈ ప్రక్రియ నిజంగా అమోఘమైనదైతే, నల్లి ఎన్నడో నశించి పోకుండా ఈ నాటికీ మిగి లేదా? మిగిలి, ఇంతగా మిడిసిపడేదా?

నల్లి మిడిసిపాటు దుస్సహమైనందునే విధానసభ గౌరవనీయ సభ్యులు కొందరు రాష్ట్రప్రభుత్వం దానిపై యుద్ధప్రకటన చేయాలన్న సూచన చేసివుండాలి. మిడి సిపాటుకైనా ఒక మితి వుండవద్దా? తక్కిన వారిపైవలె గౌరవనీయ సభ్యులపై కూడా తెగబడ్డం తగునా? అయితే, నల్లికి గౌరవనీయ సభ్య లంటేనే కాదు, ఆ సూర్య చంద్రు లన్నా, హరిహరాదు లన్నా నదురు బెదురు లున్నట్టు తోచదు. వెనుకటికి ఒక కవి చెప్పనే చెప్పినట్టు--

శివు డద్రిని శయనించుట,
రవి చంద్రులు మింటనుంట, రాజీవాక్షుం
డవిరళముగ శేషునిపై
బవళించుట నల్లిబాధ పడలేక సుమీ!

శివుడు కొండపై పడుకొన్నా, సూర్య చంద్రులు మింటిలో కాపురం పెట్టినా,

శ్రీమహావిష్ణువు శేషునిపై శయనించినా, దేవాదిదేవులు కనుక, అది వారికి చెల్లింది. మానవమాత్రులమైన మనం నల్లికి భయపడిపోయి, ఇల్లు వదిలిపెట్టి ఏ కొండకో, కోనకో పారిపోతే, "నల్లులకు వెరచి, ఇల్లు విడిచినట్టు" అనే సామెత చెప్పి నవ్వుతారు. "నల్లికాటు, నారిపోటు" అనే మరొకటి లోకోక్తిలో ఎంత నిజంవున్నా, కాట్లు, పోట్లు లేకుండా బ్రతుకు వెళ్ళమారదు. నల్లే నయమని పించే నరు లెంతమంది లేరు? నిత్యజీవితంలో ఎన్ని సందర్భాలలో వీరు మనకు తారసిల్లరు?

కుక్క కుక్కను తిననట్టే, నల్లి నల్లిని కాటువెయ్యదు; నరులలో కొంత మంది మాత్రం తోటి నరులనే కంగాళీ పనులతో కాటు వేస్తారు, సూటి పోటి మాట లతో పోటు పొడుస్తారు. ఏ మాట కామాట చెప్పాలంటే, నల్లి మన నెంత బాధించినా, దాన్ని పల్లెత్తుమాట అనడానికి వీలులేదు. దానికి ఆహారమైనా, పానీ యమైనా నరరక్తమే అని సృష్టి నిర్ణయించింది. ఆ సృష్టినిర్ణయాన్ని పాటించక పోతే, అది ఆకలిదప్పులతో నకనక లాడవలసి వస్తుంది. ఆత్మహత్య చేసుకోవలసి వస్తుంది. అయినప్పుడు నరులను హింస పెడుతున్నదని దాన్ని నిందించవచ్చునా? నరహింస నరుని విషయంలో తప్పుకావచ్చుగాని, నల్లివిషయంలో మాత్రం కాదు. తన ప్రాణాలను నిలుపుకోవాలంటే అది కాటు వేయవలిసిందే, కవోష్ణ రక్తాన్ని త్రాగవలసిందే! దానికి సంబంధించినంతవరకు అదే నీతి, అదే న్యాయం, అదే ధర్మం, అదే యిహం, అదే పరం. అందువల్ల మనం నిందించవలసింది నల్లిని కాదు. నల్లి బుద్ధిని తమ నడతలో చూపించే నరులనే!

నల్లిబుద్ధి నరులు అకారణంగానే, అనవసరంగానే ఇతరులను బాధిస్తారు, వేధిస్తారు. పచ్చగా ఒక రుంటే, అదే పాపంగా, "ఆ! బ్లాకు మార్కెట్టు సంపాదన!" అని వీరు ఒక బల్లెం విసురుతారు. పేరులో ఒక రుంటే, అదే నేరంగా "పేరు గంగా భవాని,త్రాగబోతే నీళ్లు లేవు" అని ఒక బాణం ప్రయోగిస్తారు. మాటలద్వారానే కాకుండా చేతలద్వారాకూడా కీడు చేయటానికి ప్రయత్నిస్తారు. ఆకలి తీరగానే నల్లి మరి మన జోలికీ సొంతికీ రాదు; ఈ నల్లి బుద్ధి నరులది తీరని ఆకలి. అందువల్ల అంతూపంతూ లేకుండా కుట్టడమే వీరి పని. డి.డి.డి.తో ఫ్లిట్‌ను కలిపినా, దానితో మరొక విషాన్ని కలిపినా, ఈ విషపు పురుగులను అణచివేయ లేము. ఆరోగ్యమంత్రి అమోఘమైనదని చెప్పిన పురాతన ప్రక్రియసయితం వీరి విషయంలో నిరర్థకమైనదే.

# అన్నం

ఒకనాడు మనదేశంలో అన్నాన్ని అమ్ముకొనడం చాలా తప్పుగా యెంచే వారు. మరి దేనినైనా అమ్ముకోవచ్చుగాని బ్రహ్మపదార్థాన్ని అమ్ముకోవడమా? అన్నం బ్రహ్మ పదార్థమని మన ఋషీశ్వరుల నమ్మకం. అన్నానికీ, బ్రహ్మపదార్థానికీ భేదమే లేదని చెప్పడానికి వారు ఒక పెద్ద అన్నసూక్తానికి సూక్తాన్నే ప్రవచించారు. తర్వాత తర్వాత అన్నం దేవీ మూర్తిని ధరించి "కాశీ అన్నపూర్ణ" అయింది. ఆమెను—

అక్షయంబుగ కాశిలోపల
అన్నపూర్ణ భవానివై
సాక్షి గణపతి గన్నతల్లివి,
సద్గుణావతి శాంభవీ

అని కీర్తించకుండా పెక్కుమంది ఈ నాటికీ ముద్ద యెత్తరు.

ఇతరులతో పంచుకొనని భోజనం వొంట పట్టదని ఋగ్వేదం చెప్పిన ముక్క ప్రతి గృహస్థుకు పూర్వ మొకనాడు "వేదవాక్కు"గానే వుండేది. అతిథి, అభ్యాగతులను వారు దైవసమానులుగా చూచుకొనేవారు. తమకున్నా లేకపోయినా,

"దేహి" అంటూ వచ్చినవారికి విస్తరి పరిచేవారు. తమ గుమ్మంలోకి "భవతి భిక్షాం దేహి!" అని దేవిరిస్తూ వచ్చేవరకు ఆగక అతిథి, అభ్యాగతులను వెతికి తెచ్చుకోడానికి స్వయంగా బయల్దేరేవారు. వచ్చిన అతిథి వొంటరిగా రాక దుర్వా సునివలె కొన్ని వేలమంది శిష్యులను వెంటవేసుకువచ్చినా "ఏమి దిక్కురా, దేవుడా!" అని చింతపడేవారే తప్ప, "ఇదేమి కుమ్మ" అని విసుక్కునేవారు కాదు. అతిథులుగా వచ్చిన వారు – త్రిమూర్తులు అనసూయను కోరినట్టు – ఏదో విసరీతపు కోర్కెను కోరినా, ఆ చిక్కునుంచి మెలకువగా తప్పుకునేవారుగాని చేటుకొట్టి పంపించేవారుకాదు. ఆకలికి నకనకలాడుతూ యెత్తబోయిన ముద్దను అన్నార్తులై వచ్చిన బాపనికి, శూద్రునికి "హరి సమర్పణం" అంటూ పంచిపెట్టి, మిగిలిన కాసిని కూసిని మెతుకులను డొక్కలెండివున్న కుక్కకు పడవెయ్యడమేగాక "అన్నము లేదు, కొన్ని మధురాంబువులున్నవి, త్రావుమన్న! రావన్న! శరీరధా రులకు నాపద వచ్చిన, వారి యాపదల్ గ్రన్ననమార్చి, వారికి సుఖంబులు సేయుటకన్న నొండు మేలున్నదె? నాకు దిక్కు పురుషోత్తము డొక్కడె చుమ్మ" అని నోటి దగ్గర నీళ్ళనుకూడా పరుల కిచ్చివేసిన రంతి దేవుని ప్రతిగృహాస్థు పోలక పోయినా, లేదన్నవారికి లేకుండానే పోగలదన్న నమ్మకం మాత్రం బహుళ వ్యాప్తంగా వుండేది.

అన్ని దానాలలో అన్నదానం గొప్పదన్న నమ్మకం నాటి ప్రజాకోటిలో గట్టిగా వేళ్లు తన్నుకొన్నందునే అన్నసత్రంలేని ఊరు చెదురుగా తప్ప వుండేదే కాదు. ఎక్కడ బడితే అక్కడే సంతర్పణలు, సమారాధనలు జరుగుతూ వుంటేవి. "ఆయువు లేక చస్తారుగాని, అన్నంలేక చస్తారా!" అనేమాట ఆ కాలంలో ప్రతినోటా వినవచ్చేది. అసలు ఋగ్వేదమే ఆకటిచావు భగవదిచ్ఛకు వ్యతిరేకమని చెప్పింది. ఆకలిగొన్న వారికి అన్నం పెట్టని వ్యక్తికి పుట్టగతు లుండబోవని, లేదనకుండా వెళ్ళేవానికి ఎన్నటికీ లేమి వుండదని అది హెచ్చరించింది.

ఋగ్వేదం ఏనాటిదోగాని, ఒకటి, రెండు తరాలక్రితం వరకు కూడా అన్నం విషయంలో "ల"కు ఏత్వ మివ్వడం మన దేశంలో సర్వసామాన్యంగా జరిగేది కాదు. భోజనాలవేళకు వాకిటిలోకి వచ్చిన బిచ్చగాడిని "చెయ్యి ఊరికేలేదు – పోపో!" అంటే, మా తాత తనకు వడ్డించిన విస్తరిని అలాగే యెత్తుకువెళ్ళి బిచ్చగాని జోలిలో పడవేసి, ఆ పూటకు నిరాహారం వుండేవాడు. ఆయనకంటె ధర్మపరుడు ఆయన తండ్రి. ఇంచుమించు ఎనభైయేళ్ళవాడు "పగటిచుక్కలు రాలె"నని, "ఎల్లుగాలి వీచె"నని చెప్పబడే ధాతనామ సంవత్సరపు కరవు రోజులలో

"అన్నమో రామచంద్రా!" అంటూ క్షామ ప్రాంతాలనుంచి మా తాతగారి సీమకు జనం తండతండాలుగా వచ్చిపడినారట. ఆ సంవత్సరంలో వివాహం చేసుకొన్న మా తాత తన పెండ్లినాడు గాడిపొయ్యి వేసి, కాగు తర్వాత కాగు చొప్పున అన్నాన్ని దించి, మూడు, నాలుగు తండాలవారిని బంతులు లేపి, ఆపైన స్నానం చేసి, లగ్నానికి వెళ్ళబోతుండగా మరొక తండా వచ్చి పడిందట. వాళ్ళను చూచి "ఇప్పుడుకాదు - మరిపొండి" అని మా తాత కసిరేసరికి "ఇంతమంది నా వాకిట్లో ఆకలికి చస్తుంటే, నువ్వు పెళ్ళి చేసుకు వస్తావట్రా!- నీకు సిగ్గులేదూ?" అని ఆయన తండ్రి (మా ముత్తాత) గద్దించాడట. ఆ గద్దింపు విన్నంతనే ఆ సరికి బోయీలు భుజానికి యెత్తుకున్న పల్లకీనుంచి మా తాత కిందికి ఒక్క ఉరుకు ఉరికి, గాడి పొయ్యిలో మళ్ళీ నిప్ప వేశాడట. ఆ ధాత కరువురోజుల లోనే కర్నూలుజిల్లా, కోయిలకుంట్ల తాలూకా, ఉయ్యాలవాడ గ్రామంలోని బుడ్డా వెంగళరెడ్డి ఆస్తిపాస్తులన్నీ తెగనమ్మివేసి, బుక్కా పకీరుగా నిలవడమేకాక, తాను స్వయంగా ఊళ్ళవెంటబిచ్చమెత్తికూడా, వచ్చినవాడికి లేదనకుండా అన్నంపెట్టి, వేల వేల ప్రాణాలను కాపాడినాడట. ఈనాటికీ కర్నూలు జిల్లాలో బిచ్చగాళ్లు--

బుడ్డా వెంగళరెడ్డి
ఉండేదే ఉయ్యాలవాడా

అంటూ పాటలు పాడుతూ ఆ మహాదాతను వేనోళ్ళ కీర్తిస్తూ వుంటారు.

అయితే, ఆకలిగొన్నవానికి, అన్నం పెట్టడం ప్రత్యేకత అని మనం గొప్ప చెప్పుకోవలసిన రోజులలో ఏ సంఘంలోను "చిన్న నా బొజ్జకు శ్రీరామ రక్ష" అనుకొనేవారుకారు. చివరికి నిర్జనారణ్యంలో భోజనానికి కూర్చున్నా ముద్ద యెత్తడానికి ముందు తన ఆహారాన్ని పంచుకోడానికి వచ్చేవా రున్నారా అని పాలికేక పెట్టితీరాలని కొన్ని ప్రాచీన సంఘాలలో ఒక కట్టుబాటు వుండేది. ఇప్పటికీ రైలు ప్రయాణాల సందర్భంలో ముస్లిములు తాము వెంట తెచ్చుకున్న భోజనం మూటను విప్పుతూనే, ఆ పెట్టెలో తోటి ముస్లిము లెవరైనా వుంటే, వారు అపరిచితులైనా, "ఆయియే! ఖాయియే!" అని ఆహ్వానిస్తారు. తమ కడుపుకే తినడంకాని, తిండివద్ద కొట్లాటలు పెట్టుకోవడం కాని, తిండిలేక చచ్చిపోవడంకాని, అసభ్య మానవులుగా పరిగణించబడే వారికి ఎంత మాత్రం కొరుకుడు పడని విషయాలు. ఆఫ్రికాకు తొలిగా వెళ్ళిన తెల్లవారు అక్కడి నీగ్రో జాతివారిలో కొందరిని కూడగట్టుకోవాలని, వారి నెవరినైనా చేరదీసి, చాటు మాటుగా

తినుబండారాలను పెడితే, వారు వాటిని అక్కడే గుటుక్కున నోట్లో వేసుకొని, మూతి తుడుచుకుని, చక్కాపోకుండా, భద్రంగా పట్టుకువెళ్ళి, తమ వారం దరికీ సమానంగా పంచిపెట్టివేసేవారు. అమెరికాకు ఓం ప్రథమంగా వెళ్ళిన తెల్లవారు చెప్పేదాన్ని బట్టి రెడ్ ఇండియన్ జాతివారికి తాము వేటాడిన జంతు వుల మాంసాన్ని పోగులు వేసుకోవడంలో ఈ పోగు చిన్నదని, అది పెద్దదని, ఇవి మెత్తని కండలని, అవి వట్టి బొమికలని, ఇది చవు లూరించే కార్ష్యమని, అవి సారంలేని పొట్టపేగులని ఏనాడూ తగవే వచ్చేది కాదు. పసిఫిక్‌లోని శామోన్ దీవులకు చెందిన ఆదివాసితో మాట్లాడుతూ దారిద్ర్యంవల్ల చలికీ, ఆకలికీ నొచ్చి లండన్‌లో పెక్కుమంది చచ్చిపోతూ వుంటారని ఒక బ్రిటిషర్ చెప్పగా, అతడు పట్టరాని ఆశ్చర్యంతో "అ దేమిటి, బాబూ! మీ దేశంలో అన్నం లేదూ? చుట్టపక్కాలుండరూ? ఒక్కరికీ ఇల్లే వుండదూ? ఎవరికి వారు దిక్కూ మొక్కూలేని అడవిలో బ్రకుతుతారా?" అని గుచ్చిగుచ్చి అడిగాడట! ఈ నాడైతే మాత్రం అతడి నోట ఈ ప్రశ్న పరంపరలో ఒక్కటైనా రాదు. కారణం? అతడికి సభ్యతావాసనలు అంటడమే!

గాదెలలోను, గరిసెలలోను గింజ మూలుగుతున్నా, పట్టెడు మెతుకులు కరవై కొందరు కటికి చావు చావడం విపరీతం కాదన్న స్థితికి శామోస్ ద్వీపాల ఆదివాసి రావడానికి సభ్యతా వాసనలు కారణమని చెప్పడం విడ్డూరంగానే తోచవచ్చుగాని, అన్నం విపణి వస్తువైన పిదపే మానవుడు నాగరికతాపథం వెంట నిజంగా పురోగ మించాడని మానవవికాస శాస్త్రజ్ఞులు – వీరిని ఇంగ్లీషులో "యూన్‌థ్రోపోలజిస్ట్స్" అంటారు–అనేక నిదర్శనాలు చూపుతారు. కష్టపడక పోయినా నిక్షేపంగా జరిగే దారివుంటే, కష్టపడి పనిచెయ్యడానికి వెట్ట పుట్టదు. సత్రంభోజనాన్ని, మఠం నిద్రను మరిగినవారు రెక్కలు విరుచుకుంటారా? నా కున్నదాన్ని నలుగురితో పంచుకోవడం గొప్ప విశేషమే. కాని, పంచుకోవలసిన దానికి నలుగురూ నాలుగు కాస్తలూ చేర్చకపోతే, ఎవ్వరికీ కడుపూ కాలూ నిండదు. పదిమంది పాటుపడితేనే పదిమందికీ సాపాటు. అప్పుడే సంఘానికి వికాసం; అప్పుడే దానికి పురోగతి. ఇలా కాక,వండుకున్నమ్మకు ఒక్కటే కూర, అడుక్కున్నమ్మకు అన్నీ కూరలే" అనుకుంటే సంఘంలో బద్ధకం బలిసిపోతుంది; జోగుల సంఖ్య పెరిగిపోతుంది; ఆ జోగుల రాపిడికి ఆ సంఘంలో రాలేది బూడిదే. దీన్నిబట్టే అడిగినంతనే అన్నం దొరికిన సంఘంలో ఆశ లుడిగేవని, ఆశలతో పాటు వికాసం ఉడిగేదని మానవ వికాస శాస్త్రజ్ఞు లంటారు. "కట్టుకు పోతామా!" అని కలదాన్ని

కలవారు లేనివారికి పంచడం ఎంత గొప్పసంగతైనా, అందువల్ల సోమరిపోతులు పెరిగిపోయి, సంఘం నానాటికి తీసికట్టు కాగల ప్రమాదం ఏర్పడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్నందునే "ప్రతివానికి అతడి అవసరాలకు తగినంత అనుభవం" అనే పాతకాలపు సామ్యవాద సూత్రానికి "ప్రతి వానిచే అతని శక్త్యానుసారం పనిపాటులు" అనే షరాను ఈ కాలంలో చేర్చారు.

*

# ముద్రణాలయం

"ముద్రణ కూడా ఒక కళేనా?" అని వెదవి విరిచేవారు కొంద రున్నారు కాబోలు, లేకపోతే, మొన్న పూనాలో కేంద్ర సమాచారమంత్రి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి "ముద్రణకూడా ఒక కళే సుమీ!" అని హెచ్చరించవలసి వచ్చేదా? ఏ పరిస్థితిలో ఎవరిని ఈ విధంగా ఆయనహెచ్చరించారో తెలియదు గాని, నాకు సంబంధించినంతవరకు ఇది అనవసరమైన హెచ్చరికే! ముద్రణాలయం నాకు కార్యాలయం మాత్రమే కాదు; అదే నాకు విద్యాలయం, అదే దేవాలయం. ఉద్యోగంలో ప్రవేశించడం, ముద్రణాలయంలో ప్రవేశించడం నా విషయంలో భిన్న సమయాలలో జరిగిన భిన్న సంఘటనలు కావు; ముద్రణాలయంలో ప్రవేశించ డంద్వారానే దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఉద్యోగ స్వీకారం చేశాను. వారాలలో, వర్ష్యాలలో ఆనాడే నమ్మకం లేనందున మంచిరోజు చూచుకొని నేను ముద్రణాలయంలో పాదం పెట్టలేదు. ఇలాంటి విషయాలలో లోకాచారానికి విరుద్ధంగా ప్రవర్తించడం స్వతంత్రాలోచన చేయనారంభించిన నాటినుంచీ నాకు పరిపాటి కాబట్టి, ముద్రణాలయంలో కుడికాలుకు బదులుగా ఎడమదాన్నే ముందు పెట్టినట్టు జ్ఞాపకం.

ఉద్యోగధర్మంలో నా జీవితం పూర్తిగా ముద్రణాలయంలో గడిచింది; శేషజీవితానికి సయితం అదే ప్రధాన కేంద్రం కావచ్చు. "కావచ్చు" అని సందేహానికి కొంత సందు మిగల్చ నక్కరలేదు. ముద్రణాలయం వెలుపల నాకు ఆలోచనలు తోచవు; రచన సాగదు; ధారాళంగా ఊపిరి పీల్చుకోవడమైనా కష్టమే. ముద్రణాలయంతో నా బ్రతుకు ఇంతగా పెనవేసుకొన్నందున, "ముద్రణకూడా ఒక కళేనా?" అని నిరసనగా ఎవరు మాట్లాడగలిగారో, ఎలా మాట్లాడగలిగారో నాకు అర్థంకాని విషయాలు.

ముద్రణ కేవల మొక కళ మాత్రమే కాదు, అదొక మహావిద్య, ఒక మహిత శాస్త్రం, ఒక పరమ తపస్సు, ఒక వరప్రసాదం. మానవచరిత్రలో ప్రాచీన, అర్వాచీన యుగాలను వేరు చేసేది ముద్రణే. అది వ్యాప్తిలోకి రాకముందు అన్ని విద్యలు గుప్తవిద్యలే; అది బహుళ ప్రచారాన్ని పొందక ముందు అన్ని శాస్త్రాలు రహస్య శాస్త్రాలే; అది విశ్వరూపాన్ని ధరించకముందు సమస్త విజ్ఞానం సంఘంలో ప్రబలులైనవారి సొంతములై మాత్రమే. అది లేనప్పుడు గురుముఖంగా తప్ప విద్యాభ్యాస్యం సాధ్యపడేది కాదు. గురువులైన వారు ఉత్తమకులజులను తప్ప తక్కినవారిని దరిజేరనిచ్చేవారు కాదు. గురువులైనవారు ఉత్తమకులజులను తప్ప తక్కినవారిని దరిజేరనిచ్చేవారుకాదు. జబాల పుత్రుడు విద్య నభ్యసించ గోరి గురువు వద్దకు వెళ్ళగా, అతడెదుర్కొనవలసి వచ్చిన మొట్టమొదటి ప్రశ్న "నీ తండ్రి పేరేమిటి?" తండ్రి పేరును చెప్పలేని వాడైనా, అదృష్టవంతుడు కాబట్టి, జబాల పుత్రునికి విద్యాయోగం పట్టింది. లక్షలాది అదృష్టహీనులలో అతడు ఒకే ఒక అదృష్టవంతుడు కాకపోతే, ఇన్ని శతాబ్దాల తర్వాత కూడా "సత్యకాముడు"గా అతని పేరు నిలిచివుండేదా? సూతపుత్రుడని నమ్ముతున్నా, కర్ణునికి ద్రోణాచార్యులు ధనుర్విద్యను చెప్పడం అతనికి రాజాశ్రయం కలదు గనుకనే. ఆ చెప్పడమైనా మనస్ఫూర్తిగా కాదు. బ్రహ్మాస్త్రాన్ని ఉపదేశించ వలసిందని కర్ణుడు ప్రార్థించగా, వ్రతసమన్వితుడైన బ్రాహ్మణునికి, తపః పుణ్యాన్నపతికి తప్ప, అన్యులకు దాన్ని తెల్పరాదని ద్రోణాచార్యులు తెగవేసి చెప్పనే చెప్పాడు. అందువల్లనే పరశురాముని వద్దకు వెళ్ళి, తాను బ్రాహ్మణుడైనట్టు కర్ణుడు నటించవలసి వచ్చింది. ఎంత దీక్షగా గురుశుశ్రూష చేసినా, ఎన్ని మహాస్త్రాలను సంపాదించినా, కుల రహస్యం వెల్లడైపోయేసరికి "నీవు నేర్చిన విద్యలన్నీ సమయానికి అక్కరకురాని శుష్కవిద్యలై పోగల" వన్న శాపం అతడికి తప్పలేదు.

ఈ "పుణ్యభూమి"లోనే కాదు, అన్ని దేశాలలోను ముద్రణయుగప్రారంభానికి

పూర్వం సర్వవిద్యలు, సమస్తవిజ్ఞానం అగ్రవర్ణాలకు మాత్రమే పరిమితం. శూద్రుడు వేదం వింటే, అతడి చెవులలో కరిగించిన సీసం పోయవలెనన్నంతవరకు తక్కిన దేశాలు వెళ్ళి వుండక పోవచ్చు గాని, వాటిలోనైనా అగ్రవర్ణాలకు చెందని వారికి విద్యాబోధన విషయంలో కొన్ని విధినిషేధా లుండేవి. ప్రపంచం మొత్తంపై ఇవి ముందు సడలింది, ఆ తర్వాత క్రమక్రమంగా మాయమై పోయింది. ముద్రణ యుగం సుస్థిరంగా నెలకొన్న పిదపనే. విద్యావ్యాప్తికి, విజ్ఞానప్రచారానికి ప్రోది చేయడం ద్వారా మానవుని దృక్పథంలోనే ముద్రణ విప్లవాత్మకమైన మార్పులను తెచ్చింది. స్వాతంత్ర్యం, సమత, సౌభ్రాత్రం; బీజరూపంలో ఈ మహోదాత్త లక్ష్యాలు మతగ్రంథాలలో, తత్త్వశాస్త్రాలలో ప్రాచీనకాలంలోనే ప్రతిపాదితమై వుండ వచ్చు గాని, సంఘనిర్మితిలో, రాజకీయవ్యవస్థలో, ప్రజాజీవితంలో వీటికి ఆనాడు ఎంత మాత్రం స్థానం వుండేది కాదు. ఈ లక్ష్యాలే ప్రాతిపదికగా నవసమాజ నిర్మాణానికి నేడు దేశదేశాలలో కృషి కొనసాగడం మానవ మనస్తత్వంలోనే అపూర్వ విప్లవాన్ని ముద్రణయంత్రం సాధించినందువల్లనే.

మానవ మనస్తత్వంలో ముద్రణయంత్రం మహావిప్లవాన్ని తెచ్చింది పదహారవ శతాబ్ది తర్వాతనే. దీన్నిబట్టి ఆ శతాబ్దిలోనే ముద్రణపద్ధతిని కనుగొన్నారని తీర్మానించుకోరాదు. అందుకు శతాబ్దికి పూర్వమే యూరప్‌లో ముద్రణాలయాలు ప్రారంభమైనాయి. అందుకు చాలా శతాబ్దాలకు పూర్వమే చైనాలో ముద్రణ ఆవిర్భవించింది. సరిగా ఎప్పుడు, ఎక్కడ, ఎవరు ముద్రణను కనుగొన్నారో మనకు తెలియదుగాని, క్రీస్తుశకం 868వ సంవత్సరానికి పూర్వమే చైనాలో పుస్తకాలను అచ్చు వేయడం ప్రారంభించారని నిర్ధారణగా చెప్పవచ్చు. మధ్య ఆసియాలో విస్తృతంగా పర్యటించి, ప్రాచీన భారతచరిత్రకు, మతానికి, సారస్వతానికి, కళలకు, సంస్కృతికి సంబంధించిన కొత్త విషయాలను పెక్కింటిని కనుగొన్న సర్ ఆరెల్ స్టయిన్ పుణ్యమా అని, ఇతర గ్రంథాలు,చిత్రాలు, కళాఖండాలు మొదలైన వాటితో పాటు "వజ్రసూత్రం" అనే బౌద్ధమత గ్రంథానికి చైనీస్ భాషాంతరీకరణ లభ్యమైంది. పదహారు అడుగుల పొడుగు, ఒక అడుగు వెడల్పు కాగితపు చుట్ట రూపంలో చైనా లోని టున్‌హువాంగ్ గుహలలో 1900 సంవత్సరంలో ఇది దొరికింది. ఇప్పటివరకు లభించిన అచ్చుపుస్తకాలలో ఇదే అతి ప్రాచీనమైనట్టిది.

"వజ్రసూత్రం" ప్రతి న్యాయంగా మనకు దక్కవలసినా, బ్రిటిష్‌వారు దీన్ని చేజిక్కించుకొని, బ్రిటీష్ మ్యూజియంలో భద్రపరచుకొన్నారు. హంగరీలో జన్మించినా, బ్రిటన్, ఆస్ట్రియా, జర్మనీలలో ఉన్నతవిద్య నభ్యసించినా, సర్ ఆరెల్

ఉద్యోగం చేసింది మన దేశంలోనే, లాహోర్‌లోని ఓరియంటల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా కొంతకాలం పనిచేసిన తర్వాత, పంజాబ్ యూనివర్శిటీకి ఆయన రిజిస్ట్రార్ అయినాడు. తర్వాత విద్యాశాఖలో ఉన్నతోద్యోగిగా ప్రవేశించి, భారత ప్రభుత్వం తరపున చైనీస్ టర్కిస్తాన్‌లో చరిత్రపరిశోధనలకై పర్యటించాడు. దీనితో చారిత్రక పరిశోధనలపట్ల ఆసక్తి మరింత ప్రబలం కాగా, భారత పురావస్తుశాఖలో చేరి, పర్షియా, బెలూచిస్తాన్, మధ్య ఆసియా, పశ్చిమ చైనా మున్నగు ప్రాంతాలకు పెక్కుసార్లు వెళ్ళివచ్చాడు. భారత ప్రభుత్వోద్యోగిగా ఆయన తన పర్యటనల సందర్భంలో సేకరించగలిగిన వాటిలో చివరికి పూచికపుల్లపై కూడా బ్రిటిష్‌వారికి హక్కులేదు. అయినా, పరిపాలన చేసే హక్కు ఆనాడు వారిదే. "రాజుల సొమ్ము రాళ్ళపాలు" కావచ్చు, కాకపోవచ్చు గాని, దాసులసొత్తు ప్రభువుల పాలే! ఈ సూత్రం ప్రకారం మన శిల్పాలను, చిత్రాలను, అమూల్యమైన ఇతర కళాఖండాలను సొంతం చేసుకొన్నట్టే, అచ్చు పుస్తకాలలో అతి ప్రాచీనమైన "వజ్రసూత్రం" ప్రతిని సయితం వారు దఖలు పరచుకొన్నారు.

సర్ ఆరెల్ సేకరించిన "వజ్రసూత్రం" బ్రిటిష్ మ్యూజియంలో వున్నట్టు నేను తెలుసుకొన్నది ఈ వ్యాసరచన ప్రారంభించిన పిదపనే. ఇంతకుముందే ఈ సంగతి తెలిసివుంటే, నిరుడు అక్టోబర్‌లో బ్రిటిష్ మ్యూజియం పునర్దర్శనానికి వెళ్లినప్పుడైనా దాన్ని తప్పక చూచి వుండేవాడినే! ఇటీవలి యాత్రను కలుపుకొనగా నేను లండన్ వెళ్లింది మూడుసార్లు! బ్రిటిష్ మ్యూజియం సందర్శనానికై వెళ్లింది కనీసం ఆరేడుసార్లు. పుస్తకాలంటే పడి చచ్చేరకం కాబట్టి ప్రాచీనగ్రంథాల విభాగంలో ఎప్పుడైనా సరే మొత్తం అయిదారు గంటలైనా నేను గడిపి వుండాలి. అయినా, "వజ్రసూత్రం" వైకి నా కన్ను ఎందుకు పోలేదో? దాన్ని చాలా పదిలంగా దాస్తున్నారా? ప్రత్యేకానుమతిని పొందినవారికే దాన్ని చూపుతున్నారా? ఏమో, నాకు తెలియదు.

"వజ్రసూత్రం" ముద్రణను ఎప్పుడు ప్రారంభించారో కాని, క్రీస్తుశకం 868 వ సంవత్సరం మే 16వ తేదీని దాన్ని ముగించారు. ఆ వెనువెంటనే (871-938 సంవత్సరాల మధ్య) త్రిపిటకాలను అచ్చు వేశారు. అప్పటిలో సుంగ్ వంశానికి చెందిన చక్రవర్తులు చైనాను పరిపాలిస్తున్నారు. 960నుంచి 1279వరకు విస్తరించిన వీరి పరిపాలనాకాలంతో రాజాదరణ కారణంగా ముద్రణ మూడు పువ్వులు-ఆరు కాయలుగా పరిఢవిల్లింది.

గ్రంథప్రచురణకే కాక, ఇతర ప్రయోజనాలకు కూడా ముద్రణను ఆదినుంచీ

వినియోగిస్తూ వచ్చారు. చిట్లపేకలనే కాక, కరెన్సీ నోట్లనేకాక, తాయత్తులను కూడా అచ్చుతో తయారు చేసిన నిదర్శనాలు నేటికీ మిగిలి వున్నాయి. జపాన్ చక్రవర్తిని షోటూకూ (ఈమె బౌద్ధమతస్థురాలు) క్రీస్తుశకం 770లో అచ్చువేయించిన పదిలక్షల తాయత్తులలో అన్నీ మిగలకపోయినా, వాటిలో కొన్నింటిని ఈనాడు అమెరికన్ మ్యూజియములలో మనం చూడవచ్చు. చిట్లపేకను తయారు చేయడానికి చైనావారు అచ్చును వినియోగించారనే సంగతి 969 నాటి వారి రికార్డులను బట్టి తెలుస్తున్నది. వారే అచ్చుగుద్దిన కరెన్సీ నోట్లను 1190ప్రాంతాల మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టినట్టు కూడా వారి చరిత్ర చెబుతున్నది, ముద్రణద్వారా కరెన్సీని చాలా తేలికగా సృష్టించగలుగుతున్నామని అదే పనిగా నోట్లను వేయబట్టి కాబోలు, అప్పటిలో "ఇన్‌ఫ్లేషన్" పెద్దగా ప్రారంభమై, అన్ని వస్తువుల ధరలు "ఇంతింతై, వటుడింతయై, మరియు దానింతై, నభోవీధిపైనంతై" అన్న ధోరణిలో పెరిగి పోయినవట. ముమ్మరంగా కరెన్సీ నోట్లను ముద్రించినప్పుడు అనివార్యం కాగల ఆర్థికసంక్షోభానికి ప్రపంచం మొత్తంపై తొలి తార్కాణం బహుశా ఇదే కావచ్చు.

చైనాలో ఆవిర్భవించిన ముద్రణను కొరియా మరింత వృద్ధిలోకి తెచ్చింది. ఒక్కొక పుటకు ఒక అచ్చు చొప్పున కొయ్యపలకపై చెక్కి, అట్టి పలకలతో చైనావారు గ్రంథాలను ముద్రిస్తుండేవారు. ఈ పద్ధతికి స్వస్తిచెప్పి ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్క అచ్చును తయారు చేసినవారు కొరియనులు. అచ్చులను చేయడానికి కొయ్యను కాక, లోహాన్ని వాడ నారంభించింది కూడా వారే. ఈ కొత్త పద్ధతులను వారు ప్రవేశపెట్టింది 1241లో. వీటితో అచ్చువేసిన తొలిగ్రంథమేదో తెలియదు గాని, "ప్రథమ ముద్రణ 1377 లో" అని తెలుపుతున్న ఒక ప్రాచీన కొరియన్ గ్రంథం ప్రతి నేటికీ మిగిలి వున్నది.

ఏ అక్షరానికి దాన్ని విడిగా లోహంలో పోతపోసే పద్ధతిని- ప్రస్తుత పరిభాషలో చెప్పాలంటే, "టైపు" లను తయారు చేసే పద్ధతిని-కొరియానుంచి చైనా, జపానులు నేర్చుకొన్నా, ఆ దేశాలలో, ముఖ్యంగా చైనాలో, ఈ కొత్త పద్ధతి విరివిగా ప్రచారంలోకి రావడానికి ఒక పెద్ద ప్రతిబంధకం కానవచ్చింది. చైనీస్ లిపి బహు విస్తృతమైంది. అక్షరాలద్వారా కాక, బొమ్మల (ఐడియోగ్రామ్స్) ద్వారా చైనావారు తమ భావాలను వ్యక్తీకరిస్తారు. అందువల్ల ఆ భాషలో ఒక గ్రంథాన్ని అచ్చు వేయాలంటే, కావలసిన టైపులు పదుల, వందలసంఖ్యలో కాదు, వేలసంఖ్యలో, ఉదాహరణకు, త్రిపిటకాలను అచ్చువేయడానికి వారికి కావలసివచ్చిన టైపులు

130 వేలు, అదే మహాభారతాన్ని పోలినదాన్ని అచ్చువేయాలంటే మరెన్ని కావాలో! చైనాలో ముద్రణ ప్రయోజనం బహుపరిమితమై పోవడానికి ఇదొక ముఖ్య కారణం.

తొలిగా కాగితాన్ని చేసింది తామైనా, కాగితంపై అచ్చువేసే పద్ధతిని కని పెట్టింది తామైనా, చైనావారు వీటిద్వారా విస్తృత లాభాలను గాని, విప్లవాత్మక మైన ప్రయోజనాలను గాని సాధించలేక పోవడానికి ఒక ముఖ్యకారణం చైనీస్ లిపి కల్పించిన తీవ్ర ప్రతిబంధకంకాగా, అంతకంటె కూడా ముఖ్యమైనట్టిది మరొకటి లేక పోలేదు. అదివరలో ఎంతో శ్రమపడి చేతితో వ్రాస్తూ వచ్చిన తన పురాతన గ్రంథాలకు అంత శ్రమ లేకుండా వేలసంఖ్యలో ప్రతులను సిద్ధపరచుకొనడానికే చైనా వారు ముద్రణను విశేషంగా వినియోగించారు. జపాన్, కొరియాలలో సయితం చాలా వరకు ఇంతే జరిగింది. అందువల్ల నూతనభావాల ప్రచారానికి, నూతనమార్గాలలో పురోగతి సాధనకు ముద్రణ వినియోగపడలేదు. ఈ పొరపాటు యూరప్‌లో జరగలేదు కనుకనే, అక్కడ విప్లవాత్మకమైన పరిణామాలు త్వరితంగా రావడానికి ముద్రణయంత్రం విశేషంగా తోడ్పడింది.

చైనావారిని చూచికాక, యూరోపియన్‌లు తమకు తామై ముద్రణ పద్ధతిని కనుగొన్నట్టు ఈ విషయంలో పరిశోధనలు జరిపినవారు అభిప్రాయపడుతున్నారు. ఎవరు దీన్ని కనిపెట్టినారనే విషయమై తర్జన భర్జనలు దీర్ఘంగా జరిగిన పిమ్మట జర్మన్ దేశస్థుడైన జొహాన్ గూటెన్‌బర్గ్ అని మొత్తంపై తేల్చారు. ఈ నిర్ణయం ప్రకారం యూరప్‌లో ముద్రణకు జన్మస్థానం మింట్స్ నగరం. ఇక్కడినుంచి అది త్వరలోనే తక్కిన జర్మన్ నగరాలకే కాక, ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, బ్రిటన్ మొదలైన యూరోపియన్ దేశాలకే కాక. టర్కీకి కూడా వ్యాపించింది.

బ్రిటన్‌లో తొలి ముద్రణాలయ సంస్థాపకుడు విలియం క్యాక్స్టన్. ఇతడు వ్యాపారి. అయినా వ్యాపారదృష్టితో కాక, ముద్రణపట్ల ఆసక్తితో, అభిమానంతో 1475 వ సంవత్సరంలో వెస్ట్‌మిన్‌స్టర్ (లండన్) లో ప్రథమ ముద్రణాలయాన్ని ఇతడు సంస్థాపించాడు. అన్ని దేశాలలోవలె కేవలం లాటిన్‌లో గ్రంథాలను అచ్చు వేయడానికే కాక, దేశ భాషలలో పుస్తక ప్రచురణకు ముద్రణ సౌకర్యాన్ని వినియోగించిన ఘనత ఈ క్యాక్స్టన్ దే!

బ్రిటన్ లో నేమి, తక్కిన యూరోపియన్ దేశాలలో నేమి ముద్రణ నిరాఘాటంగా పురోగమించలేదు. నూతనభావాల ప్రచారానికి అది తోడ్పడుతున్నదని, విప్లవ వాతావరణాన్ని అది సృష్టిస్తున్నదని పీఠాధిపతు లేమి, రాజ్యాధిపతులేమి దానిపై

ఎన్నో విధి నిషేధాలను ప్రకటించారు. ఒకానొక సందర్భంలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ పరిపాలకవర్గాలు తప్ప మరెవ్వరు ముద్రణాలయాన్ని నడపరాదన్నం తవరకు కూడా బ్రిటన్‌లోకూడా ఈ విధి నిషేధాలు వెళ్ళాయి. ముద్రణాలయం పట్ల ఇంతకు మించిన శత్రుత్వాన్ని ఫ్రాన్సు ప్రదర్శించింది. సంఘాన్ని పట్టు కున్న చీడ పురుగులుగా ముద్రాపకులను అక్కడ కొంతకాలంపాటు చూశారు. ఈ సమయంలో కొందరు ముద్రాపకులను ఘోరంగా చిత్రవధ చేయడం సయితం జరిగింది. ఆర్థిక, సాంఘిక రాజకీయ వ్యవస్థలలో మార్పు కోరేవారిని అరికట్టవలె నంటే, ముందుగా ముద్రాణాలయాన్ని అణచివేయాలని తీర్మానించుకొని, దాదాపు పదిహేడవ శతాబ్ది చివరివరకు అందుకు ప్రయత్నించని పశ్చిమ యూరోపియన్ ప్రభుత్వమే లేదు.

తాత్కాలికంగా క్షీణస్థితిలోకి వచ్చినట్టు కనబడినా, విప్లవశక్తులకు ప్రాతినిధ్యం వహించినందున ముద్రణయంత్రం తుదకు దేశ దేశాలలో అఖండ విజయాన్ని సాధించింది. అది ఎక్కడెక్కడ పాదం పెట్టిందో, ఎక్కడెక్కడ పరిఢవిల్లిందో అక్కడక్కడ విద్య వ్యాపించింది, విజ్ఞాన జ్యోతులు వెలిగాయి, విప్లవ శక్తులు విజృంభించాయి. ముద్రణాలయం ఎంత సార్థకమైన పేరు! విద్యకు, విజ్ఞానానికి, విప్లవానికి, వికాసానికి అది నిస్సందేహంగా ఆలయమే!

అన్ని సాధనాలవలె ముద్రణసాధనాన్ని సయితం దుర్వినియోగ పరచవచ్చు. కాళిదాసు కావ్యాలను అచ్చువేసే ప్రెస్‌లోనే కవి చౌడప్ప శతకాన్ని కూడా అచ్చు వేయవచ్చు; అజంతా చిత్రాలను పునర్ముద్రించేదానిలోనే అంబాళ్ నస్యం లేబుల్స్‌ను కూడా తయారు చేయవచ్చు. దీన్ని నేను కాదనడం లేదు. కాని, మొత్తంపై చూస్తే, మానవ స్వాతంత్ర్యానికి, వికాసానికి, పురోగతికి ముద్రణా లయం సమకూర్చిన దోహదం ఇంతంత కాదు. కడచిన రెండు శతాబ్దాలలో మానవాళి అపూర్వ పురోగతిని సాధించడానికి అత్యధికంగా తోడ్పడినట్టిది నా దృష్టిలో ముద్రణాలయమే!

ఆధునిక విజ్ఞానం, సంస్కృతి, నాగరికత, ఒక్కమాటలో, ఆధునిక యుగమే ముద్రణాలయం పెట్టిన భిక్ష. ఆధునిక భారతవర్షానికి మూలపురుషుడైన రాజా రామమోహన్ రాయ్ తన నవభావాల ప్రచారానికి, తన సంస్కరణోద్యమ వ్యాప్తికి అన్య మార్గంలేక స్వయంగా ఒక ముద్రణాలయాన్ని ప్రారంభించవలసి వచ్చింది. ఆదిలో ఆయన రచనలను ముద్రించిన సెరాంపూర్ మిషన్ ప్రెస్‌వారు తమ మత విశ్వాసాలలో కొన్నింటినికి విరుద్ధంగా ఆయన వ్రాసేసరికి "మరి మీ

పుస్తకాలను అచ్చు వేసేది లే" దని చెప్పారు. అందుపై ఆయన "యూనిటే రియన్ ప్రెస్" అనే పేరుతో కలకత్తా నగరంలోని థరంతొలా వీధిలో సొంతగా ఒక ప్రెస్‌ను పెట్టుకోవలసి వచ్చింది. మన ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవ రకు వీరేశిలింగంగారి రచనల ముద్రణను నిరాకరించడం జరగలేదు గాని, సొంత ప్రెస్ తన లక్ష్యసాధనకు మరింతగా తోడ్పడగలదని ఆయన కూడా ఒకదాన్ని స్థాపించి నిర్వహించారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొంటే నవభారతంవలె నవ్యాంధ్రం సయితం ముద్రణాలయంలో జన్మించినట్టు మనం అంగీకరించవలసి వుంటుంది.

*

# ఇడ్లీ దిగ్విజయం

దాదాపు ముప్పై అయిదేళ్ళనాటి మాట. చుట్టపు చూపుగా కట్నీ (మధ్య ప్రదేశ్) వెళ్లాను. వేసవి సెలవులైనందున నాలుగైదు వారాలపాటు అక్కడే వుండిపోయాను. తనకు కూడా సెలవులైనందున తమ కళాశాల విద్యార్థి బృందంతో పాటు దక్షిణాది యాత్ర చేసి, స్వస్థలానికి తిరిగి వచ్చిన ఒక మిత్రుడు (ఈయన నాకుదగ్గర బంధువు కూడా) తమ యాత్రావిశేషాలను నాకు వివరిస్తూ, తమ పర్యటనలో "ఇటలీ ఫలహారం" చేశామన్నాడు. ఇటలీ ఫలహార మేమిటి? ఇటాలియన్ తినుబండారమా? మధ్యప్రదేశ్‌లోనే పుట్టి పెరిగిన వాడైనందున ఆయనకు తెలిసింది "హిందీ తెలుగు" మాత్రమే. "బైబిల్ తెలుగు", "తురక తెలుగు" కోవకు చెందినదే ఈ "హిందీ తెలుగు". ఈ కృతకభాష నాకు సరిగా అర్థం కావడం లేదేమో అని, ఎంతో గుచ్చి గుచ్చి అడిగిన తర్వాతగాని ఆయన అంతగా మెచ్చుకొంటున్న ఫలహారానికి ఇటలీతో బాదరాయణ సంబంధమైన లేదని, అది "ఇడ్లి" అని తెలిసింది కాదు.

ఒక ప్రాంతంవారి పిండివంటల, ఫలహారాల పేర్లు మరొక ప్రాంతం వారికి కొత్తగానూ వుంటాయి, వింతగానూ వుంటాయి. ఉత్తరాది వారి "దూధ్‌పేడా"

తెలుగువారి చెవులకు యెబ్బట్టుగా వుంటుంది. అన్నట్టు హిందీవారికి "వేడా" తో పాటు"కఢి" అనే మరొక వంటకం వున్నది. ఇది మనకు తెలియనిదేదో కాదు. మన మజ్జిగ పులుసుకే హిందీ వేరు "కఢి". కమ్మని మజ్జిగ- పులుసుకు, వొత్తు"ఢి"తో అయినా, ఈ పాడు వే రేమిటని మనం చీదరించుకోవచ్చు. మన తెలుగువంటకాలలో కొన్నింటి పేర్లు అన్య భాషలవారికి ఇదే విధంగా జుగుప్స కలిగించవచ్చునేమో మనకేమి తెలుసు? మన వంటకాల పేర్లను హిందీ వారు వెక్కిరించిగా నేను వినలేదుగాని, గౌరవపూర్వకమైన ఆహ్వానానికి మనం వాడే "రండి" వారికి బూతుగా ధ్వనిస్తుందని మాత్రం నాకు తెలుసు. "రండ" అనే సంస్కృతశబ్దం హిందీలో "రండి" అయింది.

ఇతర రాష్ట్రాల వంటకాల పేర్ల కంటెకూడా నిజానికి ఇతర దేశాలవి మనను మరింత తికమక పెడతాయి. పారిస్‌లో, రోమ్‌లో ఈ బెడద మరీ పెచ్చు. స్వానుభవ పూర్వకంగా ఇది నాకు తెలుసు. డైనింగ్ హాల్‌లోకి వెళ్ళగానే వెయిటర్ మెనూకార్డు చేతికి అందించేవాడు. ఫ్రెంచి, ఇటాలియన్ రాకపోయినా, అన్ని యూరోపియన్ భాషలను అతి స్వల్ప భేదాలతో ఒకే రోమన్ లిపిలో వ్రాస్తారు. కాబట్టి, మెనూకార్డుపై మాటలను ఎలాగో కూడబలుక్కోవచ్చుగాని, వాటికి సరైన ఉచ్చారణ విషయమై అన్నీ సందేహాలే! "కవియార్" కు రెండు రకాల వర్ణక్రమాలను, మూడు రకాల ఉచ్చారణలను నిఘంటువే చూపుతుంది. కొంతవరకు ప్రసిద్ధమైన ఈ వంటకం పేరే ఇంత తికమక పెట్టినప్పుడు తక్కినవాటి మాట వేరే చెప్పాలా?

ఫ్రెంచివారేమి, ఇటాలియనులేమి పాకశాస్త్రంలో ఉద్దండులైనపండితులు. నల భీమపాక మంటే వారిదే అని పాశ్చాత్యప్రపంచం మొత్తంపైనే వారికి పేరు ప్రఖ్యాతు లున్నాయి. తమ వంటకాలకు చిత్రవిచిత్రమైన పేర్లను వారు పెడతారు! వాటిలో తమ కవితాప్రౌఢిమ నంతటిని ప్రదర్శిస్తారు. మనకు నోరు తిరగని కొత్త పేర్లను ఎప్పటికప్పుడు ప్రవేశపెట్టడంకూడా కద్దు. పేరు గొప్పగా వున్నది కదా అని మోజుపడి దేన్నో ఆర్డర్ చేస్తే, తీరా టేబుల్ పైకి వచ్చేసరికి అతి నత్త కావచ్చు, పీత కావచ్చు. కప్ప కావచ్చు. పారిస్‌లో, రోమ్‌లో, మరికొన్ని యూరోపియన్ నగరాలలో ఈ దౌర్భాగ్యం నాకు పదే పదే తప్పలేదు.

యూరప్‌లో భరతనాట్య ప్రదర్శనాలకై మొదటిసారి వెళ్ళినప్పుడు శ్రీ ఉదయ శంకర్, ఆయన బృందం సరిగా ఈ దురవస్థలోనే పడ్డారట. నత్తలు, పీతలు, కప్పలు వరసగా ప్రత్యక్షమైన తర్వాత విసిగివేసారి, మెనూకార్డులో చిట్టచివర

నమోదైవున్న వేరును వేలుతో చూపించి, దాన్ని ఆర్డర్ చేశారట. వెయిటర్ ఎంత తటపటాయించినా చివరికి తమ పట్టు నెగ్గించుకొన్నారట. అయితే, వారి టేబుల్ వద్దకు వచ్చింది వారు ఆశించినట్టు ఫ్రూట్ సాలెడ్ కాదట; గండు ముఖంతో, దుబ్బు మీసాలతో భీమసేనుని మరపించే వంటలవాడట! ప్రసిద్ధమైన హోటల్సులో మెనూకార్డు చివర తమ పాకశాలాధ్యక్షుని ("హెడ్ షెఫ్") వేరును పెద్ద అక్షరాలతో అచ్చువేస్తారని-పాపం!- ఈ పెద్దలకు అప్పటివరకు తెలియదు!

మూడు, నాలుగు దశాబ్దాలనాడు ఇడ్డెన సామ్రాజ్యం దక్షిణభారతానికే పరిమితం కాబట్టి, నా కట్నీ మిత్రుడు దాని పేరునైనా సరిగా పలకలేక "ఇటలీ" అన్నాడు గాని, ఇప్పుడు బహుశా కట్నీ కంచర దుకాణాలలోనైనా కావాలంటే ఒక ఇడ్లీ పాత్రను ఖరీదు చేయవచ్చు. అగస్త్యమహర్షి వింధ్య దక్షిణప్రాంతాన్ని జయించినట్టు, ఆ పర్వతశ్రేణి ఉత్తర ప్రాంతాన్ని ఇడ్డెన జయించింది. ఆ మహర్షివలె కపటం చేసి జయించడమైనా కాదు! కండపుష్టితోనేజయించింది. "దక్షిణంగా వెళ్లాలి; కాస్తదారి యిప్పిస్తావా?" అని అగస్త్యుడర్థించినట్టు అది అర్థించనూ లేదు; "పెద్దవాడు, పై పెచ్చు, సప్తసముద్రాలను ఔపాసనం పట్టినవాడు. కాస్తదారినే కదా అడుగుతున్నా" డని వింధ్య తల వంచగా, "నేను తిరిగి వచ్చేవరకు దయచేసి ఇలాగే వుండవలసింది" అని దేవురించి, తిరిగి ఆ దారినే రాకుండా చక్కాపోయి, పచ్చిమోసం చేయనూ లేదు. ఒకరిని అర్థించకుండా, ఒకరి అనుమతి పొందకుండా, ఒకరిని వంచించకుండా తన కమ్మదనమే కరవాలంగా దిగ్విజయయాత్ర చేసి, ఏకచ్ఛత్రాది పత్యంగా ఇడ్డెన నేడు అఖిల భారతాన్ని పరిపాలన చేస్తున్నది!

వింధ్యను దాటి, ఉత్తరాపథంలో తన విజయపతాకను ప్రతిష్ఠించడానికి ముందు ఉత్తర, దక్షిణ భారతాలకు వారధివంటి ఆంధ్రప్రదేశ్‌ను ఇడ్డెన లోబరచుకోవలసివచ్చింది. ఒకప్పుడు ఈ ప్రాంతం దాని పలుకుబడిలోన వున్నా, మధ్యకాలంలో ఎందువల్లనో ఇక్కడ దాని అధికారం కొంత బలహీనపడింది. శ్రీనాథుని "కాశీఖండము" చూస్తే, రెడ్డిరాజుల కాలంలో తెలుగునాట ఇడ్డెన కెంత గౌరవస్థానం వున్నదో తెలుస్తుంది. భోజనప్రియుడైన ఆ కవిసార్వభౌముడు ఏదో సందర్భాన్ని కల్పించుకొని తన కాలంలోని భక్ష్యభోజ్య చోష్య లేహ్యపానీయాలన్నింటిని పేర్కొన్నాడు. "కాశీఖండము" లోని ఆ భాగమిది:

"కనక రంభా పలాశ పాత్రంబులయందు విచిత్రంబుగా గల వంటకంబులు, నపుపంబులు, లడ్డుకంబులు, నిడ్డెనలు, గుడుములు, నప్పడంబులు, నిప్పట్లు, గొల్లెడలు, దోసియలు, సేవియలు, నంగరపొలియలు. పోవెలు, సారసత్తలు,

బొత్తరలు, జక్కలంబులు, మణుగుబూవులు, మోరుండలు, బుంద్రేక్షు ఖండం బులు, బిండ ఖర్జూర ద్రాక్షనారికేళ, కదశీ పనస జంబూ చూత లికుచ దాడిమీ కపిత్థ కర్కంధూ ఫలంబులు, గసగసలు, బెసరుపులగములు జెఱకు గుడుములు, నరిసెలు, బిసకిసలయముల వరుగులు, జిఱుగడములు, బడిదెములు, బులుపలు, బులివరుగులు, నప్పడంబులు, బప్పలు, రొట్టియలును జాపట్లు, బాయసంబులు, గర్కరీ కారవేల్ల కూశ్మాండ నిష్పావకపటోలికా కోశాతక్యలాబూ శిగ్రూ దుంబర వార్తక బింబి కారవింద శలాటువులను (ఇవి నోట నలగవేమో!) గందయు, బొందయు, జారులు, దియ్యగూరలు, బచ్చడులు, భజ్జిగలు, భిజ్జిగిణులు, వడియం బులు, గడియంబులు, గాయంబులు, గంధతోయంబులు, నుంద్రాలు, నానబాలు, ననుములు, మినుములు, బుడుకులు, సడుకులు, నిలిమిడియును, జలిమిడియును, ద్రెబ్బడయు, వడయు, నుక్కెరలు, జక్కెరలును, నేతులు, దేనెతొలలు, బిట్టును, గుట్టును, ద్రోపలు, పాలతిమ్మనంబూపలు, మోదకంబులు, గుడోదకంబులు, శాకం బులు, చెఱకు పాకంబులు....."వగైరా, వగైరా...

ఈ పట్టికలో "అపూపంబులు, లడ్డుకంబులు" తర్వాత శ్రీనాథుడు "ఇడ్డెను" లను పేర్కొన్నా, అంతమాత్రంచేత ఇడ్డెనులకు ఆ రోజులలో తృతీయస్థానం మాత్రమే వుండేదని తీర్మానించుకొనడం శుద్ధ పొరపాటు. కవి సార్వభౌమునికి తీపి పదార్థా లంటే మక్కువ కనుకనే ఇడ్డెనులకు ముందుగా "అపూపంబులు, లడ్డుకంబులు" ఆయన పట్టికలో ప్రథమ, ద్వితీయ స్థానాలను ఆక్రమించడం జరిగింది. ఈ పట్టికలోనే కాదు, పిండివంటకాల ప్రసక్తిని ఎక్కడ తెచ్చినా, తీపిపదార్థాలకే ఆయన అగ్రస్థాన మిస్తాడు. "శృంగార నైషధము" లోని క్రింది పద్యాన్ని చూడండి:

గోధూమసేవికాగుచ్ఛంబు లల్లార్చి ఖండశర్కరలతో గలిపి కలిపి
గుజ్జుగా గాచిన గోక్షీరపూరంబు జమలిమండెగలపై జిల్లి చల్లి
మిరియంబుతో గూడ మేళవించిన తేనె దోరంపు లడ్వాలు దోచితోచి
పలుచగా వండిన వలిపెంపుజాపట్లు వెసరపప్పులతోడ బెనచి పెనచి

గోవజవ్వాది కస్తూరి గొఱత పఱుచు
వెన్నపడిదెంబు జొబ్బిల విద్రిచి విద్రిచి
వారయాత్రకు లనుమోదవంతు లగుచు
వలచి భుజియించి రోగి బిండివంటకములు

ఏమైనా, కుడుములకు ముందు ఇడ్డెనులను శ్రీనాథుడు పేర్కొన్నాడు. ఆ నాటికి, బహుశా అంతకు ముందుకూడా, కుడుములను మించి ఇడ్డెనులనే ఆంధ్రులు అభిమానిస్తున్నా, తర్వాత ఏ బలం చూచుకొనో ఇడ్డెనులను తెలుగు గడ్డపైనుంచి తరిమివేసి, కుడుములు తమ ప్రాబల్యాన్ని సుస్థాపితం చేసుకొన్నాయి.

విజయనగర సామ్రాజ్య విచ్ఛిత్తితర్వాత ఆంధ్రదేశంలో అరాజక పరిస్థితు లేర్పడినాయి. దానితో, గోగులపాటి కూర్మనాథకవి చెప్పినట్టు, "గ్రామముల్ నిర్ధామధామమ్ములయ్యెను. సస్యంబులెల్ల నాశనము చెందె, దొడ్లలో శాకముల్ దుంప శుద్దిగ బోయె, దోచిరి సర్వంబు గోచిదక్క"..... అప్పటిలో నాశనమైపో యిన సస్యాలలో మొట్టమొదటిది వరి అయివుండాలి. పంటచెరువుల పూడికలు ఎప్పటికప్పుడు తీయిస్తూ వుంటేనే, పంట కాల్వలను, బోదెలను ఎప్పటికప్పుడు మరమత్తులు చేయిస్తూవుంటేనే వరిపండుతుంది. "గ్రామములే నిర్ధామధామమ్ము" లైపోయిన ఆ రోజులలో ఈ విషయాలను గురించి శ్రద్ధవహించే నాథుడెవడు? అందువల్ల ప్రత్యేకించి వరిసాగు చాలా క్షీణస్థితికి వచ్చివుండాలి. పంటనీటి వనరు లేకపోయినా, సకాలంలో ఒకటి, రెండు వానలు కురిసినా పడుతుంది కనుక, మినుంపంట ఇంత దెబ్బ తినివుండదు. బియ్యం కరవుతో తెలుగు గడ్డపైనుంచి ఇడ్లి పూర్తిగా మాయమైపోయినందునే, ఫక్తుమినుంతో తయ్యారయ్యే కుడుములు ఈ సమయంలోనే విశేషంగా వ్యాప్తిలోకి వచ్చి వుండాలి.

"వాసెన కుడుము" గా ఇడ్డెనకు నిర్వచనం చెప్పిన మన నిఘంటుకారులు దానిపట్ల ఘోరాపచారం చేశారు. వాసెన కట్టనిదే కుడంవలె ఇడ్డెనకూడా తయారుకాదను కోండి. అంతమాత్రంచేతనే ఇడ్డెనను "వాసెన కుడుము" గా పేర్కొనడం తగదు. తలక్రిందులుగా తపస్సు చేసినా ఇడ్డెన రుచి కుడుముకు వస్తుందా? కాకను కొట్టి వేస్తుందని, మధుమేహాన్ని తగ్గిస్తుందని కుడుములను ఆయుర్వేదవైద్యులు కీర్తించవచ్చు. వారి మాటపై నమ్మకంకొద్దీ ఆ రుగ్మత లున్నవారు వాటిని తినవచ్చు. వారైనా పత్తెం తిన్నట్టు ఒక విధిగానే తప్ప, ఫలహారం చేసినట్టు "నోరూరగ జవులువుట్ట" తినగలరా? అయినా, "కుడుము పెడితే పండుగ" అనే సామెత ఎందుకు పుట్టిదో తెలియదు. జనం కూటికి ముఖంవాచిన రోజులలోనే ఇది పుట్టి వుండాలి!

గత శతాబ్దిలో ఆంధ్రదేశంనుంచి దాదాపు పూర్తిగా అంతర్ధానమైపోయిన ఇడ్లి, అయ్యర్ల పుణ్యమా అని ఈ శతాబ్దిలో తిరిగి వచ్చింది. తొలుత పట్టణాలకే వచ్చినా, ఇప్పుడు పల్లెలకుకూడా పాకింది. ఒక "లక్ష్మీవిలాస్", ఒక "సరస్వతీ

విలాస్", ఒక " దుర్గావిలాస్" ఒక రామావిలాస్", లేదా ఒక "సీతారామాంజనేయ విలాస్" కాఫీ హోటల్ లేని పంచాయతీగ్రామం ఈనాడు తెలుగునాడులో-ముఖ్యంగా, సర్కార్ జిల్లాలలో-కనబడదనే చెప్పవచ్చు. పదిహేను, ఇరవై సంవత్సరాలక్రితం వలె ప్రస్తుతం గ్రామస్థులు ఏ తెనాలికో తెల్లవారకముందే సైకిల్ పై బయల్దేరి వెళ్ళవలసిన పనిలేదు; ఇడ్లి, ఉప్మా, కాఫీ వగైరాలు తమ గ్రామాలలోనే వారికి పుష్కలంగా లభిస్తున్నాయి. ఆంధ్రదేశాన్ని ఇంతగా జయించినతర్వాత ఉత్తరాభి ముఖంగా పయనించి, ఇండియా మొత్తంపైనే ఇడ్లి తన సార్వభౌమత్వాన్ని సంస్థా పించుకొన్నది. ఇప్పుడిప్పుడే అది ఖండాతరాలకు కూడా వ్యాపిస్తున్నది. ఒకటి, రెండు షిల్లింగులు మనవి కావనుకొంటే ఈనాడు లండన్‌లోనైనా ఇడ్లిని ఆర్డర్ చేయవచ్చు.

ఇడ్డెను రుచి ముప్పాతిక మువ్వీసాలు దాని తయ్యారీలో వుంటుంది. ఉప్పుడు బియ్యం, మినపపప్పు ఏ పాళ్ళలో కలపాలి? ఎంత సేపు వాటిని నాన నివ్వాలి? ఎంత మెత్తగా రుబ్బాలి? ఏ సైజులో దాన్ని పోతపొయ్యాలి? ఎంత సేపు ఆవిరి సోకనివ్వాలి? ఈ సూక్ష్మాలన్నీ క్షుణ్ణంగా తెలిసినప్పుడే ఇడ్డెను సరిగ్గా కుదరడ మైనా, అది నోరూరించడమైనా! ఉప్పుడు బియ్యం, మినపపప్పు పాళ్ళలో ఎది కొంచెం తప్పినా, అది గట్టిగానో, జిగురు జిగురుగానో ఒకచోట ఉడికి, మరొకచోట ఉడకుండానో తయారవుతుంది. రుబ్బుడులో లోపం వచ్చినా పాకం చెడుతుంది. అదే కుదుమైతే దాన్ని ఎవరైనా తేలికగా వండవచ్చు. అందువల్లనే"కుదుములు వండలేని ఆడుది, కూనిరాగం తీయలేని మగవాడులే" రంటారు. ఇడ్లని వండ గలిగే వారు నూటికో, కోటికో తప్ప కానరారు. మన దక్షిణ భారతంలో ఎన్ని వేల, ఎన్ని లక్షల కాఫీ హోటల్స్ లేవు! అయినా మద్రాస్‌లో తిరువళ్ళి క్కేణి వీధిలోని కోయంబత్తూర్ కృష్ణయ్యర్ హోటల్ ఇడ్డెనుకు చాలింది మరె క్కడైనా లభిస్తుందా? నూరేళ్ళకుపైగా అవిచ్ఛిన్నంగా, జేగీయమానంగా నడిచిన తర్వాత ఈ మధ్యనే ఈ హోటల్ మూతపడింది. దీనితో మద్రాసు శోభ సగం తగ్గిందని నే ననడమే కాదు; ఒకసారి కోయం బత్తూర్ కృష్ణయ్యర్ హోటల్‌కు వెళ్ళి, భుక్తాయాసాన్ని సయితం పాటించక, కనీసం రెండు, మూడు ప్లేట్ల ఇడ్లిని ఆరగించిన వారెవరైనా అంటారు.

కృష్ణయ్యర్ హోటల్‌లో ఇడ్డినే ఎక్కువ రుచిగా వుండేదో, కొబ్బరి పచ్చడే ఎక్కువ రుచిగా వుండేదో చెప్పడం కష్టం. ఇడ్డెనులోగల సొగసే అది! నేతితో దాన్ని తినవచ్చు; వెన్నతోనైనా తినవచ్చు. కొబ్బరి పచ్చడి, అల్లం పచ్చడి, కారం

పొడి, సాంబరు వగైరాలు దేనితోనైనా తినవచ్చు. అన్నింటితోను దానికి మైత్రి; అన్నింటివల్ల దాని రుచి మరింత పెరుగుతుంది! కొందరు సాంబారు లేనిదే ఇడ్లిని పసందు చేయలేరుగాని, నా నోటు మాత్రం కొబ్బరి పచ్చడికే.

తయ్యారు చెయ్యడం తేలికైతే ఇడ్డెను మరింతగా వ్యాప్తిలోకి వచ్చి వుండేది, ఇడ్డి పిండిని చక్కగా రుబ్బడం ముఖ్యంగా ఒక పెద్ద బెడద. ఇందుకు నల్లరాతి రుబ్బురోలు కావాలి. నల్లరాతి పాత్రం కావాలి. ఉత్తరాదిలో ఇవి దొరకవు. హిమాలయాలనగానే ఎత్తుకే కాక, శక్తికి, దార్ఢ్యానికి, దర్పానికి వాటికి అవే సాటి అని మనం భావిస్తాము. కాని, అంతకంటె మెతకరాతి కొండలు మరి లేవు. ప్రపంచం మొత్తంపైగల పర్వత పంక్తులన్నింటిలో హిమాలయాలే వయస్సుకు చిన్నవి. ఇందువల్లనే కావచ్చు, వాటి రాయి ఇసుకరాయి. నల్లరాయికాదు. ఆరాతి తో రుబ్బురోలు చేసి, దానిలో రుబ్బిన పిండితో ఇడ్లి వండితే, వాటిని, నోటిలో పెట్టుకోగల ప్రాప్తి వుండదు; హిమాలయ పరిసరాలలో నివసిస్తున్నవారు రుబ్బురోలు కావాలంటే, దక్షిణాది నుంచి దాన్ని తెప్పించుకోవలసిందే; రవాణా ఖర్చులతో తడిసి మోపెడు కావలసిందే.

ఇడ్లి తయ్యారీ విషయంలో ఈ రుబ్బురోలు చిక్కును తొలగించడానికి రుబ్బ వలసిన శ్రమను సయితం తప్పించడానికి బెంగుళూర్ లోని ఇండియన్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూట్ వారు సరైన పాళ్ళతో ఇడ్లి పిండిని తయారు చేశారట. రెక్కలు పడేటట్టు రుబ్బనవరసరం లేకుండా, ఇన్ని నీళ్ళుపోసి నానబెట్టి, ఈ పిండితో ఇడ్లిని సులభంగా చేసుకోవచ్చునట. తమ పిండితో తయారైన ఇడ్లి స్వర్గానికి బెత్తెడుగా వున్నాయని వీరు అంటున్న మాటలు నిజమైతే, అలెగ్జాండర్‌ను మించి, జెంఘిస్‌ఖాన్‌ను మించి, ఆటిల్లాను మించి మొత్తం ప్రపంచాన్నే ఇడ్లి జయించు కురాగలదు!

కాని, ఈ సులభమార్గాలంటే, నాకు పూర్తి నమ్మకం లేదు. 1958 నవంబర్‌లో ఒక ఆదివారంనాడు పారిస్ నగరానికి ముప్పై, నలభైమైళ్ళలోగల ఒక "షాటో" కు కొందరు ఆంధ్ర, తమిళమిత్రుల కుటుంబాల వెంట వెళ్ళి, అక్కడి ఉద్యానవనంలో ఇడ్లి ఫలహారం చేశాను. ఆ మిత్రులమధ్య, ఆ పరిసరాలలో, వెండి దారాలవలె జల్లు చినుకులు పడుతుండగా, లేతమంచు తెరలు అంతలో మూసుకుని, అంతలో విచ్చుకొంటూవుండగా, చురుకైన చలి గడగడ లాడిస్తుండగా, నేను తిన్న వేడి వేడి ఇడ్లి (రుబ్బురోలుతో పని లేకుండా, పిండితో వాటిని తయారు చేశారు) నాలుకపై కరిగి పోతున్నట్టు అనిపించినా, అవి కృష్ణయ్యర్

ఇడ్లికి దీటుగా వున్నవని అనలేను. ఆ మాట నేనంటే, అది కృష్ణయ్యర్ హోటల్ మధురస్మృతి పట్ల మహాపచారమే కాగలదు.

*

# గొడుగులు

ముసురు పట్టింది. కుండపోత పోస్తే, అదొక దారీ తెన్నూ. కురిసినట్టుకాక, వెలిసినట్టుకాక, ఈ చీకువాన చెడ్డచికాకు పెడుతున్నది. పెళ్ళుమంటూ యెండకాసి అప్పుడే వారం కావస్తున్నది. మధ్యమధ్య తెరపిచ్చినా, మళ్ళీ అంతలో మూసుకు వస్తున్నది.మరెన్ని రోజులు ఇలా చినుకుతూ పోతుందో! ఎండ నెంత కాలమైనా భరించచ్చుగాని,ముసురుపడితే మూడువ నాటికే ముఖం మొత్తుతుంది! రోహిణీ కార్తెలో "ఎంతైతే, వర్షాకాలం!" అని మనకు అనిపించవచ్చు, "సన్నతు ప్పర పడుతుంటే వేరే స్వర్గం దేనికి?" అనేవరకు మనం వెళ్ళినా వెళ్ళవచ్చు. అయినా, తొలకరితోనే వానలపై మనకు మోజు తగ్గుతుంది. ఎండ కెండి, నెర లిచ్చిన నేలపై దబాటు చినుకులు నాలుగు పడేసరికి కమ్మని వాసనేదో వస్తుంది. అప్పుడు ప్రాణం ఎంత చల్లబడుతుంది! మనస్సు ఎంత తేలిక పడుతుంది! అటు పిమ్మట అడపాతడపా వాన పడి, మొదటిసారిగా ముసురు పట్టేసరికి "ఎంతైతే వేసవికాలం" అనే మాట మన నోట రానే వస్తుంది. ఇంతలోనే వున్నది మానవస్వభావ రహస్యం. ఏది తనకు లేదో అదే స్వర్గం. ఏది తనకు కలదో అదే నరకం. అప్పటికప్పుడు తనకున్న దానితో, అసంతృప్తి చెందడం, తనకు లేనిదానికోసం అల్లాటు జూచడం-ఇదే మానవ స్వభావం కాకపోతే, మానవుడు మానవుడుగా పరిణామం చెందేవాడు కాదు, మహీపతి కాగలిగేవాడు కాదు.

ముసురు మన నెంత చికాకు పెట్టినా, దాని రాక కోసం యెదురు చూచే వారు కొంద రుంటారు. నెలసరి జీతానికో, సాలుసరి జీతానికో బట్ట లుతికేవారికి ఆటవిడుపు ముసురు పట్టిన రోజులలోనే. ముసురు పట్టనక్కరలేదు, బట్టతడుపు జల్లు పడినా ఆనాటికి వారు పనికి నాగా పెడతారు. ఉబ్బ చినుకులని వారిని డబాయించి లాభంలేదు. తమ పని చెరుపుకు ఆ చినుకులు చాలవా అని చెబుతారు. వారి హక్కుల రక్షణకు కార్మిక శాసనా లేవీ లేవు. చినుకే వారికి "క్యాజుయల్ లీవ్", ముసురే వారికి "ప్రివిలేజ్ లీవ్".

గుడ్డ లుతికేవారిని మించి, గొడుగులమ్మేవారు ముసురు పట్టాలని ముచ్చటపడుతూ వుంటారు. లేకపోతే, వారికి బేరసారాలు జోరుగా సాగవు. స్వాతి వానకోసం ముత్తెపు చిప్పలు ఎదురుచూస్తాయో, లేదో మనకు తెలియదుగాని, గొడుగుల వ్యాపారులు మాత్రం "ఎప్పుడెప్పు" డంటూ దాని కోసం కనిపెట్టుకు కూర్చుంటారు. తక్కిన కాలాలలో "బేరమూలేదు, బెండ విత్తూలూ లేదు" అన్నట్టు వారి వ్యాపారం సాగుతుంది; వర్షాకాలంలోనే వారికి కనకవృష్టి!

గొడుగు కొత్తది కాదుగాని భారీ యెత్తున గొడుగుల వ్యాపారం మాత్రం కొత్తదే! రాజరికం పుట్టినప్పుడే గొడుగు పుట్టిందేమో! ఏమైనా, ఆదిలో రాజులే, రారాజులే గొడుగులను వాడినట్టు కలబడుతుంది. అధికారానికి, ఆధిపత్యానికి కొన్ని సహస్రాబ్దాలపాటు ఛత్ర మొక చిహ్నంగా నిలిచింది. "ఛత్రపతి" అంటేనే చక్రవర్తి. మహారాష్ట్ర సామ్రాజ్య సంస్థాపకుడు శివాజీకి బిరుదనామం "ఛత్రపతి". "ఛత్రభంగము" అంటే రాజ్యనాశనం; "ఏకచ్ఛత్రాధిపత్యం" అంటే సర్వాధికారం. తమ సర్వాధికారానికి చిహ్నంగా ప్రాచీన కాలపు ఫారోరాజులు ఛత్రంకింద సింహాసనాసీను లయ్యేవారు. ఈజిప్టులోనే కాదు. బాబిలోనియాలో కూడా ఇదే పరిపాటి. మన దేశంలో సయితం చిరకాలంగా చక్రవర్తిత్వానికి ఛత్రమొక చిహ్నం. చక్రవర్తిత్వాన్ని సూచించే సప్తరత్నాలుగా చక్రం, గజం, యుద్ధాశ్వం, పట్టమహిషి, మౌక్తికం, సర్వసేనాని, ప్రధానామాత్యులనే పేర్కొన్న మన ప్రాచీన గ్రంథాలు ఛత్రాన్ని ఎందువల్లనో విడిచిపుచ్చినా, మన సమ్రాట్టులందరు ఛత్రపతులే. రాజలాంఛనంగా వినియోగించే గొడుగు పేరు "భూ చక్ర గొడుగు" అందువల్లనే "గొడుగుకింది రూపు" అనేది రాజు కొక నుడికారమైంది. నన్నెచోడుని "కుమారసంభవము" లో "గొడుగు క్రింది రూపుబొడిచి, జయంబు నీకిత్తు నధిప! నన్ను నింత నమ్ము" అని "భటురొకరుండు దండియై" పలుకుతాడు. రాజార్హమైనది శ్వేతఛత్రమే. ఏ శ్వేతచ్ఛత్రమైనా "పుండరీకము" గాని, రాజులు వినియోగించేది

"నృపలక్ష్మ్యం" "రాజ్యశృంగం," "కనకదండం". వీటిలో చివరి రెండు బంగారు కర్రల గొడుగులట. బంగారు కర్ర గొడుగును వాడకపోయినా, మన రాష్ట్రపతి ఛత్రపతే! పార్లమెంటు సమావేశాలకు ప్రారంభోత్సవాన్ని చేయడానికి ఆరు గుఱ్ఱాలను పూన్చిన బండిలో వచ్చే సందర్భాలలో గొడుగుకింద కూర్చునే ఆయన వస్తారు! మన దేశంలో కంటె ముందుగానే చైనాలో, జపానులో, ఇతర ప్రాచ్య దేశాలలో ఛత్రమొక రాజలాంఛన మైనట్టు చెబుతారు!

మహీపతులను చూచి మతాచార్యులు, వారిని చూచి లక్ష్మీపుత్రులు తమ ఆధిక్యతకు, ఐశ్వర్యానికి చిహ్నంగా ఛత్రాన్ని వినియోగించడం ప్రారంభించారు. ఛత్రంతోపాటు పెక్కుచోట్ల చామరాన్ని కూడా వాడుకచేస్తారు. కనుకనే, "ఛత్ర చామరాలు" అనేది ప్రసిద్ధ సమానమైంది. మత సంస్థాపకులలో ఏసుక్రీస్తును ఛత్రపతిగా చూపరుగాని, గౌతమబుద్ధుని చూపడం కద్దు. బౌద్ధశిల్పాలలో బుద్ధుని మూర్తిని ఆదిలో చూపించేవారుకాదు; ఆయన అస్తిత్వాన్ని నిరూపించడానికి ఏవో కొన్ని సంకేతాలను వినియోగించేవారు. కలశాలలో గజద్వయం నీరుపోస్తున్నట్టు చూపితే, అది బుద్ధుని జననం. అశ్వత్థ వృక్షాన్ని చూపితే, అది మహాసంబోధి. స్తూపాన్ని చూపితే, అది మహాపరినిర్వాణం, ఇదేవిధంగా, కంటక పీఠంపై ఒక ఛత్రాన్ని చూపితే, అది మహాభినిష్క్రమణ. బుద్ధుడు చేతి కఱ్ఱను వాడినట్టు బౌద్ధ పిటకాలను బట్టి ఊహించవచ్చు; ఆయన గొడుగు వేసుకునేవాడో, లేదో మనకు తెలియదు. అయినా, బౌద్ధశిల్పులు ఆయనను ఛత్రపతిని చేశారు. ఏసుక్రీస్తు ఛత్రధారుడైనా, కాకపోయినా, క్రైస్తవ పీఠాధిపతులైన పోప్‌లు పదహారవ శతాబ్దం ఉత్తరార్ధం నుంచి తమ ప్రాబల్య ప్రదర్శనకు ఛత్రాన్ని ఆలంబనం చేసుకొన్నారు. పోప్‌ల గొడుగు రంగు నాకు తెలియదుగాని, మన మఠాధిపతులు కాషాయరంగు గొడుగునే ఉపయోగిస్తారు. మన బాలాజీలు, మన బైరాగులు వాడేవికూడా ఆ గొడుగులే. మఱి, మన దేవుళ్ళ గొడుగు లెట్టివో! నారాయణస్తుతికి సంబధించిన పద్యం "ధరసింహాసనమై, నభంబు గొడుగై", సూచిస్తున్నట్టు, ఆకాశమే వారికి ఛత్రమా? లేక, ఒక్కొక్కరికి ఒక్కొక రకం గొడుగు వుంటుందా? వరుణుని గొడుగు పేరు "ఆభోగ"మట. దాని నానార్థాలలో ప్రసిద్ధమైనవి "వైశ్యాల్యము", "ప్రాంత ప్రదేశము" కాబట్టి, ఇది కూడా నభమైనా కావచ్చు.

ఐశ్వర్య ప్రదర్శనకు సయితం గొడుగును వాడుక చేసేవారు కనుకనే "అల్పుడికి ఐశ్వర్యం వస్తే, ఆర్ధరాత్రి వేళ గొడుగు పట్టమన్నాడట," అనే సామెత పుట్టింది. అతడు పట్టమన్నది మామూలు గొడుగు అయివుండదు; అది ఏ

N-8751
Dr. BRAOU LIBRARY Acc. No. 814-874 Class No. వెంకటి



ముత్యాల గొడుగో, రత్నాల గొడుగో! కాకపోతే, దానిలో ప్రత్యేక ఘనత ఏమి వుంటుంది? అన్నట్టు, ఐశ్వర్యం కలిగినవాడు గొడుగును "పట్ట"మన్నాడు గాని, తానై దాన్ని పట్టుకోలేదు. తన నెత్తిపై తానే గొడుగు పట్టుకొనడం తన ఘన తకు లోటు కాదా? అవసరానికి కాక, ఆడంబరానికి గొడుగును వాడేవారు దాన్ని పట్టుకోరు; పట్టించు కొంటారు! ధనవంతులైనా, ధారుణీపతులైనా ఇదే పరిపాటి. చక్రధరుడంటే చక్రాన్ని స్వయంగా పట్టుకొనేవాడు కాగా, ఛత్రధారు డంటే ఛత్రాన్ని మరొకరి చేత పట్టించుకొనేవాడు. ఛత్రధారుడనే పదానికి మరొక అర్థం "దాసుడు" దాసులచే గొడుగును పట్టించుకొనడం పరిపాటి కనుకనే ఈ మాటకు ఈ అర్థం వచ్చిందని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

గొడుగును పట్టించుకొనేవారికి పట్టపగ్గాలులేని రోజులలో కులం తక్కువ వారో, కలిమి తక్కువవారో గొడుగు వేసుకొంటే సహించేవారు కాదు. ఎంతో వెనుకకు వెళ్ళనక్కరలేదు. నా చిన్నతనంలో కూడా తక్కువ కులాలవారెవరైనా గొడుగు వేసుకుంటే, ఎక్కువ కులాల వారికి తల తీసినంత పని అయ్యేది. అతడిని నడివీధిలో నిలవేసి, నానా దుర్భాషలాడి, దేహశుద్ధి చేయడానికి సయితం సంసి ద్ధపడి, గొడుగు మూయించి మరీ పంపించేవారు! ఈ నాడు సయితం ఇలాంటి సంఘటనలు జరిగే పల్లెలు చెదురుగా కొన్ని లేకపోలేదేమో!

విదేశాలలో కూడా ఛత్రవినియోగంపై రెండు శతాబ్దాల క్రితం వరకు విధి నిషేధాలుండేవి. దేవిడి జమీందారు ఈ భోగట్టాను ఎక్కడ సేకరించారో నేను చెప్పలేనుగాని, "ఆంధ్రవిజ్ఞానము" అని తన పేరుతో తాను వ్రాసి ప్రచురించిన విజ్ఞాన సర్వస్వంలో ఇంగ్లండులో క్రీస్తుశకం 1780 ప్రాంతాల మొట్టమొదటగా గొడుగును వాడిన సామాన్య పౌరుని పేరు జోనాస్ హాన్‌వే అని ఆయన వ్రాశారు. వర్తక వ్యాపారాలకై పారిస్ వెళ్ళిన హాన్‌వే అక్కడ ఒక గొడు గును కొని తెచ్చి, లండన్ వీధులలో దానిని వేసుకొని తిరగనారంభించాడట. "అయ్యది దురాచారమని కొందరును, దైవమున కపరాధమని కొందరును, ఇది వాడిన వర్షములు కురవక నిలిచిపోవునని కొందరును తలంచి యాతని నిరసించి, యాతని వంచించిరట" ఈ వాక్యంలో "వంచించిరట" అనే మాట విషయమై "దీని భావమేమి, తిరుమలేశ?" అని ప్రశ్నించుకొనవలసివస్తున్నది. "హింసించిరి" అనే దానికి అచ్చుపొరపాటు కావచ్చు. ఏమైనా, అన్ని దేశాలలోను గొడవ లెన్నో జరిగిన తర్వాతగాని, గొడుగులు సర్వజనోపయోగంలోనికి రాలే దనడం మాత్రం స్పష్టం. ఛత్రానికి "లోక సమ్మతము" అనే పేరొకటి కలదని మన నిఘంటువులు చెప్పినా, స్వేచ్ఛగా దాని వినియోగం లోకసమ్మతమైంది అధునాతన

కాలంలోనే!

యూరప్ ఖండంలోనికి ఛత్రాన్ని ప్రవేశపెట్టిన వారు యవనులట. తాము జయించిన ప్రాచ్యదేశాలనుంచి వారు దాన్ని తమ గ్రీసుకు తీసుకువెళ్ళి వుండాలి. గ్రీకు సామ్రాజ్యానికే కాక, దాని సభ్యతకు, సంస్కృతికి వారసులైన రోమనులు గొడుగును ఇటలీకి పట్టుకుపోయారు. ఎండకే కాక, వానకు కూడా మొట్టమొదటిగా గొడుగును వాడినవారు రోమనులని ప్రతీతి. ఆదిలో బహుశా అన్ని దేశాలలో ఎండకే గొడుగును పట్టేవారేమో! "ఎండ మఱువు" గొడుగుకు మరొక పేరు; "ఎండచాటు పుట్టువు" వేరొక పేరు. తెనుగును విడిచి సంస్కృత భాషకు వెడితే, "ఆతపత్రము" "ఆతప వారణము" "ఉష వారణము" "ఛాయా మిత్రము" – ఇవి దాని కున్న పెక్కు పేర్లలో మరికొన్ని. నెత్తి మాడకుండా వుండడానికే గొడుగును వాడేవారని సూచిస్తున్న పేర్లే ఇవన్నీ. "జలత్ర," "వారిత్ర" అని కూడా దానికి పేర్లున్నా, అవి తర్వాత వచ్చినవే కావచ్చు.

యవనుల ద్వారా యూరప్‌లో ప్రవేశించిన ఛత్రం రోమన్ సామ్రాజ్యంలో తన ఏకచ్ఛత్రాధిపత్యాన్ని నెలకొల్పినా, మధ్యయుగంలో ఎందువల్లనో ఆ ఖండం నుంచి మటుమాయమైపోయింది. దాదాపు వెయ్యేండ్ల తర్వాత క్రైస్తవ పీఠాధిపతుల ప్రాపకంతో ఇటలీలో తిరిగి ప్రత్యక్షమై, అక్కడ నుంచి ఫ్రాన్స్‌కు, హాలెండుకు విస్తరించింది. అటుపైన బ్రిటన్‌కు, ఇతర పాశ్చాత్య దేశాలకు ప్రాకింది. ఈనాడు యూరప్‌లో గొడుగులు కోకొల్లలు. మనిషికొక గొడుగు, ఇంటికొక గొడుగుల స్టాండు చొప్పున అక్కడ మనం చూస్తాము. పైపంచె లేకుండా మనలో కొందరు ఇల్లు కదలనట్టు, వారిలో (ముఖ్యంగా బ్రిటీష్ వారిలో) కొందరు గొడుగు లేకుండా గడపదాటరు. రెండవ ప్రపంచయుద్ధ ప్రారంభంలో బ్రిటన్‌కు ప్రధానిగా వున్న నెవెల్లీ ఛాంబర్లేన్ రెండు కాళ్ళు, రెండు చేతులతోపాటు, ఒక గొడుగుతో కూడా పుట్టినట్టు చెప్పవచ్చునేమో! చేతిలో గొడుగు లేకపోతే ఆయనకు అడుగు పడేది కాదు! ఆనాటి వ్యంగ్య చిత్రకారులకు ఇదొక వరప్రసాదమైంది. అప్పటిలో వారు ఛత్రాన్ని చిత్రిస్తేచాలు, బ్రిటీష్ ప్రధానిని చిత్రించినట్టే!

మన దేశ వ్యంగ్య చిత్రకారుల దృష్టిలో ఈ విషయం పడలేదుగాని, మన ప్రముఖులలో ఛాంబర్లేన్‌కు ఉజ్జీ శ్రీ శ్రీప్రకాశ. గవర్నర్‌గా వున్న రోజులలోనే కాక, అంతకుముందు, అటు తర్వాత కూడా ఆయనకు హస్తభూషణం పుస్తకం కాదు, ఛత్రం. మల్లెపూల వంటి ఆయన తెల్లని దుస్తులకు, తుమ్మెద రెక్కలను మించి నల్లనైన ఆయన చేతిగొడుగు, రంగుల వ్యత్యాసం ద్వారా, ఒక వింత

సొబగు కూర్చుతూ వుంటుంది. అసలే ఆయనది నిండైన విగ్రహం. చేతిలోని గొడుగు దానికి మరింత రాజఠీవి తెస్తుంది. లేని ఠీవి తెచ్చుకోవాలని కాదుగాని, నా చిన్నతనం నుంచీ నేను గొడుగులు కొంటూనే వున్నాను; వాటిని పోగొట్టుకొంటూనే వున్నాను. ఇప్పటికి నేను పోగొట్టుకున్న గొడుగులతో ఒక చిన్న దుకాణమే పెట్టవచ్చునేమో! ఆ దుకాణంలో బుట్టమార్కు గొడుగులు, జింక మార్కు గొడుగులు, వెదురుకఱ్ఱ గొడుగులు, గాజుపిడి గొడుగులు, సిల్కుకుచ్చు గొడుగులు, మీట నొక్కితే వాటంతట అవే తపీమని తెరచుకునే గొడుగులు—ఇలాంటి వెన్నో కాక, ఒక తాటాకు గొడుగు కూడా వుంటుంది. ఈ నాడు కొన్న గొడుగును మర్నాడే పారవేసుకొన్న తర్వాత, విసుగెత్తి, మచిలీపట్నం నోబెల్ కాలేజీలో చదివే రోజులలో ఒక తాటాకు గొడుగు సంపాదించాను.

కిర్రు చెప్పులు లేనిదే తాటాకు గొడుగుకు అందమే లేదని, తళతళలాడే తగరం పూతతో, ఎర్రని కుచ్చులతో, అరమైలు వరకు వినబడే కిర్రుతో పసందైన ఒక జతను అతికష్టం మీద సంపాదించాను. ఆ తాటాకు గొడుగుతో, ఆ కిర్రు చెప్పులతో కాలేజీకి వెళ్ళగా, అందరి కళ్లు నాపైనే! అప్పటి నా సహాధ్యాయులు కొందరు ఈ సంఘటనను గురించి ఇప్పటికీ ఒక చోద్యంగా చెప్పుకొంటారు!

ఈనాడు నా బోటివా డెవడైనా తాటాకు గొడుగు వేసుకొంటే, అది వింతగా, విడ్డూరంగా కనబడినా, ఒకనాడు తాటాకు గొడుగులే ఎక్కువగా వాడుకలో వుండేవి. ఈనాడు తాటాకు గొడుగు లెంత తక్కువో ఒకనాడు గుడ్డగొడుగులంత తక్కువ. అంగుళానికి తక్కువ కాని కైవారంతో వుండే కామతో (దండంతో) వున్నా తాటాకు గొడుగు ఆనాటి వారికి బరు వనిపించేది కాదు. పైగా, ఎంత దిట్టమైన కామను చేయిస్తే, అంత గొప్ప. పదహేడవ శతాబ్దపు ప్రాంతంవాడైన భాస్కర శతకకారుడు గొడుగుకు పనికివచ్చే కామ "చెట్టు చెట్టున" లభిస్తుందా అని ప్రశ్నించాడు.

కులమున నక్కడక్కడన
కుంఠిత ధార్మికు డొక్క డొక్కడే
కలిగెడు గాక, పెందలచు
గల్గగ నేరరు; చెట్టు చెట్టునన్
గలుగగ నేర్చునే గొడుగు
కామలు? చూడగ నాడనాడ నిం
పలరగ నొక్క నొక్కటి న

యంబున జేకురుగాక, భాస్కరా!

కామ కరవైతే, అది లేకుండా కూడా గొడుగులను తయారు చేసేవారు కాబోలు! కామలేని గొడుగును "గిడుగు" అనేవారని "శబ్దరత్నాకరము" సూచిస్తున్నది; దానికి మరొకపేరు "జగ్గు గొడుగు" అని "ఆంధ్ర వాచస్పత్యము" పేర్కొంటున్నది. కామలేనిది గొడుగు ఎలా కాగలదో? వానకు తడవకుండా నెత్తి పై నుంచి కప్పుకొనే గూడచాపనే, లేదా, జమ్ముగూడనే కామలేని గొడుగుగా వ్యవహరించేవారా? ఏమైనా, గొడుగు తొలిరూపం గూడచాప, లేదా, జమ్ముగూడు అయివుండాలి. తాటాకులతోనో, మొగలి ఆకులతోనో గొడుగులను కుట్టడానికి ముందు జమ్ముతో, ఇతర తృణాలతో గూడలను అల్లుకొనేవారనుకొంటాను. "భ్రమత్కుటి" అంటే "తృణాది నిర్మితచ్ఛత్రము" అని "సూర్యరాయాంధ్ర నిఘంటువు" అర్థం చెబుతున్నది. అల్లికగాని, కుట్టుగాని లేనినాడు, పెద్ద ఆకు ఏదైనా సరే చేతి కందితే, దాన్నే గొడుగువలె వాడేవారేమో! వానలో తడుస్తున్న వారు ఇప్పుడైనా తాటాకు కంటబడితే ఆపద్ధర్మచ్ఛత్రంగా దాన్ని వాడకుండా విడిచి పెడతారా? ఆకులతో నెత్తిని కప్పుకొన్న వాడిని చీకటిలో చూస్తే దెయ్యమో, భూతమో అని భయపడవలసి వస్తుంది. అయినా, వానకు తడిసి, ముద్దకాలేక, ఆకులను కప్పుకొనడం కద్దు గనుకనే, "పత్రపిశాచిక" సయితం ఒక ఛత్రమైంది. "ఆకులతో పిశాచివలె చేయబడిన గొడుగు" పత్ర పిశాచిక.

నే ననుకోకుండానే గొడుగుల పేర్లను గురించి విశేషంగా ప్రస్తావన వచ్చినందున, అన్నింటిలోనూ నాకు నచ్చినట్టిది "జంగమ కుటి" అని చెప్పవచ్చునేమో! "జంగమ" అంటే "తిరుగుతున్న," "కుటి" అంటే "గుడిసె", గొడుగుకు ఇదెంత ముచ్చటైన పేరు! ఎంత చక్కగా ఇది గొడుగు ఆకృతినే కాక, దాని ఉపయోగాన్ని కూడా వ్యక్తం చేస్తున్నది. గొడుగు నిజంగానే కాళ్ళున్న గుడిసె! అది మన వెంట తిరుగుతుంది. ఎండలో ఎండకుండా, వానలో తడవకుండా అది మనను కాపాడుతుంది. అది లేక పోతే ఎన్ని వడదెబ్బలు! ఎంతగా శైత్య సంబంధమైన జబ్బులు! ఇంతగా జనులను ఆపదనుంచి కాపాడుతుంది కాబట్టే "జనత్ర" దానికొక బిరుదనామమైంది!

ఇంతగా నేను గొడుగును మెచ్చుకొంటున్నా, గొడుగుల బేరగాడు నా రాకకై యెదురు చూడ నక్కరలేదు. చౌకపారు గొడుగును నేను కొనలేను; ఖరీదైన దాన్ని కాపాడుకోలేను. అందువల్ల గొడుగుల షాపులోకి మరి తొంగి చూడరాదని

రెండేళ్ళ నాడే నిర్ణయించుకొన్నాను. రెండు వర్షాకాలాల ధాటికి చెక్కు చెదర కుండా నిలిచిన ఈ నిర్ణయం ఇప్పటి ముసురుకు తట్టుకోలేక పోతుందా?

*

# ద్వంద్వాలు

ఇవ్వాళ (దీన్ని వ్రాస్తున్నది ఆగష్టు 21వ తేదీని) మా రెండవ పిల్లవాడు పుట్టిన రోజు పండుగ చేసుకొంటున్నాడు. అయిదు నిండి, ఆరవ సంవత్సరం ప్రవేశించింది. నిద్ర మంచంమీదనుంచి లేచానో, లేదో, నావద్దకు పెద్ద ఫిర్యాదుతో చక్కావచ్చాడు. "నా పుట్టినరోజని నేను తలంటు కుంటే, అన్న కూడా తలంట మంటున్నాడు. చూచావా, బాబా!" అంటూ. "తమ్ముడికి పండగైతే అన్నకు సంతోషం కాదటరా? అందుకని తలంట మంటున్నాడులే, బాబూ!" అని నేను సమాధాన పరచడానికి ప్రయత్నించాను కాని, వాడికి తృప్తి కలగలేదు. ఇందుకు వాడి ననవలసిన పనిలేదు, ప్రత్యేకత కోరడం మానవ స్వభావం.

పెద్దపెద్ద విషయాలలోనే కాదు, చిన్న చిన్న వాటిలోకూడా మనం ప్రత్యేకత కోరుకుంటాము. పెద్ద విషయాలలో ప్రత్యేకత సాధించడం కష్టం కాబట్టి, చిన్నవాటిలోనే నిజానికి ఈ కాంక్ష ఎక్కువగా వ్యక్తమౌతుంది. కవిగానో, గాయకుడుగానో, చిత్రకారుడుగానో, నటకుడుగానో, నాయకుడుగానో ప్రత్యేకత చూపించుకోవాలంటే, అందుకు ప్రజ్ఞా ప్రాభవాలు కొంతవరకైనా వుండాలి. ఇంతేకాక, తపన కావాలి; ఏకాగ్రత కావాలి; కష్టసహిష్ణుత కావాలి. ఇన్ని కూడివస్తేనే పెద్ద విషయాలలో

ప్రత్యేకత కోరేవారికి రాణింపు. ఇందువల్లనే కట్టు, జుట్టు, బొట్టు మొదలైన చిన్న చిన్న విషయాలలోనే ప్రత్యేకత కోసం ఎక్కువమంది, ఎక్కువగా దేవులాడ్డం కనబడుతుంది.

ఫ్యాషన్‌లు త్వరత్వరగా మారిపోవడానికి ఈ దేవులాటే కారణం. ఈనాడు అందమైన ఒక చీర, లేదా ఒక నగ రేపటికి అందవికారమైంది కాబోదు. అందపు విలువలకు స్థిరత్వం వున్నది. కుంచెతో చివరిపూత రంగు పూసి, నాలుగు అడుగులు వెనక్కువేసి, అజంతా చిత్రకారుడు తన సృష్టిని చూచుకొన్నప్పుడు అజంతా కుడ్యచిత్రం ఎంత సుందరమైందో, ఈనాడు కూడా అంత సుందరమైందే. ఆగ్రా చలువరాతి పనివారు తమ పనిముట్లను సంచిలో వేసుకొని, తమకు రావలసిన లెక్క చేతిలో వేయించుకొని, షాజహాన్ యిచ్చిన యీనాం పుచ్చుకుని, స్వస్థలాలకు వెళ్ళిపోయిననాడు తాజ్‌మహల్ ఎంత మనోజ్ఞమైందో, ఈనాడు కూడా అంత మనోజ్ఞమైందే అందాల విలువలు చెక్కు చెదరనివైనా, ఎంతో మనసుపడి ఈ నెలలో కొనుక్కున్న చీరమీద, లేదా నగమీద మరొక నెలకే కొందరు స్త్రీలకు మోజు తగ్గిపోవడం మనం చూస్తూనే వుంటాము. కారణంకోసం అడిగితే దాన్ని వారు దాచిపెట్టరు కూడా. "ఆ! ఎవతెను చూడ బోయినా ఇదే చీర!", లేదా, "దేని మెడలో చూచినా, ఇదే నగ!" అని పెదవి విరిచేస్తారు! "ఎవతెను చూడబోయినా" అన్నప్పుడు అదే చీరను కట్టుకొంటున్నవారు మరొక యీభైమందే కావచ్చు; "దేనిమెడలో చూచినా" అన్నప్పుడు అదే నగను పెట్టుకొంటున్న వారు మరొక పాతికమందే కావచ్చు. కాని, తన ప్రత్యేకత పోవడానికి మరొక్కరైనా సరే అట్టి చీరనే కొనడమో, అట్టి నగనే చేయించుకొనడమో చాలదా?

చీరల, నగల ప్రసక్తి మాత్రమే ఇక్కడ తెచ్చాను కాబట్టి, ఇది కేవలం స్త్రీ జనానికి పరిమితమైన ఒక దౌర్బల్యమని భావించ నక్కరలేదు! పురుష పుంగవులు కూడా ఇంతటి చిన్న విషయాలలో ప్రత్యేకతకోసం ఆరాటపడేవారే. లేకపోతే, ఆయనకు ఆ రొయ్యమీసాలు దేనికి చెప్పండి! ఈయనకు ఈ మేకగడ్డం ఎందుకు చెప్పండి? ఆయన చేతిలో ఆ వెండిపొన్నుకట్ట దేనికి? ఈయన పొడుంకాయకు ఇంత నగిషీపని దేనికి? అయితే, "ఎక్కడ చూచినా, ఇదే నగ కనబడుతున్నది కనుక, దీన్ని చెడగొట్టించి వేరే చేయించుకోవాలి" అని ఆడవారు బయటపడినంత తేలికగా మగవారు బయటపడరు.

స్త్రీలలో, పురుషులలో, పిన్నలలో, పెద్దలలో ఏదో ప్రత్యేకతకోసం ఇంత బలీ

యంగా కనబడే ఈ ఆకాంక్షను కేవల మొక దౌర్బల్యంగా కొట్టివేయగలమా? ఈ దౌర్బల్యమే లేకపోతే మానవజాతికి వృద్ధివికాసా లుండేవి కావేమో! చాన లందరు ఒకే రకం చీరతో సంతృప్తిపడితే, ఈనాటికీ అనాది మానవుల నారచీరలే అమ లులో వుండేవి కావా? నారీమణులందరు ఒకే రకం నగతో సంతృప్తిపడితే, గవ్వలదండలే ఇప్పటికీ ఆభరణాలుగా వుండేవి కావా? జాగ్రత్తగా ఆలోచిస్తే, మానవసభ్యతావికాసానికి కీలకం "ఈ చీర మోటు అయిపోయింది," లేదా "ఈ నగ ఇప్పుడు నాజూకుగా వుండడంలేదు" అనే దానిలోనే యిమిడివున్నదేమో!

ప్రత్యేకత కోసం ఆరాటపడే మానవ ప్రవృత్తే సామ్యంకోసం కూడా అఱ్ఱులు జాచుతుంది. ఇవ్వాళ పొద్దున మా రెండవ పిల్లవాడన్న ఒకమాటనే తీసుకోండి. తలంటుకొని, కొత్తబట్టలు వేసుకొని, వాళ్ళ నాయనమ్మకు నమస్కారం చేశాడు. "పెరిగి, పెద్దవాడవై , పెద్ద ఉద్యోగం చేసి ఆరుగురు కొడుకులను కని, సుఖంగా వుండు" అని ఆమె ఆశీర్వదించింది. "ఊహు! నాకు ఆరుగురు కొడుకు లొద్దు. ఏడుగురు కావాలి!" అని వా డన్నాడు. ఔను మరి! వాడు చెవులు కోసుకుంటూ వినే ప్రతి కథలో రాజుకు ఏడుగురు కొడుకులుంటారు. ఏడుగురు కానిదే ఏటికివెళ్ళి, ఏడు చేప లెలా తేగలరు? ఏడుగురు కానిదే, ఆరుగురు దద్దమ్మలైనా, ఏడవ వాడొక్కడు ప్రయోజకు డనిపించుకోవడం ఎలా సాధ్యం? కాబట్టే మావాడు కూడా తన కొడుకుల సంఖ్య ఏడింటికి తగ్గడానికి ససేమిరా వీలు లేదన్నాడు. తండ్రిగా వాడు కోరుతున్న సామ్యం తనకు నచ్చిన పిట్టకథల లోని రాజులతో.

అమాయకంగా వాడు పెట్టుకున్న ఈ సామ్యం ఏదో ఒక రూపంలో ప్రతి ఒక్కరు పెట్టుకొనేదే! కొద్దిపాటివారు కొద్దిపాటి విషయాలలో తమకంటె ఒక మెట్టు పైవారితో సామ్యం పెట్టుకుంటారు; పెద్ద ఆశలకు పోగలవారు పెద్ద విషయాలలో తమకంటె చాల పై మెట్టుపైనున్న వారితో సామ్యం పెట్టుకుం టారు. ఉభయవర్గాల ఉద్దేశం తాము కూడా ఆ పై అంతస్తుకు దేకాలనే. ఈ తాపత్రయమే లేకపోతే, మానవుడు ఈనాటికీ ఇంకా ఆడవులలో వేటాడుతూనే వుండే వాడేమో!

ప్రత్యేకత, సామ్యం; ఇవి పరస్పర విభిన్నమైనవి. అయినా, వీటి ఊపు తోనే ఇంతవరకు మానవాళి పురోగమించగలిగింది, తరచిచూస్తే సృష్టికి మూలమే ఇలాంటి ద్వంద్వాలు.

# సొంత పుస్తకం

పుస్తకాలు కొనడమంటే నాకు చెడ్డ సరదా. జేబులో డబ్బున్నా, లేకపోయినా, మంచి పుస్తకం కంటబడగానే బేరం చేస్తాను. అది పదేపదే పనిపడగల పుస్తకం కావచ్చు; ఒకసారి చదివినతర్వాత మరి పనికిరానిది కావచ్చు. అయినా దాన్ని కొనేదాకా మనస్సు రెపరెప లాడుతుంది. అప్పచేసికూడా పుస్తకాలు కొనడం తరచు జరుగుతూ వుంటుంది. ఉప్పూ పప్పూ, గుడ్డా గుడుసూ, మందూ మాకూ అవసరాలుకూడా మరచిపోయి పుస్తకాలు కొనడమూ. తర్వాత పస్తాయించడమూ మామూలైపోయింది. ఎప్పటికప్పుడు పుస్తకాల షాపులవైపుకు మరి వెళ్ళరాదని అనుకుంటాను. కాని, ఏం లాభం? ఉదయాన్నే "ఇక కల్లు

ముట్ట” నని వొట్టువేసుకుని సాయంత్రంకాగానే కల్లు పాకలో దూరే త్రాగుబోతు మాదిరిగా, మళ్ళీ నాలుగైదు రోజులనాటికే పుస్తకాల షాపులో ప్రత్యక్షం! “ఇది వ్యసనం సుమా!” అంటారు కొందరు మిత్రులు. కావచ్చు. కాని ఉత్తమ వ్యసనం.

ఈ మద్రాసులో ఎన్ని గ్రంథాలయాలు లేవు? ఎంతెంత పెద్ద గ్రంథాలయాలు లేవు? నిజమే. కాని, మద్రాసులో పెద్ద పెద్ద ధర్మసత్రాలుకూడా ఎన్నో లేవా? ఉన్నవని నేను వెళ్ళి వాటిలో కాపురం వుంటున్నానా? సత్రం దారి వేరు, ఇంటి దారి వేరు. సత్రం మీద హక్కు ఒక్కరిది కాదు, పదిమందిదీ. దానిలోకి ముసాఫిర్లు వస్తూవుంటారు, పోతూ వుంటారు. నా సౌకర్యం ప్రకారం, నా చిత్తం వచ్చినట్టు అక్కడ వుండడానికి వీలా? పైగా, ముచ్చిక మూడు రోజులుండనిచ్చి, నాల్గవనాడు బయటికి నడవమంటారు. ఇంకా వుంటానంటే, రోజుకు పావలా, అర్ధా అద్దెకింద తెమ్మంటారు. ఇక, నా యింటికి నేనే పెద్దను. నా సౌకర్యాన్ని బట్టి దాన్ని నేను అమర్చుకొంటాను; నా చిత్తం వచ్చినట్టు దానిలో కాపురం వుంటాను. అది అద్దె కొంపైనా దానిలోనుంచి నన్ను కదలమనడానికి (రెంట్ కంట్రోల్ ఆర్డర్ పుణ్యమా అని) ఎవ్వరికీ అధికారం లేదు. రాజభవనం లాంటి సత్రంకూడా సొంత పూరిగుడిసెతో సరితూగలేదు. ఏ పక్షికి ఆ పక్షి విడిగా గూడు కట్టుకోవడం ఈ రహస్యం తెలియ బట్టే కావచ్చు!

ధర్మసత్రానికీ, పబ్లిక్ లైబ్రరీకి చాలా సామ్యం వున్నది. లైబ్రరీలో కోరిన పుస్తకం కోరినప్పుడు దొర్కకడం కష్టం. దొరికినా ఏ వారానికో, పక్షానికో తిరిగి యిచ్చి వెయ్యాలి. ఈ గడువు దాటితే రోజుకు అణా చొప్పున జరిమానా కట్టుకోవాలి. అట్టాగిట్టా చిరిగితే అదొక చిక్కు. ఇందువల్లనే కన్నిమరా పబ్లిక్ లైబ్రరీపై కంటే కూడా నా చిన్న పుస్తక సంచయంపైనే నా కెక్కువ ప్రేమ, అధికాభిమానం.

“ఎరవు పుస్తకం వల్ల కలిగే ఆనందం బహుస్వల్ప”మని శ్టాన్లీ బాల్డ్విన్ అన్నాడు. ఈ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. సొంత పుస్తకాన్ని ఒక్క బిగిని చదివి వెయ్యవలసిన అగత్యం వుండదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎంత కావాలంటే అంతే, తాపీగా చదువుకోవచ్చు. ప్రారంభించిన తర్వాత విడవకుండా చదివించే పుస్తకమైతే, ఏకతాకీని దాన్ని పూర్తిచేసి, తిరిగి కోరినప్పుడు కోరిన భాగాలు చదువుకుని, మధురస్మృతుల్ని పునరుద్దీపింపచేసుకోవచ్చు. ముఖ్యంగా జ్ఞాపకం వుంచుకోవలసిన భాగాల్ని మార్క్ చేసుకోవచ్చు. పుస్తకాన్ని చదువుతూ వుండగా తోచిన భావాల్ని మార్జిన్‌లో వ్రాసుకోవచ్చు. ఇదేమీ కాక, పుస్తకం విసుగు కలిగించినా, అసహ్యాన్ని పుట్టించినా, కోపాన్ని తెప్పించినా, దాన్ని విసిరి

పుచ్చుకు గిరాటు కొట్టవచ్చు. అదే యెరవు పుస్తకమైతే, ఇలా చెయ్యగలమా? పంజాబ్ కేసరి లాలా లజపత్‌రాయ్ ఒకనాడు లాహోర్‌నుంచి ఢిల్లీకి ప్రయాణం చేస్తున్నాడు. పెద్ద ప్రయాణం, ఉబుసుపోదు. అందుచేత కాలక్షేపానికి కొన్ని పుస్త కాలు ముందుగానే జాగ్రత్త పెట్టుకొన్నాడు. రైలు సాగారిన వెంటనే రుడియర్డ్ కిప్లింగ్ నవల "కిం" అనేదాన్ని తీసి, దాన్ని ఆయన చదవ నారంభించాడు. పది, పదిపేను పేజీలు చదివాడో, లేదో అది భారతజాతిని నిరసిస్తున్న ధోరణి ఆయ నకు ఆగ్రహం కలిగించింది. పరిగెత్తుతూవున్న తన రైలు కిటికీగుండా వెంటనే ఆయన దాన్ని గిరాటు కొట్టాడు. ఆ మరుక్షణంలో ఆది యెరవుతెచ్చిన పుస్తక మన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. అందువై ఆయన నాలక కరచుకోవలసివచ్చింది. అదే సొంత పుస్తకమైతే, తాను చేసిన భేషైనపనికి నొచ్చుకోవలసిన అగత్యం లాలాజీకి కలిగేది కాదుగదా?

ఏ బిడ్డ అయినా ముద్దుగానే వుంటుంది. కాని, పరాయిబిడ్డ మన బిడ్డ పాటి ముద్దు వస్తుందా? ఎరవు పుస్తకానికీ, సొంత పుస్తకానికీ ఇదే భేదమని నా అభిప్రాయం. నా అభిప్రాయమే కాదు; నా అనుభవంకూడా. అందుచేతనే డబ్బు కెన్ని తిప్పలు పడుతున్నా, అప్ప సప్పల పాలైపోతున్నా, పుస్తకాలు కొనడం మానలేను.

కొంతమంది అదృష్టవంతులు పుస్తకాలు కొనరు; వాటిని సేకరిస్తారు. ఈ సేకరణ విద్య నాకు పట్టువడలేదు. నిజానికి ఇది చాలా తేలిక పని. "చదువ కిస్తాను, ఒకసారి పుస్తక మివ్వండి" అని మొహమోటు పెట్టడం, దాన్ని జమ కట్టుకొనడం—ఎంత తేలిక పనో చూడండి! చచ్చుపీనుగ ఎవడైనా తన పుస్తకం తనకు తిరిగి కావాలని విడవకుండా వెంటబడితే, "ఇదిగో, అదిగో" అంటూ వాయిదాలు వెయ్యవచ్చు. పది వాయిదాల తర్వాత వాడికే విసుగు పుడుతుంది. లేదా "ఎక్కడ పెట్టానో కనబడ్డంలేదు. క్రొత్త ప్రతి కొనియిస్తా"నని చెప్ప వచ్చు. మెత్తనివాడైతే, "వద్దులెండి" అని అననే అంటాడు. అనకపోతే, "రేపు కొంటాను; మాపు కొంటాను" అని తిరిగి కాలయాపన చెయ్యవచ్చు. ఎంత మొండిఘటానికైనా [illegible] ప్రాణం విసిగిపోతుంది. లేకపోతే, "మొన్న బీరువా సర్దుతూవుంటే, నీ పుస్త [illegible] కనబడింది" అని చెప్పి, దాన్ని వాడి ముఖాన గిరగిర తిప్పికొట్టవచ్చు. కాని, నూటికొకసారైనా వ్యవహార మింతవరకు పోదు.

మొగమోటుపడి పుస్తకాన్ని యెరవిచ్చి, "కొత్త ప్రతిని కొనియిస్తా" నన్న మాటకు" ఫరవాలేదు; వద్దులెండి" అని చెప్పడం నా అనుభవంలో అనేక

పర్యాయాలు జరిగింది. ఒక్కసారిమాత్రం తెగబడి "సరే, ఎప్పుడు కొనియిస్తా"రని అడిగాను. "నేను కొనియివ్వడం దేనికి? పైక మిస్తాను, మీరే కొనుక్కోండి" అని ఆ పెద్దమనిషి పైయెత్తు వేశాడు. నేను మరీ మొండికెత్తి, "సరే, యివ్వండి" అని డబ్బుకు చెయ్యిజాచగా "మూర్ మార్కెట్‌లో దాన్ని మీరు అర్థరూపా యికి కొన్నామన్నారు గదా? " అంటూ తన మనీపర్సు పైకితీసాడు. చక్కని గ్రంథాన్ని కారుచౌకగా కొనగలిగానన్న సంతోషాన్ని పట్టలేక దాన్ని యెరవిస్తూ నేను నోరుజారిన ముక్క నాకు జ్ఞాపకం లేకపోయినా, అతడు మాత్రం మరచిపోలేదు. కాస్త తెల్లబోయి కొంచెం ఉడికిలుతూ కూడా, "కాని, ఇప్పుడు కావాలంటే ఆ పుస్తకం మూర్ మార్కెటులో వుంటుందా? ఉన్నా, మళ్ళీ అర్థరూపాయికే దొరుకుతుందా? దాని అసలు ధర అయిదు రూపాయలు" అని నే నన్నాను. "ఈ అర్థరూపాయి మీవద్ద వుంచండి; దొరికినప్పుడే కొనవచ్చు. ఆలస్యమైతే యేమీ ముంచుకుపోదులెండి?" అని ఎనిమిదణాల డబ్బులు నా చేతిలో పెట్టబో యాడు; ఏం చెయ్యను? పరాజయాన్ని గుర్తించక తప్పిందికాదు.

పుస్తకాలు కొనడంకంటె కూడా అవి చేతులు మారకుండా పదిలపరచుకోవడమే కష్టమైన పని. సుఖాన్నీ, ఆనందాన్నీ దాచుకోవడం మానవప్రకృతికి విరుద్ధం. పదిమందికి పంచిపెట్టినప్పుడే మన సుఖం, మన ఆనందం మరింత పరిపూ ర్ణమైనట్టుతోస్తవి. మంచి పుస్తకాన్ని చదివి ఆనందించినప్పుడు, మిత్రులదగ్గరనో, పరిచితుల దగ్గరనో, దాని ప్రశంస చెయ్యకుండా వుండలేము; మన ప్రశంస విని "అది మీ వద్ద వున్నదా? " అని వాళ్ళు అడగకనూ మానరు. అబద్ధాన్ని చెప్పడానికి నోరు రాక - చేసిన నేరాన్ని అచ్చుకుంటున్న ముద్దాయిలాగా – వున్నదని అంగీకరిస్తాము. వెంటనే ఒకసారి చదువుకొని యిస్తామని అడుగుతారు మొగమోటపడి యిచ్చి వేస్తాము. "చదువుకొని యివ్వడంలో " మొదటిభాగం తప్పక జరుగుతుంది; రెండవదే సంశయాస్పదం. అలాగని మాట దక్కించకపోతే హాస్యానికి, చతురోక్తికి పేరందిన అమెరికన్ రచయిత మార్క్ ట్వెయిన్ చేతిలో అతగా డెవ్వడో దెబ్బతిన్నట్టు మనం కూడా దెబ్బతినవలసివచ్చినా రావచ్చు. మార్క్ ట్వెయిన్‌కు ఒకనా డొక పుస్తకం కావలసివచ్చి, తన పొరుగింటి ఆసామికి వాని పేరు చెప్పి, "అది మీ లైబ్రరీలోవున్నదా"? అని అడిగాడు. "ఉన్నది. కావాలంటే మీరు దాన్ని నా లైబ్రరీలో కూర్చుని సంతోషంగా చదువుకోవచ్చు" అని అతగా డన్నాడు. "థాంక్స్" చెప్పి, మార్క్ ట్వెయిన్ అప్పటికి చల్లగా వూరుకున్నాడు. తర్వాత కొన్నిరోజులకు ఆ పొరుగింటి ఆసామికి "లాన్-

మౌవర్" కావలసి వచ్చింది. (లాన్-మౌవర్ అంటే మీకు తెలేసేవుంటుంది. పచ్చిక బయలు మీద ఈడ్చినప్పుడు, పచ్చికను చదునుగా కత్తిరించే సాధనమది.) "మీ వద్ద లాన్-మౌవర్ వున్నదా?" అని అతగాడు కబురుచేశాడు. "ఉన్నది. కావాలంటే మీరు దాన్ని మా లాన్ (పచ్చిక బయలు) మీద సంతోషంగా ఉప యోగించుకోవచ్చు" అని మార్క్ ట్వెయిన్ జవాబు పంపించాడు!

ఎవ రేమి అనుకున్నాసరే ఖాతర్ చెయ్యక పుస్తకాన్ని ససేమిరా యెరు విన్వనివారు కొంద రుంటారు. వీరు ఏ తరహావారై వుంటారో తెలియజెప్పడా నికి ఈ క్రింది కథ ఉపకరిస్తుంది : ఒక పెద్దమనిషి తనకు సుపరిచితుడైన వ్యక్తిని ఏదో పుస్తకాన్ని యెరవివ్వమనగా, అతడు "సారీ" అన్నాడట. "ఈ కాస్త భాగ్యానికేమాట పోగొట్టుకున్నానే!" అని ఆ పెద్దమనిషి ముఖం చిన్న బుచ్చుకుని, తన బాధను కప్పిపుచ్చుకోడానికి "అది మీ వద్ద లేదు కాబోలు లెండి" అన్నాడట. అంతట "అయ్యో! లే కేమండీ! నిక్షేపంలా వున్నది. అయినా, దాన్ని మీకెందుకివ్వనంటున్నానో చెబుతాను -- ఇలా దయచెయ్యండి" అంటూ ఆ నిర్మొగమోటి ఆ పెద్దమనిషిని తన లైబ్రరీకి వెంటబెట్టుకు వెళ్లి, ఇలా అన్నాడట. : "చూడండీ -- ఇరవైవేల గ్రంథాలు బారులు తీర్చివున్నాయి. వీటిలో ప్రతిది చదువు కిస్తానని చెప్పి నేను పుచ్చుకున్న పుస్తకమే సుమండీ!"

నిర్మొగమోటిని కాను కనుక నేను పుస్తకాల్ని యెరవివ్వక తప్పదు; అవి పోవడమూ తప్పదు. కొత్త పుస్తకాలను చూడగానే మనస్సు రెపరెప లాడుతుంది. కనుక, పోతూవున్నా వాటిని కొనకనూ తప్పదు. ఇతరుల మాట చెప్పలేను గాని, నా విషయంలో జరిగేది మాత్రమింతే - ఇప్పటికీ, ఎప్పటికీ!

*

# క్షుద్ర విశ్వాసాలు

---

దండు నడిపిస్తున్న మాసిడోనియన్ దండనాయకుడు ఫిలిప్‌కు మార్గమధ్య ప్రదేశ్ మొకటి మజలీ చెయ్యడానికి మహా ప్రశస్తమైందిగా కనబడిందట. వెంటనే అతడు "నిలుడహో"! అన్నాడట. ఈ మాట కాకపోతే, తను గ్రీక్ భాషలో మరొక మాట అన్నాడనుకోండి. సర్వసేనాని ఏ భాషలో "ఖడేరావ్" అన్నప్పటికీ సైన్యాలన్నీ "హాల్ట్" కావలసిందే. అయినా ఫిలిప్ ఉత్తరువు ప్రకారం అక్కడ మజలీ చెయ్యడం జరగనే లేదు. కారణం! సైన్యాలకు కావలసిన సంభారాన్ని మోసుకువస్తున్న గాడిదలకు అక్కడ మేత లేకపోవడం. అంతట ఫిలిప్ "గాడిదల సౌకర్యం ప్రకారం బ్రతకవలసిన బ్రతుకు, ఇదేమి బ్రతుకయ్యా! వెధవ బ్రతుకు!" అని విసుక్కున్నాడట.

అవి ఏమి పాపం చేసుకున్నవో కాని, భూమి పుట్టిననాటినుంచీ గాడిదలంటే అందరికీ లోకువే ! వాటి పేరే ఒక తిట్టు ! బుద్ధిలేనివాడు గాడిద. అల్లరిచిల్ల

రిగా తిరిగేవాడు అడ్డగాడిద. నడస్తుండగా మోకాళ్లు తగిలేవాడు గాడిదకాళ్లవాడు. పనికిరానివేపగాడిదవేప. బరువు మోపైతే, అది గాడిద బరువు. లేనిపోని చిక్కు మొడకు చుట్టుకుంటే అది గాడిద గత్తర. గొంతు వికారమైనదైతే అది గార్దభ స్వరం. కార్యసాధనకు హేయమైన పనిని దేనినైనా చేస్తే "వసుదేవు డంతటివాడు గాడిదకాళ్ళు పట్టుకోలేదా?" అని కుంటిసమర్థన. "గాడిద పుండుకు బూడిద మందు" అని మరొక మాట. ఇంత హీనంగా గాడిదను ఎందుకు చూడాలని అడిగితే, "గాడిద గాడిదే. గుర్రం కాలేదను కోండి. కాని, గుర్రాన్ని తనకంటే భారీజంతువు ఏనుగుగా మారమనండి, దాని తర మౌతుందేమో! ఏనుగుతో పోల్చి గుర్రాన్ని మనం నిరసించనప్పుడు, గుర్రంతో పోల్చి గాడిదను నిరసించడం మాత్రం ఏమి సబబు? దాణా, గీణా అడగకుండా, అది ఎన్ని బరువులు మోసిపెడితే నేమి? ఎంతగా అరవ చాకిరి చేసి పెడితే నేమి? ఎంత ఓర్మిని, కూర్మిని, ఎంత నెమ్మదిని, నిదానాన్ని చూపిస్తే మాత్ర మేమి? అంతాబూడిదలో పోసిన పన్నీరే! నిజ మాలోచిస్తే, దాని మంచే గాడిదకు ఇన్ని తిప్పలు తెచ్చి పెడుతున్నది. మెత్తనివాడిని చూస్తే. ఎవరికైనా మొత్త బుద్ధి అవుతుంది కాదటండి! సగోత్రీకుని వలె చీకటి మాటికీ మారం చేస్తే, గాడిదకు కూడా గుర్రానికి దక్కు తున్న మన్ననే దక్కేది. ఈ పాటి ఆలోచించక శ్రీనాథ కవి సార్వభౌము డంతటివాడు కొండవీటిలో ఏ మూలలకు వెళ్లినా కుక్కగొడుగులవలె తనకు కనబడిన కవులను అవహేళన చెయ్యడానికి గాడిదనే అడ్డం పెట్టుకున్నాడు:

5 బూడిద బుంగపై యొడలు
పోడిమిదక్కి మొగంబు వెల్లనై
వాడలె వాడలం దిగిరి
వారును వీరును జొచ్చొచోయునన్
గోడల గొందులం దొదిగి
కూయుచునుండెదు కొండవీటిలో
గాడిద నీవునున్ గవివి
కావుగదా యనుమాన మయ్యెడిన్.

గాడిద దృష్టినుంచి ఆలోచించి, దానిపట్ల సానుభూతి చూపించినవాడు-

ఆడినమాటలు దప్పిన,
గాడిద కొడుకంచు దిట్టగా విని, యయ్యో
వీడా నా కొక కొడుకని

గాడిద యేడ్చెంగదన్న ఘన సంపన్నా!
అని చెప్పిన మహామహు డొక్కడే,

అన్నట్టు, మరొక వ్యక్తికూడాగాడిదకు న్యాయం చేశాడు. అతడు వేదాంతి. వేదాంతికి తగినట్టు గాడిదకూతకు అతడు వేదాంతపరమైన అర్థాన్ని చెప్పాడు. "ఆయ్ ఖుదా!" అని ముందు గాడిద దేవుని ఎలుగెత్తి పిలుస్తుందట. ఆ పాడు దేవుడు సామాన్యంగా పలికేవాడు కాడు గనుక, "హై? నై? హై?నై?" అంటూ, అతడున్నాడో, లోడో నన్న సంశయంలో పడుతుందట. అప్పటికీ జవాబు రాక పోయినా, పరాత్పరుని అస్తిత్వాన్ని గురించి శంకించడం పాప మని అంతలోనే గుర్తై రెగి, "హై!, హై!" అంటూ వున్నా డన్న నిశ్చయానికి వస్తుందట. పదిహేను, పదహారేళ్లనాడు బందరు నేషనల్ కాలేజీలో బసచేస్తూ, అ చుట్టుప్రక్కల గుంపులు, గుంపులుగా వున్న గాడిదల ఓండ్రకు తనకు రాత్రి నిద్రపట్టలేదని ఫిర్యాదుచేసిన గాంధీజీకి అక్కడ హిందీ పండితుడు గాడిదకూతకు ఈ అంతరార్థాన్ని విప్పి చెప్పేసరికి ఆయన ఫక్కున నవ్వాడు. ఆ తర్వాత రెండు, మూడు రోజులు అక్కడే మకాంచేసినా నిద్రాభంగ మౌతున్నదనే మాట తిరిగి ఆయన నోట రాలేదు.

ఒక కవిని, ఒక వేదాంతిని విడిచిపుచ్చితే, తక్కిన వారందరు గాడిదను తిట్టిన వారే గనుక "నలుగురితో పాటు నారాయణ" అన్నట్టు, ఫిలప్ గాడిదలను నాలుగు తిట్టినాడని అతడి మాటలను త్రోసివెయ్యరాదు. "ఇంత ఘనుడనైన నా సంకల్పానికి ఏ క్షుద్రప్రాణుల కారణంగానో, ఏ క్షుద్ర విషయాల కారణంగానో వికల్పంజరగనా!" అన్న అహం భావమే అతడిచేత ఆ మాటలను అనిపించింది. బల దర్పాలున్న వారందరికీ ఇట్టి అహంకృతి కొద్దిగానో గొప్పగానో వుండనే వుంటుంది. అహం బలిసినందునే కైలాసగిరిని యెత్తడానికి రావణాసురుడు పూనుకున్నాడు! అహం కన్ను గప్పినందునే దారికి అడ్డంగా 'తగిలిన హనుమంతుని తోకను ఎడ మకాలితో పక్కకు నెట్టివెయ్యడానికి భీమసేనుడు ప్రయత్నించాడు. ఉభయులకు పరాభవం తప్ప లేదు. శివుడు కాలిబొట్టనవ్రేలితో కాస్త నొక్కేసరికి లంకాధిపతి కుక్కిన పేను కావలసివచ్చింది, తనకు కంఠోపాఠంగా వచ్చిన శివస్తోత్రా లన్నింటినీ గుక్కతిప్ప కోకుండా ఏకరవు పెట్టవలసి వచ్చింది. ఈ గర్వభంగగాథ ప్రాచీన భారతీయ శిల్పుల నెందరినో మహోత్తమ శిల్పాల సృష్టికి పురికొల్పింది. ఎల్లోరాగుహ లన్నింటికీ కైలాసం శిరోభూషణం కాగా, దానిలో మకుటాయమానస్థానం లంకేశ్వరుని గర్వభంగ శిల్పానిదే. భువనేశ్వర్‌లోని పరశురామేశ్వరాలయంపై ఎన్నో ఉత్తమ

శిల్పాలుండగా, అగ్రతాంబూలం తిరిగి దశకంఠుని గర్వభంగానిదే. భీముని భంగపాటు శిల్పాల కెక్కలేదుగాని,హరికథకులు తరచు దాన్ని చెప్పనూ చెబుతారు; ఎన్నిసార్లు చెప్పినా వినేవారు చెవికోసుకుంటూ దాన్ని విననూ వింటారు. అహంకారం కొద్దీ ఫిలిప్ "గాడిదల సౌకర్యం ప్రకారం బ్రతికే బ్రతుకు, ఇదేమి బ్రతుకయ్యా! వెధవ బ్రతుకు!!" అన్నప్పటికీ, వాటి వీలునుబట్టే మజిలీచేశాడు గాని, లేకపోతే ఆ క్షుద్ర ప్రాణుల కారణంగానే అతడికీ గర్వభంగ మయ్యేది.

మనం వెనక్కు తిరిగి పారజూచుకోము గాని, క్షుద్రంగా తోచే ప్రాణులపైనే మన బ్రతుకు చాలావరకు ఆధారపడివుంటుంది. మనకు కూడుపెట్టేవి, ఎంతటి తుఫాను వచ్చినా లెక్కచేయక తలయెత్తుకు నిలిచే మహా వటవృక్షాలు కావు; చిరుగాలికి సయితం తల్లడిల్లిపోయే క్షుద్రపు వరి, జొన్న, గోధుమ మొదలైన మొక్కలే. మనకు గుడ్డ నిచ్చేవి మిన్నుముట్టే తాటి, కొబ్బరి వగైరా చెట్లు కావు; నిలువెత్తు కైనా పెరగని ప్రత్తిచెట్లే. మనం విలువైనవిగా చూచుకునే చీని చీనాంబరాలను మనకు కూర్చేవి కొందరు చూడ్డానికే చీదరించుకునే పట్టుపురుగులు. "ఏను గుపాడి" మనకు పనికివచ్చేది నుడికారంగా మాత్రమే; పాలు, పెరుగు, నెయ్యి కావాలంటే మనం సంపాదించుకోవలసింది ఆవులను, బర్రేలనే. జబ్బుచేస్తే పెండి, బంగారాలను మందుగా మ్రింగము; దమ్మిడీకైనా కొరగావని ఇతరవేళలలో త్రోసిపారవేసే ఏ మూలికలకోసమో పరుగులెత్తుతాము. ఇంత దేనికి? లూయీ పాశ్చర్‌ను అడిగితే, మన చావు బ్రకుకులన్నీ కంటికి కనబడని సూక్ష్మాతి సూక్ష్మజీవులు "బ్యాసిలీ"పై ఆధారపడి వున్నట్టు చెబుతాడు.

ఈ విశ్వంలో వాస్తవానికి ఏదీ క్షుద్రం కాదని గుర్తించి, అందుకు అనుగుణంగా జీవితాన్ని గడపగలిగితే, ఆ జీవితం ధన్యమే అవుతుంది. కాని, ఇందుకు మారుగా క్షుద్ర విశ్వాసాల ప్రకారం బత్రుకును వెళ్ళబుచ్చడమే ఎక్కువగా కనబడుతుంది. మనలో పెక్కుమంది నిత్యజీవిత రథానికి క్షుద్రవిశ్వాసాలే చక్రాలు. నిద్రమంచంనుంచి లేస్తూనే గోవునో, పుణ్యస్త్రీనో చూస్తే శుభం; పిల్లినో, విధవనో చూస్తే అశుభం. వొళ్లు విరుచుకుని మంచంపైనుంచి కాలుకింద పెట్టబోతుండగా ఎవరైనా పుటిక్కిన ఒకటి తుమ్మితే చేటు: రెండు తుమ్మితే గ్రుడ్డిలో మెల్ల. చెంబు చేతబుచ్చుకుని అవతలికి వెడుతుంటే, నూనె ఎదురుగా వస్తే కీడు, నక్కను తొక్కితే మేలు. తిరిగి వచ్చి, దంతధావనం చేద్దామని చూరులోని వేపపుల్లలకు తడుము లాడుతుండగా అలికిడికి బెదిరిన బల్లి, ముంజేతిని తాకితే కీర్తి. స్నానపానాలు పూర్తిచేసి, పనిపాటులకు కదలగా, వొంటి బ్రాహ్మడు యెదు

రొస్తే కార్యభంగం. కోమటి యెదురైతే కోటిలాభాలు. ఈ క్షుద్రవిశ్వాసాలకు పారమే లేదు. చివరికి గడ్డం గీకించుకోవాలన్నా, బుర్ర డెక్కించుకోవాలన్నా, తిధి వార నక్షత్రాలు చూడాలి. అందుకు మంగళ, శుక్రవారాలు పనికిరావు; చవితి, అష్టమి, నవమి, చతుర్దశి పనికిరావు; అమావాస్య తగదు. తిధి వార నక్షత్రాలు కుదిరినా, గృహిణి గర్భవతి కారాదు; మైలరోజులు కారాదు; ఇంకే మేమో కూడదు. పొరుగూరుకు ప్రయాణం పెట్టుకున్నా, నూతన వస్త్రానో, ఆభరణాన్నో ధరించాలన్నా ఇన్ని పట్టింపులూ తిరిగి తప్పవు.

ఒక్క మనదేశంలోనే కాక, దేశదేశాలలోనూ ఇట్టి క్షుద్ర విశ్వాసాలు మూఢ మతులపై రాజ్యాన్ని చేస్తూనే వుంటాయి. పదమూడు కీడు మూడించే దుష్టసంఖ్య అని పాశ్చాత్యుల పిచ్చినమ్మకం. భోజనానికి పదముగ్గురు కూర్చోవలసివస్తే, ఒకరు తగ్గుతారు; లేదా, చివరికి బట్లరునైనా సరే పధ్నాల్గవ వానిగా కలుపుకుంటారు. ఇళ్ళ వరసలో తమది పదమూడవదీ కావడం తటస్థిస్తే, దానికి "12 - ఎ" అని నంబర్ మేయించుకుంటారు. ఇంతేకాక, చేతిలో అద్దం పగలరాదని, నిచ్చెనకింద నడవరాదని, ఒక అగ్గిపుల్లతో ముగ్గురు సిగరెట్లను ముట్టించుకోరాదని, డైనింగ్ టేబుల్ పై ఉప్పు చిందరాదని, శుక్రవారంనాడు ఓడను బయలుదేర దీయరాదని ఎన్నెన్నో మూఢనమ్మకాలు వారికీ వున్నాయి.

ఇవి తగవని క్షుద్ర విశ్వాసాలను ఎంతగా ఖండించినా వాటి ప్రాబల్యం తగ్గదు. అవి లొంగేది ప్రచారబలానికి కాదు; పరిస్థితుల బలానికి. రైళ్ళలో, బస్సులలో, విమానాలలో ప్రయాణాలు వచ్చిన తర్వాత ఇప్పుడు వర్జ్యం వున్నదని శుభ ముహూర్తం ఇంకా కుదరలేదని కూర్చునేవారికోసం అవి ఆగుతవా? తలచెడిన మనిషి ఎదురొచ్చిందని ఫ్యాక్టరీకో, ఆఫీసుకో లేటుగా వెడితే పైవారు వూరుకుంటారా? అయితే, పరిస్థితులు బలీయమై, వెనుకనుంచి ఒక తాపు తన్నేవరకు పాతదారినే నడవక, ప్రయత్న పూర్వకంగా క్షుద్ర విశ్వాసాలనుంచి బయటపడ గలవారే విజ్ఞులని మెప్పు పొందగలుగుతారు. ఏమైనా, గార్దభాన్ని క్షుద్రజీవిగా యెంచిన మాసిడోనియన్ దండనాధుడైనా క్షంతవ్యుడు కాగలడు గాని, గాడిద కూస్తే, చేస్తున్న పని మానుకునే వాడు మాత్రం క్షమార్హుడు కానేరడు.

*

# బాలానందం

ఏదైనా ఒక వ్యాసాన్ని ఇంటివద్దే వ్రాద్దామనుకున్నాను. ఇందుకు కారణం మరేమీ లేదు. "ఆదివారం పూటైనా యింటిపట్టున వుండగూడదా?" అని మాఆవిడ అనింది. దాదాపు పగలంతా నాకు ఆఫీసుపనితోనే సరిపోతుంది. పొద్దున తొమ్మిది గంటలకు యిల్లు కదిలితే, తిరిగి రాత్రి ఏడెనిమిది గంటల తర్వాతే యింటికి చేరుకోవడం. "ఇదుగో నాన్న వస్తున్నాడు: అదుగో నాన్న వస్తున్నాడు" అంటూ కళ్లు కాయలు కాచేటట్టు దారి కాచి కాచి, ఒక్కొక్క రోజున నేను తిరిగి వచ్చేసరికి "ఆదివారం పూటైనా యింటిదగ్గర వుండగూడదా?" అని అన్నదంటే, దానిలో పెద్ద నింద, కొంత బాధ మిళితమై వున్నాయన్నమాట!

ఆఫీసుకు బయల్దేరిన వాణ్ణికూడా ఈ మాట తర్వాత ఆగిపోయాను. ఆగి, వ్యాసాన్ని వ్రాయడానికి కూర్చుంటే, ఒక్క అక్షరమైనా రాలితే వొట్టు. మా పిల్లవచ్చి "నాన్నా! ఏం రాస్తున్నావ్?" అని అడిగింది. వ్యాస మని చెబితే, మూడేళ్ళ పసిదానికి అర్థమౌతుందా, పెడుతుందా? "ఉత్తరం" అన్నాను. "ఎవరికి?" అని వెంటనే ప్రశ్న "నాయనమ్మకులే? నీవు వెళ్ళి ఆడుకో, తల్లీ!" అని బుజ్జగించి పంపి వెయ్యబోయాను. కాని, కదిలితేనా!

"నాయనమ్మ ఎక్కడుంది?" అని నా మాట పూర్తికాకముందే మళ్ళీ ప్రశ్న.

అబ్బబ్బ! పిల్లలు వేసే ప్రశ్నలకు అంతూ పొంతూ వుండదు గదా! మనం ఒకదానికి సమాధానం చెప్పగానే, వాళ్ళకు మరి నాలుగు ప్రశ్నలు స్ఫురిస్తాయి. వాళ్ల కళ్ళకు ఈ ప్రపంచం కొత్తగా, వింతగా కనబడుతుంది. కొత్తగా ఈ ప్రపంచం లోకి వచ్చినవాళ్లు కనుక, పిల్లల చిత్తవృత్తిని కొత్త ఊరుకో, నాడుకో వెళ్ళినప్పటి మన చిత్తవృత్తిని పోలివుంటుంది. అయితే, అజ్ఞానాన్ని ఎక్కడ బయలుపెట్టు కుంటామోనన్న భయంవల్ల నేమి, సభ్యతకు విరుద్ధ మేమోనన్న సంకోచంవల్ల నేమి మనకు తెలియని ప్రతిదాన్ని గురించీ మనం ప్రశ్నలు వెయ్యము. ఇంతే కాదు. తెలియని విషయం కూడా తెలిసినట్టుగానే నటించడానికి ప్రయత్నిస్తాము. పిల్లలలో ఈ భయం ఈ సంకోచం, ఈ కపటం వుండవు. అందుచేత వాళ్లు ప్రశ్నలవర్షాన్ని కురిపిస్తారు. ప్రతిదీ కూడా కొత్తగా, వింతగా తోచడం అలా వుండగా, వాళ్ళకు తెలియకుండానే వాళ్ళలో వుండే జ్ఞానతృష్ణ సయితం వాళ్లు వేసే ప్రశ్న పరంపరకు కారణ మౌతుంది. పిల్లల మనస్సు, శరీరం కూడా అపరిపక్వ స్థితిలో వుంటాయి. అవి అలాగే వుంటే, ప్రకృతిచ్ఛ సంపూర్ణం కాదు. అంచేత తన ఇచ్ఛాపూర్తికి దోహద మివ్వగల స్వభావాల్ని అది కల్పిస్తుంది. పిల్లల్ని చూడండి: చిరుతిండికోసం ఎంత ఆరాటపడతారో! వాళ్ళ శరీరాభివృద్ధికి అది ప్రకృతిచేసిన కిటుకు. ఇక వాళ్లు వేసే ప్రశ్నలు వాళ్ళ మానసికాభివృద్ధికి ప్రకృతి కల్పించిన ఆలంబన.

మన పనులకో, మన మాటలకో అడ్డువస్తున్నారని పిల్లలు వేసే ప్రశ్న లన్నింటికీ మనం జవాబు చెప్పము. ముద్దు కొద్దీ ముందు రెండు, మూడింటికి మాత్రం జవాబు చెప్పి ఆ తర్వాత కసిరికొడతాము. నిజానికి ఇది చాలా తప్ప. "మాకు కూడుగుడ్డల్ని యిచ్చితీరా" లని తల్లిదండ్రుల్ని అడగడానికి పిల్లలకు ఎట్టి హక్కువున్నదో "మా ప్రశ్న లన్నింటికీ జవాబు చెప్పితీరా"లని పట్టుపట్టడానికి సయితం అట్టి హక్కు వున్నది. "ఏమిటి, ఈ చొప్పదంటు ప్రశ్న" లని మనం వాళ్ళను విదిలించి పారవేశామంటే, వాళ్ళ జన్మ హక్కును హరించా మన్న మాటే, అడిగినప్పుడల్లా పిల్లలకు చిరుతిండి పెడితే అజీర్ణం తప్పదు. కాని అడిగిన ప్రతి ప్రశ్నకు ప్రత్యుత్తర మివ్వడంవల్ల వారి మనస్సు వికసిస్తుందే తప్ప, మానసిక రుగ్మత ప్రవేశించదు. అయినా, మనం పిల్లల ఆహారం విషయంలో చూపినంత శ్రద్ధను వాళ్ళ ప్రశ్నల విషయంలో చూపించము. ఇది పూర్తిగా పొరపాటు.

పిల్లల ప్రశ్నలన్నింటికి మనం ప్రత్యుత్తర మివ్వలేకపోవడానికి మరొకకారణం

కూడా లేకపోలేదు. అమాయికంగా వాళ్లు వేసే కొన్ని ప్రశ్నలు పేగులు తెంచే విగా వుంటాయి. " దేవు డొచ్చి కొబ్బరికాయ తినిపోడేమి, అమ్మా?" అని నిలవేస్తే తల్లి ఏమి జవాబు చెప్పగలదు? "నాకే – మొన్నే – ఆమ్మోయ్! – కడుపుబ్బితే తమలపాకులు పెట్టి – మరే – పొట్ట కాచావ్. నువ్వు, మరి, కాచుకోవేమే, అమ్మా?" అని నెలలు నిండుతున్న తల్లిని నిగ్గదిస్తే జవా బేమిటి? "తాతా! నాన్న నన్ను కొట్టాడు. బూచాడి నొచ్చి నాన్న నెత్తుకుపో మ్మను! అంటావా, అనవా?" అని మారంచేస్తే, అది మనం నూరిపోసిన పిచ్చి భయాలతో మనలనే బెదిరించడం కాదా? "మన పక్కవాళ్ళకు బోలెండంత జాగా వుంది. ఇల్లు కట్టుకోవడానికి మనకు కాస్త ఎందు కివ్వరు, నాన్నా?" అనే ప్రశ్న మన సాంఘిక వ్యవస్థ పునాదిపైనే వ్యాఖ్యానం కాదా? "నా నేస్తం రామానికి – పాపం! – అన్నీ చిరుగు చొక్కాలే. నా దొకటి వాడి కిచ్చేస్తే ఎందుకమ్మా కోప్పడతారు? నాకు కొత్త చొక్కాలు పెట్టి నిండా లేవూ?" అని ముద్దు ముద్దుగా ఒకమాట ఊడవేస్తే, అది మన సంకుచితబుద్ధిపై గొడ్డలి పెట్టే కాదా? కాగితపు పడవచేసి నీళ్ళబిందెలో వేసి, "రండి! చందమామ ఈ రెడదాం. ఎక్కరేం భయమా?" అని పృచ్ఛచేస్తే, మధుర స్వాప్నిక జగత్తుకు మనం పరదేశీల మైపోయామన్న నింద దానిలో లేదా?

ఇట్టి పసితనపు ప్రశ్నలువేయడం పసితనంలోనే నిలిచిపోతే, మనకు పురో భివృద్ధి వుండేదే కాదు. అన్నింటికంటె ప్రాచీనగ్రంథం ఋగ్వేదాన్ని చూస్తే, "ఎర్రని ఆవు తెల్లని పాలను ఎలా యిస్తున్నది?" అని బాలోచిత విస్మయపూ ర్వక ప్రశ్న కనబడుతుంది. దానిలోనే మరొకచోట "పడమటికి క్రుంగజొచ్చిన సూర్యుడు జర్రునజారి భూమిపై పడిపోడేమో?" అని ఇంకొక ప్రశ్న వున్నది. "నదీనదాల స్వచ్ఛతరళోదకాలు సతతం వచ్చి పడుతున్నా సముద్రం పొంగిపొరల దేమి?" అనే ప్రశ్న కూడా దానిలోనిదే. ఈనాడు ఇట్టి ప్రశ్నలను "సిల్లీ" అని ఒక్కమాటలో మనం త్రోసిపారవెయ్యవచ్చు. కాని, ఆదిమానవునికి ఇట్టి సందేహాలే తోచివుండకపోతే, వీటిలో గర్భితమైవున్న జిజ్ఞాస అతడిలో ఉదయించివుం డకపోతే, నేటికీ మనకు ఆట వికస్థితి తప్పేదికాదు. మానవ సంస్కృతీచరిత్రను ఒకసారి సింహావలోకనం చేస్తే, ప్రశ్నోత్తరాలే దానికి పునాదులని తెలుస్తుంది. మన ఉపనిషత్తు లన్నీ గురుశిష్యుల మధ్య నడిచిన ప్రశ్నోత్తరాలే.గురువు సన్నిధిని కూర్చుని, ప్రశ్నలు వేసి, వాటికి పొందిన ప్రత్యుత్తరాల సంపుటీకరణాలు కనుకనే అసలు వాటికి ఉపనిషత్తులని పేరు వచ్చింది. ఉపనిషత్తులకు మూలాధారులైన

మన ప్రాచీనఋషులను పోలిన గ్రీక్ తత్త్వవేత్త సోక్రటీస్ కూడా పృచ్ఛకం గానే సృష్టిరహస్యాలను వెల్లడించడానికి ప్రయత్నించాడు. పదుగురున్నచోటుకు చేరి ప్రశ్నల వర్షాన్ని కురిపించడమే ఆయనకు ప్రధానవ్యాపకం. చివరికి ఇటీవలి మన బ్రహ్మంగారు కూడా సిద్ధయ్యగారి ప్రశ్నలను పురస్కరించుకుని వేదాంతబోధ చేసినవారే.

పెరిగి పెద్దవారమైనామని విర్రవీగే మనం వింత ప్రశ్నలని, విడ్డూరపు ప్రశ్నలని, వెర్రి మొర్రి ప్రశ్నలని, అడ్డుగోలు ప్రశ్నలని, చొప్పదంటు ప్రశ్నలని పెదవి విరిచేవే మన వేద వేదాంగాలకే కాక, ఆధునిక వైజ్ఞానిక శాస్త్రా లన్నింటికీ మూలమైనాయి. "చెట్టునుంచి రాలిన యాపుల్ నేల మీదికే ఎందుకు పడాలి? ఆకసంలోకి ఎందుకు ఎగిరిపోరాదు?" అని సర్ ఐజక్ న్యూటన్‌కు తోచిన కుంటి ప్రశ్నే గురుత్వాకర్షణ సిద్ధాంతానికి దారితీసింది. "కెటిల్ మూతను కుదిపివేయగలుగుతున్న ఆవిరికి యంత్రాలను కదిలించగల శక్తి లేదా?" అని జేమ్స్ వాట్‌కు పట్టిన ప్రశ్నే స్టీమ్ యింజన్‌కు కారణభూతమైంది. "యూరేనియం లవణాల సమీపంలో పెట్టిన ఫొటోగ్రాఫిక్ ప్లేట్లు ఎక్స్‌పోజ్ అయిపోతున్న వేమి?" అని ఒక ఫ్రెంచి శాస్త్రవేత్తను పీడించిన ప్రశ్నే మదాం క్యూరీ రేడియం కనిపెట్టడానికి తోడ్పడింది. సందేహం లేదు – ప్రశ్నే ప్రగతికి పంచప్రాణాలూ.

అయితే, నేను మాపిల్లవేసిన మూడో ప్రశ్నకు జవాబు చెప్పి, నాల్గోదానికి వీలు కలిగించలేదని ఇక్కడ వొప్పుకొనక తప్పదు. "ఎక్కడో ఒకచోట వున్నదిలే, పో!" అని గద్దించేసరికి, కూనిరాగం తీస్తూ వాళ్ళ అమ్మ వద్దకు వెళ్ళిపోయింది.

చెదరివున్న ఊహల్ని కూడగట్టుకుని, "దేని గురించి ఇప్పుడు వ్యాసాన్ని వ్రాయడమా?" అని ఆలోచన ప్రారంభించేసరికి మా పిల్లవాడు, కొత్తగా తీగమీద నడవడాన్ని నేర్చుకొంటున్నవాడివలె, చేతులుచాచి, నడ్డివంచి, బ్యాలెన్సు చేసుకోడానికి ప్రయత్నిస్తూ, పది అడుగులువేసి, ఠపీమని ముందుకుపడి, నవ్వుకుంటూ లేచి, "ఆ! ఆ! ఆ!" అని కేరుతూ, కాళ్ళచేతులమీద చకచక పాకుతూ చక్కా వచ్చాడు. "ఇక, ఈనాటికీ వ్యాసం నడిచినట్టే;" అని వాణ్ణి చూడగానే నేను ఆశ వదులుకొన్నాను. వచ్చీరావడం తోటే పైకెగబ్రాకి, నా చేతిలోని పెన్సిల్ వూడబెరుక్కున్నాడు. తర్వాత కాగితాలకోసం చెలగడం ప్రారంభించాడు.

"అబ్బబ్బ! అల్లరి పెడుతున్నాడు ! వీణ్ణి కాస్త అవతలికి తీసుకుపోరాదా"! అని మా ఆవిడను కేకవేశాను. కాని, పిల్లవాడు ఆగితేనా? చెలిగి, రక్కి, ఏడ్చి,

పీకి, పాకానపెట్టి తిరిగి నావద్దకే వస్తానంటాడు. కాస్త కాలురాగానే పిల్లలు చేసే అల్లరికి అంతు వుండదుగదా! ఉదయంపూట మరీనీ!! ప్రొద్దుక్రుంకగానే వాళ్లు నిద్రపోతారు. చీకూ చింతాలేనివాళ్ళు కావడంచేత కమ్మని నిద్రపడుతుంది. ఏ మధుర దృశ్యాలు -- కాదు, ఏ దివ్యలోకాలు -- కలలలో కనబడతాయేగాని, వెన్నెల వెలుగుల్ని మరిపిస్తూ చిరునవ్వులు నవ్వుతూ వుంటారు. మృత్యువును జీవనంవలె, చీకటిని వెలుగు చీల్చుకురావడం ప్రారంభించినంతనే నిద్ర లేస్తారు. బ్రతుకు వలె నిద్రకూడా భారమైన పెద్దవాళ్ళు పెందలాడే నిద్రనుంచి లేవలేకపోవచ్చు. కాని, పసివాళ్ళు మాత్రం ప్రకృతితోపాటు, పక్షులతోపాటు, మందానిలంతోపాటు మేల్కొంటారు. మేల్కొన్నంతనే కొత్తబలంతో, కొత్త ఉత్సాహంతో, కొత్త ఆనందంతో అల్లరిని ప్రారంభిస్తారు. ప్రతి వసంతంలో ప్రకృతిలో వెల్లివిరిసే నూతనత్వం ప్రతి ప్రత్యూషాన పసివాళ్ళలో కనబడుతుంది.

మా పిల్లవాడి అల్లరికి తట్టుకోలేక, "మరి నేను ఆఫీసుకు పోనా?" అని నేనన్నాను. నవ్వుతూ "తర్వగా తిరిగి వస్తారు గదా!" అని మా ఆవిడ అనింది.

ఇక్కడికి చేరిన తర్వాత కూడా "దేన్ని గురించి వ్రాయనా?" అనే సమస్య నాకు తెగనే లేదు.

# మంత్ర యుగం

సత్యకాలంలో అందరి పనీ మూడు పువ్వులు, ఆరు కాయలుగా వుండేది; ధర్మదేవత ఒంటికాలిపై నడుస్తునందున ఈ పాడు కలికాలంలోనే బ్రతుకింత భారమైపోతున్నది. ఈనాడు మన కిన్ని కడగండ్లు తెచ్చిపెడుతున్నందుకు ధర్మ దేవతను నిలవేసి, నాలుగు కాళ్లుండగా ఒక్కదాని పైనే ఎందుకు నడుస్తున్నావని నాలుగూ దులిపితే బావుండును. "మూడు కాళ్లు కట్టివేసుకుని, ఒక్కదానిపైనే నడుస్తాను – తమాషా చూడండి" అనడానికి ధర్మదేవత దొమ్మరిసాని కాదు గదా! పోనీ, తన కుల గోత్రాలను మరచి, సిగ్గు యెగ్గులను విడిచి, దొమ్మరాటకే దిగిం దనుకోండి. దానికైనా హద్దూ పద్దూ వుండాలా? త్రేతా యుగం ప్రవేశంలో డోలు కొట్టి, గడ కట్టింది. "మూడు కాళ్ళతోనే నడుస్తా - దేఖో మేరా తడాఖా!" అనింది. ద్వాపరం వచ్చేసరికి, రెండుకాళ్ళపైనే నడిచి చూపిస్తాన న్నది. ఆ యుగం గడిచిపోయినా, గడ దిగలేదు. సరిగదా, ఒంటి కాలిపై ఫీట్స్ ప్రారంభించింది. కోడి రామమూర్తి సర్కసునైనా రెండు రోజులు వరసగా చూస్తే, మూడో రోజుకు ముఖం మొత్తేది. రెండు యుగాలకు యుగాలే దొర్లి పోయినా, ఇంకా ఈ దొమ్మరి మొగ్గలనే చూస్తూ కూర్చోమంటే వొళ్లు భగ్గున మండుకురాదా? అందదు గాని, అందితే వెర్రి మొర్రి వేషాలు వేస్తువన్నందుకు

ధర్మదేవతకు వెయ్యి వాలికలు చేసి, ఉప్ప పాతరలో ఊరవేసినా పాపం వుండదు.

ఏమైనా గాని, ఘోరకలి వచ్చిపడిందనడం మాత్రం నిజం. ఘోరకలి కాబట్టే కలి గంజీకూడా కరువైపోయాయి. రెక్కాడినా డొక్కాడడం లేదు. చెమ టోడ్చడమే కనబడుతున్నది తప్ప, చింతా కంతైనా సుఖం కనబడ్డంలేదు. అయినా, వైజ్ఞానిక శాస్త్రాలలో ఏదో వెలగబెట్టినామని, ప్రకృతిని వశవర్తిని చేసుకున్నామని, "అన్నమో రామచంద్రా!" అని అఘోరించవలసిన కాలం పోయి సమృద్ధియుగం పాదం పెట్టిందని, ప్రపంచంలో ఇంకా దారిద్ర్య, దైన్యాలు మిగిలివుంటే, అందుకు మన ఆర్థిక, సాంఘిక, రాజకీయాది వ్యవస్థలలోని లోపాలే కారణమని పాశ్చాత్య లనుంచి నేర్చుకున్న చిలక పలుకులు పలుకుతున్న ప్రబుద్ధులు కొందరు మనలో వున్నారు.

యంత్రాలు వచ్చి బండచాకిరి తప్పించి వేశాయనేది ఈ పాశ్చాత్య మానస పుత్రులు చెప్పే యెంగిలిమాటే! ఒక్కయంత్రం పదిమంది పెట్టు కాగలదట. మళ్ళీ మాట్లాడితే, పది పదులు నూరుమంది పెట్టు కాగలదట; మనం మీట నొక్కితే మిగిలిన పని నంతటినీ చకచకా, బిరబిరా, ధణధణా తామే చేసి పారవేసే యంత్రాలు కూడా వున్నవట. అస లిది "యంత్రముగ" మట. ఈ మాటల్ని వింటుంటే "ఆరి మీ తెలివి తెల్లార!" అనబుద్ధి వేస్తుంది. యంత్రాల వల్ల పని కాస్తో కూస్తో తేలికగానే తెములుతుందనుకోండి. కాని, ఆ యంత్రాల తయ్యారీకి ఎంతగా రెక్కలు విరుచుకోవాలి! బొగ్గు వేసి, ఆయిల్ పోసి, వాటిని మేపడానికి ఎంత రొష్టుపడాలి! పైగా, అవి "నడిస్తే బండి, నిలిస్తే మొండి." ఒక్క సీల పోయినా మరి చిల్లిగవ్వకు కొరగావు. మనకు తిండి పెట్టడానికి ముందు మన ప్రాణాల్ని నిలువునా తోడివేస్తాయి. ఇదే ఈ యంత్రయుగం సౌభాగ్యం.

సత్యకాలంలో యంత్రాలూ, గింత్రాలు "జాన్తానై." కేవలం మంత్రాలతోను, తంత్రాలతోను ప్రతి పని అతి సులుసుత్తంగా, మహా సునాయాసంగా జరిగిపోయేది. ఇప్పటిది యంత్రయుగమౌనో, గాదోగాని, అప్పటిది నిస్సంశయంగా "మంత్ర యుగం". కోతు లేమి బిసాదేమి పంటలు చెరుపుతున్నాయని వాటిని చంపి వెయ్యాలంటే, ఈనాడు అందుకు నగదు బహుమానాలట! ఆ బహుమానాలు పొందడానికి వలలు, బోనులు, కత్తులు, కటారులు, తూటాలు, తుపాకులు - ఎంత హంగామా! అదే వెనకటికాలంలో భూసురులను పదిమందిని కూకవేసి, సర్పయాగానికి కూర్చుంటే బురదకొయ్యమొదలు కొండచిలువవరకు, కోడెత్రాచు మొదలు జెర్రిపోతువరకు, భూమండలంలోని సర్పాలన్నీ కుండాగ్నులలో వచ్చిపడి,

మలమల మాడిపోవలసిందే.

ప్రాణాలకు భయపడి పురందరుని కడకు "సుర గణాధిప నన్నున్ రక్షింపుమ, రక్షింపుమ, రక్షింపుమ యనుచున్" పరుగులెత్తినా, "సహేంద్రాయతక్ష కాయస్వాహా" అని మంత్రోచ్చారణ చేసేసరికి, ఇంద్రుడు గింద్రుడు సమేతంగా కదలి రావలసిందే!

సర్ప సత్రాలో, శత్రు సంహారాలో మాత్రమే కాకుండా, మంత్రబలంతో ఇతర కార్యాలూ, కరామత్తులూ కూడా జరిగేవి. అంపశయ్యపై వొరిగిన భీష్మాచార్యునికి అభిమంత్రించిన మూడు బాణాలతో గాండీవి తలగడ యేర్పాటు చేయగలిగాడు. ఆ ముసలాయనే మామూలు నీళ్ళు ముట్టననీ, భూజలం కావాలనీ మంకుపట్టు పట్టగా, సవ్యసాచి తేజోమయమైన మార్గణాన్ని పర్జన్య మంత్రాభిమంత్రితం చేసి. మహీతలంలోకి ప్రయోగం చేసేసరికి, "భాసురచ్ఛాయంబగు తోయంబు ధారా రుపంబున దివ్య గంధ రసోపేతంబయి" యెగిసింది. అర్జునుడు ప్రదర్శించిన ఈ మంత్రబలానికి "ప్రకంప గాఢ విస్మయులై" కూడా కౌరవులు అంతటితో యుద్ధాన్ని కట్టిపెట్టి సంధి బేరానికి దిగ లేదనుకోండి. కాని, "మంత్రాలకు చింతకాయలు రాలతాయా? అనే వెక్కిరింపుతో " వారు గుండెను నిబ్బర పరచుకోలేదు. "ఒక మంత్రానికి మరొక మంత్రం అడ్డు పడకపోతుందా!" అనే భరోసాతోనే వారు భండనాన్ని మానలేదు.

పెద్దమ్మవారు వచ్చి నెత్తిపై కూర్చున్న కౌరవులమాట కేమిగాని, అర్జునుని కున్న మహామంత్రశక్తి ఈనాడు మన మంత్రులలో ఏ వొక్కరికైనా వుంటే, దమ్మిడీ ఖర్చు లేకుండా, రవ్వంత శ్రమలేకుండా, డ్రిల్సు, గ్రిల్సుతో పని లేకుండా మనకు ఎన్ని "అర్టీజియన్" బావు లేర్పడేవి కావు, ఎంతగా అధికాహారోత్పత్తి జరిగేదికాదు? ఆ మాటకొస్తే, ఒక్క ద్రౌపది ఈనాడు మనకుంటే, గృహంబున తండులంబులు నిండుకున్నా, ఎందరు దూర్వాసులు, ఎన్ని పదివేలమంది శిష్యప్ర శిష్యులతో వచ్చినా షడ్రసోపేతంగా భోజనం పెట్టగల తాహతు మనకు వుండేది కాదా? వాక్యం ఊపులో పడి, "ఒక్క ద్రౌపది ఈనాడు మనకుంటే" అన్నానే కాని, ఇది పొరపాటు. ద్రౌపదుల కేమి కొరత? వారు కొల్లలుగానే వున్నారు. ఎటొచ్చి ఆ పంచపాండవ పత్ని శక్తియుక్తులే అపురూపమై పోయాయి.

గాంధి మహిమాన్వితుడని మనం గొప్ప చెప్పుకోవడమే గాని, మంత్రశక్తులు పూజ్యం. అందువల్లనే మూడవనేత్రం తెరిచి, బ్రిటిష్‌వారిని మలమల మాడ్చివె

య్యలేక, ముప్పై సంవత్సరాలు సతమతమయ్యాడు. అంతవరకు దేనికి? నూట ఇరవై సంవత్సరాలు బ్రతకా లనుకుని, ఆ సంకల్పమైనా నెరవేర్చుకోలేకపోయాడు. ఆయన తపశ్శక్తి వున్నవాడైతే, గోడ్సే కొన్ని యోజనాలలోకైనా రాగలిగేవాడా? ఒకవేళ వచ్చినా, అతడి చేతి పిస్తోలు ప్రేలేదా? ప్రేలితే, దాని గుళ్ళు మెడలో గుళ్ళపేరు అయ్యేవి కావా? అట్టిదే తపోమహిమ! ఆ మహిమ సంపాదించినవాడు కాబట్టే, ఆగస్త్యుడు సప్తసముద్రాలను ఔపాసనం పట్టగలిగాడు; విశ్వామిత్రుడు సృష్టికి ప్రతిసృష్టి చేయగలిగాడు. జపతపాలు చేసివుండక పోయినా, కేవలం పాతివ్రత్యమాహాత్మ్యం చేతనే సావిత్రి సత్యవంతుని బ్రతికించుకోగలిగింది; అనసూయ త్రిమూర్తులను చంటిపిల్లలను చేయగలిగింది; సమతి సూర్యోదయాన్ని ఆపగలిగింది. వెనకటి కాలమంటే మజాకా అనుకున్నారా!

వెనకటి కాలాన్నిగురించి ఈ విధంగా చెప్పకుపోతే, దానికి అంతూ పంతూ వుండదు. రేడియో ఇప్పుడు వెలిసింది గాని వాల్వులు, కండెన్సర్‌లు, స్పీకర్‌లు వగైరా బెడద లేవీ లేకుండా పురాతన కాలంలో ఆకాశవాణి పలుకుతుండేది. ఇదే విధంగా నేటి టెలివిజన్‌కు ప్రతిగా అప్పుడు దివ్యదృష్టి వుండేది.దానిద్వారా కేవలం జరుగుతున్నదేకాక, జరిగిపోయిందీ, జరగబోయేదీకూడా తెలిసేది. ఇప్పటి డకోటాలు, వైకింగ్‌లు, స్కైమాస్టర్లు, కాన్‌స్టలేషన్‌లు మొదలైన వాటికి ప్రతిగా అప్పుడు పుష్పకవిమానం వుండేది. అయితే, దాని "పేటెంట్"ను ఒక్క కుబేరుడే ఎందుకు భుక్తపరచుకున్నాడో తెలియదు. త్రిమూర్తులకు, వారి భార్యాబిడ్డలకు, దిక్పాలురకు ఎవరి వాహనాలు వారికి వుండనేవున్నవి. పైగా, తాము యావన్మంది ఖేచరశక్తి గలవారు. అంతగా అక్కరపడితే పుష్పకవిమానాన్ని అద్దె గిద్దె లేకుండా కుబేరుడు పంపనే పంపేవాడు. కాదు కూడదంటే రావణాసురుడు చేసినట్టు, నాలుగు తన్ని, దాన్ని కాస్తా ఊడబెరకుకోగల సత్తా తమకున్నది. ఇందువల్లనే "నీ నొష్ఠనే పొద్దు పొడిచిందటయ్యా! నీ కొక్కడికే పుష్పకవిమానం ఎందుకు వుండాలి?" అని ఎవ్వరూ పోటీకి వచ్చివుండరు.

ఏ దృష్టినుంచి చూచినా, వెనుకటిదే దివ్యమైన కాలం. ఇప్పటిది పిదప కాలం కాబట్టే, అన్నీ పిదపబుద్ధులు పడుతున్నాయి. పోగాలం కాకపోతే, క్రాపింగు లేమిటి చెప్పండి! గోష్పాదమంత జుట్టునైనా పిలకగా పెట్టుకొనకపోతే, వైతరణి నదిలోనుంచి వొడ్డుకు లాగడానికి విష్ణుదూతలకు ఉసు లుంటుందా? ముందడుగు వేస్తున్నామన్న భేషజమే ఇంతకీ మనలను చెరువుతున్నది. ఇప్పటికైనా మనం పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికలకై ప్రాకులాట మాని, విద్యాలయాలకు, వైద్యాలయాలకు

డబ్బు పారబోయ్యక, దేశాన్ని తపోవనాలతో నింపివెయ్యాలి; గుళ్లూ, గోపురాలూ కట్టించాలి, యాగాలు, యజ్ఞాలూ చెయ్యాలి; పూజలూ, పురస్కారాలూ జర పాలి. వర్ణాశ్రమ ధర్మాలను పునరుద్ధరించాలి; సనాతనధర్మాన్ని పునఃప్రతిష్ఠాపన చెయ్యాలి. కాకులు దూరని కారడవులకో, చీమలుదూరని చిట్టడవులకో వెళ్ళి, ముక్కు మూసుకోగలవారు మూసుకోగా, మిగిలినవారికి రామనామమనే మిఠాయి పంచిపెట్టాలి. ఒక్కమాటలో, మంత్రయుగాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి. అప్పుడు గాని ధర్మదేవత తన వెకిలిచేష్టలు మాని, తిరిగి నాలుగుకాళ్ళమీద నడవదు; అప్పుడుగాని తిరిగి రామరాజ్యం నెలకొనదు.

*

# కవిత, పాండితి

"చచ్చి చెడి, చాయంగల విన్నపాలు" అన్నంత పని జరిగినమీదట సంపాదించ గలిగిన క్రీడాభిరామం ప్రతిని చదువుతుండగా కృతిపతి వంశవర్ణన లోనే ఒకచోట కొంత తికమకపడ్డాను. ఈ వర్ణన వివరిస్తున్నట్టు క్రీడాభిరామకర్త వల్ల భరాయుడేనా? అయితే, "మనుజమాత్రుండే వల్లభామాత్యవరుడు" అని తనను గురించి తానే గొప్ప చెప్పకుంటాడా? తన వాగ్వైభవదాతృత్వాదివర్ణనకు కంద పద్యాష్టకాన్ని రచించుకొంటాడా? స్వాతిశయం కవికులంలో పెచ్చుగా కానవచ్చే జాడ్యమే అనుకోండి. స్వోత్కర్షను చేసుకొని కవులను వేళ్ళపై లెక్కించవచ్చు ననుకోండి. అయినా, "బస్తీమే సవాల్!" అన్నట్టు మరీ ఇంతగా రొమ్ము విరుస్తారా? ఇంతగా జుట్టు విరబోసుకొంటారా? ఇంతగా కట్లు తెంచుకొంటారా? పోనీ, కవి ఎంతకైనా చెల్లుననే అనుకొందాము. అయిన్నా, తానే తుమ్మి శతాయుస్సు అనుకొన్నట్టు, తనను తానే ఆశీర్వదించుకోడుగదా? కాని, క్రీడాభిరామం "కాల భైరవుడు, శంభుని పట్టి సమగ్ర వైభవాభ్యుదయపరంపరావిభవముల్" గృపసేయు గవీంద్రకాంక్షిత త్రిదశమహీరుహంబునకు దిప్పయ వల్లభరాయమంత్రికిన్" అనే పద్యంతో సమాప్తి చెందుతున్నది. ఈ అసంగతమే క్రీడాభిరామం వల్లభరాయని కృతి కాదని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు బల్లగుద్ది చెప్పడానికి మొదటి

కారణం. అయితే, వేటూరివారు శ్రీనాథునితరపున వకాల్తా పుచ్చుకొన్నారని, కవిసార్వభౌముని సహాయాన్ని క్రీడాభిరామకర్త ఏ కాస్తో కూస్తో పుచ్చుకొన్నా, కృతిమాత్రం వల్లభరాయ స్వకపోలకల్పితమని వాదించే పండితోద్దండులు వెక్కురున్నారు. ఏమైనా, కృతికర్త్రు ప్రశంసలోనే నన్ను కొంత తికమక పెట్టింది ఎన్నటికీ తెగని ఈ కర్త్రుత్వచర్చ కాదు

క్రీడాభిరామం పన్నెండవ పద్యంలో "పన్నగాళంకార పన్నీరజధ్యాన నన్నుతా త్ముండు పోచన్న శౌరి" అనేది మూడవపాదం. "పన్నగాలంకారుడు" అంటే పాములే అలంకారాలుగాగల శివుడని తెలుస్తూనే వున్నది. ఆ పిమ్మట "పన్నీరు" ప్రసక్తి ఎందుకు వచ్చిందనేదే నా ప్రాణానికి కొరకరానికొయ్య అయింది. "శబ్ద రత్నాకరము" శరణుజొచ్చగా "హిమాంబువు" అని ముక్తసరిగా ఒకముక్క చెప్పి ఆపైన పలకలేదు. పులకలేదు. చల్లదన మివ్వవలసిన పన్నీరు బుర్రకు ఇలా వేడియెక్కిస్తున్నదేమని మథనపడుతుండగా, చిన్ననాడు హైస్కూల్‌లో తెలుగుపాఠాలు చెప్పిన పండితు లొకరు చుట్టపుచూపుగా రావడం, "పత్ అంటే పాదాలు కావా?" అనడం తటస్థించింది. అప్పుడుగాని పన్నీరు ప్రసక్తి ఇక్కడసలు లేదని,

పత్ + నీర + జ పన్నీరజమని బోధపడింది కాదు.

మన ప్రబంధకవు లంటే ఇందుకే నాకు మొదటినుంచీ తలనొప్పి. యతిప్రాసలపైన, యమకాలపైన చూపించే మోజులో పాతికో, పరకో మాత్రమే నిక్కువమైన కవితమీద వీరు చూపిస్తారు. కొందరైతే యతిప్రాసలే, యమకాలే కవిత్వమని భ్రమపడతారు. శబ్దశ్లేషలు, అర్థశ్లేషలు, విభక్తిశ్లేషలకోసం శ్లేష్మంలో పడిన ఈగవలె తన్నుకులాడతారు. నాగబంధం, రథబంధం, చక్రబంధం, ఖడ్గబంధం, సౌధబంధం, కంకణబంధం, గోమూత్రబంధం మొదలైన వాటితో మనకు "ప్రాణబంధం" తెచ్చిపెడతారు. పద్యాన్ని చదువుతుంటే మేలుజాతి గుర్రం కదనుతొక్కినట్టుగా వుంటుంది. కాని, తీరా పసందు చెయ్యబోతే అది దాణాదండుగ కుంటి గుర్రమై చక్కా వూరుకుంటుంది. మచ్చుకు క్రీడాభిరామం కృతిపతి వంశ వర్ణనలోని ఒక పద్యాన్నే చూడండి. "అంభోజభూభామారత్న పయోధర ద్వయ తట ప్రాలంబ నైపథ్య ముక్తా మాణిక్య నిభాభిరూప్య పదవాక్య ప్రౌఢసాహిత్య విద్యా మాహాత్మ్యవిలాస సమ్మోదిత విద్వన్మానసుండు" – కొండవీటి చేంతాడుతో పోటీచేస్తున్న ఈ సమాసంతో ఒక పద్యం దాదాపుగా సరిపెట్టబడింది. దీన్ని ఈకకు ఈక, తోకకు తోక లాగిచూస్తే తేలింది అతగా డెవడో మహా మంచి మాటకారి అని మాత్రం. ఈ భాగ్యానికి ఇంతగా మన ప్రాణం తియ్యడం

దేనికి? మనకు కావలసినవి మాటల మూటలే అయితే, అమరకోశాలు లేవా, ఆంధ్రనామసంగ్రహాలు లేవా? కవిని నేను కోరేది తన సమాసాల వడగళ్ళతో నా తలను బొప్పికట్టించమని కాదు; నా గుండెను కదిలించమనీ, నన్ను కరిగించమనీ. కవిత ధ్వని ప్రధానమైందని పెద్ద లనడం నే నెరుగుదును. అయితే, వారు "ధ్వని" అన్నప్పుడు "స్ఫురణ" నే (సజెషన్) ఉద్దేశించారు కాని, పదాడంబరాన్ని కాదు, సమాసార్భటులనూ గాదు. తిక్కనామాత్యుని భారతంలో "దుర్వారో ద్యమ బాహువిక్రమ రసాస్తోక ప్రతాపస్ఫురద్గర్వాంధప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్" అని తన అయిదుగురు భర్తల ప్రతాపాన్ని గురించి చెప్పి, ద్రౌపది కీచకుని బెదిరిస్తుంది. ఇక్కడ ఈ సమాసంలో ఎంతో ధ్వని వున్నదని కొందరు మెచ్చుకుంటారు. పిడుగుల పిండును పోలిన ఈ సమాసార్భటికి ద్రౌపదిపట్ల ఏ పాపచింతా లేని నా గుండే అవసిపోతున్నది. ఇక, కీచకుడు హడలి పోవడం అబ్బురమా? ఏమైనా "పదాలపై నా అధికారం చూడు!" అనేది నామట్టుకు నాకు కవిత్వం కాదు; "నీ గుండెపై నా రాజ్యాన్ని చూడు" అని చెప్పగలిగిందే కవిత్వం.

కవిత మహాసున్నితమైన ప్రాణి. దానిపై పాండిత్యం బరువు పడితే, అది అప్పచ్చిలా నేలకు అంటుకుపోతుంది. ఇందువల్లనే కావచ్చు. పాండితిని పెద్దపులిని చూచినట్టు చూచే జానపద గేయకర్తల అల్లి బిల్లి పదాలలోనే నాకు ఎక్కువ కవిత్వం కనబడుతుంది. "నితాంతదంతపీడనరట దాస్యరంగవికటభ్రుకుటీచటుల ప్రవృత్త నర్తన ఘటనాప్రకారభయదస్ఫురణాపరిణద్ధమూర్తియై" అని తిక్కన ఎంత సందర్భోచితంగా సమాసాన్ని విసిరాడో చూడండని, దీనిలో ఎంత కవిత్వం వుట్టిపడుతున్నదో గమనించండని పెద్ద లెవరైనా చెబితే, వారి పెద్దరికాన్ని కాద నలేక నేను తలవూచవచ్చుగాని, భీమసేనుని ఆవహించిన కోపాగ్నికి వెయ్యిరెట్లు తీవ్రతగల తుపాను కింగ్ లీర్ మనస్సులో చెలరేగడాన్ని షేక్స్‌పియర్ "బ్లో, విండ్స్ అండ్ క్రాక్ యువర్ చిక్స్ ! రేజ్, బ్లో!" మొదలైన పొడి మాటలతో వర్ణించ లేదా అని చప్పన జ్ఞాపకం వస్తుంది. తిక్కనార్యుడైనా "కడు బసిబిడ్డ, వీ డొకటి గా దవు నా నెఱుగండు, ముంద రెయ్యెడ" నొక పా లెఱుంగ , డెద యెంతయు గోమల, మెప్పుడైన నే గుడువగ బిల్తుగాని తనకుంగల యాకటి ప్రొద్దెఱుంగడు" అని కుంతీదేవి సహదేవుని ద్రౌపదికి "నిల్లడ వెట్టిన" సన్నివేశాన్ని ఇట్టి పొడి మాటల తోనే వర్ణించి గుండెను కరిగించలేదా అని కూడా జ్ఞప్తికి వస్తుంది.

ప్రబంధాలలో అక్క డొక పంక్తిలోను, ఇక్క డొక పద్యంలోను వెల్లుబికే కవిత్యం నాకు జానపద గేయాలలోని ప్రత్యక్షరంలోను దివ్యదర్శన మిస్తుంది. ఒక మహాప్రబంధం నా కొక యెత్తు కాగా—

ఏరుకొచ్చింది ఏరువాకమ్మ
ఏళ్లు నదులూ పొంగి వెంబడేవచ్చాయి
నల్లమేఘాలలో నాట్యమాడింది
కొండ గట్టులమీద కులుకులాడింది
ఇసుకనదిలో దూరి బుసలుకొట్టింది
పాడుతూ కోయిలా పరువులెత్తింది
ఆడుతూ నెమలీ అలసిపోయింది
నవ్వుతూ మా అయ్య బువ్వ తిన్నాడు
ఏరువా కొచ్చింది ఏరువాకమ్మ
ఏళ్లు నదులూ పొంగి వెంబడేవచ్చాయి.

-అనే చిన్న పాట ఒక్కటీ ఒక యెత్తు.

పెద్దనామాత్యుని మనుచరిత్ర తాళపత్ర గ్రంథ రూపంలో వుండగా చెద పట్టిపోయి మనకు దక్కకుండాపోయినా నేను శోకించి వుండేవాడినికాను గాని, తొలకరికి పడుచుపిల్ల.—

తొలకరి ఒక మబ్బు తొంగిచూచింది
మబ్బులో ఒక మెరపు మెరసిపోయింది
పెరటిలో ఒక జల్లు కురిసి వెలిసింది
ఏ కొమ్మమీదనో ఎండతాకిన పిట్ట
ఏటి త్రోవలు పట్టి ఎగిరిపోయింది
ఏరువాక నాటి కేడాది దాటింది
ఎదురుచూచి గుండె చెదరిపోయింది
పిట్టా పిట్టా ముద్దు పెట్టుకొన్నాయి
గోవులన్నీ యిల్లు జేరుకున్నాయి
ఏటిగాలికి చిలుక లెగిరిపోయాయి
ఎందుకో నా ఆశ లిగిరిపోయాయి.

అని బావను తలచుకొని పాడుకునే పాట కాలగర్భంలో కలిసిపోతే మాత్రం

ఎంతో విచారపడేవాడిని.

పోనీ, నా మాట కేమి లెండి! మీ మాటే చెప్పండి. విరహిణి వరూథిని–

ఓ చెల్ల ! విరహిణీవధ
మే చతురత నీకు? దురితమే చేయు పనుల్
రాచరికపు ఫలమే య
య్యో చంద్ర? వివేక మెఱుగవొకొ గురు సేవన్.

అని చేసిన చంద్రనిందలో ఎక్కువ కవిత్వం వున్నదంటారా? లేక, అజ్ఞాత జానపద మహాకవి సృష్టించిన ముగ్ధ–

నవ్వుతూ మాటాడి
కవ్వించిపోయాడు–చందమామోయి
నవ్వులోనే మనసు
నను విడిచిపోయింది–చందమామోయి.

అని చంద్రునికి పెట్టుకున్న మొరలో ఎక్కువ కవిత్వం వున్నదంటారా?

పండితకవులను నిరసిస్తున్నావని, డొక్క శుద్ధిలేనివాడవని కొందరు నన్ను నిందించినా మా బాగేగాని, జోలపాటలలోను, రోకటి పాటలలోను, ఇతర జానపద గేయాలలోను కనబడే కవిత్వంలో నూరో వంతైనా ప్రబంధాలలో నాకు పొడగట్టదు. కవితా పాండిత్యాలలో కలకాలానికీ కవితకే నా వోటు.

*

# గడ్డాల సొగసులు

ఒక్క గంటలో ముగ్గురో, నలుగురో వరుసగా అడిగారు; "సుస్తీగా వున్నదా?" అని . సుస్తీ లేదు, పాడూ లేదు. ముక్కున పడిసెమైనా లేదు. తత్ప్రతః ఆరోగ్యం అంతంత మాత్రమే అనుకోండి. తరచు మంచం పట్టడం కూడా కద్దు. కాని, ఇవ్వాళ మాత్రం ఏ రోగం, రొష్టూ లేకుండా పీటకోడు చెక్కలానే వున్నాను. అయినా, "సుస్తీ చేసిందా?" అని ఇందరు అడగడానికి కారణం లేకపోలేదు. గడ్డం బాగా మాసింది. చెక్కిళ్లను నిమురుకుంటే కంబళిపై చెయ్యి వేసినట్టుగా వున్నది. నాలుగురోజులు గడ్డాన్ని మాయనిస్తే వారం రోజులు ఖాయలాపడి లేచినవారిలా చాలామంది కనబడతారు. ఈ చాలామందిలో నే నొకణ్ణి.

నిజమే, గడ్డం మాస్తే అసలు బ్రతుకే మాసినట్టుగా వుంటుంది; రోగిష్టి కళ ఏర్పడుతుంది. కాని, "సుస్తీ చేసిందా? " అనే పరామర్శలకు తట్టుకుని, "తిరుపతి మొక్కుబడి వున్నదా?" అనే ప్రశ్నలకు విసువు చెందకుండా, "ఆవిడకు నెల తప్పిందా?" అనే పరిహాసాలను చెవిని పెట్టక, గడ్డాన్ని పూర్తిగా పెరగనిస్తే పెద్దరికం వస్తుందనే నా నమ్మకం. గడ్డానికీ, గొప్పతనానికీ ఏదో సంబంధం వున్నట్టే తోస్తుంది. గడ్డం పెంచిన వారందరు గొప్పవారు కారనుకోండి. కాని, గొప్పవారిలో చాలామంది గడ్డాలు పెంచినవారే? మన మహర్షులలో జనశ్రుతి

ప్రకారం గడ్డం లేనివాడు ఒక్క నారదుడే. ఆయన నిత్యయౌవనుడు. బ్రహ్మకల్పంవరకు "అడ్డాలవాడు"గానే వుండేవాడు కనుక, ఆయన గడ్డాలవాడు కాడు; కానేరడు. మహర్షులను విడిచి మహాత్ములను చూడబోతే వారిలోనూ గడ్డంలేనిది గౌతమబుద్ధుడు, గాంధి మహాత్ముడు మాత్రమేనేమో! మన మహాకవులలో వాల్మీకి, వేదవ్యాసులు ముందు ఋషులు, తర్వాతే కవులు. అందువల్ల వారు గడ్డాల వారేనని ఢంకా బజాయించి మరీ చెప్పవచ్చు. తక్కిన వారి విషయమే అనుమానం. అశ్వఘోషుడు బౌద్ధుడు. ఆయనకు గడ్డం వుండడాలకి వీలే లేదు. నిత్యయౌవనానికి సంబంధించినంత వరకు నారదుని మరిపించగని కాళిదాసమహాకవి దివ్యమంగళమూర్తికి చూస్తూ చూస్తూ గడ్డాన్ని తగింలించలేము. భాస, భవభూతి, సోమిల్లకాదులను కూడా గడ్డలతో పూహించడం కష్టమే. మన నన్నయ్య, తిక్కన, పోతన, పెద్దన మొదలగు వారు వైదికకర్మ నిష్ఠాగరిష్ఠులు కాబట్టి, వారికి గడ్డాలుండేవి కావనే అనుకోవాలి. వాల్మీకి, వేదవ్యాసుల తర్వాత మనదేశంలో గడ్డం పెంచిన మహాకవి ఒక్క రవీంద్రనాథ్ టాగోరే కావచ్చు. కాని, విదేశాలకు చెందిన గొప్ప కవులలో పెచ్చుమంది గడ్డాలవారే. ముఖ్యంగా గ్రీక్, రోమన్, ఫ్రెంచి, ఇంగ్లీషు, శ్పానిష్, రష్యన్, చైనీస్ కవులు. సందేహం లేదు – ప్రపంచ మహాపురుషులందరినీ లెక్క పెడితే వారిలో గడ్డాలవారిదే మెజారిటీ.

గడ్డాల వారందరు గొప్పవారు కాకపోయినా, గొప్పవారిలో పెచ్చుమంది గడ్డాలవారు కాబట్టి, వారి ఘనతను పంచుకోడానికి గడ్డాన్ని పెంచుకుందామని అప్పుడప్పుడు నాకు అనిపిస్తూ వుంటుంది. కానీ, గుండె నిబ్బరం చాలదు. తీరా గడ్డాన్ని పెంచితే, అది ఏ రకమైంది కాబోతుందో అని కొంత బెరుకు కూడా పుడుతుంది. పిల్లి గడ్డం, పీచుగడ్డం, మేకగడ్డం, దుబ్బుగడ్డం, బవిరిగడ్డం, నల్ల గడ్డం, రాగిగడ్డం, తెల్లగడ్డం, పొట్టిగడ్డం, పొడుగుగడ్డం – ఈ పరిమాణ, వర్ణాకృతి విశేషాలను బట్టి ఎన్నో రకాలున్నాయి. వీటిలో మొదటి రెండూ చెడ్డ వికారంగా వుంటాయి. మేకగడ్డం కొన్ని ముఖాలకు – ముఖ్యంగా కోలముఖలకు – అందంగానే వుంటుంది. దుబ్బుగడ్డం, బవిరిగడ్డం మొత్తంపై కొట్టవచ్చినట్టుగా వుంటాయి. తక్కినవాటిని గురించి ఖచ్చితంగా ఏమీ చెప్పలేము. ఏమైనా, గడ్డం అందచందాలు దాన్ని పెంచేవారి ముఖకవళికలపైనే, వారి గుణగణాలపైన ఎక్కువగా ఆధారపడి వుంటాయి. ముఖంలో తీరు, నడతలో ఠీవి లేకపోతే, గడ్డం అతికించినట్టుగా నైనా వుంటుంది. అంద వికారంగానైనా వుంటుంది.

కన్‌ఫ్యూషియన్ గడ్డాన్ని చూడండి. అది అంత పెద్దదీ కాక, బొత్తిగా

చిన్నది కాక, ఆయన బోధించిన మధ్యమ మార్గాన్ని ("గోల్డెన్ మీన్") అను సరించి వుంటుంది. ఇంగ్లీషు కవిత్వానికి మొలకవేసినవాడు కాబట్టే కావచ్చు, ఛాసర్ గడ్డం మొలిచీ మొలవనట్టు వుంటుంది. మహాశిల్పి, స్థపతి, చిత్రకా రుడు మాత్రమే కాక, రోలింగ్ మిల్లు, రోలర్ బేరింగులు, పైల్ డ్రయివర్, స్టీమ్ యింజన్ మొదలైన వాటిని గురించి శతాబ్దాలనాడే పరిశోధనలు జరిపిన బహుముఖ ప్రజ్ఞానిధి కాబట్టే కావచ్చు, లియొనార్డో డావించే గడ్డంలో భావ శబలత కనబడుతుంది. తరచిన కొద్దీ ఆయన నాటకాలలో కనబడ్డట్టే, చూచి నకొద్దీ షేక్స్‌పియర్ గడ్డంలో సొగసులు కనబడతాయి. మంత్రాంగంలో మేటిగా చెల్లిన కార్డినల్ రిచ్లూ బుద్ధినిశితత్వం ఆయన గడ్డంగొసగుండా తొంగిచూస్తూ వుంటుంది. సృష్టిక్రమాన్ని గురించి మహావిప్లవకరమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదిం చినవాడైనా నలుగురిలో నిలవడానికే బిడియపడేవాడు కనుక చార్లెస్ డార్విన్ గడ్డం ముఖాన్ని కమ్మివేయడానికే ఉద్దేశించబడినట్టు వుంటుంది. కార్ల్ మార్క్స్ గడ్డం ఆయనవలె "తిరగబడండి" అని రంకెవేస్తున్నట్టు వుంటుంది. అబ్రహం లింకన్ గడ్డం దున్నిన చేనువలెవుండే ఆయన ముఖానికీ. ఆడంబర మెరుగని ఆయన ప్రవృత్తికీ తగినట్టుగా వుంటుంది. టాల్‌స్టాయ్‌గడ్డం ఆయన తలపులవలె ఎంతో ఏపుగలది. కొంతవరకు టాల్‌స్టాయ్‌గడ్డాన్ని పోలిందే బెర్నార్డ్ షా గడ్డం. లెనిన్ కంటిలోని తళుకుతో ఆయన గడ్డంబెళుకు పోటీపడుతున్నట్టుగా వుంటుంది. ట్రాట్‌స్కీది మేకగడ్డం. మేకదాట్లు వేయగల ఆయన చిత్తవృత్తికి అది తగినదే. మన అరవింద యోగిది కూడా మేకగడ్డం. నా కంటికి అది అతికించినదానిలానే కనబడుతుంది.

గడ్డాల సొగసుకు మార్క్ ట్వయిన్ అంటే నేను ఫస్టుమార్క్ టాగోర్‌కే యిస్తాను. ఏ వయస్సుకు తగు గడ్డాన్ని ఆ వయస్సులో ఆయన పెంచాడు. ఎప్పటికప్పుడు అది ఆయనకు సొగసు నిచ్చింది, తీవి నిచ్చింది. బెర్నార్డ్ షా అంతటివాడు టాగోర్ గడ్డాన్ని చూచి రవ్వంత అసూయపడ్డాడు. అంతటి చక్కని గడ్డాన్ని చూచిఉండలే దన్నాడు. నీలాలవలె నిగనిగ లాడుతూ పట్టుకుచ్చులా ఉన్న ఆయన గడ్డాన్ని (ఇది రవీంద్రుడు వయస్సులో వున్నప్పటిమాట అయివుండాలి) నిమిరిచూడాలని తనకు బుద్ధి పుట్టినట్టు చెప్పాడు. గడ్డాలవిషయమై షా "అథారిటీ". గడ్డంవుంటే విష వాయు ప్రమాదాన్ని నివారించే కవచాన్ని ముఖానికి తగిలించు కోవడం కష్టమని యుద్ధసమయంలో ఆయన కొకరు సలహా చెప్పగా, విషవాయువులకు చావనైనా చస్తానుగాని, గడ్డాన్ని మాత్రం గొరిగించ నన్నాడు. మొన్న కాలువిరగగొట్టుకు

న్నప్పుడు ఆపరేషన్ సందర్భంలో గడ్డం వుండగా మత్తు మందు పుచ్చుకోవడం కష్టమంటే, అయితే ఆపరేషన్ వద్దు పొమ్మన్నాడు. తొంభై దాటినా ఇప్పటికీ ప్రతి రోజూ పక్కా అరగంట అద్దం ముందు నిలబడి, మీసాలను గడ్డాలను చివరికి కనుబొమలనుకూడా దువ్వుతాడు. ఆసుపత్రిలో వుండగా నలిగిపోయిందని ఇంటికి చేరగానే మీసాల, గడ్డాల పోషణను ఆయన తిరిగి ప్రారంభించే వుండాలి.

గడ్డం తత్త్వం తెలియకనే అనుకుంటాను, మననాటకాలలోను, సినిమాలలోను మహర్షులందరికీ బవిరిగడ్డాలనే తగిలిస్తారు. ఇది శుద్ధ తప్పు. బవిరిగడ్డం వశిష్ఠ బృహస్పతులకే తగు. సృష్టికి ప్రతిసృష్టి చేయడానికి ప్రయత్నించిన లేనిన్‌కు తాతగానో, ముత్తాతగానో యెన్నదగువాడు కనుక విశ్వామిత్రునికి లెనిన్ గడ్డాన్ని పోలిన దాన్ని పెట్టాలి. దూర్వాసుడికి పెట్టే గడ్డం కణకణ మండే చింతనిప్పులవలె ఎర్రనిదే వుండాలి. అగస్త్యునిది జంఘిస్ఖాన్ గడ్డం వంటిది కావాలి. పిచ్చు కలు గూళ్లు పెట్టుకోడానికి పనికిరాగల గడ్డమే వేదవ్యాసునికి తగు. వాల్మీకికి తగుపడేది టాగోర్ గడ్డం.

ఇతరులకు ఏయే గడ్డం తగునో తేలికగానే చెప్పివేస్తున్నా, నాకు తగు గడ్డాన్ని గురించి మాత్రం నాకు అన్నీ సందేహాలే. ఇంతకీ గడ్డాన్ని పెంచాలంటే కొంత సాహసమే కాక, దానిపట్ల ప్రేమ వాత్సల్యాలు కావాలి, భక్తి శ్రద్ధలు కావాలి, పసిపాపను మించి దాని పోషణ చెయ్యాలి; ప్రేయసిని మించి దాన్ని ప్రేమించాలి. గురువును మించి గౌరవించాలి. పదహారవ శతాబ్దపు బ్రిటీష్ తత్త్వవేత్త, రాజనీతి విదురుడు సర్ థామస్ మోర్‌పై రాజద్రోహ నేరాన్ని మోపి, శిరశ్ఛేదానికి వధ్య స్థలానికి తీసుకువెళ్ళగా, "నా గడ్డం ఏమి పాపాన్ని చేసిందయ్యా! దాన్ని తొల గించే వరకు కాస్త నిదానించండి" అని ఆయన అన్నాడట. గడ్డం విషయమై ఇంతటి భక్త్యభిమానాలు లేనందునే "సుస్తీ చేసిందా?" అని వరసగా ముగ్గురో, నలుగురో నన్నడిగే సరికి నా సేఫ్టీ రేజర్‌కు పని చెప్పాను.

*

# ఒక నిట్టూర్పు

హేమిష్ హ్యామిల్టన్ కంపెనీ లండన్ నుంచి పంపిన పుస్తకాల కేటలాగ్ ప్రొద్దున పోస్టులో వచ్చింది. దాన్ని కాసేపు తిరిగవేసి, ఒక నిట్టూర్పుతో అవతల పెట్టాను.

ఒక్కొక్కరు ఒక్కొక్క కారణానికి నిట్టూరుస్తారు. ఒక్కరే వేర్వేరు సమయాలలో వేర్వేరు కారణాలకు నిట్టూరుస్తారు. ఏవైనా కష్టాలు చుట్టుకుంటే నిట్టూర్పు; వాటినుంచి బయటపడితే నిట్టూర్పు. ఏదైనా బాధకలిగితే నిట్టూర్పు; అది ఉపశమిస్తే నిట్టూర్పు. ఏ ప్రమాదమైనా కలుగుతుందని భయం తోస్తే నిట్టూర్పు; ఆ భయం నిరాధారమైందని తేలిపోతే నిట్టూర్పు. మొత్తంమీద గుండె బరువుకు, నిట్టూర్పుకు చాల లంకె వున్నదని చెప్పాలి. గుండె బరువెక్కినా, ఆ బరువు తగ్గినా, రెండింటికీ ఒక్కటే సిగ్నల్. అది -- నిట్టూర్పు. కాని, 'ఎయిర్ రెయిడ్ వార్నింగ్"కు, "ఆల్-క్లియర్ సిగ్నల్"కు వున్నట్టు శ్రుతిభేదం కొంత వుంటుంది.

నిట్టూర్పుకు కారణాలు నానావిధాలైనా మన కవులు, ముఖ్యంగా ప్రబంధ కవులు, దానికి తరచు విరహవేదనతోనే లంకె పెడతారు. విరహావస్థలో పడిన

వారికి హారం భార మౌతుందట, ఆహారం కార మౌతుందట, మందమారుతం మహాతాపాన్ని కలిగిస్తుందట, పండు వెన్నెల కేవలం నిప్పుల్ని చెరుగుతుందట. ఈ ఘోరతాపోద్వేగాన్ని భరించలేక మూర్ఛిల్లిపోతారట. అప్పుడు తామరతూండ్లతోను, ఎర్ర కలువలతోను, పన్నీటితోను, పచ్చకర్పూరం కలిపిన పల్చని గంధంతోను శైత్యోపచారాలు చెయ్యాలట. మూర్ఛ మునిగే విరహులు ఆ ఘట్టానికి పూర్వోత్తర భాగాలలో ఏకధాటిగా నిట్టూరుస్తారట.

ఏకధాటిగా కాకపోయినా, నిగుడ్చిన ఒక్క నిట్టూర్పును నేను వెడ్డగానే నిగుడ్చాను. అయితే, విరహవేదనతో నా నిట్టూర్పుకు ఎంతమాత్రం సంబంధం లేదు. సుమండీ! నాకు కలిగింది వేరొక వేదన. దాన్ని ఒక వేదనగా చాలామంది అసలు అంగీకరించకపోవచ్చు. హీనపక్షం ఒక చిక్కుగానైనా అది వారి అంగీకృతిని పొందకపోవచ్చు. రేషన్ బియ్యం దొరక్కపోవడం, రేసులలో డబ్బు పోగొట్టుకోవడం, అప్పులు మోపుకావడం, అద్దెకు కొంప దొరక్కపోవడం, సినిమా టిక్కెట్టు అందకపోవడం, సేఫ్టీ రేజర్ బ్లేడు కరువుకావడం మొదలైనవాటిని తప్ప, మరొక దాన్ని చిక్కుగా ఈనాడు బహుళజనులు భావించకపోవచ్చు. అందుకే నా నిట్టూర్పు కారణాన్ని బయటపెట్టడానికి తటపటాయిస్తున్నాను.

ప్రొద్దుటి పోష్టు నాకు తెచ్చిన కేటలాగ్ మొదటి పేజీలో "వరల్డ్" అనే పేరుతో స్టీఫెన్ స్పెండర్ కొత్తగా వ్రాసి ప్రచురించిన ఆత్మకథకు సంబంధించిన భోగట్టా వున్నది. ఆత్మకథ సాధారణంగా ఆత్మీయుల కథలతో – పిత్ర, పితామహ, ప్రపితామహ కథలతో – ప్రారంభ మౌతుంది. ఎలాగో ఈ వంశవృక్ష మహారణ్యాలను ఛేదించుకుని బయట పడేసరికి, కృతికర్త జనన, శైశవ, కౌమార, యౌవనాది వివిధావస్థల మహాయెడారులలో చిక్కుకుని తిరిగి దారి తప్పుతాము. వ్యక్తిత్వం వచ్చిన తర్వాత ప్రయోజనకులైన పిమ్మట ఎవ రేమి చేశా రనేదే ఆత్మకథలను చదవడంలో మనం ఎక్కువగా తెలుసుకొనగోరేది. అయినా, ఆ ఘట్టానికి రాకముందే పుస్తకంలో దాదాపు సగమైనా సరిపెట్టబడుతుంది. అప్పటికే విసుగుపుడితే మిగతా సగాన్ని మనం చదివేదే లేదు. ఆత్మకథ వ్రాస్తున్న వ్యక్తి మహాపురుషు డైతే, ఈ ప్రమాదం రాదనుకోండి. కీర్తికెక్కిన నాటినుంచీ అట్టి వ్యక్తి జీవితం మనకు తెలిసేవుంటుంది. అందువల్ల ఆయన విషయంలో ప్రఖ్యాతికి రాకపూర్వపు విశేషాలనే మనం తెలుసుకోగోరతాము. ఈ విషయాన్ని గుర్తించే కావచ్చు, గాంధీజీ తన ఆత్మకథను 1921తో ఆపివేశాడు. ఆ తర్వాత తన జీవితంలో కైక వేద్యం కనుక, తాను ప్రత్యేకించి వ్రాయవలసిందిలే దన్నాడు.

కాని ఆత్మకథలను వ్రాసేవా రందరు మహాపురుషులు కారు. అట్టివారి పుట్టు పూర్వాలను గురించి మనం శ్రద్ధ తీసుకోడానికి ముందు వారిని గురించి మనకు శ్రద్ధయేర్పడాలి. స్టీఫెన్ స్పెండర్ ఈ కిటుకు గ్రహించి, తన జీవితగాథను కొన నుంచి మొనకు వ్రాశాడుట. ఆయన మరొక క్రొత్త పోకడకూడా పోయాడట. ఆత్మకథలలలోని జననం, శైశవం, విద్యాభ్యాసం, వివాహాది ప్రకరణ విభాగానికి స్వస్తిచెప్పి, స్నేహం, ప్రేమ, కవిత, రాజకీయాలు, నానాదేశ సదర్శనం మొదలైన శీర్షికలకింద తన జీవితచరిత్రను వివరించాడట. ఇంతగా కొత్త ఫక్కీలో నడవడమేకాక, ఈ ఆత్మకథలో వర్జినియా వుల్ఫ్, టి. యస్. ఇలియట్, లేడీ మోరెల్, డబ్లియు. హెచ్. ఆడెన్, క్రిస్టఫర్ ఐషర్‌వుడ్ మొదలైన సుప్రసిద్ధ ఆధునిక రచయితల "మూర్తికల్పనలు" కలవట. ఈ పుస్తకాన్ని కొని చదవడం ఎప్పుడెప్పుడా అని మనస్సు రెపరెప లాడింది.

మహోత్సుకతతో కూడిన ఈ మనస్సులో కేటలాగ్ మొదటి పేజీని తిప్పివేసి రెండవదాన్ని చూచాను. దానిలో ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్‌నుగురించి జాన్ గంథర్ వ్రాసిన పుస్తకం ప్రశంస కానవచ్చింది. గంథర్ పుస్తకాల ప్రాశస్త్యాన్ని కొత్తగా నాకు వివరించక్కరలేదు. ఆయన "ఇన్‌సైడ్" పుస్తకా లన్నీ నేను చదివినవే. సూక్ష్మంలో మోక్షాన్ని చూపించడంలో, మోక్షాన్ని సూక్ష్మంలో యిమడ్చడంలో ఆయనకు ఆయనే సాటి. అందువల్లనే యూరప్, ఆసియా, లాటిన్ అమెరికా, యునైటెడ్ స్టేట్సులను పోలిన మహాఖండాల అసంఖ్యాక సమస్యలను అయిదారేసి వందల పేజీలలోకి కుదించగలిగాడు. పైగా, ఆయన జనాభా లెక్కలలో కవిత్వం చూపిస్తాడు; ఎగుమతి, దిగుమతుల మదింపులలో సంగీతం పలికిస్తాడు; పన్నుల, సుంకాల గుణకారాలలో రస మొలికిస్తాడు. దేశనాయకులను గురించి సమ్మోహనంగా వ్రాస్తూ, దేశసమస్యలను విప్పిచెప్పడాన్ని ఒక కళగా తీర్చిదిద్దాడు. ఆయన ఒక ఖండాన్ని గురించి వ్రాసిన పుస్తకాన్ని చదవడం, ఆ ఖండంలో ఏడాదో, రెండేళ్ళో పర్యటన చేసివచ్చిన దానితో సమానం.

పైగా, ఈసారి గంథర్ వ్రాసింది ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్‌ను గురించి. ఈ యుగం మహాపురుషులలో ఫ్రాన్క్లిన్ డెలానో రూజ్‌వెల్ట్ తప్పక గణనకు వస్తాడనడం విర్వివాదం. పుట్టుకతోనే కాకపోయినా, పసితనంలోనే రూజ్‌వెల్ట్ అవిటివాడై పోయాడు. ఆయనకు వచ్చిన బాలారిష్టం షక్షవాతం.విధి చూచిన ఈ క్రూరపుచూపు తర్వాత సామాన్యుడైతే సోదెలోకైనా రాకుండాపోయేవాడే. అసామాన్యుడైనందునే జీవితారంభంలో ఇంత ఘోరపు దెబ్బ తినీ రూజ్‌వెల్ట్ పైకి

వచ్చాడు. నాల్గవ పర్యాయం వైట్‌హౌస్‌లో ప్రవేశించి, నాలుగేళ్ళూ నిండకుండానే వెళ్ళిపోయాడుగాని, మరి నాలుగు పర్యాయాలు ప్రెసిడెంట్ పదవికి పోటీచేసినా, ఆయనకు బహుశా తిరుగువుండేది కాదు. ఆయనపట్ల ప్రజల అనురాగం అంత టిదే! ఆయనలో ఏదో వశీకరణశక్తి వున్నట్టు, ప్రబల విరోధులైనా సముఖంలో సాధువు లైపోయేవారు; దుయ్యబట్టడానికి వచ్చి, దణ్ణంపెట్టి వెళ్ళపోయేవారు. కావడానికి ఆయన కేపిటలిస్ట్ వ్యవస్థాసంరక్షకుడు. అయినా, కేపిటలిజం కోరలు పెరికివేయడానికి ప్రయత్నించాడు. రూక లున్నవానిదే రాజ్యమైన దేశంలోనైనా కాసుకు గతిలేనివాడు కూడు గుడ్డలకు మొగం వాచి, మలమల మాడి, కటికచావు చావనక్కరలేదని తన "న్యూ డీల్" ద్వారా నిరూపించడానికి కృషిచేశాడు. ద్వితీయ ప్రపంచసంగ్రామ సందర్భంలో తన చతుస్సూత్ర స్వాతంత్ర్యప్రణాళికలో "క్షుధార్తినుంచి విముక్తి" ని కూడా చేర్చాడు. నిస్సందేహంగా రూజ్‌వెల్ట్ మహా పురుషుడే. కాని, ఆయనకు చరిత్రలో లభించే స్థానం ఎవరి సరసను? గాంధీ, లెనిన్‌ల సరసనా? చర్చిల్ స్టాలిన్‌ల సరసనా? అమెరికా ప్రెసిడెంట్‌లలో ఆయన జార్జి వాషింగ్‌టన్, అబ్రహాం లింకనుల కోవలో చేరగలడా? లేక, ఒక మెట్టు కిందనే వుండిపోగలడా? సమకాలికులు సమకాలికులకు విలువ కట్టడం కష్టం. ఆ సమకాలికులు విలక్షణులైతే, ఆ పని మరింత కష్టం. కనుక ప్రపంచచరిత్రలో రూజ్‌వెల్ట్ స్థానాన్ని భావి చరిత్రకారుడుతప్ప నిర్ణయించలేడేమో! అయినా, రూజ్‌వలెల్ట్ జీవితంపై గంథర్ ఏమి తీర్పుచెప్పాడో తెలుసుకోవలసిందే. ఈ పుస్తకాన్ని కూడా తప్పక కొని చదవాలని తొందరపడుతూ కేటలాగు మూడవ పేజీ పైకి కన్ను పోనిచ్చాను.

ఫ్రెంచి నవలా సాహిత్యాన్ని సమీక్షచేసే పుస్తక మొకటి కొత్తగా వెలువడిం దన్న కబురు ఆ పేజీ అందజేసింది. నూతనదృక్పథంనుంచి శ్టాండాల్, బాలాక్, ఫ్లోబేర్, ప్రూస్ట్ మొదలైన ఏడుగురి రచనల సమగ్రపరిశీలన ఈ గ్రంథంలో కల దట. ఈ నవలాకారులలో కొందరు నాకు పరిచితులే. ఒకసారి పరిచయమైన తర్వాత యేళ్ళూ, పూళ్ళూ, గడిచినా వీరు మరి మరపురానివారు. వీరిలో పెద్ద తలకాయ శ్టాండాల్. అయితే. అది మారు పేరు. తల్లిదండ్రులు పెట్టిన అసలు పేరు హెన్రీబెల్. రాతకోతలకు మారుపేరుగా "శ్టాండాల్" అని ఒక చిన్నపట్టణం పేరు తగలించుకున్నాడు. "లాటరీలో నే నొక టిక్కెట్టు కొనుక్కున్నాను. దానికి పెద్ద బహుమానం రాబోతున్నది: అదేమిటంటే, 1935లో నా పుస్తకాలకోసం ప్రపంచం విరగబడ్డం" అని ఆయన నూరేళ్ళక్రితం చెప్పకున్నాడు. ఆ ప్రకారమే

నూరేళ్ళ నాడు లేని ఖ్యాతి ఈనాడు ఆయనకు అబ్బింది. ఆయనను మించిన నవలాకారుడు ఫ్రెంచివారిలో మరిలేడని సర్వే సర్వత్రాపోయిన పది, పదిహేను సంవత్సరాలలో ప్రపంచం అంగీకరించింది.

శ్టాండాల్ ఇటీవల తన అగ్రతాంబూలాన్ని తన్నుకు పోయినా, బాల్జాక్ ఐనా అసామాన్యుడే. దేశదేశాల నవలాకారులలో హేమాహేమీలే ఆయన రచలనలు చూచి వరవడి పెట్టుకున్న కాలం వున్నది. ఆయన రచనల కంటెకూడా ఆయన జీవితం నన్ను ఎక్కువగా ఆకర్షిస్తుంది, న్యాయవాదివృత్తికి శిక్షణ పొందికూడా దానిలో నసేమిరా చేరనన్నాడు. గ్రంథకర్తగా రాణించడానికి పదేళ్ళు అష్టకష్టాలు పడ్డాడు. వేరు ప్రఖ్యాతులు రావడంతో పాతకష్టాలన్నీ తీరిన వనుకుంటే, సుల భద్రవ్యార్జన ప్రలోభానికిలోనై "స్పెక్యులేషన్" కు దిగాడు. అందులో వచ్చిన నష్టాలను పూడ్చుకోవాలని గ్రంథముద్రణ, ప్రచురణ మొదలైన వ్యాపారాలలో వేలుపెట్టి మరింత అప్పుల పాలయ్యాడు. ఆయన జీవితమే ఒక చిత్రకథ.

ఫ్లాబేర్ ఐనా దిగ్గజంలాంటివాడే, రచనలో సన్నపోగారు పనితనం ఎక్కువగా చూపించేవాడు కనుక, ఇప్పటివారు ఆయన కవిబ్రహ్మ కాడని, విశ్వకర్మ మాత్రమే నని పెదవి విరుస్తారు గాని, ఫ్లాబేర్ సృష్టించిన "మదాం బోవరీ" మానసిక శాస్త్రం సారాన్ని చూచిన వారికే వెలుగుదారి చూపించింది. ఇట్టి మహారచయితలను గురించిన పుస్తకాన్ని కొనక పోవడమేమిటి? చదవక పోవడమేమిటి?

సరే, ఆ పేజీని ముగించి, మరొకదానికి వెడుతుండగా "అప్పో, సప్పో చేసి, ఈ పుస్తకాలన్నించిని కొన్నా, వీటి నన్నింటిని చదవగలనా" అని సందేహం తోచింది. ఈ మధ్య కొన్న ఒక గంథర్ పుస్తకాన్ని ("ఇన్ సైడ్ ది ఐరన్ కర్టైన్") అక్కడక్కడ తిరగవేయడమే తప్ప ఆసాంతం చదవనేలేదని గుర్తుకు వచ్చింది. శ్టాండాల్, బాల్జాక్, ఫ్లాబేర్ నవలలలో ఇంకా విప్పిచూడనివి నాపుస్తకాల బీరువాలలోనుంచి నిర్లక్ష్యాన్ని సహించలేక బాధకొద్దీ మూలుగుతున్నట్టు వినబడింది. చదవాలని, తెలుసుకోవాలని అంతులేని అసక్తే తప్ప అందుకు తగు విరామం ఈ జీవితాని కెక్కడిదని నిస్పృహ తోచింది. ఆ నిస్పృహనుంచి వలువడిందే నా నిట్టూర్పు!

*

# కట్టుకథలు

ఏదుగురినోట పడ్డానికే మరొకపేరు-కీర్తి. "నా సంగతి లోకానికి ఎందుకు పట్టాలి"? అని గుణిసేవాడు కీర్తి కెక్కలేడు; కీర్తి కెక్కినవానిగురించి లోకం మంచో, చెడ్డో చెప్పకోకనూ మానదు. మంచి చెప్పకుంటే అది సత్కీర్తి; చెడ్డచెప్పకుండే దుష్కీర్తి. కీర్తికామి తననురగురించి లోకం ఏమి చెప్పకుంటున్నదో అని కలత పడరాదు. అతడు ఆందోళన చెందవలసింది తన ఊసే ఎక్కడా వినిపించనప్పడే. "లోకం నిన్ను దూషిస్తున్నదా, భూషిస్తున్నదా అనేది ముఖ్యంగాదు; నిన్ను గురించి చర్చిస్తున్నదా, లేదా అనేదే ముఖ్యం" అని చర్చిల్ ఒకప్పుడు చెప్పిన ముక్కకీర్తికై ప్రాకులాడే ప్రతివ్యక్తీ మననం చేసుకోదగినట్టిది.

నలుగురినోట పేరు నలగడం ప్రారంభించిన తర్వాత మంచీ చెడ్డా రెండూ కూడా వినవలసి వస్తుంది. "ఎంత మంచి గొల్లకైనా వేపకాయంత వెర్రి వుంటుంది" అనే సామెత కేవలం యాదవకులస్థులకే వర్తించదు. ఎంతటి దొడ్డవానిలోనైనా (అతడు గొల్ల కాకపోయినా) ఏవో కొన్ని దౌర్బల్యాలు వుండనే వుంటాయి. హితులైనవారు ఈ దౌర్బల్యాలను నిర్లక్ష్యం చేసి, కేవలం సుగుణాలకే ప్రాధాన్య మిస్తారు; అహితులైనవారు ఇందుకు తలక్రిందులుగా ప్రవర్తిస్తారు. అతడెంతటి మహాపురుషుడైనా, చివరికి ప్రవక్తేఅయినా, అతని జీవితకాలంలో

యావత్తూ మంచివి చెప్పుకొనడం జరగదు; ఇది జరిగినా, యావన్మంది మంచిని చెప్పుకొనడం జరగదు. సోక్రటీస్, జీసస్ జీవితాలు ఇందుకు తార్కాణం. ఒక చెడ్డమాట వీరిపై వెయ్యాలంటే వెరపు పుట్టడానికిముందు వీరు కీర్తిశేషులు కావలసివచ్చింది.

ప్రసిద్ధు లైనవారినిగురించి వారిపట్లగల సదభిప్రాయ, దురభిప్రాయాల ప్రకారం చెప్పుకోడానికి ఎప్పటి కప్పుడు ఏదో వుండనే వుంటుంది. ఏమీ కనబడకపోతే, ఇట్టే దేనినైనా కాయించవచ్చు. పండిట్ నెహ్రూను గురించి ఢిల్లీలోని అమెరి కన్ రాయబారి కార్యాలయానికి చెందిన ప్రబుద్ధుడెవడో ప్రస్తుతం ఇదేవిధంగా ఒక కథ కాయించి ప్రచారం చేస్తున్నాడట. అగ్రనాయకత్రయ సమావేశంలో పాల్గొని, ప్రపంచ సమస్యల పరిష్కారంలో తోడ్పడవలసిందిగా తనకు పిలుపువ చ్చినట్టు నెహ్రూ కల గన్నాడట. ఆ సమావేశానికి కలలోనే వెళ్ళి, స్టాలిన్‌తో సరససల్లాపాలాడి, ట్రూమన్‌తో విందారగించి, అట్లీతో వోటుచేసి, తనది స్వతంత్ర విదేశాంగ విధానమని నిరూపించకున్నాడట. ఈ కట్టుకథ ఇండియా విదేశాంగ నీతిపట్ల అమెరికనుల అసంతృప్తిని స్పష్టంగా వ్యక్తీకరిస్తున్నదేమో కాని, నెహ్రూ స్వభావాన్ని సరిగా చిత్రింతడం లేదు. త్వరగా మనస్సును త్రెంచుకోలేక, ఒక నిర్ణయానికి రావడంలో ఆయన కొంత తాత్సారం చేయవచ్చు. ఒక నిర్ణయానికి వచ్చిన వెనుక, దాన్ని పరిపాలించడం లో కాఠిన్యాన్ని చూపవలసినస్తే, అందుకు తెగించలేక ఊగిసలాడవచ్చు. కాని, తన దారి తనదే నని, తానొకరిమాట విననని చెప్పి, తద్వారా తన స్వతంత్రచిత్తవృత్తిని వెల్లడించుకోవాలని కోరేవాడు మాత్రం కాడు. లేదా, ఆయననుగురించి ప్రచార మౌతున్న కట్టుకథలోని ధ్వనిప్రకారం, స్వతంత్రంగా వ్యవరహరిస్తున్నట్టు నటన చేస్తూ, మరొకరి అడుగు జాడలను (ఈ సందర్భంలో అట్లీ అడుగుజాడలను) అనుసరించేవాడు అసలే కాడు.

"బొంకరా, బొంకరా పోలిగా అంటే, టంగుటూరి మిరియాలు తాటికాయ లంతేసి" అన్నట్టు కట్టుకథ లల్లితే వాటిలో పస వుండదు. ఏ వ్యక్తిని గురించి కథ కట్టబోతున్నామో, అతని స్వభావాన్ని చక్కగా అర్థం చేసుకోవాలి; మనం కట్టే కథలో దాన్ని చమత్కారంగా యిమడ్చాలి. ఈ కళలో మెలకువ లన్నీ ఆకళింపు చేసుకున్నవా డెవడో కాని, డాబుకూ, దర్పానికీ పడిచస్తుండే ముసో లినీని గురించి చక్కటి కథ కల్పించాడు. ఆ ఫాసిస్ట్ డిక్టేటర్ చచ్చి స్వర్గానికి వెళ్ళగా, జూలియస్ సీజర్ ఆప్యాయంగా " అబ్బాయ్! మన రోం విశేషా లేమిటి?" అని పలకరించాడట." ఇంతటి వాడిని నన్ను పట్టుకుని అబ్బాయ్,

గిబ్బాయ్ అంటాడు!" అని చర్రున కొసం వచ్చి, మారుచెప్పకుండా ముసొలినీ మూతి ముడుచుకున్నాడట. అంతట "నన్ను అమర్యాద చేస్తే చేశావు గాని, ఇక్కడ దేవుడిని అమర్యాద చేసేవు! నలుగురిలో ఔననిపించుకుంటూ పేరుగా బ్రతికిన మన దేశానికి అపఖ్యాతి వస్తుంది" అని సీజర్ ఉచ్చరించాడట. ఆ దారినే పోతూ ఇంతలోనే అక్కడికి కాకతాళీయంగా వచ్చిన నెపోలియన్ "ఇక్కడి మర్యాదలు కొత్తవాడవు నీకు తెలియవేమో! దేవుడు వస్తే లేచి నిలబడాని" అని మాటలో మాట అందుకున్నాడట. " అయితే, నేను కూర్చునే తీరతాను" అని పబ్లిక్ రోడ్డుమధ్య (స్వర్గంలో కూడా పబ్లిక్ రోడ్డులుంటాయి లెండి) ముసోలినీ చతికిలబడ్డాడట. ఇదేమి తిక్క మేళమని సీజర్, నెపోలియన్‌లు మథనపడుతుండగా రాజనీతిలో మన చాణక్యుని తలదన్నిన మాక్యవెలీ అక్కడికి రావడం తటస్థించిందట. "మీ కెందుకు మీరు ఊరుకుందురూ! ఇతని సంగతేదో నేను చూస్తాను." అని మాక్యవెలీ అంటుండగా, ఆయన మాటలో మూట వేసుకుని, దేవుడు వారున్నచేటుకు రానే వచ్చాడట. ఆయనను దగ్గరివరకు రానిచ్చి, "అడుగో! ఫోటోగ్రాఫర్" అని మాక్యవెలీ అన్నాడట. తక్షణం ముసోలినీ నిట్టనిటారుగా లేచి, రొమ్ము విరిచి, మోర పైకెత్తి, గడ్డాన్ని ముందుకు నిక్కబొడిచి, పెదవులు బిగించి, కుడిచేయి పైకెత్తి, ఫాసిస్ట్ సెల్యూట్ చేస్తూ నిలుచున్నాడట.

ఈ ఫాసిస్ట్ డిక్టేటర్‌ను గురించే ఇతర నియంతలను గురించి కూడా నేను విన్నవే ఇట్టి కల్పిత కథలు మరెన్నో వున్నాయి. నియంతృత్వ దేశాలలో వాక్స్వాతంత్ర్యం పూజ్యం. కడుపు మండినప్పుడు నోటికి వచ్చినట్టు నాలుగు తిట్టగలిగితే దానితో కోపం కొంత చల్లారుతుంది. ఇందుకు వీలు లేనప్పుడు, బహిరంగంగా పరిపాలకును పల్లెత్తుమాట అనడమే ఘోర నేరమైనప్పుడు, వారిపై కసితీరడానికి చాటు మాటుగా ఏవో కొన్ని కట్టుకథలైనా చెప్పుకోవాలి కదా! ఈ బాపతు కథలన్నీ బహులబ్జుగా వుండేవైనా నాలు గైదింటిని మాత్రం ఇక్కడ చెబుతాను.

రొమ్ముపట్టకుండా తాను రోజూ పెట్టుకునే మెడల్స్ అన్నింటితో తళుక్కుమంటూ గోరింగ్ ఒక ఉక్కు కర్మాగారంతనిఖీకి వెళ్ళాడు. వెళ్ళి, వొయ్యారంగా ఆ కర్మాగారంలోని ఒక హాల్‌లోకి అతడు అడుగు పెట్టీపెట్టడంతోనే రంయ్యని వెళ్ళి కప్పుకు తగులుకున్నాడు. ఇదేమి విడ్డూరమని విచారించగా, అతడి వొంటి పైవున్న బండెడు మెడల్సులో ఉక్కుతో చేసినవి కొన్ని వున్నందున, అక్కడి ఎలక్ట్రో మాగ్నెట్ ఈడ్చివేసినట్టు తేలింది. ఖూనీలు చేయడానికీ, చేయించడానికీ పేరుపడిన గోరింగ్ ఒక బ్రిటీష్ ప్రముఖునికి తానిస్తున్న విందుకు లేటుగా

వచ్చి, వేటనుంచి రావడంలో జాగైనందుకు మన్నించవలసిందిగా కోరాడు. విలం బన కారణాన్ని విని, ఆ బ్రిటీషర్ "మృగాల వేటనుంచే అని నమ్ముతున్నాను" అని చమత్కరించాడు. యుద్ధంలో జర్మనీ వోడిపోతే, తమ గతి ఏమి కాను న్నదని గోరింగ్, గోబెల్స్‌ల మధ్య ఒకనాడు సంభాషణ రాగా, వాచాలుడైన గోబెల్స్ "నా నోటికి మూతవేసుకుంటే, మరి నన్నెవ్వరు ఆనవాలు కట్టలే" రన్నాడు. "నా పని మరింత తేలిక. నా మెడల్స్‌ను పీకిపారవేస్తే, ఆ దేవుడైనా నన్నగుర్తుపట్టలే"! డని గోరింగ్ పకపకనవ్వాడు.

ఒకనాడు హిట్లర్, గోబెల్స్‌లు పల్లెపట్టులగుండా ప్రయాణం చేస్తుండగా వారి కారుకింద పడి ఒక రైతు పెంపుడు పంది చచ్చిపోయింది. జరిగిన ప్రమాదానికి నొచ్చుకుని, "నా వల్ల తనకు కలిగిన ఈ నష్టానికి నన్ను మన్నించవలసిందిగా దీని యాజమానిని నువ్వు కోరక తప్పదు" అని హిట్లర్ గోబెల్స్‌ను పంపిం చాడు. చాదస్తం కాని, ఈ కాస్త భాగ్యానికే క్షమాపణ లేమిటని కదలలేక కదలిన గోబెల్స్ కాసేపటిలోనే మోయలేనన్ని పూలూ, పళ్లూ పుచ్చుకుని తిరిగి చక్కావచ్చాడు. "తన పందిని చంపడ మేమిటి? మనకు పందేరం పంపిచడ మేమిటి"? అని విస్తుపోతూ "చూచి రమ్మంటే కాల్చివచ్చే ఘటానివే నువ్వు! ఏమి తంత్రంచేసి వచ్చా వేమిటి"? అని హిట్లర్ అడిగాడు. నాకు చిత్రంగానే

వుంది. గడపలోకి అడుగుపెట్టి 'హైల్ హిట్లర్! చచ్చెనయ్యా పంది' * అన్నానో, లేదో ఎగిరి గంతులువేస్తూ నా పైన పూల, పళ్ళ వర్షం కురిపించాడు" అని గోబెల్స్ బుర్ర గోక్కుంటూ జవాబిచ్చాడు.

అగ్రరాజ్యత్రయ సభకు తాము టెహరాన్‌లో సమావేశమైనప్పుడు ఒక పూట స్టాలిన్, చర్చిల్, రూజ్‌వెల్ట్‌లు కలిసి ఒకే కారులో వెడుతున్నారు. అప్పుడొక ఆవు దారికి అడ్డంగా నిలబడి వారి బండిని ముందుకు సాగనిచ్చింది కాదు. చర్చిల్ ఒక గంభీరోపన్యాసాన్ని చేసినా, రూజ్‌వెల్ట్ తన రాజనీతిచాతుర్యాన్ని చూపినా, ఫలితం లేకపోయింది. కాని, స్టాలిన్ కారు దిగివెళ్ళి, ఆవు చెవిలో ఏదో రహస్యం ఊదేసరికి కాళ్ళసత్తువకొద్దీ అది పెద్ద పరుగుతీసింది. ఏమి కిటుకు చేశావని ఆ ఉక్కు మనిషిని ప్రశ్నించగా, "మరేమీ లేదు. 'నిన్ను సమష్టి వ్యవసాయ కేంద్రానికి తోలిస్తాను సుమీ!' అని ఒక్కమాట అన్నాను" అని బదులు చెప్పాడు.

* "హైల్ హిట్లర్! దిపిగ్ ఈజ్ డెడ్"

ప్రసిద్ధపురుషుల స్వభావాలు ఆధారంగా గలవి కొన్ని కట్టుకథలు కాగా, వారి

స్వరూపాలను ఊతగొనేని మరి కొన్ని వుంటాయి. బెర్నార్ట్‌షాతో అంతులేనన్ని వాగ్యుద్ధాలను చేసిన జి.కే. ఛెస్టర్‌టన్ పిప్పళ్ళ బస్తాలా వుండేవాడు. ఆయన ఎంత స్థూలకాయుడో బెర్నార్డ్ షా అంత బక్కపలచటివాడు. వారిశరీరాకృతులను పురస్కరించుకొని ప్రచారంలోకి వచ్చిందే ఈ కింది కథ; ఒకనాడు బెర్నార్డ్ షాను "నిన్ను చూస్తే, దేశానికి కరువు పచ్చిపడిందని అనుకోవలసి వస్తున్నది సుమీ!" అని ఛెస్టర్‌టన్ పోళన చేశాడు. "నిన్ను చూస్తే, ఆ కరువు నీ వల్లనే వచ్చినట్టు తీర్మానించుకోవలివస్తున్నది." అని షా వెంటనే మాటకు మాట అప్పగించాడు. ఛెస్టర్‌టన్ స్థూలకాయాన్ని గురించి మరొక కథ చెబుతారు. క్రిక్కిరిసి వున్న ట్రామ్‌లో ఒకమూలకు వొదిగి నిలిచివున్న ఇద్దరు స్త్రీలను చూచి, "పాపం ఆడకూతుళ్ళు" అని తన సీటునుంచి ఆయన లేచేసరికి, ఆ స్థలం వారిద్దరికీ ఎక్కాతక్కీగా సరిపోయింది.

ఇంత సొగసైనవీ ఆస్ట్రియాకు కొంతకాలం డిక్టేటర్‌గా వున్న డాల్ఫన్‌ను గురించిన కథలు. ఆయన వామనమూర్తి. అంగుళంయెత్తు బూట్సు వేసుకున్నా అయిదడుగులైనా నిండా వుండేవాడు కాడు. ఈ మరుగుజ్జు ఒకనాడు నిచ్చెనపై నుంచిపడి కాలువిరగగొట్టుకున్నాడు. అతడు నిచ్చెన వేసింది నేలములక చెట్టుకు! విరోధులు అతడిని చంపడానికి కుట్రచేసి, పడకగదిలో ఒక ఎలుకలబోను పెట్టారు. అతడిపై ప్రయోగాలు చేసి, పరమాణుశాస్త్రంలో మహాపండితుడుగా ఒక ఆస్ట్రియన్ శాస్త్రవేత్త నోబెల్ బహుమతి పొందాడు. ముసోలీనీతో సమావేశానికి రోం వెళ్ళినప్పుడు డాల్ఫన్ రైలులో ప్రయాణం చెయ్యలేదు; ఎయిర్ మెయిల్‌లో బంగీగా అతడిని పంపించారు. ఆస్ట్రియన్ సర్వసేనాని ఒకనాడు సైనికవందనం అందుకుంటూ వేదికపై తన కాలివద్ద తాబేలు ప్రాకుతున్నదని త్రుళ్ళిపడ్డాడు. కాని, అది తాబేలూ, గీబేలూ-కాదు; శిరస్త్రాణం ధరించివున్న ఆస్ట్రియన్ డిక్టేటర్. ఆస్ట్రియాను స్వాహాచెయ్యడానికి అడ్డువస్తున్నాడని "ఆ పొట్టి బుడంకాయను సఫా చేసి రండి" అని హిట్లర్ కొందరు నాజీలను పంపించాడు. వారొకనాటి రాత్రి డాల్ఫన్ పడకగదిలోకి ప్రవేశించారు. అలికిడికి నిద్రలేచిన డాల్ఫన్ పిల్లవాడి గొంతు పెట్టి "మా నాన్న ఇంట్లో లేడు" అనేసరికి నిజమే అనుకుని ఆ నాజీలు వచ్చిన దారినే చక్కాపోయారు. పోస్టుబిళ్ళపై డాల్ఫన్ చిత్రాన్ని అచ్చువేసినపుడు శిరోభాగాన్ని మాత్రం వేస్తే దానిలో ఒకమూలైనా నిండదని "లైఫ్‌సైజ్" లో మూర్తినంతటినీ ముద్రించారు.

వ్యక్తులనుగురించే కాక, జాతులనుగురించి కట్టుకథలు అనేకం వ్యాప్తిలోకి వస్తుం

టాయి. ఐరిష్‌వారు మందబుద్ధులని, స్కాటిష్‌వారు పిసినిగొట్టులని, ఇంగ్లీష్‌వారు భల్లూకపుపట్టు పట్టగలవారని, యూదీయులు టోపీ పెట్టడంలో దిట్టలని, అమెరికనులు కోతలరాయుళ్ళని, ఇటాలియనులు పిరికివారని అయాజాతులకు ముందు కొన్ని ప్రత్యేక గుణాలను, లేదా అవగుణాలను ఆపాదిస్తారు. తర్వాత తాము ఆపాదించిన గుణావగుణాలే ఆధారంగా ఆ జాతులనుగురించి కథలు కల్పిస్తారు. ఇవి అనంతం. వీటిని చెప్పడం ప్రారంభిస్తే తెమలడం కష్టం. అందువల్ల ఐరిష్, ఇటాలియన్ జాతులకు సంబంధించిన కథలను కొన్నింటిని మాత్రం చెప్పి అంతటితో విరమిస్తాను.

ఐరిష్‌వాడొకడు తన పాదాలలో ఒకటి పెద్దది మరొకటి చిన్న దైనందున ఒక బూటుకంటే మరొకటి చిన్నదిగా ఒక జోడు కోసం ఆర్డరిచ్చాడు. ఆ విధం గానే కుట్టగా "ఒకదానికంటె మరొకటి చిన్నదిగా వుండాలని నేనంటే, ఒకదానికంటె మరొకటి పెద్దదిగా ఎందుగు తయారు చేశారు?" అని కోపగించుకున్నాడు. మరొక ఐరిష్‌వాడు కొత్తకంబళి కొనుక్కుని, కప్పుకున్నప్పుడు అది తలవైపు చాలా ఊరికే మిగిలిపోతున్నదని, కాళ్ళను సరిగా క్రమ్ముకోవడమే లేదని, శుష్కదండుగ బేరమై పోయిందని విచారించాడు. సిరిసంపత్తులుగల విధవరాలుతో స్నేహంగా వుంటూ, పదేళ్ళుగా ప్రతి సాయంత్రం ఆమె యింటివద్ద గడుపుతున్న ఐరిష్‌వానితో "ఆమెను కట్టుకోరాదటయ్యా!" అంటే, "నాకూ ఆ వూహ తట్టింది కాని, పెండ్లాడిన తర్వాత సాయంత్రంపూట కమ్మని టీ ఎవరిస్తారు? కమ్మనికబుర్లు ఎవరు చెబుతారు?"అనిజవాబిచ్చాడు. పోతే, చివరికథ ఇటాలియనుల పిరికితానాన్ని గురించి: ముస్సోలినీ కూతురు ఎడ్డా తమ దేశానికి సహాయంగా జర్మనీ పంపిన కొన్ని టాంకులను చూచివచ్చి వాళ్ళనాన్నకు "మనల్ని హిట్లరు పచ్చిమోసం చేశాడు. ఒక్క టాంకు కైనా రివర్సు గీర్ లేదు" అని ఫిర్యాదు చేసింది. రివర్స్ గీర్ బండిని వెనక్కి నడపడానికి ఉపకరించే సాధనమని వివరించ దలిస్తే ఈ కథ స్వారస్యమే చెడుతుంది.

*

# అలవాట్లు

మూడవసిగరెట్టు విసిరి పారవేసి, నాల్గవదాన్ని ముట్టించాను. తర్వాతే గాని వ్రాతకు తగిన "మూడ్" కుదరలేదు. మనస్సు కళ్ళెంలేని పొగరుబోతు గుర్రం వంటిది. దారీతెన్ను లేకుండా అది తనచిత్తం వచ్చినట్టు పోతుంది: గట్టు లను, పుట్టలను దాటుతుంది; ఒక దిక్కుకు వెడుతూ కారణం లేకుండానే మరొక దిక్కుకి మళ్ళుతుంది: ముందుకాళ్ళను పైకెత్తి వెనుక కాళ్ళపై నిలుస్తుంది, పడు తుంది, దొర్లుతుంది; లేచి, తిరిగి ఎటో, ఎందుకో దౌడుతీస్తుంది: నురుగులు కక్కుతుంది: చెమటలు కార్చుతుంది: డొక్కలు ఎగర వేస్తుంది: కళ్ళెం తగిలించి, అంకెలోకి తెచ్చుకుని, ఒకదారిని నడిపించక పోతే, మనస్సు కూడా ఇదే రీతిగా చిత్తం వచ్చి నట్టు పరుగిడుతుంది: కుప్పింగంతులు వేస్తుంది: కొక్కిరాయి చేష్టలు చేస్తుంది.

కొన్ని గుర్రాలకు ఏతాడైనా కళ్ళెంగా పనికి వస్తుంది: మరి కొన్నింటికి ఇనుప కళ్ళెం వుండాలి: వేరొక కొన్నింటికి కక్కుల కళ్ళెం కావాలి: మనస్సు విషయంలో కూడా ఇంతే! నా తలంపులు చెదిరిపోకుండా వుండాలంటే, నేను సిగరెట్లు కాల్చాలి. నా స్నేహితులలో వొకరికి కారాకిళ్ళి దట్టించనిదే వ్రాతసా గదు: మరొకరికి పచ్చివక్క నెమరువేయనిదే కలం నడవదు: ఇంకొరికి ఇంత

కంటె ఘాటైన పదార్థం-కాదు, పానీయం-కావాలి. తామరాకు మీద పడిన నీటి చుక్కవలె, అద్దం మీద వొలికిన పాదరసం వలె మహా చంచలంగా వుండే మన స్సును వశవర్తినిగా చేసుకోడానికి ఒక్కొక్కరికి ఒక్కొక్క సాధనం అవసరమౌతూ వుంటుంది.

మన పెద్దన్న గారికి "నిరుపహతిస్థలంబు, రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురపు విడెము, ఆత్మకింపైన భోజనము, ఊయెల మంచము": ఇవన్నీ కూడా కవితా వ్యవసాయానికి అవసర మౌతూవుండేవట! రాయలవారి ఆస్థానకవి; ఆయన అభిమానాన్ని చూరగొని కవి గండపెండేరం తొడిగించుకున్న ఉద్దండుడు. నిరుపహతి స్థలమైనా, రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురపు విడెమైనా, ఆత్మ కింపైన భోజనమైనా, ఊయెల మంచచమైనా మరేభోగమైనా ఆయన కోరుకోవాలేకాని, అందుకు అడ్డువుంటుందా? కాని ఒంటికాలి మీద తపస్సు చేసినా సామాన్యుల కివిదొరకవు. కాబట్టి ఒక కప్ప కాఫీతోనో, ఒక ప్యాకెట్టు సిగెరెట్లతోనో, ఒక చిటిక పొడుంతోనో, ఒక వక్క పలుకుతోనో సరిపెట్టుకోవాలి.

ఏకాగ్రతకు ఇవి ఏవిధంగా తోడ్పడతాయి? ఏమో, ఆ విషయాన్ని చెప్పడం కష్టం. సిగెరెట్లు కాల్చే నా సంగతే చూద్దాము: పొగాకులో "నికొటిన్" అనే విషం వున్నదట. అది నరాలపై పని చెయ్యడంవల్లనే ఏకాగ్రత కుదురుతుందా? అందువల్లనే వ్రాత చకచక సాగుతుందా? ఏమో, నాకు తెలియదు. ధూమపానం వల్లవ్రాత సాగేమాట నిజమే కాని, అది సారం లేని చచ్చువ్రాత అని టాల్ స్టాయ్ వాదం. "చాలా మంది అంటారు (ఒకప్పుడు నేనూ అనేవాణ్ణి) మెదడు చురుకుగా పనిచెయ్యడానికి ధూమపానం తోడ్పడుతుందని. మెదడు ఏమి పని చేసిందనికాక, ఎంత పనిచేసిందని చూచుకుంటే ఈ మాట నిస్సందేహంగా వాస్త వమే. ధూమ పానం చేసేవారికి, ఆ కారణాన తన ఊహలను తరచిచూచుకొనని వానికి, ఒక్కసారిగా ఎన్నోభావాలు తట్టినట్టుగా అనిపిస్తుంది. ఇలా అన్పించడం నిజంగానే చాలా భావాలు స్ఫురించి నందువల్లకాదు; ఆలోచనాశక్తి అంకుశాన్ని తప్పినందునే" అని టాల్ స్టాయ్ వ్రాశాడు. ఇంతటితో ఆయన ఆగలేదు; ఇంకా వాదించాడు: "పనిచేస్తున్న వాడిలో ఇద్దరుంటారు; ఒకడు పనిచేసేవాడు, రెండవ వాడు ఆ పని మంచి సెబ్బరలను తరచి చూసేవాడు. ఎంతగట్టిగా తరచి చూస్తే అంత నిదానంగా పని సాగుతుంది. తరచి చూసేవాడిని పొగతో ఊదరపెడితో, ఎక్కువ పని సాగినా, దాని పస తక్కువ." టాల్ స్టాయ్ వ్యాసంనుంచి ఈ వాక్యాలను తెనిగించే లోపల నేను అరసిగరెట్టు ఊదివేశాను. ఇంత మాత్రం చేత

నా తెనిగింపు చచ్చుగా వున్నదంటే నేను అచ్చుకుంటానా?

పోనీ, నా మాట విడిచి పుచ్చండి. ధూమపానంవల్ల వివేచనా శక్తి సడల డమే నిజమైతే, నిద్రపోతున్నపుడు తప్ప నోటినుంచి పైప్ తియ్యని బెర్ట్రెండ్ రసెల్ వివేచనాపటిమకు ప్రపంచ ప్రసిద్ధిని ఏవిధంగా పొందగలిగాడు? ధూమ పానం వల్ల మేధాపటిమ మందగించడమే నిజమైతే రసెల్ వలె పైప్ భక్తుడైన అల్బర్ట్ ఐన్‌స్టీన్ ఎనలేని మేధానిధిగా ఏ విధంగా పేరు ప్రోగుతున్నాడు? ఇంతే గాదు. టాల్ స్టాయ్ చెప్పినట్టు, నాలుగు దమ్ములు లాగగానే ఆలోచనలు పెద్ద జల వలె ఊరుకువచ్చి నట్టు తోస్తుందనడంకూడా అన్ని సందర్భాలకు వర్తించదు. నామట్టుకు నా అనుభవంలో ఒక్కొక్కపుడు సిగరెట్టు కాల్చినా ఒక్క ఆలోచ నైనా తోచదు సరిగాదా, తల అంతకంతకు దిమ్మెక్కుతుంది, కళ్ళుతిరుగుతాయి, గుండెలలో మంటపుడుతుంది, మనస్సు శూన్యం అయిపోతుంది.

చూస్తూ చూస్తూ పెద్దవాడిని ఒకమాట అనడానికి నోరు రాదు కాని, టాల్‌స్టాయ్ "వృద్ధనారీపతివ్రత" వంటివాడు. తానే చెప్పినట్టు, ఆయన ఒకప్పుడు ధూమపానం చేసేవాడు. మద్యాన్ని కూడా పుచ్చుకునేవాడు. (అయితే అన్నవలె, మోతాదును మరీ మించ నిచ్చేవాడు కాదనుకోండి.) రుబుల్సు వొడ్డి పేకాటతో పాటు కొన్ని ఇతర జూదాలు కూడా ఆడేవాడు. జూదంలో అప్పులపాలై మళ్ళీ దాని జోలికి పోరాదని పదేపదే వొట్లు వేసుకునే వాడు; అవి పదేపదే పరగడుపు అయిపోయేవి. ఆయనొక సారి జూదంలో నాలుగువేల రుబుల్సు అప్పపడి జమిందా రిని బావకుఅప్పగించి తనఖర్చుల క్రింద సాలుకి 500 రుబుల్సు మాత్రం తనకిచ్చి మిగతా రాబడితో ఋణాల్ని తీర్మానంచేసి పెట్టవలసిందిగా అభ్యర్థించాడు. మరొ కమారు జూదంలోనే వెయ్యి రుబుల్సు బాకీ తేలి, దాన్ని తీర్చడానికి వేరేదారి లేక, వ్రాస్తున్న ఒక పుస్తకాన్ని అమ్ముకున్నాడు. టాల్‌స్టాయ్‌కి జూదం పైనేకాక వేటపైకూడా మక్కువ వుండేది. వ్యభిచారి కాక పోవచ్చుగాని, పరనారీ సాహచ ర్యాన్ని ఎరగని వాడు మాత్రం కాడు. మొదట ఇంతగా "భోగి" అయినవాడు చివరికి ధూమ పానాన్ని పోలిన స్వల్ప బలహీనతపై కూడా కత్తులు నూరబట్టి, పల్లెత్తు మాట అనరాని పెద్దవాడని తెలిసి కూడా "వృద్ధనారీ పతివ్రత" అని అప్రయత్నంగా అని వేస్తాము.

"కొత్తవైష్ణవులకు పంగనామాలు దండి" అన్నట్టు, వయస్సు మళ్ళిన తర్వాత నీతి బోధకు దిగిన టాల్‌స్టాయ్ "జూదగాళ్ళు దాదాపు యావన్మందీ ఎందుకు ధూమాపానం చేస్తారు?..... పణ్యాంగనలు, పిచ్చెక్కినవారు యావన్మందీ ఎందుకు

పొగ త్రాగుతారు?" అని ప్రశ్నించ నారంభించాడు. ఇంతటితోనైనా ఆగితే కొంత నయమే. కాని ఆయన పొగ త్రాగడానికి, ఖూనీ చెయ్యడానికి చాలా దగ్గర సంబంధం వున్నట్టు కూడా చెప్పకువచ్చాడు. తనకు చుట్టమైన ఒక ముసలమ్మను చంపివేయడానికి ఆమె కొలువులో వున్న వంటవాడు నిర్ణయించుకున్నాడట. ఆ ముసలమ్మ ఇంటిలోనే పనిచేస్తున్న దాసి ఆ వంటవాడికి ఉంపుడు కత్తెగా వుండేదట. ఆ పిల్లను యింటినుంచి పంపించివేసి, నూరి పెట్టుకున్న కత్తితో వాడు ముసలమ్మ పడక గదిలోనికి వెళ్ళబోయాడట. కాని మనస్సు పీకిందట, అడుగు ముందుకు పడనేలేదట. గిర్రున వెనక్కి తిరిగి గడగడ రెండు గ్లాసులు వోడ్కా (రష్యన్ సారాయి) తాగి ఆ తర్వాత గబగబ వెళ్ళి ఖూనీ చేసి వేశాడట. అయితే టాల్‌స్టాయ్ కథలో ఇది పూర్వఘట్టం మాత్రమే; దీని ఉత్తరఘట్టం లోనే ధూమపానం చేసే పరమదుర్మార్గుల ప్రస్తావన వస్తుంది. ముసలమ్మ పడక గదిలో ప్రవేశించిన వంటవాడు కత్తితో మెడపై ఒకపోటు పొడిచేసరికి ఆమె గిజగిజ తన్ను కుంటూ కింద పడిపోయిందట. చిమ్మటిగొట్టంతో కొట్టినట్టు గాయంనుంచి నెత్తురు బుస్సుమంటూ పొంగి కాల్వ కట్టిందట. దాన్నిచూడగా గుండె బేజారై వాడు బయటికి వెళ్ళిపోయి, సిగరెట్టు ముట్టించి గబగబ నాలుగు దమ్ములు పీకాడట. పీల్చిన పొగలోనికి వెళ్ళి వాడి ఆత్మ కళ్లను కప్పి, దాని చెవులను మూసి, దాని నోటికి తాళం వేసి వెనకగాని తిరిగి పడక గదిలోనికి అడుగు పెట్టి, ముసలమ్మ మెడను పూర్తిగా కోసి, ఆమె నగానాణెం కోసం గాలించడానికి వాడికి ధైర్యం చిక్కలేదట.

నీతిబోధకు ఇతరకథలను అల్లినట్టు టాల్‌స్టాయ్ దీన్ని అల్లలేదనే అనుకుందాము కాని, సిగరెట్లు కాల్చేవారందరు ఖూనీలు చేస్తున్నారా? ఖూనీలు చేసినవారిలో పొగాకు వాసనైనా గిట్టనివారు లేరా? ఎవడో వొకడు ఖూనీచేస్తూ సిగరెట్టు కాల్చాడని హత్యకు, ధూమపానానికి ముడిపెట్టడం భావ్యమా? కావాలంటే ఈ విషయంలో మనం టాల్‌స్టాయ్ మాటను ఆయనకే అప్పగించడం ఏమంత కష్టం కాదు. సిగరెట్టు కాల్చిన రోజులలో ఆయన "యూనా కెరీని", "వార్ అండ్ పీస్" మొదలైన గొప్పగొప్ప నవలలను లోకానికి ప్రసాదించాడు. ఆయననుంచి లోకం ఇంకా ఆశించిన మహాకావ్యా లన్నింటిని ఖూనీ ఆయన సిగరెట్లను కాల్చడం మానివేసిన వెనక ఆయన చేతుల మీదగానే జరిగిపోయింది!

ప్రసక్తానుప్రసక్తంగా ధూమపానాన్ని గురించి విశేషంగానే చర్చ జరిపినా, ఈ వ్యాసోద్దేశం దాని సమర్థన కాదు, ధూమపానం దురభ్యాసమైతే కావచ్చు. (నేను

మాత్రం ఆ మాట వొప్పుకో ననుకోండి) దానికి లోను కావడం ఘోరావినీతి కాదు; దానికి దూరంగా వుండడం మహానీతి కాదు. పుణ్య పాపాలతో దానకి సంబంధం లేదు. అయితే, గియితే, అది ఇతరులకు చెరువు చాపల్యం మాత్రమే. ఏదైనా, రచయితలకు కావలసిన ఏకాగ్రతా సాధనకు అది దివ్యంగా తోడ్పడు తుంది. దాన్ని కాక పోతే, మరొకదాన్ని ఏకాగ్రతా సాధనకు రచయిత లైనవారు ఆలంబనం చేసుకొనడం సర్వసాధారణంగా తప్పదు. కొందరిని చూడండి; వారికి చుట్ట, బీడీ, సిగరెట్టు, పొడుం మొదలైన వ్యసనా లేవీ వుండవు. చివరికి వక్క పలుకునైనా నమలరు.అయినా ఏకాగ్రత కుదరాలంటే, వారికి సైతం ఏదో ఒక ఊత కావలసి వస్తుంది. చిన్న చిన్న కాగితాలపై తప్పితే కొందరికి వ్రాత సాగదు; పెద్దకాగితాలు లేకపోతే మరికొందరికి అక్షరం రాలదు; ఆలోచన పోవాలంటే కొందరికి ఏకాంతం కావాలి; మరికొందరికి సందడి కావాలి. టెలిఫోన్ ఒక వైపున, టెలిప్రింటర్ మరొకవైపున, టైప్‌రైటర్ ఇంకొక వైపున గణగణ, టకటక, ధణధణ రొద చేస్తూ తమ ఊహలకు తగినట్టు తాళం వెయ్యనిదే పని చెయ్యలేని జర్నలిస్టులు ఎందరినో నే నెరుగుదును. కాక, జర్నలిస్టులలోనే కొందిరకి రచనా సమయంలో కాలి అలికిడైనా కూడదు. "మాంచెష్టర్ గార్డియన్" ఎడిటర్, మిస్టర్ సి.పి.స్కాట్, ఆగంతుకుల కాలి అలికిడికి తన ఆలోచనలు ఎక్కడ చెదిరి పోతాయోనని తన కార్యాలయాన్ని రత్నకంబళాలతో కప్పి వుంచుకునేవాడు. వీటి అన్నింటినిబట్టి ఏకాగ్రతకు ఏది సాధనం కాగలదనే విషయం కేవలం ఆయా వ్యక్తుల అలవాట్లపై ఆధారపడి వుంటుందనే చెప్పాలి.

బాగా చెయ్యితిరిగి, పెద్ద పేరుపొందిన హేమాహేమి రచయితలు కూడా ఏదో ఒక అలవాటుకు బానిసలే! తుడుపుపడితే, రవీంద్రనాథ్ టాగోర్‌కు మరి కలం నడిచేది కాదు. ఆ తుడుపును రంగుల పెన్సిల్‌తో ఏదైనా ఒక బొమ్మకిం దికి మార్చివేసేవాడు. చేతిలోని చివరి దమ్మిడీ కూడా చెల్లిపోవాలి, బాకీలు మోపుకావాలి; అప్పులవాళ్లు వెంటదరమాలి-అప్పుడుగాని దొస్తవస్కీకి వ్రాయడానికి వేడి పుట్టేదికాదు. రత్నకంబళాలతో, చక్కని చిత్రపటాలతో, ఉత్తమ గ్రంథసం చయంతో, సుగంధపుష్పాలతో అలంకరించిన గదిలో ఏకాంతంగా కూర్చుంటేనే తప్ప షెకోవ్‌కు కథ నడిచేది కాదు. ఒక్కొక్కమాటను పదిసార్లు పైకి వల్లించి చూచుకుని, అది చెవికి ఇంపుగా వున్నదో, లేదో నిర్ణయించుకోవడమే కాకుండా, దాన్ని బ్లాక్‌బోర్డుమీద సీమసున్నంతో వ్రాసి, కంటికి సొంపుగా వున్నదో, లేదో తేల్చుకున్నమీదట గాని ఫ్లోబేర్‌కు ఆపై మాట తోచేది గాదు. ఎంతటివారైనా

అలవాట్లకు బానిసలైపోతా రనడానికి ఈ విధమైన నిదర్శనాలను ఎన్నింటినైనా చూపవచ్చు.

అసలు మన బ్రతుకే కొన్ని అలవాట్ల పోగు. అభ్యస్తమార్గం వెంట లేకుండా, చివరికి కళ్ళు మూసుకుని కూడా, మనం నడవగలము. ఇదే విధంగా జీవిత మార్గం వెంటకూడా కష్టం లేకుండా పురోగమించడానికి మనం ఎన్నో అభ్యాసాలను చేసుకుంటాము. అయితే, అలవాటైపోయిన పనిలో ఆనందం తక్కువ. అందుచేత ఒక్కొక్కప్పుడు మన అభ్యాసాలను అతిక్రమించి గోరతాము. కాని, దానికి మానసిక దార్ఢ్యం కావాలి, సంకల్పబలం కావాలి. అది మనలో చాలమందిలో మృగ్యం. ఆ కారణాన మనం అభ్యాసాల బానిసతనం నుంచి బయటపడ్డం అరుదు. స్వతంత్రవ్యక్తికి బాధ్యతలు పెచ్చు. తన స్వాతంత్ర్య రక్షణకు అతడు సతతం అప్రమత్తుడై వుండాలి. అవసరమైతే అందునిమిత్తం ఎట్టి కష్టనష్టాలకైనా, ఎంతటి శౌర్యాత్యాగాలకైనా, సన్నద్ధపడాలి. బానిసకు ఈ సమస్య లుండవు. తన పోషణకు, తన రక్షణకు, తన కష్టసుఖాలకు అతడు పూర్తిగా తన యాజమానిపై, లేదా, పరిపాలకునిపై ఆధారపడతాడు. అందువల్ల అతడి బ్రతుకు సాఫీగా నడుస్తుంది. సాఫీబ్రతుకు కోరుకుంటాము. కాబట్టి మనం కూడా అలవాట్లకు కట్టువడివుంటాము. మన మంచిచెడ్డలు మన అలవాట్ల మంచి చెడ్డలపై ఆధారపడి వుంటాయి. కాని, వాస్తవంగా జీవితమాధుర్యాన్ని అనుభవించగలవాడు అభ్యాసాల ప్రాబల్యానికి లొంగిపోనివాడే.

*

# పరామర్శ

పలకరిస్తేనే తప్ప పలక్కపోవడం నాకు పరిపాటి. ఇంగ్లీషు చదువులవల్ల కొన్ని ఇంగ్లీషు సంప్రదాయాలు వంట బట్టడమే ఇందుకు కారణం కావచ్చు. తా మిద్దరి మధ్య ఉభయులకు తెలిసిన మూడవ వ్యక్తి పరిచయలాంఛనం-దీన్ని "ఇంట్రడక్షన్" అంటారు-నడిపితే నే తప్ప ఏ యిద్దరింగ్లీషువారు మాట్లాడుకోరు. టాం, డిక్‌లు తెల్లవారితే అడుగడుగుకు తారసిల్లనేవారే కావచ్చు. అయినా తామిద్ద రికీ తెలిసిన హ్యారీ తటస్థపడి, "హ్యా వెంట్ యు మెట్ బిఫోర్?" అంటూ యథావిధిగా "ఇంట్రడక్షన్" లాంఛనాన్ని నడపనిదేవారు ఒకరి నొకరు పల కరించుకోరు. హ్యారీ సంధానకర్తృత్వం లేకుండానే టాం, డిక్‌లకు మాటలు కలవాలంటే, అందుకు ఏ రెండు మూడు వారాలో కొంత తంతు నడవాలి. ముందు కొన్ని రోజుల తాము మార్గమధ్యంలో తటస్థపడినపుడు నవ్వీనవ్వనట్టు చిరునవ్వు నవ్వాలి. తర్వాత కొన్ని రోజులు చిరునవ్వు నవ్వుతూ, తమ హ్యాటుల అంచులను యెత్తీయెత్తనట్టు కాస్తపైకెత్తుతూ వుండాలి. ఆపైన కొన్ని రోజులు "గుడ్ మార్నింగ్" "గుడ్ ఈవినింగ్" లతో సరిపుచ్చాలి. ఆ తర్వాత ఎవరో వొకరు చొరవ చేసి సంభాషణకు ఉద్యమించాలి. అప్పుడైనా "ఫైన్ డే" అనో, వెదర్" అనో వాతావరణ వర్ణనతో ప్రారంభించాలి. ఇంత దీర్ఘమైన ఈ

తంతు నడపడానికి వీలులేక, వెంటనే పలకరించుకోవలసిన అగత్యం కలిగితే "పార్డన్ మి" అంటూ క్షమాభిక్ష కోరుతూ ఉపక్రమించాలి.

"ఇంట్రడక్షన్" లేనిదే ఒకరినొకరు పలకరించుకొనరాదని ఇంగ్లీషు వారి కున్న ఈ సంప్రదాయ ప్రాముఖ్యాన్ని ఇతరులు తరచు అవహేళన చేస్తూవుంటారు. నట్టి నడి సముద్రంలో పెద్దతుఫానులో చిక్కి ఒక నౌక భళ్ళున బ్రద్దలై పోయిందట. ఇద్దరింగ్లీషువారు తప్ప దానిలోని వారందరు సముద్రం పాలై పోయినారట. పర్వతాల వలె లేస్తూ పాతాళానికి కూలిపోతున్న కెరటాలలో తలమునక లౌతున్నా పక్కా రెండు గంటలసేపు మాట్లాడుకోనే లేదట. ఆ తర్వాత వారిద్దరిలో ఒకరు తెగించి రెండవ వాడిని సమీపించి, అపరిచితుని పలకరించడానికి ఏదోఒక కుంటి సాకు కల్పించుకోవాలి కనుక, అక్కడికి కొన్ని వేల మైళ్ళ దూరంలో వున్న సౌథాంప్టన్ ఓడరేపు ప్రసక్తి తెచ్చి, "పార్డన్‌మి! దయచేసి సౌథాంప్టన్‌కు దారి చెప్పగల రటుండీ!" అని అడిగాడట!

కొత్తవారిని పలకరించడానికి ఇంతగా కొట్టుమిట్టాడడం ఇంగ్లీషువారి సాంప్రదాయం కాగా, కొత్తవాడు కనబడ్డమే పాపంగా అతడిని బోనులో ముద్దాయికంటె హీనంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేయడం మన సంప్రదాయం. "మన దేవ్వూరు?" ప్రశ్నతో ఈ కఠిన పరీక్ష ప్రారంబం మౌతుంది. తర్వాత వచ్చే ప్రశ్నలు "మన పేరేమిటి? కులమేమిటి? గోత్రమేమిటి? తండ్రి యెవరు? ఆయన బాగా వున్నారా? ఏమి చేస్తుంటారు?" వగైరా, అటుపిమ్మట "అన్నదమ్ము లెంతమంది? అక్కచెల్లెళ్లో? అందరికీ వివాహాలైనవా? ఏయే వూళ్ళిచ్చారు? పొలం పుట్రా వున్నవా? ఏ పాటి? పాడి వున్నదా? చదువుకుంటున్నావా? ఉద్యోగంలో ప్రవేశించావా? చదువుతుంటే, ఏమి చదువు? ఉద్యోగమైతే, అదేమి ఉద్యోగం? జీతమెంత? పైసంపాదన ఏమైనా వుంటుదా? అబ్బే! పై సంపాదన లేకపోతే, జీతపురాళ్ళేమి సరిపోతాయి?" ఈ విధంగా ఈ ప్రశ్న పరంపరకు అంతే వుండదు. "మన దేవ్వూరు?" అని కలుపుగొట్టుతనాన్ని వెళ్ళబోసుకుంటూ పరామర్శను ప్రారంభించే పెద్ద మనుషులలో కొందరు మరొక నిమిషానికో రెండు నిముషాలకో "మన పిల్ల లెంతమంది?" అని ప్రశ్నించడం కూడా కద్దు!

పనిలేని పని కల్పించుకొని అపరిచితులైనవారు మన పుట్టుపూర్వోత్తరాలను విచారించడాన్ని నావలెనే సహించలేని నా మిత్రుడొకడు రైలులో ఒకనాడు ప్రయాణం చేస్తుండగా అతని కెదురుబల్ల పై కూర్చున్న పెద్దమనిషి "మన దేవ్వూరు?" అంటూ మామూలు కథ కుపక్రమించాడు. వెంటనే ఇతడు తనది ఫలా-

ఊరని చెప్పి, అంతటితో ఆగక, తన పేరు ఫలానా తన తండ్రిపేరు ఫలానా, తన ఉద్యోగం ఫలానా, తన జీతం ఫలానా, తన సంతానం ఫలానా, వగైరా, వగైరా లన్నీ గుక్కతిరగకుండా చదివేసి, "నన్ను గురించి ఇంకేమైన భోగట్టా కావాలేమో సెలవివ్వండి-మనవి చేసుకుంటాను" అంటూ గుడ్లు వురిమాడు. ఇందుకు ఆ పెద్దమనిషి రవ్వంతైనా తెల్లబోలేదు సరిగదా, మందహాసం చేస్తూ, అయ్యా! తమరు కోపగించనంటే మరొక్కటే ప్రశ్న. తమ తల్లి గారు తమకెన్ని పలాల వసపోశారో దయచేసి కాస్తచెబుతారూ?" అని అడిగాడు.

అపరిచితులను వారి పుట్టుపూర్వోత్తరాలను గురించి అడ్డదిడ్డంగా ప్రశ్నించే మన దేశాచారానికి అవనీనాథులు కూడా అతీతులుకారనే చెప్పాలి. ధర్మరాజు సన్న్యాసి వేషంతో విరటుని కొల్వుకూటానికి వచ్చాడో, లేదో-

ఎయ్యది జన్నభూమి, గుల మెయ్యది, యెయ్యది యున్నచోటు, పే

రెయ్యది, మీర లిందులకు నిప్పుడు వచ్చినదానికింగతం

బెయ్యది, నాకు నంతయును నేర్పడగా నెఱిగింపుడున్న రూ

పయ్యది.....

అని ఆయనను మత్స్యభూపాలుడు ప్రశ్నల జడివానతో ముంచెత్తుతాడు. "ఎయ్యది జన్మభూమి?" అని ప్రారంభించడంలో పోనీ తప్పలే దనుకోండి. కాని, ఆ వెంటనే "కులమెయ్యది?" అని నిగ్గదియ్యడం తగునా? అవి కుల ధర్మాలకు, కులవృత్తులకు "ఢోకా" లేని రోజులు-దీన్ని నేను కాదనడం లేదు. కులధర్మాలను, కులవృత్తులను కాపాడ్డం అప్పటి రాజుల ప్రథమ కర్తవ్య మని కూడా నాకు తెలుసు. కాని, ఆ కాలంలోనైనా చూస్తూ చూస్తూ సన్న్యాసిని "కులమెయ్యది?" అని ప్రశ్నించడంఅనౌచితి కాదా? ఎంత జాగ్రత్తగా " మేకప్" చేసుకున్నా మారువేషం సరిగా కుదరనందునే ధర్మరాజు సన్న్యాసి కాడని విరటమహారాజు అనుమానించాడని అనుకోడానికి అది వేసుకున్న వేషం కాదయ్యె పాండవాగ్రజుడు "కర కమలంబులు మొగిచి ఫాల భాగంబునం గదియించి సంప్రార్థనంబుగా వినయ వినమిత మస్తకుండు" అయ్యేసరికి ధర్మదేవత అనుగ్రహంతో "ఉన్న యునికిన సన్న్యాసిరూపం" అల వడిందయ్యె! కేవలం దైవానుగ్రహం వల్ల కలిగిన మారు రూపు చూచీ చూడగానే రహస్యం బట్టబయలు చేసేదిగా వుంటుందా? పోనీ అలవాటులో పొరపాటు చొప్పన "కుల మెయ్యది?" అని విరటుడు యతీంద్రుని అడిగాడనే అనుకుందాము. కాని, ఒక చెంపను "జగము లెల్లను నేలగ జాలు తేజ

మా మువ్వురతోడి జోడి" అని మెచ్చుకుంటూనే "నాకు నంతయును నేర్పడగా నెఱిగింపుడున్న రూపయ్యది" అనడం సమంజసమా? "కల్లబొల్లికబుర్లు చెప్పేవు సుమీ!" అనే ధ్వని దీనిలో లేదా?. ఈ ధ్వని కలదు కనుకనే-

ఉన్న రూప పలుక నన్నరు లెక్కడ
గలరు? తో చినట్లు పలుకు వలుక
నైన చందమయ్యె, నంతయుకా కంత
పట్టి చూడగలరె యెట్టివారు?
అని ధర్మరాజు జవాబు చెప్పడం జరిగింది.

సంసారులనైనా, సన్న్యాసులనైనా ప్రశ్నల వర్షంతో పలకరించడం పరిపాటి కాబట్టే, సిద్ధుడు తారసిల్లగానే ప్రవరాఖ్యుడు "ఎందుండి ఎందుబోవుచు నిందులకేతెంచినార లిప్పుడు?" అని నిల వేస్తాడు. మరొక క్షణానికి ఆ కాస్తలో కలిగిన పరిచయాన్నే పురస్కరించుకొని-

ఏయే దేశములన్ జరించితిరి మీ
రేయే గిరుల్ చూచినా
రేయే తీర్థములందు గ్రుంకిడితి రే
యే ద్వీపములో మెట్టినా
రేయే పుణ్యవనాళి గ్రుమ్మరితి రే
యే తో యధుల్ డాసినా
రా యా చేటుల కల్గు వింతలు మ
హత్మా? నా కెఱింగింపరే
అని వెంటబడతాడు.

ఆర్చేవారూ, తీర్చేవారూ కాకపోయినా పని కట్టుకుని మన యోగక్షేమాలను గుచ్చిగుచ్చి అడిగే వారిలో కొందరు అతి ప్రేమను, వినయాన్ని నటించగా, మరి కొందరు నిక్కు లెక్కు పోతారు. చూస్తూచూస్తూ కొత్త వారిని పట్టుకొని "ఏ గి " అనలేరు. కాని "ఏమండీ" అనడం తమ ఘనతకు భంకరంగా తోస్తుంది. ఈ చిక్కు నుంచి తప్పుకోడానికి "మనదేవూరు? ఎక్కడికి ప్రయాణం? ఏమిటి విశేషాలు?" అంటూ "ఏ" కాని, "ఏమండి" కాని వాడ నవసరం లేకుండా ప్రశ్నలు వేస్తారు. ఈ పాటి లౌక్యం తెలియని మరికొందరు "ఏ గొడుగూ!" ఏ కావడీ! ఏ బండీ! "ఏ మోపూ"! మొదలైన ప్రయోగాలను ఆయా సంద

ర్భాలను బట్టి చేస్తుంటారు. వెనకటికి ఒక పెద్దమనిషి ఒక కమ్మటూరుగుండా తాటాకు గొడుగు వేసుకొని వెడుతున్నాడట. అప్పుడు వెనుక నుంచి ఆవూరి ఆసామి ఏ గొడుగూ!! ఏ గొడుగూ" అంటూ పిలిచాడట. ఆ పిలుపులను చెవిపెట్టకుండా తనదారిన తాను పోతుంటే అదే కేకవేస్తు వెంటబడ్డాడట. ఇక లాభంలేదని ఆ పెద్దమనిషి ఆగి పోయి తన వెంట బడిన వ్యక్తి దగ్గరికి వచ్చేవరకు ఆగి, తీరా దగ్గరికి వచ్చిన తర్వాత "కమ్మకు పుట్టి కమ్మకు పెరిగావ్; కమ్మ పిలిస్తే పలకవా?" అని తన తాటాకు గొడుగును నేలకు విసిరి విసిరి కొట్టాడట.

పొరుగూరు మనిషి తమ వూరుగుండా వెడుతుంటే, మీ దేవ్వూరని, ఎక్కడికి వెడుతున్నారని వెంట తరిమి కూడా విచారించడం ఈ నాడు అమర్యాద గాను, అసభ్యంగాను పెక్కుమందికి తోచినా, ఒకనాడు దీనితో పెద్ద అవసరం వుండేదనే అనుకుంటాను. తరచి చూడము గాని, ప్రతి ఆచారానికి వెనక ఏదో అవసరం దాగే వుంటుంది. ఆ అవసరం వున్నంతవరకు అది సదాచారం; అది తీరిన వెనక దురాచారం. ఉదాహరణకు భ్రూణ, శిశు హత్యలనే చూడండి. ఈనాడు వీటిని మనం క్షంతవ్యం కాని మహాపరాధంగా పరిగణిస్తాము. కాని, మానవుడు వ్యవసాయ వృత్తి నెరుగని రోజులలో, ఒకేస్థానాన్ని అంటిపెట్టుకుని వుంటే క్షుధార్తికి లోనుగావలసిన రోజులలో, ఆహారాన్వేషణకై స్థానం నుంచి స్థానానికి నిత్యం పరిభ్రమించినా అందరికీ అన్నివేళల కడుపునిండుగా తిండీ తిప్పలు దొరకని రోజులలో సంతానాభివృద్ధి శాపంలా నే తోస్తుండేది. ఇందువల్ల భారమని తోచిన సంతానాన్ని పుట్టుక ముందో, పుట్టిన వెనకో సఫా చేసివెయ్యడం సదాచారంగా వుండేది. నాటి పరిస్థితులు మారిపోయినా, నాటి మానసిక స్థితిలోనే మిగిలిపోయిన కొన్ని ఆటవికజాతులలో భ్రూణ, శిశుహత్యలు ఇటీవలివరకు - యాభై, నూరేళ్ళ క్రితం వరుకు - జరుగుతూనేవుండేవి. విక్టోరియాకు (ఆస్ట్రేలియా) చెందిన బాంగె రాంగ్ జాతివారు పుట్టిన పిల్లలలో సగం మందిని పుట్టుకలోనే చంపివేసేవారు. చాకోకు (దక్షిణ అమెరికా) చెందిన లెంగ్వా తెగవారు ఒక్కొక్క కుటుంబానికి ఏడేళ్ళకు ఒక బిడ్డ చొప్పున మాత్రం బ్రతకనిచ్చేవారు. మరొక తెగవారు-ఆచిపోన్ తెగవారు- కుటుంబానికి ఒక పిల్లను, ఒక పిల్లవాడిని మాత్రం మిగిల్చి, మిగిలిన బిడ్డలందరినీ ఈ లోకంలో అడుగు పెట్టడమే తడవుగా పరలోకానికి సాగనంపేవారు, చూస్తూ, చూస్తూ కన్నబిడ్డల గొంతు పిసకడం కష్టం కాబట్టి, కొన్ని తెగలవారు ఏదో ఒక మూఢ నమ్మకంతో గుండెను దిటువుచేసుకునేవారు. ఎదురుకాళ్ళని పుట్టని పిల్లల నందరనీ (ఎదురు కాళ్ళను పుట్టడం సర్వసామా

న్యంగా జరగదు) కీడు మూడ్చ గలవారని బాండ్లై తెగవారు మట్టుబెట్టేవారు. కామ్‌ఛాడల్ తెగవారు గాలివానలో పుట్టినవారి నందరిని ఖతం చేసేవారు. మడగాస్కర్ లోని కొన్ని తెగలవారు మార్చి ఏప్రియల్ నెలలలోను, బుధ, శుక్ర వారాలలోను, ఏ మాసంలోనైనాసరే చివరి వారంలో పుట్టినవారి నందరనీ ప్రాణా లతోనే పూడ్చిపెట్టేవారు. లేదా నీళ్ళపాలు చేసేవారు. ఇతర ఆటవిక జాతులు కొన్నింటిలో కవలలు పుడుతే, బాలింతరాలు పెడదారి తొక్కి వుండాలిని, లేక పోతే ఒకే కాన్పులో ఇద్దరు బిడ్డలు పుట్టివుండరని, బిడ్డల జంటను కాని, వారిలో ఒకరిని కాని చంపివేసేవారు. ఎక్కడికో ఖండాంతరాలకు పోవడం దేనికి పూర్వంమన దేశంలోనూ ఈ ఆచారం వుండేది. గంగ శంతనునిద్వారా తనకు కలిగిన అష్టసంతానంలో ఏడుగురిని నీళ్ళపాలు చెయ్యలేదా? కనీసం ఎనిమిదవ కొడుకును (భీష్మని) బ్రతకనివ్వమని భర్తకోరినందుకే అలిగి ఆయనకు విడాకు లిచ్చి వెళ్ళిపో లేదా? ఉత్తర హిందూస్థానంలో నూరేళ్ళక్రితం వరకు తొలిచూలు బిడ్డను "గంగామాయీ"కి అర్పిస్తూండేవారు. కట్నాలకు, కాన్కలకు తూగలే మని రాజస్థాన్, గుజరాత్ ప్రాంతాలలో కొన్ని కులాలవారు ఆడపిల్లలనుపుట్టగానే చంపివేస్తూవుండేవారు.

పొరుగూరు మనిషి కనబడగానే వెంటతరిమి ప్రశ్నల వర్షాన్ని కురిపించే ఆచారం కూడా అవసరం కొద్దీ సదాచారంగా మిగిలిపోయినట్టిదే. ప్రపంచంలో రెండు, మూడు శతాబ్దాల క్రితం వరకు శాంతి భద్రతలు తక్కువ. మన దేశంలో శతాబ్దిక్రితం కూడా కన్నం దొంగతనాలు, దార్లు కొట్టడం వగైరాలు తరచు జరుగుతుండేవి. పట్టపగలే ఊళ్ళను దోచుకోవడంసంభవిస్తూడేది. కొత్త ముఖం ఊళ్ళో కనబడితే ఏ దొంగల ముఠాకో, ఏ దోపిడిగాండ్ర జట్టుకొ వేగులవాడు కావచ్చునన్న అనుమానానికి తావుండేది. దుక్కలాంటివాడు వాకిటిలోకి బిచ్చానికి వస్తే "దొంగ వెధవలు: పగలుచూచి రాత్రి కన్నం వేస్తారు" అనే మాట ఈ నాటికీ కొన్ని పల్లెలలో వినవస్తుంది. పాతకాలంలో భద్రత తక్కువ కాబట్టే పరాయిమనిషి మంచి చెడ్డలను విచారించడం ప్రాణావసర మయ్యేది.

అపరిచితుడైన ప్రతి వ్యక్తిని దొంగగానో, తాగుబోతుగానో శంకించవలసిన అవ సరం ఈ నాడు లేదు కాబట్టే, ప్రభుత్వ గూఢచారి అనుమానితుని విచారించే ధోరణిలో మన ముక్కు ముఖాలైనా యెరుగనివారు మన పుట్టు పూర్వోత్తరాలను గురించి ప్రశ్నల వర్షం కురిపిస్తే, మనము చికాకు పడతాము. అవసరం తీరినంత త్వరగా ఆచారం తొలగదు. అయినా, ఒక్కొక్క సంవత్సరం గడచినకొద్దీ "మన

దేవ్వూరు?" ప్రశ్న మరింత తక్కువగా వినబడుతున్నది. నా మట్టుకు నాకు ఇది శుభసూచకం.

*

# పరధ్యాస

"ఓమ్మకైనను పుట్టును రిమ్మ తెగులు" అన్నారు. ఆ తెగులు పరాకు చిత్తగించ డమేనని నా గట్టి అనుమానం. అన్యధాయత్త చిత్తుడైవున్న క్షణంలోనే బ్రహ్మ ఈ సృష్టిని చేసివుండాలి. లేకపోతే, అంతులేనన్ని అవకతవకలు జరిగేవా? బంగారానికి వన్నెవుంటే తావి లేదు; కోయిలకు పాటవుంటే రూపు లేదు; గులాబికి కాడ చివర పువ్వు, కాడంతా ముళ్ళు. ప్రభాతం మురిపెం పది నిమిషాలు, ఇంద్రధనస్సు బులపాటం నూటికో కోటికో. భగవత్సృష్టిలో అధికులమని విర్రవీగే మన విషయంలోనైనా ఒక తీరూ, దారీ వుంటేనా! యవ్వన మిచ్చినవాడు వృద్ధాప్యాన్ని ఎందుకు పంపకం చెయ్యాలో చెప్పండి! బ్రతుకు నిచ్చినవాడు చావు నెందుకు తగలాటం చెయ్యాలో ఆలోచించండి! ఈ విధంగా అన్నీ వైరుధ్యాలే, అన్నీ ద్వంద్వాలే, వెలుగు వెనకే చీకటి కలిమి వెన్నంటే లేమి, వృద్ధి వెన్ను తన్నుతూనే క్షయం, సంతోషం సరసనే దుఃఖం, ప్రేమ గర్భంలోనే ద్వేషం, అమృతకలశంలోనే విషబిందువు! సృష్టి చేసే సమయంలో ఎంత పరాకుగా లేనిదే ఆ పాడు బమ్మ ఇన్ని పొరపాట్లు చేసివుంటాడు?

బ్రహ్మకే ఇంత పరాకుగా వుండగా ఆయన పుట్టించిన మనకు ఇందులో ఒక

అంశ వుండడం అబ్బురమా? తక్కిన వారి మాట ఏమో గాని, నేను తరచు పరాకు చిత్తగిస్తుంటాను. ముట్టించిన సిగరెట్టు ముట్టించిన వెంటనే పరాకుగా పారవేసిన కొత్తదాన్ని ముట్టించడం, కాల్చుతున్న సిగరెట్టుతో కట్టుగుడ్డలు కాల్చు కోవడం నాకు మామూలు. తిండి తినిందీ, లేనిదీ తరచు జ్ఞాపకం లేకపోవడం నాకు రివాజు. కొన్నగంట లోపల గొడుగును పారవేయడం, రోజున్నర లోపల ఫౌంటెన్ పెన్ జారవిడవడం నా ఠికార్డు. పోస్టు బిళ్ళలను డబ్బాలో వేసి, ఉత్త రాన్ని వెనక్కి భద్రంగా తెచ్చింది మాత్రం ఒక్కసారే! అయితే ఈ విషయంలో నన్ను మెరుగనిపించిన ఒక మిత్రు డున్నాడు. కాలేజీ ప్రిన్సిపాల్‌గా వనిచేస్తూ పొరుగూరు వెళ్ళి, మరివారం రోజులు సెల విప్పించ వలసిందిగా కాలేజీ కమిటీ ప్రెసిడెంటుకు, తాను తిరిగి వచ్చేవరకు ఇల్లూ, పిల్లలూ జాగ్రత్త అనిప్రాసి, ఒకరి కవరులో మరొకరి ఉత్తరం పెట్టి భద్రంగా పోస్టు చేశాడు.

మన లోపాలను చూచి లోకులు నవ్వుతుంటే పెద్దవారితో పోలిక పెట్టు కొని వాటిని కమ్మివేసుకోడానికిప్రయత్నించడంమానవ స్వభావం. పొగ త్రాగడం తప్పంటే మాజినీ, మార్క్సులు మొదలుకొని చర్చిల్, స్టాలిన్‌ల వరకు అన్నిర కాల పెద్దలలో ఎందరో పొగత్రాగేవారు కారా అని రెట్టిస్తాము. చుట్టముక్కలకు డబ్బులు లేక, మాజిని "క్లోక్" ను తాకట్టు పెట్టాడని కూడా చెబుతాము. మితిమీరిన ఖర్చులు తగవంటే దొస్తవస్కీ, గోల్డుస్మిత్ వగైరాలు పొదుపరితనానికి ప్రఖ్యాతి గన్నవారా అని అడుగుతాము. లేదా, చిత్తరంజన్‌దాసుకు, ప్రకాశం పంతులుకు ఏమి లోపం వచ్చిందంటాము. మళ్ళీ మాట్లాడితే, పోయిన నిన్నను గురించి, పుట్టని రేపు గురించి దిగులు పడక, నేటి మాధుర్యాన్ని నేడే గ్రోలాలని ఉమర్‌ఖయాం చెప్పిన పద్యాన్ని అప్పచెబుతాము. పెద్దలతో పోలికలు వెతుక్కో వడం ప్రారంభిస్తే కమ్మివేసుకోరాని లోపమే అసలు వుండదేమో! జూదం ఆడరాదంటే. "నల, ధర్మజులే ఆడలేదా?" అని తప్పుకోవచ్చు; మద్యపానం కూడదంటే "దేవతలు సురాపానం చేసేవారు కారా?" అని తిరగ్రించ వచ్చు.

తక్కిన లోపాలను నేను సమర్థించినా, సమర్థించక పోయినా, పరాకు చిత్త గించడం తప్ప కాదంటాను. అది ఒక లోపమైనా కాదంటాను. ఏ పనిలోనో, పాటలోనో చిత్తం పూర్తిగా హత్తుకున్నందువల్లనే తక్కిన ప్రపంచాన్ని మరిచి పోవ డం తటస్థిస్తుంది. పరధ్యాస అనే పదాన్ని బట్టే ఇది స్పష్టం. ధ్యాస ఒక దానిపై పూర్తిగా లగ్నమైనందునే తక్కిన అన్నింటిపట్ల పరధ్యాస ఏర్పడుతుంది. ప్రాచీనకాలపు ఖగోళ శాస్త్రజ్ఞుడు థేల్స్-గ్రీసు కడుపున పుట్టిన ఏడుగురు మహా

మేధావులలో ఒకడుగా ఈయన లెక్కకు వస్తాడు- బాలకుడై వుండగా నక్షత్రాల వంక తదేకంగా చూస్తూ, మురుగు నీళ్ళ గుంటలో బొక్క బోర్లగా పడినందుకు కడుపు చెక్కలుగా నవ్వి, "నీ కళ్ళ యెదటునే వున్నవాటిని కానలేని నువ్వు చుక్కలను చూచి ఏమి తెలుసుకుంటావురా"? అని వెక్కిరించినవారు తెలివి తక్కువవారు ఆ బాల్యంగా చుక్కలపై అంతగా చూపు పెట్టబట్టే, తర్వాత కొన్ని శతాబ్దాలకుగాని ధ్రువపడని అనేక ఖగోళశాస్త్ర సత్యాలను ఆయన జోస్యం చెప్పినట్టు చెప్పగలిగాడు.

పరధ్యాన పాపమేమీ కాకపోయినా, మరీ మితిమీరితే ప్రాణాలకే అది మోసం తేవచ్చు. ప్రాచీనకాలపు ప్రసిద్ధ గ్రీక్ గణిత శాస్త్రవేత్త అర్కిమిడిస్ (ఆయన తన కాలానికి గొప్ప ఇంజనీర్ కూడా) రేఖా గణితంలో తల మునకలౌతూ అన్న పానీయాల మాటే మరచిపోయేవాడు. పట్టబలవంతంగా స్నానాగారాలకు (పబ్లిక్ బాత్స్) లాక్కు వెడితేనే తప్ప స్నానమైనా చేసేవాడు కాడు. అక్క డైనా తలంటుకుంటూ, నూనె పట్టించబడిన తన వొంటిమీద త్రిభుజాలూ, చతుష్కోణాలూ గీసుకుంటూ వుండేవాడు. ఇంతగా తన లోకంలో తాను బ్రతికే వాడు కాబట్టే చివరికి ఆయన కటిక చావు చావవలసి వచ్చింది. తమ నగరం సైరక్యూస్‌ను రోమనులు పట్టుకున్నప్పుడు అర్కిమిడిస్ తన లెక్కల గొడవలో తానున్నాడు. "ఓ ముఖ్య సేనాని మార్సెల్లస్ నిన్ను తోడుకు రమ్మన్నా డయ్యా!" అంటూ వచ్చిన రోమన్ సైనికుడు పెట్టిన పొలికేకలైనా ఆయన చెవిని దూరలేదు. గొంతు పగిలేటట్టు అరచి అరచి, "నీ కింత పొగరా!" అని పట్టరాని కోపంతో కత్తిదూసి, ఆ సైనికుడు అర్కిమిడిస్‌ను ముక్కముక్కలుగా నరికి వేశాడు.

పరధ్యనంవల్ల ప్రాణోపద్రవం కలిగే ఖట్టాలకంటె పరిహాసాస్పద సన్నివేశాలలో పడవలసివచ్చేవే హెచ్చు. మహా శాస్త్రవేత్త సర్ ఐజక్ న్యూటన్ అసలు పరా కుతోనే పుట్టినాడేమోనని అనిపిస్తుంది. "గొర్రెలను కాస్త మేపుకు రారా! అబ్బాయ్" అని వాళ్ళ అమ్మ పంపిస్తే, వాటి దారి వాటిదే కాగా, తాను పుస్తకం చేత బుచ్చుకుని ఏ చెట్టుకిందో గంటలకొద్ది చతికిలబడేవాడట. పెద్ద వాడై, ప్రఖ్యాత పురుషుడైన వెనక, ఒకనాడు నలుగురు మిత్రులను విందుకు పిలిచి "వైన్"తెస్తానంటూ 'సెల్లర్' లోకి వెళ్ళి వేరే ఆలోచనలో పడిపోయి, ఖిందును, దానికి వచ్చినవారిని మర్చిపోయాడట. తననే విందుకు పిలవగా బయ ల్దేరి వెడుతూ, మార్గమధ్యంలో చిత్తం అన్యధాయత్తం కాగా, తప్పదారికి తిరిగి,

పది వీధులు చుట్టి, ఇంటికి చేరుకున్న సందర్భాలు అనేకం వున్నవట. ఒక పర్యాయం గుర్రంపై ఎక్కడికో ప్రయాణమై వెడుతుండగా, కొండ దాటవ లసి వచ్చిందట. పాపం, గుర్రాన్ని శ్రమ పెట్టడం దేనికని కిందికి దిగి, కళ్ళెం పట్టుకుని దాన్ని నడిపించుకుంటూ పోయాడట. తీరా కొండ దాటి వెళ్ళిన తర్వాత చూచుకుంటే చేతిలో కళ్ళెమే మిగిలివున్నదట! మరొకమారు సరిగా ము నిసిషాలే కోడి గ్రుడ్డును ఉడక నివ్వాలనుకుని గడియారాన్ని పొయ్యిపై ంచి, కోడి గుడ్డును చేతబుచ్చుకున్నాడట.

ఆంగ్లకవి, రచయిత ఆలివర్ గోల్డుస్మిత్ పరధ్యానను గురించి ఎన్ని చిత్రకథ లున్నచో లెక్కలేదు. ఎడింబరోలో డాక్టరీ చదవడానికి వెళ్ళినపుడు, పెళ్ళిబేడా ఒకహోటలులో పెట్టించి షికారుకు బయల్దేరాడు. చిమ్మచీకటి పడేవరకు తిరిగిన తర్వాత, ఇక బసకు చేరుదా మనుకుంటే, ఆ వీధిపేరు, హోటలుపేరు ముందు కనులు విచారించి వుంటేనా! అదృష్టం బాగుండి, పెళ్ళి బేడా మోసిన కూలీ తటస్థపడబట్టి, గుడ్డా గుడుసూ, డబ్బూ దుగ్గాణీ, సమస్తం పోగొట్టుకుని అంగ లార్చవలసిన యోగం తప్పింది. ప్రసిద్ధి కెక్కిన తర్వాత ఒకమారు ఆయన లార్డ్ క్లేర్ అతిథిగా వుంటున్నాడు. అప్పుడొక పూట ఏమీ తోచక, భోజనాల వేళకు ముందు షికారు వెళ్ళాడు. కాళ్ళ గుదులు తీరే వరకు నడచిన పిమ్మట లార్డ్ క్లేర్ భవంతికి తిరిగి రావడానికి మారుగా, దానిపొరుగు నేవున్న నార్తంబర్ల్యాండ్ డ్యూక్ భవనంలో ప్రవేశించి, సరాసరి వెళ్ళి డైనింగ్ టేబుల్ వద్ద బైఠాయించాడు. ఆ పొరుగింటి పెద్ద మనిషి, ఆయన భార్య, తలకు సుపరిచితులైనందున వారూ లార్డ్ క్లేర్ అతిథులుగా వచ్చారన్న భ్రమతో వారితో లోకాభిరామాయణం ప్రారంభించాడు. ముందు తెల్లబోయినా, గొల్డ్‌స్మిత్ ఏమి తప్పచేసి వుంటాడో ఊహించుకుని, ఆ దంపతులు పిలవని పేరంటంగా వచ్చిన తమ అతిథిని ఏ మర్యాద లోపం లేకుండా చూచి పంపించారు.

పరధ్యాన గాథ లన్నింటిలో నాకు యెక్కువగా నచ్చేది గత యుద్ధానికి ముందు కొంతకాలం గ్రీస్‌కు డిక్టేటర్‌గా వున్న జనరల్ మోటాక్సన్ కథ. తాము కొత్తగా తెప్పించిన విమానాలను పరీక్ష చేద్దామని ఒకనాడు ఆయన పని పెట్టుకు బయల్దేరాడు. పైలట్‌ను తప్పుకోమని తనే ఒక విమానాన్ని నడుపుతూ చాలా చక్కర్లుకొట్టాడు. తర్వాత విమానాన్ని భూతలంపై దించబోతుండగా, పక్కనున్న పైలట్ "క్షమించాలి, జనరల్! ఇది నీళ్ళపై దిగే విమానం. మనం సముద్రంపై దిగడమే మంచిదేమో!" అని మెలుకువ చేశాడు. "నిజమే సుమీ! పరాకుగా

వుంటిని" అని మెటాక్సన్ సముద్రం వైపుకు మరలి, తిరిగి ఎట్టి పొరపాటు చెయ్యకుండా భద్రం గానే విమానాన్ని నీళ్ళపై దించాడు. పిమ్మట "మృదువుగా నన్ను పొచ్చరించి నందుకు నిన్ను మెచ్చుకుంటున్నానోయ్!" అంటూ విమానం తలుపు తెరచి చటుక్కున కిందికి దిగి, బుటుక్కున మునక వేశాడు!

మన రాజులు బహు పొచ్చుగా పరాకు చిత్తగించే వారేమో! కాకపోతే! "బహుపరాక్" అని వారిని తరచు పొచ్చరించడం.... వుండండి! కమురు వాసన కొడుతున్నది... పంచె కాలిపోతున్నట్టున్నది!

*

# నిద్రాదేవత

వాతకు కూర్చున్నాననన్నమాటే కాని, చెడ్డ బడలికగా వున్నది. కళ్ళు మండుతున్నవి, కన్నురెప్పలు బరువుగా వున్నాయి. ఎండముఖం చూడ్డం కష్టమై పోతున్నది. తల నాదు, కీలు కీలూ నమలుతున్నది, నడుం నిలవడంలేదు, అసలు శరీరమే బరువెక్కినట్టుగా వున్నది, ఆవలింతలు వస్తున్నవి. ఇన్ని లక్షణాలు చెప్పినమీదట ఇక రోగనిదానం కష్టం కాదు. అది నిద్రలేమి. రాత్రి సరిగా నిద్రపట్టనే లేదు. చదువుతున్నపుస్తకం పదేపదే అవతల పెట్టాను. పడక కుదు రుతుందేమోనని దిండ్లను ఇటు మార్చాను, అటు మార్చాను. కళ్ళు గట్టిగా మూసుకున్నాను. వొడ్డును పట్టిన చేపవలె మంచంలో అశాంతంగా కొట్టుకున్నాను. లేచి పచార్లు చేశాను. ఇన్ని పాట్లు పడగా కంటిమీద రెప్ప పడేసరికి చుక్కలు వాలిపోయాయి; తొలికోడి కూసింది.

పెట్టి పుట్టిన కొందరికి ఇట్టే నిద్రపడుతుంది. వీరు "ఓ" అంటే, నిద్ర "కో" అంటుంది. తల్లి వొడిని చేరే బిడ్డకంటే వడిగా వీరు నిద్రాదేవత పర్యంకాన్ని చేరతారు. కంచు గంటలా ఈ క్షణం వరకు మోగుతూనే వుంటారు. మరొక క్షణంలో కిమిన్నాస్తి! మాట ఎప్పుడు మానివేస్తారో గురకఎప్పుడు మొదలిడతారో

చెప్పడం మహా కష్టం. ఆ వేళకు మనమే మాట్లాడుతూ వుండడం, తాము "ఊ" కొడుతూ వుండడం తటస్థిస్తే మాగన్ను వేస్తూనే "ఊ", ఊ"అంటూ వుంటారు. అయితేమరొకలోకం సరిహద్దుల నుంచి వచ్చే సవ్వడి, పోను పోను మందగిస్తుంది. చివరికి అసలే నిలిచి పోతుంది. తర్వాత కొన్నిక్షణాలకుగాని మనం మాట్లాడుతున్నది గాలికేనని తెలుసుకోము. నిశీథి నిస్తబ్ధత వెంటనే ద్విగుణీకృత మైనట్టు తోస్తుంది. అది మనలను వెక్కిరిస్తుట్టే అనిపిస్తుంది. ఆ వెక్కిరింతకు మనం ఉడికిలము; మందహాసం చేస్తాము. లేదా, "ఎంతఅదృష్టవంతుడు" అని నిద్రపోతున్న వ్యక్కిని చూచి కొంచెం అసూయపడతాము. చూస్తూ చూస్తూ వుండగానే ఇలా చిటుక్కున నిద్రపోగలవారు సర్వసాధారణంగా చీకూ చింతా లేనివారై వుంటారు; కల్లా కపటం లేని వారై వుంటారు; లేదా, నోటు నాలుక లేనివారై వుంటారు. తూర్పూ పడమరా తెలియని వారై వుంటారు.

జాగ్రదవస్థనుంచి సుషుప్త్యవస్థలోనికి వెళ్ళడమంటే చేతన జగత్తునుంచి అచేతన ప్రపంచం లోనికి పాదం పెట్టడం. నిద్రపోయిన ప్రతి సారీ మనం మృత్యు లోకంలోకి తొంగిచూచినట్టే చెప్పవచ్చు. నిద్ర తాత్కాలిక మృతి కావడం వల్లనే మనకు తెలిసినంత వరకు అన్ని భాషలలోను " దీర్ఘనిద్ర", "శాశ్వతనిద్ర" మృత్యువుకు పర్యాయపదాలైనాయి. క్రిష్టఫర్ మార్లో మృత్యు నిద్రాదేవతలకు అక్క చెల్లెళ్ళ వరస పెట్టాడు. అవి కవల బిడ్డలని అలెగ్జాండర్ పోప్ అన్నాడు. నిద్రస్వభావాన్ని చర్చించడం ద్వారా బృహదారణ్యకోపనిషత్తులో జనక మహారాజుకు అత్మ పరమాత్మ తత్త్వాలను వివరించడానికి యాజ్ఞవల్క్య మహాముని ప్రయత్నించాడు

నిద్రకు, మృతికి ఇంత దగ్గర చుట్టరికం వున్నందున సుషుప్త్యవస్థలో పడాలంటే మృత్యులక్షణాలు కొన్ని ఆవహించాలి. వీటిలో ముఖ్యమైంది శూన్యమైనమనస్సు. ఎవరికి మనస్సు శీఘ్రగతిని, సులభంగా శూన్యం కాగలదో వారికే శీఘ్రగతిని, సులభంగా నిద్రపడుతుంది. చీకూచింతా వున్నా, కల్లాకపటం వున్నా మనస్సుకు నిద్రవుండదు. మనస్సుకే నిద్రలేనప్పుడు మనిషికి నిద్ర ఎలా పడుతుంది? స్వామి ద్రోహానికి వొడిగట్టి డంకన్‌ను హత్య చేసిన వెంటనే మెక్బత్‌కు "ఓరీ! మరి నిద్ర పోవద్దు. హత్యకు నిద్ర వుంటుందటరా!" అని ఎవరో గద్దించినట్టు వినబ డుతుంది? అతడు వులిక్కి పడతాడు. నిజానికి ఆ మాటను పలికింది మరెవ్వరో కాదు; అతని మనస్సే. చీకూ చింతాలేనివారే, కల్లాకపటం యెరగనివారే సుఖ నిద్రకు నోచుకున్నవారని అదే అతని నోటు పలికిస్తుంది.

నిర్మలమైన మనస్సుకు ముందుగా చెప్పుకోవలసింది పసి పాపలనే. అందు

వల్లనే అనుకుంటాను, వారికి ఇళ్ళే నిద్రపడుతుంది, హాయిగానూ నిద్రపడుతుంది. ఒకరి జోలికి శాంతికీ పోక, తను రెక్కల కష్టంపై తాము బ్రతికే పాటకపు జనం మనస్సుకూడా అద్దంలా స్వచ్ఛమై, స్నిగ్ధమై వుంటుంది. కటిక నేలపై సయితం మేను వాల్చడమే తడవుగా వారూ గాఢ నిద్రలో మునుగుతారు. "సింహాసన ద్వాత్రింశిక" చెప్పినట్టు-

పనిచేసి గంజియైనను, యంబలైనను
నెద చల్లగా ద్రాగి, యెచటనైన
పడియుండి, వెన్నెల గుడిపాట పాడగా
వేదల కాత్మ సంప్రీతి కలుగు.

మెదడు తక్కువైనవారికే తేలికగానే నిద్రపడుతుంది. జడత్వానికి నిద్రతో చెలిమి కలదు కనుకనే మంద బుద్ధిని "నిద్రమొహం" అని గేలి చేస్తారు. జడబుద్ధి కాబట్టే కుంభకర్ణుడు నిద్రపోతే వరసగా ఆరు నెలలు అదే పనిగా నిద్రపోయేవాడని మన పురాణాలు చెబుతున్నవి. మైమరచి నిద్రపోవడాన్నే మెచ్చుకోవలసి వస్తే, అందరికంటె ఎక్కువగా మనం కుంభకర్ణుని మెచ్చుకోవాలి. కాని, అతడిని మెచ్చు కోము; "నిద్రాదేవత నిన్ వరించెగదరా, నిర్భాగ్యుడామోదరా"? అని అపహసిస్తాము.

మాట్లాడుతూ, మాట్లాడుతూ నిద్రపోవడంకాని, మైమరచి నిద్రపోవడం కాని విశేషాలు కానేకావు. కోరినప్పుడు, కోరినంతసేపు నిద్రపోగలగడమే నిజానికి విశేషం. నెపోలియన్‌కు ఈ అద్భుతశక్తి వుండేదట. గుర్రమెక్కి-నుడికారపు గుర్రాన్ని కాదు సుమండీ!నిజమైన గుర్రాన్నే-యుద్ధరంగంలో నిలిచివుండగానైనా సరే నిద్రాదేవతను ఆవాహనచేస్తే త్రుటిలో సాక్షాత్కరించేదట. ఒక్క అయిదు నిమిషాలపాటే నేడ తీర్చుకోవాలని అనుకుంటే, అయిదు నిమిషాల తర్వాత ఠంచన్‌గా మెలుకువ వచ్చేదట. ఈ విద్యలో మన గాంధీజీ కూడా ఘటికుడే. ఏ జాతీయోద్యమానికో, ఏ పతితజన సముద్ధరణకో భిక్షాపాత్రిక చేతబట్టి, ఆ మూలనుంచి, ఈ మూలవరకు కుగ్రామాలనైనా దిగ విడవకుండా దేశ పర్యటన చేస్తూ, ఏ కాస్త విరామం దొరికినా ఆయన ఒక కునుకు తీసేవాడు. అది మిట్టమధ్యాహ్నం కానివ్వండి, అర్ధరాత్రే కానివ్వండి, "గాంధీకిజై" అంటూ చెవులు చిల్లులుపడేటట్టు భక్తజనులు కేకలు పెట్టడం తప్పకపోయినా, రెండు రైలుస్టేషన్‌ల మధ్య కావాలంటే ఆయన రెప్ప వాల్చేవాడు. కదుకుడు రోడ్డుపై పోతున్న కారు కుదుపుకు వొళ్ళు హూన

మైపోతున్నా రెండు పల్లెల మధ్య నిద్రలేని లోపాన్ని తీర్చుకునేలాలు. ఆర్నోలో చనిపోయిన పండిట్ మోతీలాల్ నెహ్రూ కళేబరాన్ని ఆయన స్వస్థలం - హోబాద్‌కు తెస్తుండగా వెంటనడిచిన కార్లలో ఒక దానిలో గాంధీజీ వున్నారు. అది నగం దారిలో బోల్తాకొట్టింది. దానిలోని వారందరు కొన్ని గజాలదూరం వెళ్ళి కుప్ప తిప్పలుగా పడ్డారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు నిద్రపోతున్న గాంధీజీ కళ్ళువిప్పి "ఏమి జరిగింది?" అని ప్రశ్నించాడు. కాని, జవాబుకైనా వేచివుండక అంతలోనే తిరిగి సుఖనిద్ర చెందాడు.

గాంధీ, నెపోలియన్‌లవలె కోరినప్పుడు కోరినంతసేపు నిద్రపోగలవారి కోవకు చెందాలంటే ఎంతో సంయమశక్తి కావాలి. తన మెదడు అరలరల భోషాణం వంటిదని, ఎప్పుడు ఏ అరతో పనిపడితే దాన్ని తెరుస్తానని, అరలన్నింటినీ మూసి వేయగానే తనకు నిద్రవస్తుందని నెపోలియన్ చెప్పేవాడట. మహాచంచలమైన మనస్సుతో ఇంతగా అధికారం సంపాదించాలంటే, ఎంతగానో ఏకాగ్రత కావాలి, కొంత వరకైనా జతేంద్రియత్వం కావాలి. ఈ లక్షణాలు తరచుగా కానవచ్చేది మహాపురుషులైన వారి లోను, మహాత్ములైన వారిలోను మాత్రమే. నిద్రాదేనికి బానిసలు కాక దానికి నాధులైదాన్ని తమ కనుసన్నల వర్తింప జేసుకోగలవారువీరే.

సర్వదా ఎందుకో, ఏదో అశాంతిపడని వాడు, "యెదలోపలి యెదలో" ఏవో తుపానులు రేగనివాడు మహాకవి కాలేడు. ఇందువల్లనే కావచ్చు, మహాపురుష లక్షణాలను కొన్నింటిని చూపగలవారైనా దాదాపు అందరుమహాకవులు కంటినిండా నిద్రకు నోచుకోనివాళ్ళే. షేక్స్‌పియర్ దైనందిన జీవితక్రమాన్ని గురించి మనకు తెలిసిన వివరాలు బహు స్వల్పమైనా, ఆయన నాటకాలలో కనబడే నిద్రా దేవత స్తోత్ర పాఠాలను చూస్తే, ఆమె కృపావీక్షణం ఆయనకు లేదనే అనుమానం చవలసివస్తుంది. మస్తుగా తిని, మస్తుగా నిద్రపోతున్న బానిసను ఈసడిస్తూనే, అతనిలె రాజులు కమ్మని నిద్రకు నోచుకోలేరుగదా అని పెన్రీ ది ఫిఫ్త్ ఇసు మంత బాధను బయట పెడతాడు. కర్తవ్య నిరూపణను చేసుకోలేక హామలెట్ చిత్తవైకల్యాన్ని పొందివున్న సమయంలో అతని ఆవేదన మృత్యుదేవతో, కనీసం దాని సోదరి నిద్రాదేవతో ఎందుకు తనను చెంతకు తీయదనే! మెక్బెత్ ఆ క్రోశంకూడా తాను నిద్రకు దూరమైనా ననే. షేక్స్‌పియర్ సృష్టించిన ఈ పాత్రలందరు నిద్రాదేవత చూపు ఎంత చల్లనిదని, ఎంతగా శ్రమను బాపగలదని, ఎట్టి క్లేశాలపైనైనా ఎంత పూర్తిగా విస్మృతీయవనిక లాగివేయగలదని, దాన్ని తలచుకొని తలచుకొని నిట్టూర్చినవారే. ఇందువల్లనే షేక్స్‌పియర్ నిద్రా

దేవతా వరణం లో నేర్పులేని వాడని అనిపిస్తుంది. మరొక ఆంగ్లేయ కవి, అలెగ్జాండర్ పోప్, నిద్ర తన రెప్పలకు దూరమైందని స్పష్టంగా చెప్పకున్నాడు. బాల్జాక్ తన రాత కోతలన్నీ రాత్రి పన్నెండు కొట్టిన తర్వాతే చేసేవాడు. తెల్ల వార్లూ గంటంలా దీపం పెట్టుకుని మాక్సిం గోర్కీ వ్రాస్తూ కూర్చుంటే, ఏమి కుట్రలు చేస్తున్నాడో అని జారస్ట్ గూఢచారులు కన్నులలో వత్తులు వేసుకొని కాపలా కాస్తుండేవారు. ఇటీవలి మన ఆంధ్ర రచయితలలో శ్రీ కందుకూరి వీరేశలింగంగారు కంటినిండా నిద్ర నెరుగనివారే.

మహాకవినని, మహా రచయితనని ఇచ్చకానికైనా నన్ను మెచ్చుకున్న వారు లేరు. అయినా, అదేమి పాపమో నాకు త్వరాగా నిద్ర పట్టదు. ఒకసారి నిద్రపట్టినా ఒకపట్టాన మెలుకువ రాదు. అయితే, గతరాత్రి పట్టుమని రెండు గంటలైనా నిద్రపోకముందే పాడు సూర్యుడు పడిపోతున్నట్టు పరుగునవచ్చి, వసా రాలో పడుకున్న నా కళ్ళలోకి తన కిరణాల సూదులతో పొడిచాడు. అందువల్లే చాలీ చాలని నిద్రవల్ల ఇంతగా బడలిక.

*

# ఆయం, గాయం

వేదాలు పౌరుషేయాలా? అపౌరుషేయాలా? అవి పౌరుషేయాలే అని డాక్టర్ భీమారావ్ అంబేడ్కర్ వాదం. తన వాదమే నిజమని ఏ హిందూ నియెజకవర్గంలో నైనా ఆయన ఎన్నికకు నిలబడితే మాత్రం (అనుకూలంగా పడేవి నాబోటివారు ఏ నలుగురో వేసే నాలుగు వోట్లే కాబట్టి, ధరావతు మొత్తం దక్కదు. వేదాలకర్తృత్వం కనీసం కొందరి దృష్టిలోనైనా వివాదాంశం కావచ్చు గాని, సామెతలు నిస్సంశయంగా పౌరుషేయాలే. "పెద్దలు చెప్పినట్టు" అని ముందో, వెనకో తగిలించకుండా వాటిని ఉదహరించడం సామాన్యంగా జరగనే జరగదు. అయితే, పెద్దలందరు సభ తీర్చి, తర్జన భర్జన పడి, ఖండనమండలనలు చేసి, సామెతలను సృష్టించరు. వాటి కర్తృత్వం బహుళ జనులది కాదు; ఎవ్వనిదో ఒక్కనిదే. ప్రాపంచిక జీవితానుభవం ప్రేరేపణ వల్ల ఒక్కొక్కప్పుడు ఆప్రయత్నంగా ఒక్కొక్కని నోట వచ్చిన మాటకే-ఆ మాటవచ్చిన వేళావిశేషం మంచిదైతే ఆ సామెత గౌరవం దక్కుతుంది.

నిప్పులో చెయ్యి పెట్టడం శుద్ధ తప్ప. ఆ తప్ప చేస్తే చెయ్యి కాలడం నిజం. ఏదో దోషం చెయ్యబట్టి దాని దుష్ఫలితాలను భోగిస్తున్నా, అది చెప్ప కోరాని తప్పిద మైతే, తాము ఏ పాపం యెరగక పోయినా తమకు సంకటాలు

చుట్టుకున్నట్టు నాటక మాడేవారు లక్షోపలక్షలు. ఈ నాటకాన్ని చూస్తున్న ఏ పెద్దమనిషో, నిప్పజోలికి పోనిదే చెయ్యి కాలదన్న సంగతి చప్పన జ్ఞప్తికిరాగా (ఆనాడో ఆ క్రితం రోజునో పొరపాటున ఆయన చేతిని కాల్చుకొని వుండవచ్చు), "నిప్ప ముట్టనిదేచెయ్య కాలదు" అని తల పంకించాడు. ఆక్షణంలో ఒక లోకోక్తి ఆవిర్భవించింది. నిప్ప ముట్టనిదే చెయ్యి కాలదనడం ఎంత వాస్తవమైనా, ఆ మాట ముఖాన అని వేస్తే, నిర్దోషి నన్నట్టు నటన చేస్తున్నవాడు సహించగ లడా? అతని దుస్సహనం చూచి, ఇంకొక పెద్దమనిషి "నిజమాడితే నిష్కారం" అంటూ తన దారిన తాను చక్కా పోయాడు. అప్పుడు మరొక సామెత ప్రపంచలో పడింది. ఈయన వలె జారుకోడానికి వీలులేని వేరొక పెద్దమనిషి, ఎప్పటికైనా అప్రియ సత్యాన్ని చెప్పడం తనకు తప్పనపుడు దాగుడు మూతలు దేనికని "అంత్య నిష్కరం కంటె ఆది నిష్కరం మేలు" అని తాను చెప్పదలుచు కున్న దాన్ని కుండ బ్రద్దలు గొట్టినట్టు చెప్పివేశాడు. ఆ ఘడియ, ఆ విఘడియ మరొక లోకోక్తికి జన్మలగ్నమైంది. ఈ విధంగా వేర్వేరు సన్నివేశాలలో ప్రాపం చికానుభవం ప్రయత్న రహితంగా పలికించే సూత్రప్రాయపు పలుకులే లోకోక్తులన్నీ. నిఘంటువు లేమన్నా, వ్యాకరణాలేమి చెప్పినా, లోకం ఉక్తి లోకోక్తి అనుకోవడం పొరపాటు; లోకానుభవపు ఉక్తే లేకోక్తి.

అయితే, సర్వజనుల లోకానుభవం ఏకవిధమైంది కానేరదు. మానవ ప్రవృ త్తులు విభిన్నం. ప్రవృత్తులలోని విభిన్నత్వం ప్రకారం వివిధ మానవులవి విభిన్నాను భవాలు కావడం కద్దు. ఉదాహరణకు, దుష్టుని వేలెత్తి చూపమంటే ఆ పని ధర్మరాజకు చేత కాలేదు; శిష్టుని వెదకి తెమ్మంటే అది దుర్యోధనుని తరం కాలేదు. దీని తర్వాత "తప్పలేని వారు ధరణిలో లేరు" అనే లోకోక్తి కర్తృత్వాన్ని ధర్మరాజు ఆపాదించ గలమా? "ఎంచబోతే మంచమంతా కంతలే" అనే సామెత దుర్యోధనుని పోలిన వాని నోటి నుంచే ఊడి పడిందని తీర్మానించుకోమా? దాతృత్వ గుణం వున్నవాడే, చేతికి ఎముకలేనివాడే "ఇస్తే చెడేదిలేదు; చస్తే వచ్చేది లేదు" అని చెప్పివుండాలి; ఆ ధర్మబుద్ధి లేనివాడే, పైసాపోతే ప్రాణం పోయినట్టు గిజగిజలాడే వాడే "బెల్లం వుండేచోటే ఈగలు ముసురుకునేది" అని ఈసడించి వుండాలి. సౌమ్యుడైనవాడే "నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది" అని పలికివుండగా, పొగరు బోతు మాత్రమే "నోరువుంటే పోరు గెలుస్తాడు" అని ప్రల్లదించి వుండాలి.

ప్రవృత్తులలోని విభిన్నత్వమే కాక, జీవనోపాధికై చేసుకొనే వృత్తులలోను,

సంఘంలోగలప్రతిపత్తులలోను కానవచ్చే విభేదాలుకూడా పరస్పర విరుద్ధమైన లోకానుభవాలకు, తద్ద్వారా పరస్పర విరుద్ధ లోకోక్తులకు కారణభూత మౌతాయి. "కూలికి వచ్చి పాలికి మాట్లాడినట్టు" అని సామెత కట్టినవాడు కలవాడే అయివుండాలి; "దంచినమ్మకు బొక్కిందే కూలి" అని కూలీనాలీ చేసుకుని పొట్టపోసుకునే కష్టజీవి తప్ప మరొకరు అని వుండడానికి వీలే లేదు. "రాజుల సొమ్ము రాళ్ళపాలు," "రాజులు తలచుకుంటే దెబ్బలకు కొదవా?," "రాచపీనుగ తోడులేకుండా చావదు," "పెద్దపులి యెదటనైనా పడవచ్చుగాని, నగరివారి యెదట పడరాదు-" ఇత్యాది లోకోక్తులు ప్రజలకు మాత్రమే తోచినవి కాగా, "రాజు మెచ్చినది మాట, మగడు మెచ్చినది రంభ," "దెబ్బకు దెయ్యమైనా జడుస్తుంది," "కోల ఆడితే కోతి ఆడును" మొదలైనవి రాజులకు, లేదా, రాజబంధువులకు, రాజాశ్రితులకు వినా తదన్యులకు స్ఫురించి వుండవు. "దండమయ్యా బాపనయ్యా అంటే, మీ తండ్రినాటి పాతబాకీ యిచ్చిపొమ్మన్నాడట" "బాపనవాని కొలువూ, తెల్లగుర్రపు కొలువు కొలవకూడదు" వగైరా సామెతలు పుట్టడానికి బ్రాహ్మణులు కారకులు కావడం ఎంత అసంబద్ధమో, "మాలాయగారికి కోలాయగారు గురువు," "మాలకూటికి లోబడ్డా పప్పుబద్ద దొరకుదు" మొదలైనవి పంచములు సృష్టించి వుండడం అంత అసంభవం.

విభిన్న వ్యక్తుల లోకానుభావాలలోని వైరుధ్యం లోకోక్తులలో విధిగా ప్రతిబింబిస్తుంది కనుకనే "కులమింటి కోతి అయినా మేలు" అంటూ ఒకటి సలహా చెప్పగా "కోడలు నలుపైతే కులమంతా నలుపు" అని మరొకటి హెచ్చరిస్తుంది. "చదువుకున్న వాడికంటె చాకలివాడు మేలు" అని ఒకటి వెక్కిరించగా, "విద్యా విహీనః పశుః" అని వేరొకటి నిర్దయగా నరుకుతుంది. "మొక్కై వంగనిదే మానై వంగుతుందా?" అని ఒకటి శంకను వెలిబుచ్చగా, "తుళ్ళే ఎద్దే గోనె మోసేది" అని ఇంకొకటి ఉపశమనం కలిగిస్తుంది. "నమిలే వానికంటే మింగేవాడు దొడ్డవాడు" అని చెప్పేది, "పరుగెత్తి పాలుతాగేకన్నా నిలుచుండి నీళ్ళుతాగడం మేలు" అని చెప్పె దానికి పూర్తిగా తలక్రిందులు. వెతకాలే కాని ఒక సామెతను ఖండించడానికి మరొకటి తప్పక దొరుకుతుంది. ఇంత మాత్రంచేత సామెతలను శుష్కవచనాలని త్రోసి వెయ్యడానికి వీలులేదు. ప్రతి లోకోక్తిలోను కొంత సత్యం- అర్ధసత్యం-వుంటుంది. అది కొన్ని సందర్భాలకే, లేదా, కొందరు వ్యక్తులకే అతుకుతుంది.

సామెతలలో వుండేది సగం నిజమన్న సంగతి నాకు నెమరుకు వచ్చింది

పోయిన షక్షం రోజులలోనే. ఎనాడో ఎడమ పాదంపై పుట్టిన పుండుకు ఇక కత్తి చూపక తప్పదని డాక్టర్లు నిర్ణయించారు. వారి నిర్ణయంపై అప్పీలు లేదు కాబట్టి ఆపరేషన్ చేయించుకున్నాను. పాదానికి పాదం పెద్ద గాయమైపోయింది. కాని, "ఆయం తప్పితే గాయమంత సుఖంలేదు" అని మన సామెత ఆశపెడు తున్న సుఖంలో ఆవగింజలో అరవయ్యో వంతైనా నాకు కనబడ్డంలేదు. ఇందువల్ల ఈ సామెత చెప్పిన వాడు వొత్తి సోమరిపోతు అనే నిశ్చితికి నేను రాక తప్పిం దికాదు. పరమ బద్ధకస్తులు తప్ప తక్కినవారు ఈ సామెత నుదహరించలేరన్న తీర్మానానికి నేను వచ్చింది కూడా పోయిన షక్షం రోజులలోనే.

ఏ జబ్బుచేసినా, దానిమూలంగా ఎంతో కొంత బాధ తప్పదు. జలుబేమి, బిసాయిదేమి, అది చేస్తే కళ్ళవెంట నీళ్ళు, చెడ్డ దగ్గు, తలనొప్పి-ఎంత బెడద! రొంప ముదిరి కాస్త ఉష్ణం తగిలితే కాళ్ళతీత, వొళ్ళు నొప్పులు, నోరు చేదు-ఇట్టి కొత్త బాధలెన్నో. ఇక దీర్ఘవ్యాధులేవైనా వస్తే, అప్పుడు పడవలసిన యమయాతన పగవానికైనా వద్దు. కాగా, గాయం జబ్బేది కాదు. తగిలేచోటు, తప్పేచోటు గాయానికి లేవనుకోండి. అందువల్లనే "ఆయం తప్పితే" అన్న షరతును సామెత పెడుతున్నది. ఆయువు పట్టులో తగులనంతవరకు, మరీ మోపుగా తగలనంత వరకు, కట్టువిప్పి దాన్ని తిరిగి కట్టినప్పుడు తప్ప (ఇదైనా కొత్తలోనే) గాయం ఏ బాధా పెట్టదు. అయినా, గాయం వంక చెప్పకుని మంచంయెక్కి మామూ లుగా చేస్తూండే పని పాటలు తప్పించుకోవచ్చు; రాజాధి రాజువలె అన్నీ మంచం వద్దనే జరిపించుకోవచ్చు. గాయం పూడాలి కనుక, సుష్ఠుగా భోజనం అమరా లని కోరవచ్చు. జీర్ణశక్తికి వచ్చిన లోపం వుండదు కాబట్టి, తినే ప్రతిముద్ద వర్రగా లోపలికి దిగుతుంది. కంఠపూర్తిగా ముప్పొద్దులా భోజనం చేసి, మంచం వడిమిని కూర్చుని, ఆత్మసుత్తి, పరనిందలతో కేవలం స్వర్గసుఖాన్నే అనుభవించ వచ్చు. అందువల్లనే "ఆయం తప్పితే గాయమంత సుఖం లే" దన్న సామెత పుట్టింది.

గాయం వేరుచెప్పి రాజాధిరాజభోగం వెళ్ళబొయ్యాలంటే రెండు విషయాలు ముఖ్యంగా కావాలి. ఒకటి, వైకం; రెండు, పరిచర్య చేసేవారు. ఈ రెండిం టిలో మొదటిదే మరీ ముఖ్యం. చేతులో నాలుగు డబ్బులు గలగలలాడుతూ వుంటే పరిచర్యకు నిలబడేవారి కేమి కొదవ! చుట్టాలూ, పక్కాలూ హాజర్ గావచ్చి నిలబడతారు. దిండు సర్దేవా రొకరైతే, పక్కదులిపేవారు మరొకరు, పండు వలిచేవా రొకరైతే, దాన్ని నోటికి అందించేవారు మరొకరు. "ఉస్సో"

అంటే చాలు విసనికర్ర అందుకునే వారొకరు, వొళ్ళు పిసికేవారు మరొకరు. ఈ సపర్యలు బాధాకరంగా పరిణమించేవరకు జరిగినా జరగవచ్చు. ఇలా హోజ ర్‌గా నిలబడే చుట్టాలూ పక్కాలూ లేకపోతే నౌకర్లను, చాకర్లను రూపాయికి మరొక రూపాయి పారవేసి ఎందరినైనా పెట్టుకోవచ్చు. ఇందువల్లనే "ఆయం తప్పితే గాయమంత సుఖంలేదు" అనే సామెతకు "ఆయముంటే గాయమంత సుఖంలేదు" అని పాఠాంతరం కూడా వున్నది.

అయితే, గాయానికి తగలవలసిన వారు, తగలగూడనివారు అనే భేదాలులేవు. అది ఎవరికైనా తగలవచ్చు. ఎవరైనా దాని కారణంగా మంచం యెక్కవలసిరావచ్చు ఇలా మంచం పట్టేవారందరు ఆయానికి కొదువ లేకపోయినా పని దొంగలు కాకపో వచ్చు. "తిట్టే నోరు, తిరిగే కాలు వూరుకోవు" అని చెప్పనే చెప్పారు. చేసే చెయ్యీ ఇదే మాదిరిగా వూరుకోలేదు, పని అంటే కొందరికి ఎంత బెంగో, పని లేకపోతే కొందరికి అంత బెంగ, పని లేకపోతే, వారికి అసలు బ్రతుకే లేనట్టుగా వుంటుంది. పింఛను పుచ్చుకోమంటే కొందరికి ఎంత సంకటంగా వుంటుందో చూడండి. సర్వీసు గడువు దాటినా, ఏడాది తర్వాత ఏడాదిచొప్పున పిల్లైనన్ని పొడిగింపుల కోసం తాపత్రయ పడతారు. గత్యంతరం లేక చివరికి పింఛనుదారుల ముఠాలో చేరినా, ఎంతో కాలం ఫించను తినబోరు. రోగం రోష్ఠాకనబడదు. అయినా రోజు రోజుకు శుష్కించి పోతారు. శరీరదార్ఢ్యంతో పాటు మానసిక పాటవంకూడా త్వరత్వరగా సన్నగిలి పోతుంది. దేనిపైనా శ్రద్ధపెట్టలేరు; ప్రతి దానిలోనూ వెలితే కనబడుతుంది. దినం యుగంగా గడుపుతూ, ఏదో ఒకనాడు హఠాత్తుగా వెళ్ళిపోతారు. "గుండెజబ్బు" అని ఇందుకు సర్వసాధారణంగా కారణం చెబుతారు. నిజమే! చేసేచేతికి చేతిలో పనిలేకపోతే అది గుండెను ఎంత క్రుంగదీసి వేస్తుంది!

పని లేకపోతే పిచ్చెత్తే నాకు ఈ షష్టం రోజుల సోమరితనం నా పాలిట నర కమే అయింది. దానినుంచి కాసేపైనా తప్పించుకోడానికి చేసిన ప్రయత్నమే ఈ వ్యాసం. పెద్దలు సామెత చెప్పినట్టు, ఇది "పనిలేని నుంగలి పిల్లితల గొరగడం" కాలేదుగదా? ఇక్కడ మరొక సందేహం. పెద్దలన్నమాట "పనిలేని మంగలి పిలిచి తల గొరిగాడు" అని కాదుగదా?

*

# "తెలుగు లెస్స"

"అబ్బ!".... ఉద్దేశం అంతర్జాతీయ రాజకీయాలను గురించి వ్యాసం వ్రాయలని. మరొక ప్రపంచ యుద్ధభయం, ఆ యుద్ధానికి విపుల సన్నాహాలు, ఇంతలోనే ఈ మహోపద్రవం తిరిగి దాపురించడానికి మీరు కారణమంటే మీరు కారణమని పరస్పరనిందారోపణలు-వీటిని విడిచిపుచ్చితే నేడు అంతర్జాతీయ రాజకీయాలు దాదాపు శూన్యం. ఇందువల్ల "ప్రపంచం ఇంచుమించు రెండు స్కంధావారాలుగా విభాజిత మైపోయింది. ఒక షక్తాన్ని మించి మరొకటి పెద్ద సైన్యాలను కూర్చుకొనడానికి ప్రయత్నిస్తున్నది; ఒకదానిపై పోటీగా మరొకటి ఘోర మారణాయుధాలను కూర్చు కొంటున్నది; ఒకదాని చుట్టూ మరొకటి యుద్ధాశ్రయాల సేకరణకై పట్టుదలచూపుచున్నది. మరొక మహాయుద్ధం కారుమేఘాలు క్రమ్ముకొని వస్తున్నవి. తూర్పున అప్పుడే ధగధగ మెరుపులు, ఫెళఫెళ ఉరుములు...." ఇట్టి ధోరణిలో ఈ వ్యాసం బహుశా ప్రారంభమై వుండవలసింది. మరొక విధంగా ప్రారంభిస్తే పెక్కుమంది పాఠకుల దృష్టిలో అది పకడ్ బందీ యెత్తుగడ కాబోదు.

కాని వ్రాయడానికి కూర్చుని, కాగితంపై నేను కలం వెట్టిసరికి అప్రయత్నంగా దొర్లిన మొదటిమాట "అబ్బ" అని. పొద్దస్తమానం పనిచేసిచేసి పూర్తిగా

అలిసిపోయిన నా అంగాంగం-నా లోని ప్రతి జీవకణం-విడిచిన నిట్టూర్పే నాకు తెలియకుండా నాకలం వ్రాసిన ఈ "అబ్బ" అయివుండాలి.

"అబ్బ" అనే మాటలోని గొప్పతన మిదే! ఆ పదం మన ప్రవృత్తిలోనే అంతర్లీనమై వుంటుంది. అది మనతో పుడుతుంది; మనలో పుడుతుంది. నోరు లేని పసిపాపకూడా "అబ్బబ్బబ్బబ్బ" అని అంటుంది. చూడగా భాషకు అసలు పునాదే ఈ "అబ్బ" అనే పదమేమో అని తోస్తుంది. పసిపాప "అబ్బబ్బబ్బబ్బ" అని కేరింత లాడుతూవుంటే, మేనమామ "నీ అబ్బ" అని పరిహాస మాడ తాడు. అట్టి సమయంలో తన భాషా పరిజ్ఞానంకూడా ఈ "అబ్బబ్బబ్బబ్బ"తోనే ప్రారంభమైందని అతడికి గుర్తురాదు. ఈ నాటికైనా తన సమస్త మానసికావస్థ లను ఈ పద ప్రయోగంతోనే తాను వ్యక్తపరుస్తూవుంటానని అతడికి స్ఫురణకు రాదు. తనకు బాధ కలిగితే, అతడు "అబ్బ" అని మూలుగుతాడు. కోపం వస్తే, "అబ్బ" అని గద్దిస్తాడు. విసుగు పుడితే, "అబ్బ" అని కసురుతాడు. దుఃఖం పెల్లుబికితే, "అబ్బ" అని నిట్టూరుస్తాడు. కష్టాలు తీరితే, "అబ్బ" అని గుండె తేలిక పరుచుకుంటాడు. జుగుప్సా కరమైన ద్రుశ్యంనుంచి "అబ్బ" అంటూ ముఖం తిప్పివేసుకుంటాడు. ఇంతేకాదు. అందమైన పువ్వు కనబడితే, "అబ్బ" అంటూ ఎంత అందంగా వుంది" అని మెచ్చుకుంటాడు. ఎండలో మాడి మాడి నీడను చేరినంతనే "అబ్బ! ప్రాణం ఎంత హాయిగా వుంది" అని సంతోషిస్తాడు. ఆతురత ప్రకటించాలన్నా, ఆశ్చర్యం ప్రదర్శించాలన్నా 'అబ్బ' తిరిగి శరణ్య మౌతుంది. అవహేళన చేయగోరితే ఈ పదాన్నే స్వల్పంగా మార్చి "అబ్బో!" అంటాడు. బాధలో, కోపంలో, లేదా, విసుగుదలలో తరతమ భేదా లను చూపించాలన్నా "అబ్బబ్బ" అనే అంటాడు. ఇంతదూరం చెప్పడం దేనికి అతడు "అబ్బ" పదప్రయోగం చేయని సందర్భాలు బహు స్వల్పం; దాదాపు లేవనే చెప్పవచ్చునేమో!

అయినా తానింతగా ఈ పదాన్ని ప్రయోగిస్తున్నానని అతడంగీకరించడు. "అబ్బ" పెదవులనుంచి రాదు;కడుపులోనుంచి వస్తుంది. దాని స్థానం నిఘంటు వులో కంటె మిన్నగా నరాలపట్టులోనే. అందుచేత దాని ప్రయోగం ఆ లోచనా పూర్వకంగా కాదు; సహజంగా! దాని వినియోగం ప్రయత్న ఫలితంగా కాదు; సంకల్పానికి అతీతమైన శక్తుల ప్రేరేపణ ద్వారా! ఎంత దీర్ఘసమాసాలైనా ఎంతటి క్లిష్టసమాసాలైన, అవిఅన్నీ ఒక యెత్తు: ఇదొక్కటీ ఒక యెత్తు. ఆ సమా సాలు ఎంత కృత్రిమమో, అంత పేలవం; ఇది ఎంత సహజమో, అంత

అర్థవంతం. సరియైన పట్టులో వాడుకోవడం తెలిసివుండాలేగాని, "అబ్బ" అనే చిన్ని ముక్కముందు నోరుతిరగని పెద్ద పెద్ద సమాసాలన్నీ కేవలం దిష్టి పిడతలే.

"అబ్బ" అనే పదంవలె "అమ్మ" అనేది కూడా మనలో పుట్టిందే; మనతో పుట్టిందే! దానివలె దీన్ని కూడా ఎన్నో అర్థాలలో, ఎంతో భావగర్భితంగా ప్రయోగించవచ్చు. నిజానికి దానికంటె ఇదే హెచ్చు పటుత్వంవున్న పదం. నడుం విరిగేపాటి పెద్ద కష్టాలేవైనా చుట్టుకొనగా, "అబ్బ"అని నిట్టూర్చినప్పటికంటె, "అమ్మ" అని దీర్ఘనిశ్వాసాన్ని విడిచినప్పుడుగుండె బరువు త్వరగా తగ్గుతుంది. నరాలను పట్టిన పాడు జబ్బులేవో ప్రాణాలను తోడివేస్తుండగా "అబ్బ" అని మూలిగినప్పటికంటె "అమ్మ" అంటూ పక్క కొత్తిగిలినప్పుడు బాధోపశమనం అధికంగా కలుగుతుంది. "అమ్మ"ను మించి ఆప్యాయమైన మాట మరొకటి లేదు కనుకనే కొందరు పెద్దవారు, ముఖ్యంగా, పాతకాలపువారు, లింగభేదాన్ని కూడా పాటించక "నీ పేరేమిటమ్మా? నీవేమి చదుకొంటున్నావమ్మా?" అని మగ పిల్లలనే నోరారా పలకరిస్తారు. 'అమ్మ' ఎంత రాతిగుండెకైనా రాచబాట కాబట్టి, గిద్దెడు గింజలైనా పుట్టని ఈ గడ్డురోజులలో కూడా "అమ్మా! సందాకవళం" అంటూ బిచ్చగాళ్ళు పది గడపలకు తిరిగి ప్రాణాలు నిలుపుకోగలుగుతున్నారు. మన గుండెలపై రాజ్యాన్ని చెయ్యగోరే మహాకవుల చేతులలో ఈ రెండక్షరాల చిట్టి పొట్టి మాట తిరుగులేని బ్రహ్మాస్త్రమే! పోతనామాత్యుడు-

అమ్మా మన్ను దినంగ నే శిశువునో,
యాకొంటినో, వెట్టినో,
నమ్మంజూడకు వీరి మాటలు మదిన్,
నన్నీవు గొట్టంగ వీ
రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు.....

అని అల్లరికాన చిన్ని కృష్ణుడిచేత అనిపించేసరికి, చెంపపై ఒక చరుపు చరచడానికి యశోదాదేవి యెత్తిన చేయి యెత్తినట్టే మిగిలిపోతుంది సరిగదా, ఆమెతో పాటు మనంకూడా కరిగిపోతాము. తిక్కనామాత్యుడు "అమ్మా నిను నమ్మి చాల విషమంబగు నివ్వనవాస మీతడుం బూనగ నియ్యకొంటి" నని అరణ్యవాస ప్రయాణ సందర్భంలో కుంతీదేవిచే సహదేవుని ద్రౌపదికి ఇల్లడ వెట్టిస్తుండగా, కన్నప్రేమకంటె పెంచిన ప్రేమ ఎంత ఎక్కువని ఒక్కసారి తలపుకు రాగా, కడగొట్టు కొడుకును వీడలేక వీడలేక వీడుకున్న ఆ తల్లి కివలె మనకు కూడా "బోరన నశ్రులుగ్రమ్మె" కొంటవి. ఇష్టదేవతాది ప్రార్థన పద్యాలు లెక్కతేవన్ని

వుండగా, ప్రత్యేకించి దుర్గకు మ్రొక్కులిడిన మెన్నో వుండగా-

అమ్మల గన్నయమ్మ,ముగు
రమ్మల మూలపుటమ్మ, చాలబె
ద్దమ్మ, సురారులమ్మకడు
పాఅడిపుచ్చినయమ్మ, దన్నులో
నమ్మిన వేల్పులమ్మల మ
నమ్ములనుండెడియమ్మ దుర్గమా
యమ్మ.....

అని భాగవతంలో వున్నదే మన హృదయాలకు పూర్తిగా హత్తుకుపోవడం "అమ్మ" పదంలోగల అందా లన్నింటిన్ని అది పుణికి పుచ్చుకున్నందునే.

"అమ్మ" "అబ్బ" లతో పోల్చదగింది కాకపోయినా, "ఇది" సయితం ప్రత్యేకంగా యెన్నదగిందే. ఎక్కడ ఏ మాట తోచకపోయినా దాన్ని రామబాణం వలె సంధించవచ్చు: ఎక్కడ ఏ చిక్కు ఎదుర్కొన్నా దాన్ని విష్ణుచక్రంవలె అడ్డువెయ్యవచ్చు. ఒక ఉదాహరణ చూడండి; "నాకు అసలే ఇదిగా వుండగా నువ్వుమరింత ఇది చేశావంటే, నేను అసలే ఇద్దైపోతాను." ఈ వాక్యంలో "ఇది" వచ్చిన మూడుచోట్ల దానికి మున్నూరు విడివిడి అర్థాలు చెప్పుకోవచ్చు. మొదటి "ఇది" మనస్సు చికాకు మొదలుకొని, మిన్నువిరిగి మీదపడినంతటి మహాకష్టంవరకు ఏదైనా కావచ్చు. రెండవ "ఇది" తాటాకులు కట్టడం మొదలుకొని, తంటాలు తెచ్చిపెట్టడం వరకు ఏ దైనా కావచ్చు. మూడవ "ఇది" మరింత క్రుంగిపోవడం మొదలుకొని, కన్నీళ్ళ పర్యంతం ఏదైనా కావచ్చు. ఊహకు ఇంత "ఇది" గా అవకాశమివ్వడమే ఈ "ఇది" మాటలోని గొప్పతనం. ఇంత "ఇది" గా మనకు చక్కచక్కని మాటలుండగా అయినచోట, కానిచోట సంస్కృత సమాసాలను వాడి తేట తెలుగును- అబ్బ!- ఎంత పాడు చేస్తున్నాము! ఇందువల్ల "దేశభాషలందు తెలుగు లెస్స" అనే ఘనతకు చేతులారా-అమ్మ!-ఎంత మచ్చ తెస్తున్నాము..... ఏదో ఇదిగా నడవ వలసిన ఈ వ్యాసం మరొక ఇదిగా నడిచింది. ఏమైనా ఇక్కడి కిది ఒక ఇదే కదండీ!

*

# సందేశాలు

"మా గ్రామ గ్రంథాలయ రజతోత్సవం, మా ఫిర్కా యువజన మహా సభ 15వ తేదీని జరుపుతున్నాము. రెండింటికి రెండు సందేశాలు మీరు తిరుగు టపాలో పంపించాలి. మాకు ఆశాభంగం కలిగించరనే మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాము" - ఇది నిన్న నా మిత్రుడొకడు వ్రాసిన లేఖ.

యుద్ధంవల్ల కలిగిన శతమానం చిక్కులలో జాబులు వేళకు చేరపోవడమొకటి. నిన్నటి నా ఉత్తరం సంగతే చూడండి. తిరుగుటపా వేళ మించిపోయిన తర్వాతగాని అది నాకు అందలేదు. ఏమైనా, ఏదో ఒక వేళకు నిన్ననే చేరింది. అక్కడికది చాలా నయం. తన తొందపపాటుకొద్దీ నా స్నేహితుడు టెలిగ్రాం పంపించివుంటే అది ఈనాటికైనా వచ్చేదో, లేదో! పొన్నేరిలో ఒక పెద్దమనిషి ఏప్రిల్ 16వ తేదీనాడిచ్చిన టెలిగ్రాం మే 28వ తేదీకి కాని మద్రాసు చేరలేదట! ముక్కాలు ముదుసలైనా ఈ వ్యవధిలో పొన్నేరి, మద్రసుల మధ్య తొంభైతొమ్మిది సార్లు ఆసులో గొట్టం తరిగినట్టు గిరగిర తిరిగివుండేది.

అయితే, నా స్నేహితుడు కోరినట్టు నేను నిన్న సందేశం-పొరపాటు సుమండీ!- సందేశాలు పంపించకపోవడానికి కారణం, అతడి జాబు తిరుగుటపా వేళదాటి

పోయిన తర్వాత చేరడం కాదు. కావలంటే నేను దీన్ని నా స్నేహితునికి ఒక సాకుగా చెప్పవచ్చు ననుకోండి. ఎన్ని చికాకులను తెచ్చిపెట్టినా, మరెన్ని చిక్కులను మెడకు చుట్టినా సాకు విషయంలో మాత్రం యుద్ధం మహోపకారం చేసింది.

"ఏ! తోటకూరకూ అంత గిరాకీ వచ్చింది!- మండబెట్టుకుంటున్నావ్!"

"యుద్ధ మొచ్చిందిగా, దొరసానమ్మా!- జర్మనోడి యుద్ధం".

"ఇదిగో యిస్తానని చేబదులు పట్టుకుపోయి ఎన్నాళ్ళైందిరా, తమ్ముడూ?".

"ప్రపంచం తల కిందులౌతుంటే ఇప్పుడేమిటయ్యా నీ తొందర!". "ఏమండీ! పిల్లలకు బట్టలు బొత్తిగా చిరిగిపోయాయే". "అహోరించండి! గజం పావలా చేసే గుడ్డ మూపాయి పెట్టినా దొరకడం లేదు. గుడ్లు ఇప్పటికే వెళ్ళుకొస్తున్నాయి-అ దేమైనాసరే నావల్ల కాదు".

"ఆఫీసుకు ఇంత లేటుగా దయచేశా రేమండీ, సార్?".

"వెళ్ళాం బిడ్డల్ని ఊరు పంపించి వేశానుగదండీ! హోటల్ వాడు పిండాకూడు వేళకు పెడితేనా? నన్నేమి చావమంటారు!" -ఈ విధమైన సంభాషణలు మనం ఈ నాడు ఎన్ని వినడంలేదు? ప్రతి విషయానికి, అది చిన్నదైనా, పెదదైనా, తిరుగులేని సాకుగా యుద్ధం ఉపకరిస్తు న్నది. ఈ దృష్టినుంచి చూడగలవారికి అది అక్కరకు రాని చుట్టం" ఎంతమాత్రం కాదు.

పుణ్యకాలం దాటిపోవడం నేను సందేశాలు పంపకపోవడానికి కారణం కాదంటే మరేమిటని అడుగుతారా? దాపరికం లేకుండా చెప్పాలంటే లౌక్యం. ఔను లౌక్యమే! మాట తబాబుకు, మోసానికి "లౌక్యం" అనేపేరు ఇప్పుడు పెట్ట బడుతున్నా నూరేళ్ళక్రితం కూడా దానికి ఈ దుష్టార్థాలు వున్నట్టు తోచదు. ఉద్యోగ సద్యోగాలు, ప్రాపంచిక వ్యవహారాలు--ఇట్టి అర్థాలనే దానికి సి.పి. బ్రౌన్ వ్రాసాడు. అతనికి ఇప్పుడు లౌకీకము లేదు' అంటే "అతనికి యిప్పుడు ఉద్యోగము లేదు" అని వివరించాడు. "నేను విశేష లౌకీకుడను కాను" అంటే "ప్రాపంచిక వ్యవహారాలు అంతగా తెలిసినవాడను కాను" అని మరొక వివరణ వ్రాశాడు. రాను రాను మరొకరితో వ్యవహరించడమే మోసం చెయ్యడంగా పరిణమించినందువల్ల కాబోలు, "వాడు మహా లౌక్యుడు" అంటే మహా తెలివితేటలుగల మోసగాడు సుమీ!" అనే ధ్వనివస్తున్నది. అయితే మనం మోసంచేస్తే, అది లౌక్యం; ఇతరులు లౌక్యం చేస్తే, అదేమో మోసం. సందేశాలు పంపించకపోవడంలో నేను

చూపిన లౌక్యం మాత్రం ఈ తరహాది కాదు; దాని చహరాయే వేరు.

అడిగిన వెంటనే కొందరు సందేశం పంపిస్తారు: అడగకుండా కూడా కొందరు పంపిస్తారు. సందేశం అడిగించుకోవడం, దాన్ని పంపించడం, ఫలానావారు పంపిన సందేశం ఫలానా సభలో సన్మానసంఘ కార్యదర్శి ఫలానావారిచే చదవ బడిందని తర్వాత పత్రికలలో ప్రకటన జరగడం-దీనిలో ఎంత పబ్లిసిటీ వున్నది! ఒక్కొక్కప్పుడు బుద్ధిహీనుడై ఆ సన్మాన సంఘ కార్యదర్శి సందేశా లన్నింటినీ సభలో చదవక, చాలా చాలామంది సందేశాలు చేరినవని ఒక్కముక్కలో కొట్టి వేస్తాడనుకోండి. అన్ని సందేశాలు చదివి తీరాలన్న పట్టుదలను అతడు చూపితే, సభలోనుంచి "ఆలస్యమైపోతున్నది-మరి చాలు లేవయ్యా!" అని అల్లరిరావ డంకూడా కద్దే అనుకోండి. ఇలాంటి గొడవ లేవైనా జరిగితే, మన సందేశం కార్బన్ కాపీని జాగ్రత్త పెట్టుకుని దాన్ని మనమే ఏ పత్రికకైనా పంపించి అచ్చు గుద్దించుకోవచ్చు. అయినప్పుడు సందేశం పంపించడం లౌక్యమా? పంపించక పోవడం లౌక్యమా? స్థూలదృష్టికి పంపించడమే, కాని, కాస్త లోతుకు దిగి ఆలోచిస్తే పంపించకపోవడమే.

"సందేశము" అనే పదానికి "శ్రీశబ్దరత్నాకరము అను నీ యకారాది యాంధ్ర నిఘంటువు" లో "సమాచారము" అని అర్థ మిచ్చారు. దమయంతి ప్రేమసమాచారాన్ని నలునికి మూటకట్టుకువచ్చింది హంస కనుకనే, అది తెచ్చిన వర్తమానం "హంససందేశ" మైంది. శాపగ్రస్తుడై వింధ్యపర్వతాలలో ప్రవాసిగా వున్న యక్షుడు తన విరహవేదనా సమాచారాన్ని అలకాపురినోని తన ప్రియురాలికి అందజేయవలసిందిగా మేఘుని వేడుకున్నందునే కాళిదాసు కావ్యం "మేఘసందేశ" మైంది. కాని సభల సందర్భంలో సందేశాన్ని ఈ అర్థంలో మనం ప్రయోగిం చము. సభానిర్వాహకులుగాని, సభాసదులు గాని మన క్షేమసమాచారాలు కోరరు; వారి యోగక్షేమాలను మనం విచారించేది లేదు కవరు అణన్నర అయిపోయిన తర్వాత బంధుమిత్రులమధ్యే పరస్పర కుశలప్రశ్నలు తగ్గిపోయాయి. సభానిర్వా హకులు మనలను కోరేది సభకు శుభలగ్నం ఏదనే సమాచారంకూడా కాదు. లగ్నాలలో నమ్మకం వుండి వాటి, సమాచారం తెలుసుకోవాలంటే వారు ఏ పురోహితునివద్దకో, ఏ సిద్ధాంతివద్దకో వెడతారు. అందుచేత సభకు సందేశం పంపవలసిందిగా లేఖ వచ్చినప్పుడు దాని భావం-, సభలో చర్చకు రానున్న ముఖ్య సమస్యలనుగురించి వాటి పరిష్కారానికి తోడ్పడగల విధంగా మీ అభిప్రాయాలను సంగ్రహంగా తెలియజె ప్పండనిమాత్రం.

లోకంలో ఎన్ని విధాలైన జాడ్యాలున్నాయో అన్ని విధాల సభలుకూడా వున్నాయి. సాంఘిక సభలు, ఆర్థిక సభలు, రాజకీయ సభలు, సహకార సభలు, సారస్వత సభలు, బ్రాహ్మణ సభలు, బ్రాహ్మణేతర సభలు, నియోగి సభలు, వైదీకి సభలు, స్త్రీల సభలు, సినీఫాన్స్ సభలు, సనాతనసభలు సనాతన ధర్మ సభలు హరిజన సభలు ఉద్యోగుల సభలు, నిరుద్యోగుల సభలు, కార్మిక సభలు, కర్షక సభలు, కాందిశీక సభలు, లాయర్ల సభలు, డాక్టర్ల సభలు, రైలుప్రయాణీకుల సభలు, అఖిలభారత సభలు, రాష్ట్రీయ సభలు, జిల్లా సభలు, తాలుకా సభలు, ఫిర్కా సభలు, గ్రామ సభలు శివారు సభలు- వీటికి అంతూ దరీ లేదు. 1929 నాటి లాహోర్ అఖిలభారత కాంగ్రెస్ మహాసభ సందర్భంలో కాబోలు, జేబు దొంగతనాలు విపరీతంగా జరిగాయి. అప్పుడు ఒక స్థానిక దినపత్రిక "అఖిల భారత జేబుదొంగల మహాసభ" అని చమత్కారంగా హెడ్డింగ్ పెట్టింది! ఇంతకూ చెప్పవచ్చిన అసలు సంగతి ఏమిటంటే, తలమీది వెంట్రుకలన్ని సభలు జరుగుతూ వుంటాయి; వాటిలో లక్షోపలక్షల సమస్యలు చర్చకు వస్తూవుంటాయి; ఆ సమస్యలన్నింటిని గురించి మనకు తెలిసివుంటుందా? తెలియనప్పుడు ఏదో సందేశం పంపించి మన తెలివితక్కువ బయటపెట్టుకోవడం లౌక్యం కాగలదా?

నన్నడిగితే మనకు తెలిసిన విషయాన్ని గురించికూడా సందేశం పంపరాదంటాను. ఏమో తెలుసునంటే తెలుసుననన్నట్టుకాక తక్కినవారికంటె మనకు ఎక్కువగా తెలిసివుండాలి. ఇది కాకపోతే, తక్కినవారు చెప్పలేని ఫక్కీలో చెప్పదలుచుకున్న దాన్ని చెప్పగల సత్తా వుండాలి. ఈ రెండింటిలో ఏ ఒక ప్రత్యేకతైనా వుండడం చాలా చెదురు. అయినప్పుడు సందేశం పంపించి "ఓస్! ఈపాటివాడేనా!" అనిపించుకోవడం కంటె "సందేశం పంపించివుంటే ఎంత గొప్పదాన్ని పంపించి వుండేవాడో?" అన్న బెట్టు మిగుల్చుకోడం మెరుగు కాదా?

సందేశానికి మనం సరైన అర్థాన్ని చెప్పకున్న పక్షంలో దాన్ని ఇవ్వగలవారు శతాబ్ది కొక్కరైనా జన్మిస్తారో, లేదో! అట్టివారిచ్చే సందేశం కేవలం వాగ్రూపంలో వుండదు; వారి జీవితాలుకూడా దాన్ని ఘోషిస్తాయి. కష్టనిష్ఠురాల నెరుగకుండా, కడుపులో చల్ల కదలకుండా, వారు తమ సందేశం వినిపించరు: మతపీఠంపై బైఠాయించి, లేదా, సభావేదికపై సుఖాసీనులై, కాదా, సంఘపూజితు లౌతూ వారు తమ సందేశం వినిపించరు. సర్వసంగ పరిత్యాగం చేసిన ఒక గౌతమబుద్ధుడు, విషపాత్రికను అమృత కలశంవలె స్వీకరించిన ఒక సోక్రటీస్, "తండ్రీ! వీరిని క్షమించు. తామేమి చేస్తున్నదీ వీరికి తెలియదు" అనే ప్రార్థనతో శిలువ

నెక్కిన ఒక ఏసుక్రీస్తు, భరతఖండ ఏకచ్ఛత్రాధిపత్య సాధనయత్నాన్ని విజయపరం పర మధ్య ఐచ్ఛికంగా విరమించిన ఒక అశోకుడు, నమ్మినదాన్ని చాటినందుకు మరణదండన పొందిన పిమ్మటకూడా "నా బ్రతుకును మాపగలరేమోకాని, నా నమ్మకాలను చెరిపివయ్యగలరా"! అని ధీరంగా పలికిన ఒక బ్రూనో, నమ్మకాలకై దారిద్ర్యాన్ని వరించిన ఒక మార్క్స్, అందుకు ప్రాణాలనే వొడ్డిన ఒక లెనిన్, ఒక గాంధి-ఇట్టివారే సందేశ మివ్వగలవారు. వీరి సందేశం సభలకే కాదు, సమస్తానికీ, సర్వకాలాలకూ.

తక్కినవారు"తగుదుమమ్మా" అని సందేశ మివ్వబోతే ఒక కాంగ్రెసు ముఖ్య మంత్రి విషయంలో జరిగినట్టు (ఆయన పేరు బట్టబయలు చేయడం భావ్యం కాదేమో!) పప్పులో కాలు వేయడం తప్పకపోవచ్చు. మూడు, నాలుగేళ్ళనాడు మద్రాసులో జరిగిన అఖిలభారత స్వదేశీ వస్తుప్రదర్శనానికి తంతిద్వారా (బహుశా ప్రభుత్వం ఖర్చుతోనే) "ఖద్దర్ పుట్స్ ఎ ప్రీమియం ఆన్ అనెంప్లాయ్‌మెంట్" అని ఈ ప్రబుద్ధు డొక మహత్తర సందేశం పంపించాడు. "దీని భావమేమి తిరుమలేశ?" అంటే, "ఖద్దరు నిరుద్యోగానికి దోహదం చేస్తుంది" అని ఆ ప్రదర్శనం కార్యదర్శి గుడ్డిగా దీన్ని సభలో చదివేసరికి సభికులు ఘొల్లుమన్నారు. కాని, ప్రదర్శనం ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహిస్తున్న శ్రీమతి సరోజనీ నాయుడు అద్భుత సమయస్ఫూర్తితో ఆ కాంగ్రెస్ ముఖ్యమంత్రి పరువు నిలిపింది. "ఛీ! ఈ పెద్దమనిషికి ఎంతటి దద్దమ్మ ప్రయివేట్ సెక్రటరీగా దొరికాడు!" అని నోరూవాయీలేని అతని తాబేదార్‌పై నెపాన్ని ఆమె చమత్కారంగా నెట్టివేసింది.

*

"హిమాయుద్దీన్" గా మిగిలిందేమో! జహాంగీర్ తండ్రి, అక్బర్, తన పేరును ఏ మామిడిపండుకు విడిచి వెళ్ళకపోయినా, ఆ మొఘల్ పాదుషాకూడా దాని రుచి మరిగినవాడే. మామిడిపండ్లపై మనస్సుపోతే ఆయన కనీసం ఒక పరకపళ్ళు చులాగ్గా ఊదివేసేవాడు. ఒక రోజు బీర్‌బల్ తో చేరి ఆయన మామిడిపళ్ళ ఫలహారానికి కూర్చున్నాడు. పండు తర్వాత పండును సుష్ఠుగా భోంచేసి లెంకలను బీర్‌బల్ ముందుకు నెట్టివేశాడు. తర్వాత మొత్తం లెంకలను లెక్కపెట్టి "బీర్‌బల్ ! నీ వెంతటి కడుపాత్రపువాడవోయ్! రెండు పరకపళ్ళు గుటుక్కు మనిపించావ్! జబ్బు చేస్తుందేమో సుమీ?" అని చమత్కరించాడు. "హనుమంతుని ముందు కుప్పిగంతులా!" అన్నట్టు బీర్‌బల్ వద్దనా ఇలాంటి చమత్కారాలు చెల్లేది! ఆవలిస్తే పేగులు లెక్కపెట్టగల గడసరి; మాటకుమాట అప్పజెప్పగల గడుగ్గాయి. "చిత్తం, స్వామీ ! నేను కడుపాత్రపువాడనే. అయినా, లెంకలను విడిచి పెట్టాను. దేవరవారు వాటిని కూడా చిత్తగించారు;" అని చల్లగా చురక తగిలించాడు. మామిడిపండు రుచి నెరిగిన రసజ్ఞుడు కనక, అక్బర్ పాదుషా తనకు అంటిన చురకకు నొచ్చుకోక ఫక్కున నవ్వివుండాలి.

పిల్లరాజు లైనప్పటికీ రాజభోగాలు వెళ్ళబోసిన మన జమీందారులు మామిడి పండు రుచి మరిగినవారు కావడంవల్లనే పిఠాపురం, పెద్దాపురం, నూజీవీడు, కార్వేటినగరం, బనగానపల్లి మామిడి తోటలకు ప్రసిద్ధి కెక్కాయి. మన బైరాగి బ్రహ్మంగారి మెప్పు పొందకపోయినా మామిడిపండును ముస్లిం బైరాగులు మెచ్చుకున్నట్టున్నారు. బహుశా వారు పసందుచేసిన మామిడిపండే "ఇమాం పసందు". మన బ్రహ్మంగారైనా మామిడిపండు మాధుర్యం తమాం తెలియనివారని త్రోసి వెయ్యలేము. ఆయనగారి ఒకతత్త్వం "తియ్యని మామిడిపండు పండు తినబోతె దొరకాదు - తీపులుమెండు" అని చాటుతున్నది. దీన్నిబట్టి పూర్వాశ్రమంలో ఆయన మామిడిపండు చవిచూచినవాడే; చిన్ననాడు చూచిన ఆ చవిని ఆశ్రమం ఫిరాయించిన తర్వాత కూడా మరవనేరకపోయినవాడే. అయితే మెట్టవేదాంతం ముదిరిపోయినందున "తీపులు మెండు" అని, "తినబోతే దొరకాదు" అని చెప్పిన ఉత్తరక్షణంలోనే "పండుకు వృక్షము ప్రజలెవ్వరెరుగారు పరమాత్ముడను యాకు పైనుండగా - పండు యెనుబదినాల్గు పర్వములై యుండు - ఒరులకు యీ పండు వశముగాకుండు" అని బైరాగి ధోరణిలోకి దిగిపోయాడు.

రాజులను, మహారాజులనేకాక, విరాగులను కూడా రంజిల్లజేసిన రసాల ఫలం ముమ్మాటికీ ఫలరాజం, ఒక్కసారైనా దాన్ని చవిచూడని బ్రతుకు బ్రతుకే కాదు.

ఎంత పేరుగా బ్రతికినా, ఎందరిచేత నివ్వాళీ యెత్తించుకున్నా, మన జవహర్‌లాల్ నెహ్రూ పుణ్యం కట్టుకొని వుండకపోతే, బెర్నార్డ్‌షా బ్రతుకులో ఒక పెద్ద వెలితి మిగిలిపోయేదే! తొంభై దాటేవరకు ఆయన మామిడిపండు ముఖమైనా యెరగదు. ఆ లోపాన్ని తీర్చింది మన నెహ్రూ. మన ప్రధాని రెండేండ్ల నాడు కామన్ వెల్త్ ప్రధానుల సభకు లండన్ వెడుతూ ఇన్ని మామిడిపళ్ళు ఉపాయనంగా పట్టుకువెళ్ళాడు. వాటిని తింటుండగా సెయింట్ జోన్ పాత్రను చిత్రించినప్ప టికంటె టానర్‌ను సృష్టించినప్పటికంటె, కెప్టెన్ బ్రాస్‌బ్రౌండ్‌కు ప్రాణప్రతిష్ఠ చేసినప్పటికంటె, లిజామూర్తి కల్పనను చేసినప్పటికంటె బెర్నార్డ్ షా ఎక్కువ తన్మయత్వాన్ని పొంది వుండాలి.!

మామిడిపండు స్వర్గానికి బెత్తెడు యెడంగా వుంటుందని తెలిసిన భాగ్యశాలి కాబట్టే రాయలవారికి తల్లికి స్వర్గానికి వేంచేయడానికి ముందు ఆ పండుపై మనస్సు పోయింది. విజయనగర సామ్రాజ్యాధిపతికైనా కాలంకాని కాలంలో మామిడిపండ్లను రప్పించడం సాధ్యమా? రాజమాత తన మనసు తీరకుండానే దేహం చాలించింది. ఈ వెలితివల్ల ఆమె ఆత్మశాంతికి భంగం కలగవచ్చునని రాయలవారు మాతృశ్రీ శ్రాద్ధకర్మ సందర్భంలో భూసురోత్తముల సలహాపై వారికి బంగారు మామిడిపండ్లను పంచిపెట్టించారు. దానం పట్టడానికి వచ్చిన ప్రతి బడుగు బాపడు మిలమిల లాడుతున్న మేలిమి మామిడిపండు పుచ్చుకుపోవడాన్ని చూడగా తెనాలి రామలింగనికి కన్ను కుట్టింది; కడుపుబ్బింది. క్షణాలమీద తన తల్లి తద్దినాన్ని కల్పించి, రాయలవారివద్ద దానాలు పట్టిన వారినందరినీ కూక వేశాడు. "వాతరోగంతో తీసుకుని మా అమ్మవాతలో వాతలో అని గోలచేస్తూ హరీ అన్నది. ఈ తుదికోర్కె తీరకపోతే ఆమె ఆత్మ సంక్షోభపడిపోతుంది. తలొక వాత వడ్డించుకు వెళ్ళండి" అని ఎర్రగా కాల్చిన కర్రుతో బెదిరించి బంగారపు మామిడిపండ్లు నన్నింటినీ వూడబెరుక్కున్నాడు.

అవి బంగారపు మామిడిపండ్లు కాక, బంగారాన్ని మించిన చిన్న రసాలైనా ఏదో పన్నుగడ పన్ని వాటిని తెనాలి రామలింగడు తన్నుకుపోయేవాడే. జహాం గీర్, హిమాయుద్దీన్, పంచదారకలశ, బెనీషా, బెంగుళూరియా, బంగినపల్లి, నీలం, రుమానీ, మల్‌గోవా, ఇమాంపసందు, సబ్బేసి, సువర్ణరేఖ, ఆల్ఫెంజో – ఇత్యాది పెద్దపెద్ద పేర్లు ఇతర జాతుల మామిడిపండ్లకున్నా, పేరు వింటేనే నోరూరించే పేర్లు వాటికున్నా, రసజ్ఞుడైనవానికి రసంమీద ఇవన్నీ దిగదుడుపుకైనా పనికిరావు. అన్నంలో తోడుపెట్టిన గేదె పెరుగు వడ్డించుకుని, ఒక చిన్న రసాన్ని దానిలో

పిండుకు తింటే స్వర్గసుఖాలుగా పురాణాలు చిత్రించేవన్నీ రసవిహీనమైనవిగానే తోస్తాయి. చిన్నరసం అంటే రసకుల్య; కాదు, రసధుని కాదు కాదు రసార్ణవం.

అది చిన్న రసమైనా, మరొక మామిడిపండైనా దాని రుచి తెలిసేది తిన్నవారికే. తిననివారికి ఎంతచెప్పినా దాని మజా తెలియదు. ఎలాగైనా తెలియజెప్పాలని ఏదైనా ఉపాయం ఆలోచించినా ఫలితం అంతమాత్రమే. వెనకటికి పర్షానుంచి మన దేశం వచ్చిన ఒక పెద్ద మనిషి స్వదేశానికి తిరిగివెళ్ళి తమ షా దర్బార్‌లో మామిడిపండును మహా మెచ్చుకున్నాడట. ఆ పొగడ్తను వినివిని "సరేకాని, ఆ పండు రుచి మాకు ప్రదర్శించి చూపించగలవటయ్యా?" అని షా అడిగాడట. వెంటనే ఏమీ తోచక "రేపటి వరకు ప్రభువులవారు గడు విప్పించండి" అని భారత యాత్రికుడు మనవి చేసుకున్నాడట. నాటి రాత్రి అతడు దీర్ఘాలోచనలో మునిగి చిట్టచివరకి ఒక ఉపాయం కనిపెట్టాడట. మర్నాడు దర్బార్‌కు వెళ్ళి "ప్రభు, ఇప్పటికీ దేవర వారికి మామిడి పండు రుచిని ప్రదర్శించి చూపలేను. కాని, వజీర్లలో ఎవరికైనా చూపవలసిందిగా సెలవైతే ఈ గులాం తయ్యార్‌గా వున్నాడు" అని వినతి చేసుకున్నాడట. "భేష్! కానివ్వు" అని ప్రభువు సెలవ య్యేసరికి చింతపండు, పంచదార తెప్పించి, ఆ రెండింటిని పల్చగా కలిపి, ఒక వజీర్ గడ్డానికి పట్టించి, మరొక వజీర్‌ను ఆ గడ్డాన్ని చీక మన్నాడట. ఈ దృశ్యానికి విరగబడి నవ్వుతూ, "ఎలా వున్నది మామిడి పండు?" అని షా తన రెండవ వజీర్‌ను ప్రశ్నించగా అతడు "తియ్యతియ్యగా పుల్లపుల్లగా పీచుపీచుగా వున్నది స్వామీ!" అని జవాబిచ్చాడట. "అదే, దేవరా! అచ్చంగా అదే మామిడిపండు రుచి" అని భారత యాత్రికుడు తన ప్రదర్శన విజయానికి పొంగిపోతూ అన్నాడట. కాని, అదే మామిడి పండు అంటే మనం చచ్చినా వొప్పుకుంటామా?

*

# జగన్నాటకం

నీళ్ళు పోయించుకోడానికి వాళ్ళ అమ్మను రోజూ గిరికీలు పెట్టే మా రెండవ పిల్ల వాడు ఇవ్వాళ నీళ్ళు పోస్తావా, లేదా అని మారాం చేశాడు. "జ్వరం తగిలింది – వద్దురా, బాబూ!" అంటే రాగం తియ్యడం మొదలు పెట్టాడు. "నా నాన్నవు కాదూ, బాబువు కాదూ, నా మాట వినరా!" అని ఎంత బతిమాలినా, అంత కంతకు రాగం పెద్దది చేసి, ఇంటి పెంకులు ఎగరగొట్టి వేశాడు. పాదరసం వంటి బుద్ధిగలవారని, చపలచిత్తులని పసివాళ్ళ ఈ ప్రవర్తనను గురించి చెప్పకుని మనం సరిపెట్టుకుంటాము. కాని, పెద్దవారు మాత్రం అంత స్థిరచిత్తులా? వారి వర్తనైనా వైరుధ్యరహితమా?

పెద్దవాళ్లూ ఒకనాడు పసివాళ్లే, పొత్తిళ్ళలో పెరిగినవాళ్లే. గడ్డాలవానికి అడ్డా లవాడు సాక్షాత్తు తండ్రి అని వర్డ్స్‌వర్త్ మహాకవి చెప్పినమాట కడిగిపోసిన సత్యం. పెద్దరికం పిన్నరికానికి కేవలం తరువాయి కాబట్టే. ఎంత పెద్దవానిలోనైనా పిన్న తనం ఎంతో కొంత మిగలనే మిగులుతుంది. ఎటొచ్చి అతడు తన పిన్నతనానికి సిగ్గుపడి దాన్ని కప్పి పెట్టుకోడానికి ప్రయత్నిస్తాడు. లేదా దానికి మరొక రూప మివ్వడానికి ప్రయత్నిస్తాడు. చిన్నతనంలో బాణసంచా తానే కాల్చుకుని ఆనం దించినవాడు. పెద్దవాడై నాక "భయం లేదు. బాబూ! దగ్గరికిరా, చూడు, ఎంతచక్కగా కాలుతుందో; పోనీలే, నేను ముట్టిస్తాను. – నా చెయ్యి పట్టుకో"

అంటూ పిల్లవాడి వంకతో మతాబాలు, కాకరపువ్వొవత్తులు, వెన్నముద్దలు, చిచ్చు బుడ్లు వగైరాలు కాల్చుకుంటాడు. "ఛల్ ఛల్ గుర్రం" అంటూ తాను మరొకరి వీపుపైకెక్కి స్వారి చేయలేడు గనుక, తానే గుర్రమై ఆ ముచ్చట కాస్తా తీర్చుకుంటాడు. లేదా, గోలీలతోను,గచ్చకాయల తోను ఆడిన ఆటలకు మారుగా రూపాయల, అణాల, పైసలతో ఆట లాడుతాడు; తూనీగలను, గాలిపటాలను యెగరవైయ్యడానికి బదులుగా ఆలోచన లనే తూనీగలను, ఆశలనే గాలిపటాలను యెగరవేస్తాడు. తోటలోని సీతాకోక చిలుకలవెంట పరుగులిడ్డానికి ప్రతిగా సంఘం లోని సీతాకోక చిలుకలకై భ్రమపడతాడు. బాల్యచాపల్యం చావడం కల్ల. అది ఛద్మ వేషాలను ధరిస్తుంది. అంతే!

ఈ ఛద్మ వేషాలైనా ఒక వయఃపరిమితివరకే. తల నెరసి, నడుం వంగి, సులోచనాలు ముక్కుకొనకు జారేసరికి పసితనం తిరిగి నిజరూపంతో బయట పడుతుంది. వృద్ధాప్యం ద్వితీయ శైశవమని షేక్స్‌పియర్ పిచ్చివాడై అనలేదు. నిజానికి తొలి శైశవంలోకంటె ఈ మలి దానిలోనే చిత్తచాంచల్యం ఎక్కువ, ఏమీ తెలియని వారు కనుక, పసికందులు ఒకసారి కాకపోతే, మరొకసారైనా చెప్పినమాట వింటారు. తెలిసీ తెలియని మేళం కనుక, మతిసడలిన మనవలివారు పట్టే కుందేటికి మూడేకాళ్ళు. ఏదైనా సాధ మొదలిడితే అదే సాధన. ఎందకైనా సణుగుడు ప్రారంభిస్తే అదే సణుగుడు. పోనుపోను వారిముందు ముక్కు గోక్కోవడమే మహాపాపమౌతుంది.

మతిమళ్ళిన వారి మాటకేమి గాని, శైశవానంతరమైనా శైశవవిలక్షణాలను కోల్పోని వారే ధన్యజీవులు. కన్నీటి తడి ఆరకముందే కిలకిల నవ్వడం పసివారికే చెల్లు. కీచు లాడుకుని వెనక్కి తిరగక ముందే కౌగలించుకోవడం వారికే తగు. చేస్తూచేస్తూవున్న పనిలోనుంచి చిటికలో చిత్తాన్ని మళ్ళించకోవడం వారికే సాధ్యం. పోకచెయ్యనిదానికి రూకవిలువ నివ్వడం వారికే వల్ల. విస్తుపోగలిగడం వారి సొత్తు. కల కల్లకానిది వారికే. గొప్పవారనదగువారు ఏ వయస్సులోనూ, శైశవసహజమైన ఈ విలక్షణాలను కోల్పోరు. అతి గంభీరసమస్యలో నిమగ్నమైవున్నా క్షణంలో దాన్ని ఒక పక్కకు నెట్టివేసి పసివారిలో పసివాడై గాంధీజీ వారితో దోబూచు లాడగలిగేవాడు. వర్గవిప్లవజ్వాలలకు సమిధలను నేకరిస్తూనే, ఆ కఠోరకార్యసాధనను కాసేపు కట్టివెట్టి, కార్ల్ మార్క్స్ కన్నబిడ్డలకు స్వారిగుర్రం కాగలిగేవాడు. మనమలతో జతకూడి తోటలో విల్లంబులతో ఆటలాడుకోవడం ప్రారంభించేసరికి జర్మన్ మహాకవి గొథెకు ప్రపంచమే కనుమరుగైపోయవీది. బాలబాలికల

మధ్యకు వెళ్ళితే వారి తరళలోచనాలవలె లెనిన్ కళ్లుకూడా మెరిసేవి; వారిని చూట్టూ చేర్చుకుని కథని చెప్పుకోవడం ప్రారంభిస్తే కాలమే స్తంభించిపోయేది. ఒక కొత్త పోస్టుబళ్ళ దొరికితే ప్రెసిడెంట్ గిరి ఎన్నికలో తాను తొలిసారి గెలిచిన పటికంటె రూజ్‌వెల్ట్ పరమానందభరితుడయ్యేవాడు. సముద్రంవొడ్డుకు వెళ్ళి యిసుకలో పిచ్చుకగూళ్లు మరికట్టుకోలేని వెలితి తీర్చుకోడానికి కాబోలు, చర్చిల్ తిక్క తిరిగినప్పుడెల్ల పెరటిలో తాపీపని చేస్తుంటాడు. పిల్లలు ఉయ్యాల జంపాల లూగుతున్నా, రంకుల (రంగుల?) రాట్నంపై గిరగిర తిరుగుతున్నా వారిలో కలిసిపోకుండా మన నెహ్రూ కాలు కట్టివేసుకోలేడు. కోపగించుకోవడం తగదని కోపంతో చెప్పగల సత్తా ఆయన కున్నది కూడా.

శైశవవిలక్షణాలు శైశవావస్థ గడచినవారిలో కానరావడం శరీరంతో పాటుగానో, దానికంటె వడిగానో మనస్సు ముదిమి తేలిపోయినవారికి విడ్డూరంగా తోస్తుంది. ఈ ముదిమనస్సు వారు మగవారైతే "ఔరా! చిన్నతనం ఇంకా వదలనే లేదు," అని ముక్కుపై వేలు వేసుకుంటారు. ఆడవారైతే "ఓయమ్మ! ఇవేమి బుద్ధులు!!" అని బుగ్గలు నొక్కుకుంటారు. గోచిపెట్టుకునే యీడులో గోలీకాయ లాడాలి కాని, గడ్డాలు, మీసాలు వచ్చిన తర్వాత కూడానా ? నిజమే! ఈ ప్రశ్నలోని తర్కాన్ని కాదనలేము, తర్కం మానవుని చేతిలో కత్తివంటిది. దానితోనే అతడు మార్గాన్ని నిష్కంటకం చేసుకుంటూ సభ్యతాపథం వెంట పురోగమించగలిగాడు. దాన్ని మిన హాయిస్తే అతడికి, పసరానికి తేడాయే వుండేది కాదు. అయినా, తర్కం నడిపించే దారివెంట ముక్కుకు సూటిగా నడిస్తే మాత్రం వెళ్ళి చేరవలసింది బ్రహ్మంగారి మఠాన్ని; తప్పితే పిచ్చి ఆసుపత్రిని.

ఇల్లువాకిలి నాది, యిల్లాలు నాదనుచు
యేల బ్రమసితివయ్యో మనసా!
కాలుని వలలోను కానకను చిక్కితివి
కడతేరుటే త్రోవ మనసా!
తనయులు, చుట్టాలు తనవారు యని నమ్మి
తలపోయకే వెర్రి మనసా!
తనువు విడిచి వెళ్ళే సమయంబులోపల
తనవెంట రారైరి మనసా!

అని పోతులూరి వీరబ్రహ్మంగారి చేసిన బోధనలోని తర్కాన్ని కాదనడం మన తరమా!

కండ లెముకలు నెత్తురు గలిగి తనువు
మూత్ర మలములతో నుండు ముట్టరాక
కామజుని బాణమం చాసగల్గ జెడును
ఆస బాసెడి విధమును నరయు వేమ!

అని వేమనయోగి చేసిన పొచ్చరికలోని పేతువాదమైనా బలహీనమైందా? అయితే, బ్రహ్మంగారి తత్త్వాలను విని, వేమన శతకాన్ని చదివి, సంసారాన్ని రోసి, సన్న్యాసులలో కలిసిపోతున్నవారెంద రున్నారు? తర్కాన్ని తు.చ. తప్ప కుండా పాలించాలంటే, సన్న్యాసం తప్పినా, ఉన్మాదం తప్పదు. రెండువైపుల పదను గల మేధకు తర్కంతో జరిగే వెల్లే తరచు పిచ్చిగా మారుతుందని ఆలివర్ వెండల్ హోమ్స్ చెప్పిన మాట బ్రతుకును కాచి వడపోసిన తర్వాత చెప్పిన మాటే;

కొన్నికొన్ని సందర్భాలలో తర్కం భస్మాసుర హస్తాన్ని మించ పోగలిగింది. కాబట్టే దాన్ని దేవుని నెత్తినే పెట్టడానికి మిస్టర్ గిరీశం ప్రయత్నించాడు. "యేవయా? దేవుడా? నా మనస్సు యిండివెండెంటుగా సృజించావా? లేక, డివెండెంటుగాసృజించావా? అని ముందు తా నొక ప్రశ్న వేస్తాడట. ఆ తర్వాత "యిండివెండెంటుగా అయితే, నా ఇష్టమొచ్చిన పనల్లా నేను చేశాను – నువ్వే వరు అడగడానికి ? యిలాంటి చిక్కులు పెట్టావంటే హెవెన్‌లో చిన్న నేషనల్ కాంగ్రెస్ వొకటి లేవదీస్తాను" అని బెదిరిస్తాడట. "లేక నన్ను డివెండెంటుగా చేశావూ? అట్లాగయితే నువ్వే నా చేత పాపం చేయించావు గనక నీకే ఆ శిక్ష కావలసింది. దేర్‌ఫోర్ ఛలో, నరకానికి ఛలో" అని ఆజ్ఞాపిస్తాడట.

సందర్భాసందర్భాలు తెలియని, సమయాసమయాలను గుర్తించని పేతువాదం కేవలం కుక్కమూతి పిందెలను వేస్తుందని తెలియబట్టే, మహాపురుషులైన వారు కూడా అవసరమైనప్పుడు స్వవచన వ్యాఘాతానికేమి, పరస్పరవిరుద్ధ ప్రవర్తనకేమి వెరవరు. పాత మాటనో, పాతచేతనో భూమి తలక్రిందులైనా పట్టుకు వ్రేలాడతా మనే వారు కొద్ది బుద్ధిగల వారేనని ఎమర్సన్ చెప్పగా, దాన్ని సాక్షాత్తు గాంధీజీ బలపరిచాడు. పిచ్చివాడి వేషంలో "అన్నమైతే నేమిరా, మరి సున్నమైతే నేమిరా, అందుచేతనె ఈ పాడుపొట్టకు అన్నమే వేదామురా !" అని యుగంధరమంత్రి చెప్పింది పిచ్చిమాట కాదు, ఆమాటప్రకారం వ్యవహరిస్తేనే ఈ జగన్నాటకం నడవడం.

# రూపం, గుణం

"భార్యా రూపవతీ శత్రుః" అన్నారు పెద్దలు. ప్రపంచం తలకిందు లైనా, ఇటు సూర్యుడు అటు పొడిచినా, పిన్నలు ఈ మాట వొప్పుకోరు. మళ్ళీ మాట్లాడితే ఈ మాట చెప్పే పెద్దల పెద్దరికాన్నే వొప్పుకోరు. "ఆ: 'ఏమి పెద్ద ? - తాటిచెట్టు పెద్ద !" అని చులకన చేస్తారు. "కాకిముక్కుకు దొండ పండు" తగిలించుకున్నవారే చక్కని పెళ్ళాం చేటు తెస్తుందని చెప్పివుంటారని చప్పరించివేస్తారు. "ఇల్లు యిర్కటం, ఇల్లాలు మర్కటం" కావాలని కోరుకునే వారి బ్రతుకు ఒక బ్రతుకేనా అని పెదవి విరుస్తారు. మరీ బరిత్రెంచుకున్న వారైతే "కురూపి యేమి చేస్తున్నాడంటే సురూపాలన్నీ లెక్క పెడుతున్నాడు" అని వసంతం పడతారు. ఈ పిన్నలను స్త్రీజాతి చాలావరకు సమర్థిస్తుందనే చెప్పాలి. "కోడలు నలుపైతే కులమెల్లా నలుపు" అనే సామెత ఎక్కువగా ఆడవారినోటనే వినవస్తుంది. మొత్తంమీద మగువలమొగ్గు అంద చందాలవైపుకే. "ఆడది మెచ్చిందే అందం" అనే లోకోక్తి నిర్నిమిత్తంగా పుట్టలేదు.

రూపురేఖలకే పిన్నలు మార్కు లిస్తే పువ్వుబోడులు వారితో "కంకరెంట్ జడ్జిమెంట్" చెబితే, పెద్దల సుద్దులు మరి గాలికి పోవలసిందే. అయినా, "భార్యా రూపవతీ శత్రుః" అనే సూత్రంలో వీసంవాసి నిజం లేకపోలేదు. కేవలం రూపమే

వుండి, గుణం లేనిదైతే – హరిహరీ! – ఆ భార్య పగవాడికైనా వద్దు. తార చక్కని చుక్క. ఆమె అందం బృహస్పతిని పోలిన బ్రహ్మర్షిని కూడా బుట్టలో పెట్టింది. కాని గుణం తక్కువైన తారను కట్టుకుని ఆ దేవర్షి ఏమి సుఖప డ్డాడు.? చివరికి ఆమె వల్ల తన దేవగురుత్వానికే నగుబాట్లు తప్పలేదు. కాని బృహస్పతి బ్రతుకును బుగ్గిపాలు చేసింది తార రూపం కాదు; ఆమె గుణం. ఆమె జగన్మోహిని కాక, జుగుప్సాకరమైన రూపం కలదైనా ఆమె వంకరబుద్ధి వంకరగానే వుండేది. కాగా, అట్టిస్థితిలో ఆమెకు వంకరనడక బహుశా సాధ్యపడే దికాదు. రూపసి కాకపోతే చంద్రుడు ఆమె వలలో పడేవాడు కాడేమో! ఈ మాటను ఇక్కడ కొంత సందేహంతో చెప్పడం కురూపానికైనా కక్కుర్తిపడి, "నా కళ్ళతో చూడు" అనే సరసులు కొందరు కలరు కనుకనే. ఏమైనా, కురూపను రూపాలకు, సద్వర్తనదుర్వర్తనాలకు అవినాభావ సంబంధం కలదని ధ్వనించడం శుద్ధతప్ప. పాతివ్రత్యానికి ప్రసిద్ధికెక్కిన నారీమణులలో రూపలావణ్యాలు కొరవడి నవా రెవరు? సచ్చరిత్రగా సంచరించడంలో సౌందర్యవతి ఎక్కువగా ప్రలోభాలకు, లేదా, పరీక్షలకు తాళవలసివస్తుం దనడం వాస్తవమే. అంతమాత్రం చేత అందా లబరణిని ఆలుగా తెచ్చుకోవడం పాముతో చెలిమిగా చెప్పడం భావ్యం కాదు. ఎదుర్కొవలసిన ప్రలోభాలే లేనప్పుడు, నిలువ వలసిన పరీక్షలే లే నప్పుడు దారి తప్పకపోవడంలో గొప్ప లేదు. వెంటపడినా శూర్పణఖను వలచినవారే లేరు; జానకికే అగ్నిపరీక్ష అనివార్యమైంది.

పరిశీలనకు నిలవని "భార్యా రూపవతీ శత్రుః" అనే ఈ సూక్తి చెప్పింది బృహస్పతే కావచ్చు. తప్పితే, ఆయన పడిసట్టి దురవస్థలోనే పడిన మరొకరు చెప్పివుండాలి. సరిగా మన దేవగురువుకు పట్టిన దురవస్థ పోలింది కాకపోయినా, కొంచెం కుడియెడంగా అట్టిదే జపాన్ ప్రభుత్వపు ఖనిజ సంస్థలో పద్దుల గుమాస్తా ఛిచీ హనాఫ్యూన్‌కు పట్టినట్టు నేటి పత్రికలను బట్టి తెలుస్తున్నది. అతడి భార్యా రత్నానికి చంద్రుడు తటస్థపడలేదు కాని, అందకత్తెగా అందాజైన చిలకలకొలికిని ఏరి, కోరి చేపట్టడం అతడికి తద్దినం కొనితెచ్చుకోవడమే అయింది. గుమాస్తాకు ఏ పాటి జీతం వస్తుంది? అయినా, అందాలకుప్పగా దేశం మొత్తంపై ఎన్నికైన యువతిని పెండ్లాడాడు. అతడి జీతం రాళ్లు ఆమెకు ఒక నెల ఫేస్‌క్రీమ్, పౌడర్, లిప్‌స్టిక్ వగైరాల కైనా చాలవు. ఒకసారి "హెయిర్ డూ" కైనా చాలకపో వచ్చు. అందువల్లే కాబోలు, సర్కారు సొమ్ము కొన్ని కోట్లు కొట్టి వేశాడు; కొట్లో కూర్చున్నాడు.

ఏమాట కామాట చెప్పాలి - ఆమె ఫ్యాషన్‌ల కోసమే అతడు ప్రభుత్వ ధనాపహరణ చేశాడని నేను ఊహచేయడం తప్పే కావచ్చు. అతడే విలాసపురుషుడై వుండవచ్చు. "అప్పు చేసినా నిప్పంటి సారా త్రాగా"లనేది అతడి జీవిత సిద్ధాంతమే అయివుండవచ్చు.అయితే తప్పెవరిదో తబ్బీలుగా తెలియకపోయినా ఆమెపైనే నేను నెపం వేయడానికి కారణం లేకపోలే దనుకుంటాను.

మన గుమాస్తాగారి గృహిణి దేశం మొత్తంపై అందాలరాణిగా బహుమానం అందుకున్నా, ఆ ఘనతకు నిజంగా ఆమె పాత్రురాలు కాకపోవచ్చు. ఏదైనా పోటీ జరిగినపుడు దానిలో పాల్గొనేవారిలో మాత్రమే అగ్రస్థానం నిర్ణయిస్తారు. ఆ తీర్పు వారికే పరిమితం. పోటీలో పాల్గొనని అసంఖ్యాకులకు అది వర్తించదు. అయితే, మొత్తంపై కోరినవా రెవరైనా సరే పోటీలో చేరవచ్చునని ఆదిలో చెప్పివుంటే, చేరదగువా రందరు చేరినట్టే అంతానికి తీర్మానానికి వస్తారు. దీన్ని పురస్కరించుకునే "దేశం మొత్తంపై" ఫలితం అంటూ తమ నిర్ణయాన్ని ప్రచురం చేస్తారు. వాస్తవానికి అది పోటీ మొత్తంపై ఫలితమే. సత్తావున్నా పోటీలంటే కంటగించుకునే వారెంద రెందరో వుంటారు. "వీరితోనా నేను పోటీ చేసేది!" అని తక్కిన పోటీదార్లపట్ల న్యూనభావం వుండవచ్చు. "వీరా నన్ను పరీక్ష చేసేది!" అని పోటీ నడుపుతున్నవారి పట్ల తిరస్కారవైఖరి వుండవచ్చు. "ఇంతా పోటీచేస్తే, ఈ మాత్రమేనా ప్రతిఫలం!" అని ఆశ చూపబడిన పారితోషికం పట్ల తృణీకారభావం వుండవచ్చు. "పోటీలలో నెగ్గనిదే నా ఘనతను లోకం గుర్తించదా! సరే-చూద్దాం!" అన్న అహమహమిక వుండవచ్చు. లేదా, భయమో, సంకోచమో, వినయమో, వినమ్రతో అడ్డు రావచ్చు. కారణా లేవైనా పసగలవారిలో పెక్కుమంది పోటీల ఛాయలకైనా వెళ్ళరు. పోటీవేరు చెప్పగానే పెడముఖం పెట్టడం ఇంతగా జరుగుతుంది కనుక మన గుమాస్తాగారి గృహిణీమణి అందాలపోటీలో నెగ్గినా, దేశం మొత్తంపై నిస్సంశయంగా ఆమె సుందరాంగి కాకపోవచ్చు. అయినా, తాను అట్టి దాని నన్న అతిశయం పోటీ ఫలితం విన్న మరుక్షణం నుంచి ఆమెకు కలగడానికి వీలున్నది.

మరొక విషయం : దేనికైనా పోటీ అని పేరు పెట్టగానే దానిలో చేరడానికి చాలామంది సంకోచిస్తారు. ఇక, అది ఆడవారి అందచందాల పోటీ అయితే, సిగ్గు బిడియాలు తక్కువైనవారు తప్ప తక్కినవారు దానిలో పాల్గొనడం సాధారణంగా జరగదు. సుందరాంగికి తన సౌందర్య జ్ఞానం వుండవచ్చు. మరింత చక్కని చుక్కలా కనబడాలని ముప్పొద్దులా ముస్తాబు చేసుకోవచ్చు. "చిదిమి దీపం పెట్టు

కోవచ్చు" అని తనను గురించి ఇరుగు పొరుగు అమ్మలక్కలు చెప్పుకుంటుంటే విని, విననట్టు నటిస్తూనే, ఉప్పొంగవచ్చు. దారిని నడుస్తుండగా కళ్ళన్నీ తన పైనే పడితే సిగ్గు బిడియాలు ముప్పిరిగొంటున్నా లోలోపల సంతోషపడవచ్చు. కాని, "నన్ను చూడు; నా అందం చూడు" అన్నట్టుగా వెకిలిగా ప్రవర్తించదు. అంతే చేస్తే ఆమె సంస్కృతీ సౌశీల్యాలనో, కనీసం ఆమె కుటుంబ సంప్రదాయా లనో శంకించవలసి వస్తుంది. అందచందాల పోటీకి వెళ్ళడమంటే "నన్నుచూడు నా అందం చూడు" అనడమే; తాను జగదేకరంభనని విర్ర వీగడమే. కొట్లోపడిన జపాన్ గుమాస్తా బ్రతుకలా తెల్లవారడానికి అందాలపోటీ భార్యే కారణమని ఇందుకే నాకు మున్ముందుగా తట్టివుండవచ్చు. "చిలుక తన ముద్దేకాని ఎదటి ముద్దు కోరదు" కదండీ!

అయితే, ఒక విషయాన్ని నిరభ్యంతరంగా నే నంగీకరిస్తాను. ఏవైనా వొడుదుడుకులు వచ్చి సంసారం చట్టుబండలైపోతే ఇల్లాలిని తప్ప లెన్నడం లోకం రివాజు. కాపురం కడగండ్లుపాలు కావడానికి గృహస్థే బాధ్యుడని స్పష్టంగా తెలిసిన సందర్భాలలో కూడా "అతడికి బుద్ధిలేకపోతే, ఆవిడకైనా జ్ఞానం లేకపోయిందా?" అనడం కూడా కద్దు. ఎంతైనా ఈ లోకం పురుషలోకం. అందువల్లే "ఆడదాని బుద్ధి అపరబుద్ధి", "ఆడదాని మాట నీళ్ళమూట," "ఆడదానిచేతి అర్థమూ, మగవానిచేతి బిడ్డా బ్రతకదు" మొదలైన సామెతలు ప్రచారంలోకి వచ్చాయి. "విస్సన్న చెప్పిందే వేద" మన్నట్టు ఇట్టి సామెతలను నమ్ముకుని గార్హస్థ్య జీవితం కష్టభూయిష్టమైన ప్రతిసారీ, అది భగ్నమై పోయిన ప్రతిసారీ ఆ దోషాన్ని గృహిణికే అంటగట్టడం విజ్ఞత కాదు. ఇక, భార్య రూపసి అయినంత మాత్రం చేత ఆమె పరమశత్రువు కాగల దనడం కేవలం మూర్ఖత్వం. డెస్డిమోనా మహారూపసి. రూపంకంటె కూడా ఆమె గుణం దొడ్డది. ఒథెల్లో ఆమె కారణంగా మనోవ్యాకులత చెందితే, ఆమెను హత్యచేసి తనను తాను హత్య చేసుకుంటే, అది ఆమె తప్పుకాదు; ఇయాగో చాడీలకు చెవి నొగ్గిన అతని బుద్ధి మాంద్యం తప్పు.

*

# పదవీ వ్యామోహం

"మంత్రిపదవి కేవలం బందిఖానా. అది వొళ్ళు ముళ్ళపొద. అయినా, దానికోసం కొంద రెందుకో పడిచస్తారు" అని ఒక పెద్దమనిషి విస్తుపోతున్నాడు. "అంతే లేవయ్యా! అందని ద్రాక్షపళ్ళు పులుపు" అని ఒక పెద్దమనిషి మాటను త్రోసివెయ్యడానికి ఈయనా ఒక మంత్రే. పైగా, ప్రధానమంత్రి. ఏ రాష్ట్రానికో, సంస్థానానికో కాక, ఒక దేశానికే "బడా వజీర్." నిజానికి ఈయన పేరు మభ్యపెట్టవలసిన పనిలేదు. ఈ పెద్దమనిషి మరెవ్వరో కారు; మన ప్రధాని పండిట్ నెహ్రూయే.

"అందరు అందల మెక్కితే మోసేవా రెవరు?" ఈ సంగతి అందరి కంటె అధికంగా అందల మెక్కే వారికే ఆకళింపు. అందువల్లనే పల్లకీ యెక్కి తిరిగే ప్రతి పెద్దమనిషీ అంతకంటె బుద్ధితక్కువపని మరి వుండ దంటాడు. "చెడ్డకు దుపు. కీలుకీలూ కదిలి పోతుంది. వొళ్ళు హూనహూనమైపోతుంది" అని తెగ సణుగుతాడు. ఓపిక వుంటే కాలి నడకను మించి హాయి లే దంటాడు. కాలి కొద్దీ నడచినవారికి కరకర ఆకలి వేస్తుం దంటాడు. వారే సుష్మగా భోంచేసి, నిద్ర పోగల రంటాడు. ఆరోగ్యభాగ్యం వారిదే నంటాడు. "అయితే తమ రెందుకు

నడవరు? " అనే పోకిరీ ప్రశ్న వస్తుందేమోనని దానికి ముందుగానే జవాబులు ఆలోచించి పెట్టుకుంటాడు. కాలినడకను తిరగడానికి తనకు దార్ఢ్యం తక్కువనడా నికి వీలులేకపోతే, వంశ మర్యాదలను, కుటుంబ సంప్రదాయాలను కాపాడ్డానికి తాను లేనిపోని అవస్థలను పడవలసి వస్తున్నదని చెప్పి తప్పుకుంటాడు. లేదా చాలా లెక్క తిరగాలని, చావుకు వస్తున్నా పల్లకీ యెక్కడం తనకు తప్పడం లేదని సర్దుకుంటాడు. వెతికే కుంటిసాకు ఏదైనప్పటికీ అందలం నుంచి అడుగు కింద పెట్టడు. పెళ్ళికి ఒక్కసారి పల్లకీ యెక్కి దిగినవాణ్ణి ముక్కాలు ముదుస లైన తర్వాత సైనా "తాతయ్యా!మళ్ళీ గోకోకం ఎక్కుతావా?" అని కదిలించి చూడండి. "నాకు పిల్లనిచ్చే తల మాసిన వా డెవడురా?" అని ముసిముసి నవ్వులు నవ్వుతాడే తప్ప, "నాకు పల్లకీ ముచ్చట లేమిటిరా?" అనే మాట నోట వస్తుందేమో!

అందలమెక్కి కూర్చున్నవారు ప్రాయికంగా చెప్పే కబుర్లనే జవాహర్‌లాల్ చెబుతున్నా డనడం ఆయన పట్ల మహాపచారం చెయ్యడమే కావచ్చు. "నాపై ఎందరెందరో ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వారికి నే నెంత సేవ చెయ్య గలుగుతున్నాను?" అని ఒకప్పుడైనా ఆత్మపరీక్ష చేసుకోగలవాడు కాబట్టి, తన ప్రధాన మంత్రిపదవి ఆయనకు నిజంగానే బందిఖానాగా తోస్తున్నదని, నిజంగానే ముండ్లపొదవలె అది ఆయనకు బాధాకరమౌతున్నదని మనం అనుకోవచ్చు. కాని మానవస్వభావం ప్రపంచం పోకడ క్షుణ్ణంగా తెలిసిన నెహ్రూకు "పదవికోసం ఇంతగా కొందరు ఎందుకు తాపత్రయపడతారు?" అని ఆశ్చర్యం కలగవలసిన పని సుతరామూ లేదు.

లింగభేదాన్ని బట్టి మానవులలో కొందరు స్త్రీలు కాగా, మరి కొందరు పురు షులు. వయోభేదాన్ని బట్టి కొందరు పిన్నలు కాగా, మరికొందరు పెద్దలు. మేధలో భేదాన్ని బట్టి కొందరు సూక్ష్మగ్రాహులు కాగా, మరికొందరు మంద బుద్ధులు. గుణంలో భేదాన్ని బట్టి కొందరు సజ్జనులు కాగా, మరికొందరు దుర్జనులు. స్థితి గతులలో భేదాన్ని బట్టి కొందరు భాగ్యవంతులు కాగా, మరి కొందరు బీదవారు. ఇట్టివే కాక, వ్యక్తిగత దృక్పథం వల్ల జరిగే విభాగాలు కొన్ని వుంటాయి. ఉదాహ రణకు, అడాల్ఫ్ హిట్లర్ జాత్యహంకారంవల్ల మానవాళిని ఆర్య అనార్య జాతులుగా విభజించేవాడు. హిట్లర్‌ను చంపి పుట్టిన డేవిడ్ మలాన్ శ్వేత, శ్వేతేతర జాతు లుగా విభజిస్తున్నాడు. విదేశీయులు తమను బాధలు పెట్టిన కారణంగా చైనావారికి మానవజాతి అంటే రెండే రెండు తెగలు; స్వదేశస్థులు, పరదేశాల దయ్యాలు.

ఇంత దూరం పోకుండా నిత్య జీవితానుభవం నుంచే ఒక దృష్టాంతం చూపవచ్చు. మోటారుకార్లపై తిరిగేవారికి పాదచారు లందరు సరిగా దారివెంట నడపడమైనా తెలియని యెద్దు మొద్దు స్వరూపాలు; పాదచారులకు మోటారుకార్ల వా రందరు కండకావరం వల్ల కళ్ళు మూసుకుపోయినవారు. సూక్ష్మంగా పరిశీలించగలవారు మానవుల మధ్య మరెన్నో ఇతర విభాగాలు సయితం చేస్తారు. మానసిక శాస్త్ర వేత్త డాక్టర్ యూంగ్"ఇంట్రావర్ట్స్, ఎక్స్‌ట్రావర్ట్స్" అని మానవకోటిని రెండు శాఖలుగా విభాగించాడు. మరొక మానవశాస్త్రజ్ఞుడు "శాడిస్ట్స్, మాసోకిస్ట్స్" అని వేరొక విధమైన విభజన చేశాడు. సాంఘిక తత్త్వవేత్త కార్ల్‌మార్క్స్ "తినే వారు, తినబడేవారు" అని వారిని రెండు తెగలుగా చీల్చాడు. ఇదే విధంగా "నడిచేవారు, నడిపించేవారు," లేదా "పాలించేవారు, పాలింపబడేవారు" అని మనమొక చిలికచేస్తే అదీ సత్యసమ్మతమైందే కాగలదు. నడిపించాలని, పాలిం చాలని పొద్దస్తమానం ఎవరి పుర్రెలో పురుగు తొలుస్తుంటుందో వారే మంత్రి పదవులకోసం తాపత్రయపడుతూ వుంటారు.

నడిచేవారికి, నడిపించేవారికి ఎంత భేదం వుంటుందో భరతుని రామునితో పోల్చితే చక్కగా తెలుస్తుంది. తనకు రాజ్యం వలదని భరతు డనడానికి అన్నగారి పట్ల అతని కున్న పరమభక్తినే కారణంగా చెబుతారు. "అడవుల రామచంద్రుడు జటాజినముల్ ధరియించియుండ నే బుడమి భరించి భోగములు పొందగలానఁటె" అని అతడు తల్లికి వేసిన ప్రశ్న భ్రాతృభక్తి ప్రేరితమైందే – సందేహం లేదు. కాని, "ఇట్టి చొప్ప లేయెడ గలవు? " అని అతడు రెట్టించడంలో సామంజస్యం కనబడదు. రాచరికవు చరిత్ర భ్రాతృద్రోహాలతో ఎంతగా నిండిలేదు? రామా యణం లోనే సుగ్రీవుడు వాలికీ, విభీషణుడు రావణాసురునికీ ద్రోహం చేశారు. సరే ఈ విషయాని కేమిగాని, "ఇంక నన్న మొగ మేమి తెఱంగున జూతు!"

అని బాధపడిన భరతుడే కన్న తల్లిని పట్టుకుని "పాపపుం గడుపున బుట్టి యీ భువన గర్హకు బాత్రుడనైతి రాక్షసీ!" అని పడదిట్టడానికి భ్రాతృభక్తికి మించిన బలీయ కారణం మరొకటి లేక పోలేదు. ఒకరు చెప్పినట్టు నడచుకోవ డమే తప్ప తనకు తానై అడుగుతీసి అడుగు పెట్టడమైనా కైకేయీ పుత్రునికి చేతకాని పని. అతడు తల్లిచాటునో, తండ్రిచాటునో, తాతచాటునో, మేనమామ లచాటునో, అన్నలచాటునో బ్రతికినవాడు. "ఎల్లకాలం ఒకరిచాటు బ్రతుకేనా?" అని నానాతిప్పలు పడి తల్లి రాజ్యం సంపాదించి పెట్టినా దాన్ని యేలుకోవడం చేతకాకపోయింది. చేజిక్కిన రాజ్యాన్ని అన్నకు అప్పగింతపెట్టడానికి అయనను

వెతుక్కుంటూ చిత్రకూటపర్వతానికి వెళ్లాడు. "అయినదేదో అయింది. నేను తిరిగివచ్చే వరకు నా తరపున నీవే పరిపాలన సాగించు" అని అన్న చెప్పగా అందుకైనా తూగలేక, అన్న 'హుకూమత్' కు గుర్తుగా ఆయన పాదుకలు అడిగి తెచ్చుకున్నాడు. రాముడు మాత్రం ఎక్కడవున్నా నడిపించగలవాడే. కనుకనే పితృవాక్యపరిపాలన పేరుతో రాజ్యాన్ని పరిత్యజించినా తన పాదుల రూపేణా దాన్ని పరిపాలించగలిగాడు. చివరికి వానరుల మధ్యకు వెళ్ళినా వారికిక నాయకుడు కాగలిగాడు.

నడిపించే ప్రవృత్తి గలవారు పదవిని ఆశిస్తారనడం నిజమైనా, పదవికై ప్రాకులాడేవా రందరు నడిపించగల దమ్ములున్నవారు కాకపోవచ్చు. పదవిని అంటి డాబుదర్పాలుంటాయి. వాటిని అంటించుకోడానికే కొందరు పదవులకై దేవులాడతారు. పదవి లేనినాటి "పెద్దాయి," అది అబ్బగానే "పెద్దయ్య గారు అయిపోతాడు. నోరు విప్పితే బూతు వస్తుందేమోనని పెద్దయ్య నోటికి తాళం తగిలించుకుంటే అది గాంభీర్యంగా చెల్లుబడి అవుతుంది. నోటికి ఎంతవస్తే అంతా తడుముకోకుండా వాగివేస్తే అది గంగా ప్రవాహాన్ని మించిన మహోపన్యాసంగా మెప్పు పొందుతుంది. మాట్లాడిన మాటలలో అవాకులు, చెవాకులున్నా ఫరవాలేదు. అప్పుడు గడసరితనానికి పేరు మ్రోగవచ్చు. మొత్తంపై పదవి కప్పిపుచ్చలేని లోపాలు బహుతక్కువ.అది పొందని భట్రాజు పొగడ్తలు లేవేమో! అయినవారికి మాత్రమే మేలుచేస్తే, "ఆశ్రిత పక్షపాతి" బిరుదు పొందవచ్చు. దయాదాక్షిణ్యాలు లేకుండా ప్రతికక్షులను కాలరాచి వేస్తే "అటునుంచి నరుక్కురాగల అద్భుతప్రజ్ఞాశాలి" అని కీర్తి కెక్కవచ్చు. మేలు కీడులలో దేన్నీ చెయ్యడం చేతకాకపోతే 'ధర్మరాజు' ఘనతగాంచవచ్చు. కీర్త్యపకీర్తులు కాసుచెయ్యవని తెగిస్తే వెనక మూడుతరాలకు, ముందు ఏడుతరాలకు తరగని భాగ్యాన్ని పోగుజేసుకోవచ్చు. ఇట్టి తుచ్ఛసంత్పప్తులను వేటినో ఆశించి పదవికై అంగ లార్చినా, దానిలో నిజంగా రాణించగలవారు మాత్రం నడిపించగల నేర్పుగలవారే. ఆ నేర్పుగల దిట్ట, హిట్లర్ చేసినట్లు, దేశాన్ని వినాశానికే నడిపించవచ్చు. అయినా నడిపించడం మాత్రం ఖాయం ఆ నేర్పులేని వారికి పదవి మేకమెడచన్ను; లేదా, సుమతీ శతకకారుని కనకపు సింహాసనం.

*

# రంగు అద్దాలు

కాల్చిన వంకాయ పచ్చడి, పచ్చిపులుసు: ఇవంటే నాకు మహా యిష్టం. "జిహ్వాకొక రుచి; పుర్రెకొక బుద్ధి" అని పెద్ద లన్నారు గదా! ఒకరికి వంకాయ పచ్చడి ఇష్టమైతే, ఇంకొకరికి బీరకాయ పచ్చడి యిష్టం, మరొకరికి గోంగూర పచ్చడి యిష్టం. అసలు పచ్చ డంటేనే సయించనివారు కూడా కొంద రుంటారు. కూరల విషయంలోనూ ఇంతే. ఒక్కొక్కరికి ఒక్కొక్క కూర యిష్టం. మళ్ళీ అందులో కొందరికి ఇగురు కూరలు కావాలి. కూరలో మస్తుగా కారం లేకపోతే ముద్దకూడా ఎత్తలేరు. కారం ఏకాస్త యెక్కువ పడినా, మరికొందరి కళ్ళవెంట, ముక్కుళ్ళ వెంట నీళ్లు కారతాయి. కొందరికి తీపంటే మనసు; మరికొందరికి తీపి తిన్నంతనే ముఖం కొడుతుంది. ఇంత దేనికి? ఉల్లిపాయ సంగతే చూడండి: దానిపేరు చెబితేనే కొందరికి నో రూరుతుంది. వీరు "ఉల్లి పదితల్లుల పెట్టు" అంటారు. రుచులన్నీ ఉల్లిపొరలోనే పోగు చేసుకున్నాయని వీరి నమ్మకం. "ఉల్లి వుంటే మల్లి వంటలక్కే" అనేది వీరే. నంజుకోడానికి రెండు ఉల్లిపాయ లుంటే చద్దికూడైనా అమృతోపమాన మౌతుంది. కాని, కొందరికి ఉల్లివాసన ఎంత దూరాన తగిలినా కడుపులో దేవుతుంది. ఉల్లిని అంటరాని, ముట్టరాని వస్తువుగా జమకట్టి, "ఉల్లిముట్టనిదే వాసన రాదు" అని వీరు నీతిబోధ చేస్తారు. ఈ

మాటనే మరింత కులాసాగా చెప్పాలంటే "ఉడకకే ఉడకకే ఓ ఉల్లీ, నీవెంత ఉడికినా నీ కంపు పోదు" అంటూ పగలబడి నవ్వుతారు.

కాని "లోకో భిన్న రుచిః" అన్నంత మాత్రాన కాల్చిన వంకాయ పచ్చ డిపై, పచ్చిపులుసుపై నాకున్న మక్కువకు కారణం తేలిపోదు. బంగాళాదుంప, పచ్చిబటానీ, టొమాటో, క్యారట్ మొదలైనవి ఎక్కువ రుచిగల పదార్థాలని నా అభిప్రాయం. అయితే వీటితో వండిన కూరలు తింటున్నప్పుడు రుచిగల పదార్థాలు తింటున్నా నన్న సంతృప్తి తప్ప, అంతకుమించి "కదలిక" (రియాక్షన్) నాలో కలగదు. ఇక, కాల్చిన వంకాయ పచ్చడిని కాని, పచ్చిపులుసును కాని వడ్డించు కోగానే చిన్ననాటి సముద్ర స్నానంతో పాటు, నాటి ఆనందానుభూతి జ్ఞాపకం వస్తుంది.

నా చిన్నతనంలో ఒక మాఘపౌర్ణమికి మా పల్లెనుంచి సముద్ర స్నానానికి బందరు వెళ్ళాము. బాడుగకు మా అమ్మమ్మ ఒక బండి కుదిర్చింది. అది చోద్యమైన బండి. దాని దాపటిని ఒక దున్నపోతు; వెలుపటిని ఒక గొడ్డుబోతు ఆవు. నాకు తిన్నగా తెలియదుగాని, తక్కిన వాటికంటె ఒక రూపాయి తక్కువకు వచ్చిందనే మా అమ్మమ్మ ఆ బండిని కిరాయికి కట్టించిందని అనుకొంటాను. ఏమైతేనేమి దానిలో నేను, మా తమ్ముడు , మా అమ్మ, మాపిన్ని, ఆమె బిడ్డలు, మా అమ్మమ్మ, మా చిన్న మేనమామ, ఇంచుమించు పదిమంది బయల్దేరాము. భోజనాలైనాక రాత్రి ఎనిమిది, తొమ్మిదిగంటలకు బయల్దేరిన మా బండి తెల్లవారుఝామున నాలుగైదు గంటలకు చిలకలపూడి చేరుకుంది. అక్కడ రోడ్డు దిగి ఇసుక పర్రలో మూడునాలుగు మైళ్ళు వెడితేనే గాని సముద్రంవద్దకు చేరుకోము. రోడ్డుపై నడిచినంతవరకు దున్నపోతు, గొడ్డుబోతు ఆవు కలసి, బండిని ఎలాగో లాగినా, ఆ తర్వాత అవి అడుగు తీసి అడుగు పెట్టడమే వాటికి కష్టమై పోయింది. అందువల్ల మేము కొందరం బండి దిగి నడిచాము. సూర్యో దయం వేళకు సముద్రతీరం చేరుకుని, ఏడెనిమిది గంటలకు స్నానం పూర్తిచే సుకొన్నాము. తర్వాత మేము బందరు చేరేసరికి పది కావచ్చింది. అప్పుడు బండిని ఒకరి పంచను నిలిపి, వారి పెరటిలో వంట ప్రారంభించాము. అప్పటి పరిస్థితులలో సాధ్యపడగల వంట అత్తెసరు అన్నం, కాల్చిన వంకాయ పచ్చడి, పచ్చిపులుసు మాత్రమే. గతుకు రోడ్డుమీద బండి ప్రయాణం, ఇసుకలో కాలుసా గని నడక, సముద్రంలో పక్కాగంట ఈత, తిరిగి ఇసుకలో కాళ్ళీడ్చుకుంటూ నడక, ప్రొద్దెక్కిపోవడం, కరకర ఆకలి: అప్పుడు ఆ కాల్చిన వంకాయపచ్చడే, ఆ

పచ్చిపులుసే పంచభక్ష్యపరమాన్నాల కంటె నాకు మధురాతి మధురంగా తోచింది!

ఇప్పటికీ నాకు కాల్చిన వంకాయపచ్చడిపైన, పచ్చిపులుసుపైన చాలా మక్కువ వుండడానికి నాటి మధుర స్మృతే కారణ మనుకుంటాను. ఇది ఒక్క నాకేకాదు; అందరికీ వర్తిస్తుంది; ఒక్కజిహ్వాకే కాదు; జీవితానికి వర్తిస్తుంది. ఒక వస్తువు కైనా, ఒక వ్యక్తికైనా, మన మిచ్చే విలువ ఆ వస్తువు స్వతస్సిద్ధమైన గుణంపై గాని, ఆ వ్యక్తి స్వతస్సిద్ధమైన గుణంపై గాని ఆధారపడి వుండదు. మనకూ దానికీ, లేదా మనకూ అతనికీ వున్న అనుబంధంపై ఆధారపడి వుంటుంది.

మనకు ఆలోచనాశక్తి కలదని అనుకుంటాము; వివేచనా పటిమ వున్నదని గర్విస్తాము. కాని, దేన్నీ కూడా అనుబంధం, మన అనుభూతి అనే రంగు అద్దాలగుండా తప్పితే చూడనేలేము. ఇందువల్ల కొన్నింటిలో లేని అందం, లేని రుచి, లేని గుణం కనబడవచ్చు. ఇంతేకాదు. రుచికరమైన దానిలో అరుచి, అందమైన దానిలోనే వికారం, గుణం వున్నచోట అవగుణం కనబడవచ్చు. మన అనుబంధాన్ని విడిచి, మన అనుభూతిని వదలి, దేనికీ విలువ కట్టనే లేము. ఏ పిల్లికైనా పాలంటే యిష్టమే! కాని, తెనాలి రామలింగని పిల్లిపాలను చూడగానే బెదిరిపోడడం ఒకసారి వేడివేడి పాలలో మూతి పెట్టడం వల్ల దాని నాలుక చుర్రున కాలినందునే!

పరిశీలించి చూడము గాని, మన ప్రతి యిష్టానికి, అయిష్టానికి, ప్రతి ప్రేమకు, విద్వేషానికి మన అనుభూతిలోనే, జీవితంలోనే అంతర్భూతమై ఏదో కారణం వుంటుంది. ఇందుకు నిదర్శనంగా హిట్లర్ చరిత్రనే చూడండి. అతనికి యుద్ధం అంటే తగని ప్రేమ; తెంపులేని భక్తి. నాదృష్టిలో, మీ దృష్టిలో యుద్ధం ఒక మహామారి కావచ్చు. సస్యశ్యామలమైన భూతలాన్ని శ్మశానవాటికగా మార్చివేస్తుందని దాన్ని మనం నిరసించవచ్చు. ఆశలతో, ఆశయాలతో, కలలతో, కల్పనలతో భావిజీవితాన్ని సుందరంగా, మధురంగా చిత్రించుకొని, దాన్ని కైవసం చేసుకోడానికి తమలో గర్భితమై వున్న శక్తులను ప్రదీప్తం చేసుకుంటున్న యువజనులను వేలకొలదిగా, లక్షలాదిగా కబళించి వేస్తుందని దాన్ని మనం విద్వేషించవచ్చు. ఎందరినో అనాధులను చేసి, మరెందరినో నిరాధారులుగా నిలిపి, సుఖంతో, ఆనందంతో, జ్యోతిర్మయంగా వున్న గృహాంతరాళాలను దుఃఖంతో, దైన్యంతో అంధకార బంధురం చేస్తుందని మనం దాన్ని విషతుల్యంగా చూడవచ్చు. కాని, హిట్లర్‌కు మాత్రం యుద్ధంలో ఏదో అందం, ఆకర్షణ, ఏదో సమ్మోహన శక్తి కనబడేది. యుద్ధవ్యవస్థ లేకపోతే, మానవవ్యవస్థే లేదని అతడు విశ్వసించేవాడు. మానవజాతి

పురోభివృద్ధికి యుద్ధమొక మహత్తర సాధనమని అతడి నమ్మకం. మానవుని నిగూఢశక్తులన్నింటిని యుద్ధం వెలికి తెస్తుందని అతడు ధ్ఘాటించాడు. యుద్ధపరికరాలు సేకరించడం, యుద్ధసన్నాహాలు సాగించడం. యుద్ధరంగా లేర్పరచడం, ఒక్కమాటలో యుద్ధాన్నే అతడు తన జీవిత పరమావధిగా చేసుకున్నాడు. హిట్లర్ ఈ చిత్తవృత్తికి కారణ మేమిటి?

"నా" అనేవారు లేక, పనిపాటులు లేక, కూడుగుడ్డలు లేక, ఏకాకిగా, బికారివలె అతడు తిరుగుతున్న రోజులలో ప్రథమ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. అప్పుడది ప్రారంభం కావడం హిట్లర్‌కు వరదవెంట కొట్టుకుపోతున్న వానికి తెప్ప కొయ్య దొరికినట్టే అనిపించింది. ఆ క్షణంలో అతడు తన ఆనందం పట్టలేక, కళ్ళవెంట జొటజొట నీళ్ళు కార్చుతూ, నిలబడినచోటనే మోకరిల్లి, భక్తియుతంగా, కృతజ్ఞతాపూర్వకంగా పరమేశ్వరునికి నమస్కరించాడు. అంతవరకు హిట్లర్ ఒక కీటకం. సైనికుడుగా చేరినంతనే అతడు కూడా ఒక మనిషి అయ్యాడు. హిట్లర్‌కు యుద్ధం జీవితపరమావధి కావడంలోని కీలక మిదే.

విపరీత పరిస్థితులలో పుట్టి, విపరీత పరిసరాలలో పెరిగి, విపరీతపు చావు చచ్చిన విపరీతవ్యక్తిగా, పోనీ, హిట్లర్ జీవితానికి మనం విలువ నివ్వకపోయినా, ప్రపంచపు మన్నన పొందుతున్న ఇతరులైనా నమస్తాన్నీ స్వీయానుభవం రంగు అద్దాలగుండా చూచేవారే. చిన్నతనంలో దారిద్ర్యాన్ని వెళ్ళబోసినప్పుడు పులిసిన 'బ్రెడ్'(రొట్టె)తో షేక్స్‌పియర్ కడునింపుకోవలసి వచ్చేది కాబోలు – రోతగించుకోకుండా రొట్టె ప్రసక్తిని ఆయన తన నాటకాలలో తేనేలేదు. సుప్రసిద్ధుడైన స్వీడిష్ నాటకకర్త స్ట్రిండ్ బర్గ్ స్వీయ గార్హస్థ్య జీవితానుభావాల కారణంగా మొత్తం స్త్రీ జాతి విద్వేషకుడైనాడు. షేక్స్‌పియర్ నాటకా లంటే టాల్‌స్టాయ్‌కి ఎంతమాత్రం గిట్టకపోవడానికీ, ప్రత్యేకంగా కింగ్ లీర్ నాటకాన్ని, దానిలో లీర్ పాత్రను ఈయన దుయ్యబట్టడానికీ, కారణం తన జీవితవైఫల్యాన్ని ఆ పాత్రలో చూచుకొనడమే అని చెప్పేవారున్నారు, విదేశాలదాకా పోవడం దేనికి? మన దేశస్థుడు, మన కవిసార్వభౌముడు శ్రీనాథునే చూడండి. జొన్నన్నం తన గొంతు పట్టుకొంటుంది కాబట్టి—

జొన్నకలి, జొన్నయంబలి,
జొన్నన్నము, జొన్నపిసరు, జొన్నలె తప్పన్
సన్నన్నము సున్నసుమీ
పన్నుగ బల్నాటిసీమ ప్రజలందఱకున్

అని వారిని గేలిచెయ్యడంతోనైనా ఆగలేదు. "తింత్రిణీ పల్లవయుక్తమౌ నుడుకు బచ్చలి శాకము జొన్న కూటితో మెల్లన యొక్క ముద్ద దిగమ్రింగుము, నీ పసకాన నయ్యెడిన్" అని దేవుడినే సవాల్ చెయ్యడంతోనైనా ఆగ లేదు. మొత్తం పల్నాటి సీమను, అక్కడి ప్రజను "అంగడి యూరలే"దని, "శుచిత్వ మేమి లే" దని, "అంగన లింపు లే"రని, ప్రియమైన వనంబులు లే" వని, మరేమో లేవని తెగనాడాడు. అక్కడ "రంభయైన నేకులు వడుకు" తుందట, "వసుధేశుడైన దున్ను"తాడట. పల్నాటి వారు సోమరితనం చూపక పోవడమే శ్రీనాథుని దృష్టిలో ఒక మహాపాపం కాబోలు! కేవలం వ్యక్తులవిషయంలోనే కాక, జాతుల విషయంలో కూడా అనుభూతులే వాటి అభిరుచులను, అభిప్రాయాలను నిర్ణయిస్తాయి. దృష్టాంతానికి, చైనా లో ఇటీవల వరకు సైనికవృత్తిని నీచాతినీచమైన దాన్నిగా పరిగణించేవారు. సైన్యంలో చేరడం శిష్టసంఘానికి దూరమై పోవడమే. ఎవరు జీతబత్తాలిస్తేవారి షక్షాన పోరాడ్డం; ఎవరెక్కువలంచపంచాలు పెడితే వారి షక్షానికి తిరిగిపోవడం, నిరాయుధ ప్రజలపై నిస్సహాయజనపదాలపై పడి దోచుకోవడం-ఇదే సైనికులైన వారికి పరిపాటిగా వుండేది. అయినప్పుడు ఇది వరకు చైనాలో సైనికుని ఒక చోరునిగా, హంతకునిగా కంటగించుకునే వారంటే దానిలో వింత లేదుగదా? చైనా సైనికుల ప్రవర్తన పోయిన పది, పదిహేను సంవత్సరాలలో పూర్తిగా మారినందున ఇప్పటికి వారిపట్ల ప్రజాభిప్రాయం కూడా బహుశా మారిపోయే వుంటుంది. ఇది నీతిబోధకవ్యాసం కాదు గాని, మనం దేన్ని హర్షించినా, మరి దేన్ని విద్వేషించినా, మన అనుబంధాలను అధిగమించి, మన అనుభూతులకు అతీతంగా నిలిచి ఆ కార్యంచేస్తున్నామా అనే ఆత్మపరీక్ష అవస రమేమో! ఇది వున్ననాడు తొందరపడి, ఎవ్వరినీ "తను మునిగింది గంగ" తను వలచింది రంభ" అని అవహేళన చెయ్యము.

*

# స్మారక చిహ్నాలు

లండన్ కౌంటీ కౌన్సిల్‌కు దివ్యమైన ఒక నియమం వున్నది. స్మారక చిహ్న నిర్మాణానికి ఈ పురపాలక సంఘం సమ్మతిని పొందవలసివుంటే ఎవరి స్మృతి చిహ్న నిర్మాణానికి ఉద్యమిస్తున్నారో ఆ మనీషి మరణించి అప్పటికి పాతిక సంవత్స రానైనా గతించి వుండాలి. లేకపోతే కావలసిన సమ్మతి లభించదు. ఇంతవరకు ఒక్క పర్యాయమే ఈ నియమోల్లంఘన జరిగింది. అది బెర్నార్ట్ షా విషయంలో. ఆయన మరికొన్ని నెలలకు జీవయాత్ర చాలిస్తాడనగా వెనక అడెల్ఫీలో ఆయనకు నివాసమైన ఒక భవంతికి " జార్జి బెర్నార్డ్ షా ఇక్కడ నివసించాడు" అని ఒక చంద్రశిలాఫలకం అమర్చడానికి ఆయన భక్తులు అనుమతి కోరగా అందుకు లండన్ కౌంటీ కౌన్సిల్ "వల్లె" అన్నది. షా నాటికి విగతజీవుడు కాకపోయినా, ఆయన స్థిరకీర్తినందినాడన్న విశ్వాసమే దాని వల్లెకు మూలం. మనంకూడా ఈ విశ్వాసంలో భాగస్వాములమే. కాని,"షాకీర్తి తగ్గితే నా చెవి కోయించుకుంటాను" అని పందెం కడితే చెవిపోగల ప్రమాదం వచ్చినా రావచ్చునేమో చెప్పలేము. తాను షేక్సిపియర్‌తో సమానం ఉజ్జీనని, నాటక కర్తగా షేక్స్‌పియర్ ఒకవేళ కాస్తో కూస్తో మెరుగైనా ఆయనకంటె తాను చచ్చులేకుండా పెచ్చు మేధావంతుడనని బెర్నార్డ్ షా బల్లగుద్ది చెప్పకున్నా, తన

కీర్తి తన తరం తర్వాత నిలవబోదేమోనన్న భయం పీడిస్తూనే వుండేది. షా తన వృద్ధాప్యాన్ని గడిపిన అయెు సెయింట్ లారెన్స్ గ్రామంలో ఆయన ఇరు గుపొరుగు వాడైన యన్. విన్‌స్టెన్ వ్రాసిన పుస్తకం "డేన్ విత్ బెర్నార్డ్‌షా" ను చదివితే ఒక్కొక్క సంవత్సరం పైబడినకొద్ది ఈ భయం ఎంత పెచ్చిందీ తెలుస్తుంది. కొత్త తరంవారు నా పుస్తకాలను చదువుతున్నారా? నన్నుగురించి వారేమి చెప్పుకుంటున్నారు? అసలు నా ఊసైనా వారు తెస్తున్నారా?-ఇట్టి ప్రశ్న లను షా తరచు వేస్తుండేవాడు. తన తరాన్నే కాక, ఆ తర్వాత వాటినికూడా వొప్పించి, మెప్పించి, తన కీర్తిస్తంభాన్ని చిరస్థాయిగా నెలకొల్పాలన్న తాపత్రయం తోనే ఆయన కడవరకు కలం ఆడిస్తూనే పోయాడు.

ధనలక్ష్మి చంచలచిత్త అని జగత్ప్రసిద్ధి. సుమతీ శతక కారుడు-

సిరి దా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్
సిరిదా బోయిన బోవును
గరి మ్రింగిన వెలగ పండు కరణిని సుమతీ

అని చెప్పనే చెప్పాడు. అయినా, చంచల చిత్తంలో ధనలక్ష్మి కీర్తికాంతకు చాలదు. కీర్తి ఎందుకు వస్తుందో, మరెందుకు పోతుందో తెలియదు; ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు. నిన్న ఊరూ పేరూ లేనివాడే నేటికి ఊరూనాడూ మ్రోగిపోతుంటాడు. పోనీ, నిన్నటికీ, నేటికీ మధ్య అతను ఏదో పొడిచి వేశాడంటే ఆ పని చేసిన వారందరకీ అందుమూలంగా పేరు రాదు. ఎన్నడూ అబద్ధమాడని వారు చాలామంది వుండవచ్చు. అయినా ఒక్క హరి శ్చంద్రుడికి, ఒక్క వాషింగ్టన్‌కు మాత్రమే సత్యసంధతకు ఖ్యాతి లభించింది. "నిరయంబైన, నిబంధమైన, ధరణీ నిర్మూలనంబైన, దుర్మరణంబైన, గులాంత మైన, నిజమున్ రానిమ్ము...." అని బింకానికి పోయిన కొందరు చాదస్తులు గానో, వెంగళప్పలుగానో నగుబాట్ల పాలైనారు. వెనకటికి ఒక బ్రాహ్మసమాజికుడు-ఆయన పేరు పేరంబచంద్ర మైత్ర; కలకత్తా సిటీ కాలేజీ ప్రిన్సిపల్-పల్లెటూ రువారు కొందరు వీధిలో ఎదురు పడి "రామలీల" ఆడుతున్న పేటకు దారి అడగ్గా, నృత్య నాటక గాన వినోదాలు పాపవంక భూయిష్టమైనవని నమ్మినవాడు కనుక, తనకు తెలియదు పొమ్మని కోపంతో విదిలించాడట. దారి అడిగినందుకే ఈయన ఇంత బుస్సుమన్నా డెందుకోనని ఆశ్చర్యపడుతూ వారు పదిబారలు

సాగారిపోయేసరికి "దారి నాకు తెలిసి వుండీ తెలియదలడం అబద్ధం చెప్పడమే కాదా!" అని ఆ సత్యశీలి మనస్సు చివుక్కు మన్నదట. గిర్రున వెనక్కి తిరిగి, అంగలు పంగలు వేసుకుంటూ వెళ్ళి, మీరడిగిన చోటుకు దారి నాకు తెలుసు. కాని మీకు చెప్పను." అని వెడీమని అనివేసి, మళ్ళీ తన దారిన చక్కాపోయా 'డట. తెల్లబోయి, "ఇతడేమి పిచ్చివాడు కాడు గదా?" అని ఆ గ్రామస్థులు ఒకరి ముఖాలొకరు చూచుకున్నారట. పిచ్చి పుల్లాయి అనిపించుకొనడం కంటె పచ్చి దొంగ అనిపించు కొనడమే ఏనాడైనా మెరుగు కనుకనే ప్రాపంచిక అనుభవంలో పండిన శుక్రాచార్యులవారు "వారిజాక్షులందు, వైవాహికములందు, బ్రాణమాన విత్తభంగమందు, జకిత గోకులాగ్రజన్మ రక్షణమందు బొంకవచ్చు" అని సెలవిచ్చి వుండాలి. కీర్తి వచ్చిన వారికి అది ఎందువల్ల వచ్చిందో సరిగా తెలియదు సరిగదా, ఏదో ఒక కారణాన ఎంతో కొంత అబ్బినా, అది స్థిరంగా నిలుస్తుందన్న గ్యారంటీ లేదు. ఇవాళ ప్రతినోట వినవచ్చిన పేరును రేపు ఒక్కరైనా తలవక పోవడం అరుదైన సంఘటన కాదు. "పాల్ అంటే యెవరండీ?" అని తెలియక అడిగితే నలభైయేళ్ళ క్రితం నవ్వేవారు; తెలిసే అడిగితే "బిపిన్ చంద్రపాల్ పేరు తెలియనంతటి మూర్ఖుల మనుకున్నారా!" అని కోపగించుకొనే వారు. అప్పటిలో ఆయన ప్రభ అంతగా వెలిగిపోతూవుండేది. ఆయనను కలుసుకోవ డమే, ఆయనతో ఒక సారి మాటాడ్డమే, ఆయన పరిచయభాగ్యాన్ని పొందడమే జన్మ తరించడంగా భావించేవారు. అప్పటిలో ఆయన మన ఆంధ్రదేశం పర్య టనకు రాగా, ఆయనకు మనవారు ఎంతగా బ్రహ్మరథం పట్టిందీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి "స్వీయచరిత్రము" చూస్తే తెలుస్తుంది. 1906లో ఆయన రాజమహేంద్రవరం వచ్చి, మొదటి ఉపన్యాసాన్ని ఇన్నీసుపేటలో ఒక చోట చేసే సరికి ఆ మర్నాటి నుంచి దానిపేరు "పాల్ చౌక్" అయిపోయిందట. "శ్రీకృ ష్ణుని గానము విని మోడులు చిగురించినట్టు, రాళ్ళు స్రవించినట్టు బిపినుచంద్ర పాలుగారి యుపన్యాసములు విని జనులుద్రేక పూరితు" లైనారట. చిలకమర్తివారి స్వీయచరిత్రలో ఈ మాట లేదుగాని, కొన్నేళ్ళపాటు "లాల్-బాల్-పాల్" అని దేశం మారు మ్రోగింది. ఈ ప్రముఖ నాయకత్రయంలో లాలా లజపత్‌రాయ్‌ని, బాల గంగాధరతిలక్‌ను జయంతి, వర్ధంతులనాడైనా ఇప్పటికీ సంస్మరిస్తున్నారు కాని, బిపిన్ చంద్రపాల్ తన జీవితకాలంలోనే ఖ్యాతిని కోల్పోయాడు. చివరి చివ రకి అపఖ్యాతి పాలై నాడుకూడా. కీర్తికాంత ఈ చంచల స్వభావాన్ని దృష్టిలో పెట్టుకున్నందునే "మరణానంతరం కనీసం పాతిక సంవత్సరాలేనా దొర్లి వుంటేనే స్మారకచిహ్న నిర్మాణానికి సమ్మతి" అనే ఉత్తమ నియమాన్ని లండన్ కౌంటీ

కౌన్సిల్ పెట్టుకున్నది.

ఏ పది, పదిహేను సంవత్సరాలో కాక, లేదా, ఏ నలభై, యాభై సంవత్సరాలో కాక, పాతికేళ్ళ గడువు పెట్టడం లోతుగా ఆ లోచించిన మీదటనే జరిగిందని చెప్పాలి. పాతికేళ్ళు తిరిగి వచ్చేసరికి అడ్డాలవారు గడ్డాలవారౌతారు. అంటే, ఒక కొత్తతరం తలయెత్తగల దన్నమాట! ఒక తరాన్ని దాటి మరొకదానికి విస్తరించిన కీర్తి అటు పిమ్మట మాసిపోవడం సర్వసాధారణంగా జరగదు. మాసినా కొన్ని కళలు తగ్గడంవరకే కాని, పూర్తిగా కాదు. కనుమరుగైన పాతికేళ్ళతర్వాత కూడా లోకం మరచి పోని వ్యక్తికి స్మారకచిహ్నం కట్టడానికి ఎవరైనా ముందుకువస్తే వారిని సర్వవిధాలప్రోత్సహించవలసిందే. "మరి కొన్నేళ్ళపాటు ఆగితే ఆ వ్యక్తి కీర్తి కడకంట నిలిచేదీ లేనిదీ నిస్సంశయంగా తెలుస్తుందికదా? అని ఈ గడువు పొడిగించడం తెలివిగల పని కాబోదు. స్మారకచిహ్నం నిర్మాణం వ్యయ ప్రయాసలతో కూడిన పని. దానికి ఉద్యమించగల శ్రద్ధాసక్తులు, ఎవరికైస్మారక చిహ్నం ఉద్దేశించబడుతున్నదో వారిని జీవిత కాలంలో సన్నిహితంగా యెరిగినవారికి తప్ప, తక్కినవారికి సామాన్యంగా వుండవు. అసలు వ్యక్తి పోయిన తర్వాత పాతికేళ్ళకుమించి ఆగితే, ఇట్టివారు మిగలడం కష్టం."

లండన్ కౌంటీ కౌన్సిల్ నియమాన్ని మన మునిసిపాలిటీలు "కాపీ" చేస్తే నేను బ్రహ్మానందపడతాను. పుల్లయ్య పురపాలక సంఘాధ్యక్షుడుగా పనిచేశాడనో, సహకార సంఘం ప్రెసిడెంట్ గిరి వెలగబెట్టాడనో ఏ వీధికో, పేటకో, పార్కుకో, మార్కెటుకో తపీమని ఆ పుల్లయ్యపేరు పెట్టడం ప్రస్తుతం మన పట్టణాలలో జరుగుతున్నది. ఆ మహామహోపదవిని అలంకరిస్తున్నప్పుడు పుల్లయ్యపేరు దివ్వెటీలా మండిపోతూ వుండవచ్చు. మరి నాలుగేళ్ళకు అతడి పేరు తలచేవారే వుండక పోవచ్చు. అయినా ఆ వీధినో, పేటనో, పార్కునో, మార్కెట్టునో కలకాలానికీ వెక్కిరిస్తూ ఆ పేరు మాత్రం మిగిలిపోతుంది. ఇంతేకాక, మన పురమందిరాలలో ఎందరి త్రివర్ణ చిత్రాలు ఈ నాడు లేవు! మన పురవీధులలో ఎందరి శిలావిగ్రాహాలు లేవు! ఆ చిత్రపటాల అంచులపై వ్రాయబడివుండే పేర్లను, లేదా, ఆ శిలావిగ్రహాల వేదికలపై చెక్కబడివుండే పేర్లను చదువుకోనిదే వీరిలో చాలామంది ఫలానావా రన్నసంగతి మనకు తెలియదు. అప్పటికైనా "ఇతడు పుల్లయ్య" లేదా, "అతడు యల్లయ్య" అని తప్ప మనకు తెలిపేది కాని, మనం తెలుసుకోదగింది కాని వుండదు. ఇట్టి దివ్యనామాలను చిరస్థాయిగా నిల్పడానికి ఉద్యమించేముందు లండన్ కేంటీ కౌన్సిల్ పెట్టుకున్న పాతికేళ్ళ గడువు మన్నిస్తే ఎంతగా వ్యయ

ప్రయాసలు తప్పవు? ఎంతగా మన పుర సౌందర్యం పెరగదు?

లండన్ కౌంటీ కౌన్సిల్ చేసుకున్న ఒక్క నియమమే మన దేశానికి చాలదు; దానికి మరొకదాన్ని మనం జత చేర్చుకోవాలి. ఇటీవల మన బస్తీలలోనే కాకుండా మారు మూల కుగ్రామాలలోనూ గాంధీ కస్తూరీబా, నెహ్రూ, నేతాజీ మొదలైన దేశనాయకుల సిమెంట్ విగ్రహాలను వెలిపిస్తున్నారు. వీటిలో నూటికి 99 వంతులకు పైగా భరించరానంతటి వికారమైనవి. ఇవి అల్లంత దూరాన కనబడగానే నేను రెండు కళ్ళూ గట్టిగా మూసుకుని, క్షేమంగా అవతలికి చేరేవ రకు తిరిగి తెరవను. "క్షేమంగా" అని నేనన్నప్పుడు నా క్షేమం. ఆ విగ్రహాల క్షేమంకూడా. పరీక్షగానే అక్కరలేదు, పొరపాటుగానైనా వాటిని ఆ పాదమ స్తకం చూస్తే కలరావస్తుందేమోనని నా భయం. వాటి వికారాన్ని భరించలేక ముక్క చెక్కలు చేసి వేస్తానేమోనని నాపట్ల నాకు అనుమానమే! దిష్టిబొమ్మ లకంటె కనిష్టమైన ఈ సిమెంట్ బొమ్మలను-ఏ నూరు రూపాయలకో, రెండు నూర్లకో చౌకగా వస్తున్నవిగదా అని-వేలం వెర్రిగా ప్రతిష్ఠాపన చేయడం మన నాయకులను సమ్మానించడం కాదు, వారి పట్ల మహాపచారం చేయడం. ఇది వారిపట్ల భక్తిప్రపత్తులను చూపడం కాదు, వారిని ఖూనీ చెయ్యడం. ఎవరికైతే స్మారక చిహ్నాలు ఉద్దేశించబడతాయో అవి వారి అంతస్థుకు తగినవై వుండాలి. పర్వతాలతో పోటీచేస్తున్న పిరమిడ్లు వినా మరొక విధమైన స్మారకచిహ్నాలు ఫారోరాజుల అధికార దర్పానికి, ఆడంబరజీవితానికి తూగగలిగేవి కావు. అతిలోక సుందరమైన తాజ్‌మహల్ తప్ప మరొకటి ముంతాజ్‌పట్ల షాజహాన్ చక్రవర్తి కున్న అపారప్రేమకు చిహ్నంకాగలిగేది కాదు. మహాసామ్రాజ్యాల సంపత్తినంతటినీ వినియోగించిస్మారక చిహ్నాల నిర్మాణం కొనసాగించడం మనకు సాధ్యం కాక పోవచ్చు; సాధ్యమైనా అది వాంఛనీయం కాకపోవచ్చు. కాని మన దేశనాయకు లపట్ల భక్తిగౌరవాలను తెలుపు కోవాలంటే విగ్రహానికి అయిదు, పదివేలచొప్పున ఖర్చుపెట్టలేమా? దాన్ని చలువరాతిలో మలచడానికో, కంచులో పోత పొయ్య డానికో ఒక శిల్పినైనా వియోగించుకోలేమా? ఇంత మాత్రం ఓపికైనా మనకు లేకపోతే, ఒక నమస్కారం పెట్టి మిన్నకుండక, ఏదో పాడు అచ్చుదిమ్మనుంచి గుద్దిపారవేసిన సిమెంట్ దిష్టిబొమ్మలతో మనకు పూజనీయులైన వారిని వెక్కి రించడం భావ్యమా? నాకు అధికారమే వుంటే ఈ దిష్టిపిడతల ప్రతిష్ఠాపన కైమేర్పాట్లు చేస్తున్నవారికి అయిదేళ్ళ కఠినసరకం, వీటిని ఆవిష్కరిస్తున్న వారికి యావజ్జీవశిక్ష విధిస్తాను.

# నానాత్వంలో ఏకత్వం

కొన్నేళ్ళుగా నేను బహు చెదురుగా తప్పకాఫీ హోటల్‌కు పోవడం లేదు. అయినా, మొన్న మౌంట్‌రోడ్డులోని ఒక హోటల్ లోకి అడుగు పెట్టగానే "రండి సార్" అంటూ అక్కడి "సర్వర్" కుర్రవాడొకడు చిరునవ్వుతో సత్కరించాడు. అంతటనైనా ఆగక, ఖాళీగావున్న ఒక టేబిల్ వద్దకు దారి తీసి, దాన్ని క్లీన్‌చేయించి, కుర్చీ సర్ది, "ఉక్కారుంగో" అంటూ వెళ్ళి, ఫ్యాన్‌తో అంత అవసరం కనబడక పోయినా దాన్ని జోరుగా వదిలాడు. నేను జిలేబి తెచ్చిపెట్టమనగా అది తాజాసరుకు కాదని రసగుల్లా తెచ్చియిచ్చాడు. కాఫీని కమ్మగా కలుపుకువచ్చి, నురుగులు కట్టేటట్టు ఆరబోసి, భక్తిశ్రద్ధలతో ముందు పెట్టాడు. ఈ లోపున ఆ టేబిల్ వద్దకు మరొక రిద్దరు వచ్చినా వారి సంగతి అంతగా పట్టించుకోలేదు. ప్రత్యేకించి అతడింత మర్యాద మన్ననలను ఎందుకు చేస్తున్నాడని కొంత ఆశ్చర్యం కలుగక పోలేదు. పరిపరివీధాల ఆలోచించినా అతని ప్రవర్తనకు కారణం నాకు పాలు పోలేదు. చివరికి అనుకున్నమాట: మనకి తెలియని వాడైనా, మన ఘనత కర్ణాకర్ణిగా విని వుండవచ్చునని. ఇంతలో అతడు చిరునగవులతో విందుచేస్తూ బిల్లు తెచ్చాడు. అతడి దృష్టిలో మనం ఘనత వహించిన

వ్యక్తులమైనందుకు ఘనతగా దాన్ని అందుకుని, ఘనతగా లేచి, ఘనతగా సాగారబోయేసరికి "రెండు వేరుక్కు ఒరు ఫ్రీప్యాసుకుడుంగో సార్!" అన్నాడు. తెల్లబోయి "ఏమి ఫ్రీప్యాసు" అని ప్రశ్నించగా "నంబ థియేటర్ కూడా సార్!' - చంద్రలేఖ పడం నడకరదామ్ సార్" అని యికిలించాడు. చప్పన అర్థమైంది అతడు నన్ను చూచి సినిమా థియేటర్ మేనేజర్‌గా పొరపడ్డాడని, ఈ పొర పాటు వల్లనే మరొకరు అందుకోవలసిన "ఫ్రీప్యాస్" మర్యాద మన్ననలు నాకు దక్కివని. నిజం చెప్పవద్దూ-రెండంగుళాల పొడవు తగ్గి, ఆ కాఫీహోటల్ నుంచి బయట పడ్డాను.

ఏ కొద్దిపాటి పోలిక వున్నా ఒకరిని చూచి మరొకరుగా పొరపడ్డం తరచు జరుగుతూనే వుంటుంది. మరీ ఆప్తులైనవారి విషయంలోనే - నిరంతరం మన సమక్షంలో మసలే వారి విషయంలోనే - వారి ముఖకవళికలను మనం అంత పరీక్షగా గుర్తించము. ఒక వేళ గుర్తించినా క్షణంగా జ్ఞాపకం వుంచుకోవడం జరగదు. ఇక కేవలం పరిచిత వ్యక్తుల రూపం లీలా మాత్రంగానే మన మనోవీధిని వుంటుంది. ఎదట పడినప్పుడు వారిని పోల్చుకోడానికి ఇది తోర్పడుతుంది. పరోక్షంలో వుండగా వారి రూపురేఖలను తు.చ తప్పకుండా వర్ణించమంటే అది మనకు సాధ్యం కాదు. కోర్టులో సాక్ష్యం చెప్పే సందర్భంలో ఈ సంగతి బయట పడుతుంది. చిన్నతనం నుంచి బాగా ఎరుగున్న వారిని గురించైనా వారి ముఖం తీరు, ముక్కుతీరు, వారి చూపు, వారి చాయ, వారి వొడ్డు, వారి పొడుగూ మొదలైన వివరాలకై ఎదటి పక్షం ప్లీడర్ క్రాస్ పరీక్షకు దిగేసరికి తడబడని వారుండరు.

ఈ మధ్యనే నాకు మరొక చిత్రమైన అనుభవం కలిగింది. అయిదారు సంవత్సరాల తర్వాత నేను మా స్వగ్రామానికి, మా మేనమామగారి యింటికి వెళ్ళాను. "మా స్వగ్రామానికి, మా మేనమామ గారింటికి" అనడాన్ని బట్టి మాది, మా మేనమామలది ఒకే గ్రామమని స్పష్టం. మేనమామ, విశేషించి ఒకే గ్రామం, కావడంవల్ల నేను ఆయనను నా చిన్నతనంనుంచి బాగా ఎరుగన్నా ననడమూ స్పష్టం. అయినా, మొన్న "ఈయన మా మేనమామమేనా!" అని నాకు కొన్ని క్షణాలపాటు సందేహం తోచిందంటే నమ్మగలరా? మీరు నమ్మినా, నమ్మకపోయినా ఇది మాత్రం నిజం. నే నేదో పుస్తకం చదువుతూ కూర్చుండగా మా మేనమామ తమ పొరుగింటి పెద్దమనిషితో సంభాషణ ప్రారంభించాడు. కొంత సేపైన తర్వాత మరి నా మనస్సును పుస్తకం మీద లగ్నం చెయ్యడం

కష్టమైంది. అంతట చేతిలోని పుస్తకం చాటు చేసుకుని ఆయనవంక రెప్పవెయ్యకుండా మూడు, నాలుగు నిమిషాలు తేరిపారజూచేసరికి అదేమోగాని "ఈయన మా మేనమామేనా?" అనే చిత్రమైన సందేహం కలగసాగింది. నేను చిన్నతనం నుంచి ఎరిగివున్న వ్యక్తి వేరు, ఈ వ్యక్తి వేరు అనిపించింది. నా మనస్సులో వున్న రూపానికి, దీనికి ఇంత భేధం వున్నదేమా అని ఆశ్చర్యంకలిగింది. నా వెర్రిభావాలకు నాకే చిరునవ్వు వచ్చి, వెంటనే దృష్టిని వేరొకవైపుకు మరల్చి, క్షణం తర్వాత స్థూలంగా చూస్తే, నాకు దగ్గరగా కూర్చుని, పొరుగింటి ఆసామితో ముచ్చటిస్తున్నది మా మేనమామే! నాకు కలిగిన ఈ అనుభవంలో వాస్తవానికి అంత పెద్ద వైచిత్ర్యమేమీ లేదు. నిలువుటద్దంముందు నిలబడి మన బింబాన్ని మనమే దీర్ఘంగా, పరిశీలనగా, నిశితంగా చూచుకుంటే మనం మన మేనా అనే వెర్రిసందేహంకలగడం కద్దు! మన ఆకారం మనం పోల్చుకోవడంకంటే మన గొంతు మనం గుర్తించడం మరింత కష్టం. రేడియో ప్రసంగాన్ని రికార్డు చేసినవారికి ఇది అనుభవవేద్యం.

కవల బిడ్డలుగా పుట్టినా కేవలం అచ్చంగా ఒక మనిషివలె ఇంకొకరు వుండరనే నా భావం. నీకూ, నాకూ వారు ఒకే అచ్చున పోయబడినవారివలె కనబవచ్చు. కాని, వారి తల్లికి కూడా వారిమధ్య తారతమ్యం కనబడకుండా వుంటుందా? కనబడని షక్షంలో ఆమె వారిని విడివిడిగా ఎలా పోల్చకోగలదు? చేతికి పట్టు దారం కట్టిగాని, వేలికి ఉంగరాన్ని పెట్టిగాని, ఒక బిడ్డనుంచి మరొకబడ్డను విడిగా గుర్తుపట్టుకోడానికి కవలబిడ్డలతల్లి కొత్తలో యత్నించవచ్చు. కాని, కొద్దిరోజులలోనే ఇట్టి కొండగుర్తుల అవసరం తీరుతుంది. ఆ తర్వాత ఆమె ప్రేమనేత్రం. ఆమె మాతృహృదయం, మన కంటికి అచ్చమైన ఆ పోలికల మధ్య ఏదో సూక్ష్మభేదాన్ని కనిపెట్టనేపెడుతుంది.

రూపంలోనే కాదు; ఇతరవిధాలకూడా మనిషికి, మనిషికి మధ్య పోలికవుండదు. మాటలలో, చేతలలో మనిషికి, మనిషికి మధ్య ఎంతో వ్యత్యాసం. ఇక స్వభావంలో వైరుధ్యాలకు అంతే లేదు. మనం దాన్ని గురించి అంతగా ఆలోచించముగాని, ఒకరి వేలి ముద్రవలె మరొకరిది వుండకపోవడం ఎంత చిత్రం! ప్రపంచం జనాభా ఇంచుమించు 250 కోట్లు. 250 కోట్లమంది 2,500 కోట్ల చేతి వేలిముద్రలు 2,500 కోట్ల రకాలుగా వుంటాయి. మీ వేలిముద్రను మీరు ఎన్నడైనా పరిశీలించుకున్నారా? ఈ వ్యాసాన్ని వ్రాస్తూవుండగా నా వేలిముద్ర ఎలా వుంటుందో నే నెన్నడూ గమనించలేదని స్ఫురించింది. వెంటనే కుడిచేతి

బొటనవేలికి ఇంత సిరా పూసి, ఒక కాగితం మీద ముద్ర వేశాను. దాన్ని పరిశీలించగా సన్నగా, సున్నితంగా, నెలవంక వంపులతో వున్న ఆ గీతలు, వాటిమధ్య ఒక శంఖం; అందం వుట్టిపడుతూ కనబడింది. ఇంతటి చక్కని రేఖాచిత్రాన్ని గియ్యడం ఏ చిత్రకారుని తరమూ కాదు. అయితే వేలిముద్రలు వేయ్యడం అవిద్యకు చిహ్నమైంది. నేరస్థుల వేలిముద్రలు తీసుకుంటారు. ఈ రెండు కారణాల వల్లనే మన వేళ్ళపై వుండే సూక్ష్మమైన రేఖల అందాన్ని మన మెన్నడు గమనించడం జరగ దనుకుంటాను.

మనిషికీ, మనిషికీ వేలిముద్రలలోగల భేదాన్ని కొందరు ప్రవీణులుమాత్రమే కనిపెట్టగలరు. వేలిముద్రలలోని భేదాలను వారొక శాస్త్రంవలె అభ్యసిస్తారు. దుర్బణి సహాయంతో వాటి సన్నని గీతలమధ్యగల స్వల్పవ్యత్యాసాలను పరిశీలనగా చూస్తారు. కాని, ప్రత్యేక ప్రవీణులు సయితం కనిపెట్టలేని విధంగా మానవునికీ, మానవునికీమధ్య మరొక విభేదం కూడా వున్నది. వాసనకు సంబంధించింది ఈ విభేదం. ఒక్కొక్క వ్యక్తిని అనుసరించి ఒక్కొక్కవిధమైన గంధం వుంటుంది. స్నానం చెయ్యక అపరి శుభ్రంగా వుండేవారి ననుసరించి దుర్గంధం వుంటుంది; చక్కగా స్నానంచేసి, పరిశుభ్రంగా వుండి, అత్తరునో, పన్నీరునో పూసుకున్నవారి ననుసరించి సుగంధం వుంటుంది. అధునాతన యువతి పక్కగా నడిస్తే పౌడర్, క్రీం, రూజ్, లిప్‌స్టిక్, లవండర్ సమ్మిళితమైన ఒక చిత్ర సుగంధం మన నాసికాపుటాల కోటలో పాగా వేస్తుంది. కాని, నే నిక్కడ ప్రస్తావిస్తున్నది ఈ విధమైన గంధాలను గురించి కాదు. మన నాసికాపుటాలకు అందని ఒక అతిసున్నితపుగంధం ఒక్కొక్కవ్యక్తి ననుసరించి ఒకొక్క విధంగావుంటుంది. కుక్క పసిపట్టటానికి కారణం దాని నాసికా పుటాలకు ఈ అతి సున్నితపు గంధాన్ని తెలుసుకోగల శక్తి వుండడమే! మానవునికి కూడా అతడి ఘ్రాణేంద్రియం సున్నితగుణం సభ్యతాఫలితంగా పోకముందు ఈ పసిపట్టగల శక్తి వున్నట్టు తోస్తుంది. నరుడు దరిదాపులలో ఎక్కడైనా సరేవుంటే, అతడిని పొడగట్టకపోయినా పసికట్టి, రాక్షసులు నోరూరుతూ "నరవాసన వస్తున్నది-నరవాసన" అనేవారిని మన పురాణాలు చెబుతున్నవి. రాక్షసులంటే నరమాంస భక్షకులైన అసభ్యమానవులే కాని, మానవేతర జాతివారు కారు. నరుని సామీప్యాన్ని వారు పసిపట్టగలిగేవారంటే, ఈనాడు శునకాల నాసికాపుటాల కున్న శక్తి ఒకనాడు మానవునికికూడా వుండేదనే తీర్మానించుకోవాలి. ఇప్పటికీ మన జిహ్వేంద్రియం కంటె ఘ్రాణేంద్రియమే మహాసున్నితమైంది. ఆవగింజ అరవయ్యోవంతులో అరవ

య్యోవంతు అత్తరువాసననైనా మన ముక్కు పట్టివేయగలదుగాని, ఒక ఆవగింజకు గింజనే నోట్లో వేసుకున్నా దాని రుచి తెలియదు. చిన్ననాడు మనం చెలిమిచేసిన వారిని, పాతరోజులలో మనం తిరిగిన ప్రదేశాలను ముక్కు జ్ఞాపకానికి తెచ్చినంతగా మిగిలిన జ్ఞానేంద్రియాలు తేవని ఆలివర్ వెండల్ హోమ్స్ వ్రాశాడు. ఆయన వ్రాసిన దాని రుజువుకు నా అనుభవమే సాక్షి ఈనాడైనా ట్రిప్లికేన్ బీచ్‌కి పైక్రాఫ్ట్స్ రోడ్డు వెంట వెడుతుంటే బక్కింగ్‌హాం కెనాల్ బ్రిడ్జిని సమీపించేసరికి ముక్కు పైకి ఎంత అప్రయత్నంగా చెయ్యివెడుతుందో అంత అప్రయత్నంగానే మద్రాసు చేరిన కొత్తలో నిరుద్యోగిగా బెల్స్‌రోడ్డులో ఒక చిన్నగదిలో నేను కాలక్షేపం చేయడం, మిడసరి లగ్నంలో అనేకసార్లు ఆ దారినే నెత్తి కాళ్ళూ కాలుతూ యూనివర్శిటీ లైబ్రరీకి వెళ్ళడం, దాదాపు ప్రతి సాయంత్రం ఆ దారినే బీచ్‌కి చేరి, వేలాది ప్రజల మధ్య కూడా బరువైన వొంటరితనంతో గంటలకొద్దీ వెర్రివానివలె తిరగడం, ఒక్కొక్కసారి ఊరు మాటుమణగిన తర్వాతకూడా ఆ దారినే వెళ్ళి, లోపలి కలతకు, బ్రతుకు వెలితికి విరుగు డేదైనా దొరుకుతుందేమోనని సముద్రపు ఘోషకు చెవులు రిక్కించడం, ఒక నాటి రాత్రి బోరున గాలివీస్తూ, జోరునవర్షం కురుస్తుండగా తుఫాను పట్టిన సంద్రాన్ని చూడాలన్న బుద్ధిపుట్టగా తక్షణం బటల్దేరి ఆ దారినే వెళ్ళి, కొండలవలె లేస్తూ, విరుగుతూన్న కెరటాల నురుగులు కన్ను పొడుచుకున్నా కనబడని ఆ చిమ్మచీకటిని సయితం చీల్చుకుని దెయ్యపునవ్వును తలపింపజేస్తుండగా, నిలవనూ లేక, కదలిరానూ లేక, పక్కా అరగంట వానకు తడుస్తూ, గాలికి తూలుతూ, చలికి గజగజ లాడిపోతూ గుడ్లు అప్పగించడం- ఇట్టి స్మృతు లెన్నో ఒక్కసారిగా నిద్రలేచి నేను ముందంటే నేను ముందని జుట్టుపట్లు పట్టుకుంటాయి. ఇదే విధంగా ఏయే సుగంధ దుర్గంధాలు నాకు ఏయే విషయాలను జ్ఞాపకం చేస్తుంటవో చెప్పాలంటే ఈ చిన్న వ్యాసం పెద్ద స్వీయచరిత్రగా మారిపోవచ్చు.

ఎంత మంచి గడియారమైనా, ఎంత ఖరీదుగలదైనా కొందరివద్ద తిన్నగా పని చెయ్యదు; ఎంత చౌకబారు గడియారమైనా కొందరివద్ద నిమిషమైనా వారలేకుండా చక్కగా తిరుగుతుంది. దీనికి కారణం ? ఆయావ్యక్తుల ననుసరించివుండే గంధమేనని ఒక స్విస్ ప్రముఖుడు అంటున్నాడు. కొందరి శరీరాలనుంచి వెలువడే గంధం కారణంగా వారి చేతిగడియారంలోని ఆయిల్ మడ్డి తేరుతుందట. ఈ వివరణ చిత్రంగా వున్నా అసంబద్ధమని దీన్ని తోసివెయ్యగలమా? స్విస్ దేశస్థుడు కనుక, తమ గడియారాలలో లోపం లేదనడానికి, వాటిని వాడేవారిపైనే నెపం

నెట్టడానికి ప్రయత్నిస్తున్నా డనగలమా?

మొత్తంమీద మానవునికీ, మానవునికీ మధ్య ఏ విధమైన పోలికా లేదు. అలా గని మానవులు విభిన్నజీవులని భావించడం పొరపాటు. చూపులలో, చేతలలో, మాటలలో, పోకడలలో, ఆలోచనలలో, అభిరుచులలో, గుణగణాలలో, శక్తియుక్తు లలో, చివరికి వాసనలలోకూడా, మానవుల మధ్య విభేదాలు వున్నప్పటికీ, వాటిని మించిన ఒక ఐక్యత వారిలో వున్నది. దేశ, జాతి, మత, వర్ణ, వర్గ విభే దాలకు సయితం అతీతమైనట్టిది ఈ ఐక్యత. మానవు లందరు ఒకే విధంగా జన్మిస్తారు; ఒకే విధంగా మరణిస్తారు; కష్టసుఖాలకు ఒకే విధంగా చలిస్తారు. సమానానుభూతికి అందరిదీ ఒక్కటే నవ్వు, ఒక్కటే నిట్టూర్పు. ఏ గుండెలో వెలిగినా ఒక్కటే ఆశ, ఏ చెక్కిలినుంచి జారినా ఒక్కటే కన్నీరు. ఇంతకంటె బలీయమైన ఐక్యత - దీన్ని మించిన ఏకత్వం - వుండగలవా?

*

# కవులఢంకా

"నన్ను నేనే పొగడుకోగలిగినప్పుడు ఆ పని నేను మరొకరికి ఎందుకు అప్పగించాలి" అని బెర్నార్డ్‌షా తెగవేసి అడిగాడు., మనసారా తన పొగడ్తను తానే చేసుకున్నాడు. షావలె చచ్చులేకుండా చెప్పి మరీ చెయ్యకపోయినా, ప్రతి పెద్దకవి తన డబ్బాను తాను ఎంతో కొంత వాయించుకున్నవాడే. మన నన్న య్యగారినే చూడండి. "అవిరళ జపహోమ తత్పరు"డను, "విపుల శబ్దశాసను" డను, "సంహితాభ్యాసు" డను, "బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతు"డను, "పాత్రు"డను, "సద్వితావదాతను చరితు" డను, "లోకజ్ఞు" డను "ఉభయభాషా కావ్యరచనాభిశోభితు" డను, "సత్ప్రతిభాభియోగ్యు"డను, "నిత్యసత్యవచను"డను అని తనకు తానై ఎన్ని కితాబు లిచ్చుకున్నాడో! ఇక, శ్రీనాథుడు "దీనా రటంకాల దీర్ఘామాడించితి దక్షిణాధీశు ముత్యాలశాల" అని, "పగులగొట్టించి తుద్భటవివాదప్రౌఢి గౌడడిండిమభట్టు కంచుఢక్క" అని, "చంద్రభూపక్రియాశక్తి రాయలయొద్ద బాదుకొల్పితి సార్వభౌమబిరుద"మని తన ఢంకా తానే బజాయిం చాడు. అదేమి ఇదేమని తనను దగ్గరికి తీసిన కృష్ణదేవ రాయలనే "పెద్దనబోలు పండితులు పృథ్వి లేరని నీ వెఱుంగవే?" అని పెద్దనామాత్యుడు రొమ్ము విరుచుకుంటూ రెట్టించాడు.

పోతే, పిల్లకవుల సంగతి చెప్పనక్కరనే లేదు. పెద్ద కవులు తమ గొప్పను గురించి బాకాను ఒక్కడాన్నే పట్టుకోగా, పిల్లకవులు బాజాభజంత్రీ లన్నింటినీ ఉప యోగించివేసుకుంటారు. పెద్దకవులకంటె ఎక్కువగా పిల్లకవులే తమ పొగడ్తను తాము చేసుకోవడం అకారణంగా జరగదు. నిజంగా మహాకవు లైనవారు - కీట్స్‌వలె చెదురుగా కానవచ్చే ఏ కొద్దిమందినో మినహాయిస్తే - తమ జీవితకాలంలోనే సన్మానినందుతారు. అందువల్ల తమ ఘనతను తామే చాటుకోవలసిన ఖర్మ వారికి పట్టదు. ఒకవేళ పట్టినా, ఆదిలో కొద్దికాలంపాటే. ఆ తర్వాతకూడా వారు స్వోత్కర్ష చేసుకుంటే అది స్వాతిశయంవల్ల కాదు; తన బలదర్పాలను తా నెరిగిన మృగరాజు అప్పుడప్పుడు జూలును జళిపించడం, పంజాను నేలను రాయడం, దిక్కులు పిక్కటిల్లేటట్టు గర్జించడం ఎంత సహజమో, ఈ స్వోత్కర్ష కూడా అంత సహజం. కవిసింహాలు కానివారు ఈ పని చేసినప్పుడే ఇది హాస్యాస్పదంగా పరిణమిస్తుంది. ఈ మాట మనం చెప్పినా వారి తల కెక్కదు. మహాకవి కోవకు చెందినివారికి లోకంనుంచి నిర్లక్ష్య, నిరాదరణలు తప్పవు; ధిక్కార తిరస్కారాలు తప్పవు. వీటిని చూచి లోకం గ్రుడ్డిది కనుకనే తమ ప్రతిభను అది గుర్తించ లేక పోతున్నదని వారు నిశ్చయించుకుంటారు. సాటి కవుల ఈర్ష్యావిద్వేషాలవల్లే తమ పేరు బయటకి రావడంలేదని ధ్రువపరచుకుంటారు. అక్కడినుంచి త మింతవారమని, అంతవారమని లోకం చెవులు చిల్లులు పడేటట్టు పెడబొబ్బలు ప్రారంభిస్తారు. అవి పనిచేయడంలేదన్న బాధ పెచ్చినకొద్దీ మరింతగా గొంతు చించుకుంటారు.

మహాకవులైనవారు స్వోత్కర్ష చేసుకున్నా, దానిలో కానవచ్చేది వ్యర్థాడంబరం కాదు; విశేష ఆత్మవిశ్వాసం మాత్రమే. హోరేస్ (లాటిన్ భాషలో మహాకవి) తన బృహత్కావ్యసౌధాన్ని గురించి ప్రస్తావిస్తూ "లోహాలకంటె ఇది గట్టిది; రాజాధి రాజుల సమాధులకంటె మహోన్నతమైంది; కుంభవర్షాలైనా దీన్ని కరిగించలేవు; తుపానులైనా దీన్ని తుడిచిపెట్టలేవు; కాలప్రవాహానికే ఇది చెక్కు చెదరబోవడం లేదు" అని చెప్పకున్నాడు. షేక్స్‌పియర్‌లోనూ ఇంత ప్రబలమైన ఆత్మవిశ్వాసం కానవస్తుంది. ఆయన తన "సానెట్స్"లో "ఏ చంద్రకాంత శిలాఫలకం కాని, ఏ భూపాలుని స్మారకభవనం కాని, ఈ కవితకంటె ఎక్కువకాలం నిలవబోదు" అని ఎలుగెత్తి చాటుకోగలిగాడు. మరొక ఆంగ్లేయకవి వర్డ్స్‌వర్త్, తన అమరత్వం విషయమై ప్రదర్శించిన విశ్వాసం దీనికి తీసిపోయేది కాదు. తన తక్కిన కావ్యాలు ఒక వేళ కాలగర్భంలో కలిసిపోయినా, "ఈ గూటిలో ఒక పిచ్చుక గూడుకట్టు

కున్నది; దీన్ని గురించి నే నొక పద్యం అల్లాను; ఇది కలకాలానికీ నిలుస్తుంది" అని ఆయన చెప్పుకున్నాడు.

తమ జీవితకాలంలో మన్నన పొందలేకపోయిన మహాకవులైనా తమ చిరంజీవిత్వాన్ని గురించి నిస్పృహ చెందినట్టు కనబడదు. "నా పేరు నీటిపై వ్రాత కాబోతున్నది" అని వాపోయిన కీట్స్ కూడా మరొక ఘడియలో "తక్కిన ఇంగ్లీషు కవుల పేర్లతో నా పేరు కూడా జత కావచ్చు." అన్న ఆశకే పోయాడు. తక్కిన ఇంగ్లీషు కవుల పేర్లతో తన పేరు జత కూడడం ఖర్మ మేమి? – ఆ షేక్స్‌పియర్ సరసనే ఆయనకు లోకం ఈనాడు పెద్ద పీట వేస్తున్నది.

అసలు తన పేరే భూమిపై నిలవదేమోనని జాన్ కీట్స్ కొన్ని క్షణాలలో సందేహపడగా, తాను అనుభవించవలసినంతటి ఖ్యాతిని అనుభవించడంలేదని రాబర్ట్ బర్న్స్, కొంత బాధపడినట్టున్నాడు. అందువల్లనే కావచ్చు, ఆయన తన భార్యకు ఉత్తరం వ్రాస్తూ "నేను మరణించిన తర్వాత నూరేళ్ళకు లోకం నన్ను ఈనాటికంటె చాలా ఎక్కువ గౌరవిస్తుంది" అనడం తటస్థించింది. అయితే, మహాకవి కనుక "నేను మరణించిన తర్వాత నూరేళ్ళకు" అని బర్న్స్ చెప్పుకున్నమాట అక్షరాలా చెల్లుబాటు అవుతున్నది. తన శక్తికి మించిన ఖ్యాతికి అంగలార్చే ప్రతి కవి సాధారణంగా ఈ పలుకునే చిలకపలుకువలె పలుకుతూ వుంటాడు.

మహాకవులైనవారు స్వశక్తిజ్ఞాన ప్రేరితులై స్వయంగా ప్రకటించుకునే అధిక్యం కొంత గుంభనగా వుండడం కూడా కద్దు. మాళవికాగ్నిమిత్ర నాంది ప్రస్తావనలో "ప్రాచీన మైనది ప్రతిదీ ప్రశస్తమైంది కా నక్కరలేదు; అధునాతనమైంది ప్రతిదీ నింద్యమైంది కా నవసరంలేదు. పాతదైనా, కొత్తదైనా సారం గలదాన్ని ప్రాజ్ఞులు మెచ్చుకుంటారు. మూఢులే ఏది మెచ్చదగిందని ఇతరులు చెబితే దాన్ని మెచ్చుకునేవారు అని కాళిదాసు సూత్రధారునిచే అనిపించాడు. "భాస, సౌమిల్ల, కవిపుత్రాదులను పోలిన మహాకవుల నాటకా లుండగా, ఈ కాళిదాసు యెవడయ్యా?" అని ముందుప్రశ్న వేయించి, దానికి కాళిదాసు చెప్పించిన ఈ జవాబులో తన పూర్వీకులు ఎంత మహాకవులైనా, తాను అంతకంటె తక్కువవాడను కానన్న భావం ఎంత గుంభనగా లేదు!

కీర్తివచ్చేది కేవలం కవితవల్లనే కాదు. రాజ్యపాలన, సైనికవిజయాలు, శాస్త్రపరిశోధనలు – ఇట్టివన్నీ కీర్తికి మార్గాలే. అయితే, కవిత కూర్చే కీర్తి నిలిచినంతగా తక్కినవి నిలవవనే చెప్పాలి.

జయ న్తితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః,
నాస్తి తేషాం యశః కాయే జరామరణజం భయమ్

అని భర్తృహరి చెప్పినట్టు సుకవీంద్రులు సుకృతాత్ములే, రససిద్ధులే, విజయుని ధులే; వారి కీర్తిశరీరాలు జరామరణ జన్మభయ రహితాలే. పైగా కవితారంగంలో సాధించబడిన కీర్తికి వుండే బహుళవ్యాప్తి అన్యరంగాలలో సంపాదించబడిన దాని కుండదు. వాల్మీకి, వేదవ్యాసుడు తమ రంగంలో ఎంతటి అఖండులో, చరకుడు, భాస్కరాచార్యులు తమతమ రంగాలలో అంతటి ఉద్దండులు. అయినా, ఆ కవు లిద్దరిపేర్లతో మన భారతీయుల కున్న పరిచయంలో నూరోవంతైనా ఈ ఆయుర్వేదాచార్యుని పేరుతో గాని, ఈ గణితశాస్త్రజ్ఞుని పేరుతోగాని కల దనగలమా? ఆంధ్రులైన మనకు శ్రీనాథుని గురించి తెలిసినంతబాగా ఆయన కాలపు ఇతర ప్రసిద్ధ పురుషులు తెలుసునా? ఆ కవి సార్వభౌముడు పేర్కొన బట్టిగాని! లేకపోతే వీరారెడ్డి, విస్సన్నమంత్రి, భాస్కరుడు మొదలైనవారి పేర్లు మనదాకా వచ్చేవి కావు. అంతంతమాత్రపువారైనా తక్కినవారి మాట దేనికి? అయోధ్యారాముని చరిత్ర ఆదికవి వాల్మీకికి కావ్యవస్తువై వుండకపోతే తక్కిన ఇక్ష్వాకు రాజులతోపాటు ఆయన మరొక రాజుగానే మిగిలేవాడేతప్ప, ఇంటింట వాడవాడ పూజాపురస్కారాలు పొందగలిగేవాడు కాదు.

కవి వాక్కు నిలిచినంతకాలం తన కీర్తి నిలవదని ప్రతి రాజుకు చక్కగా తెలుసు. అందువల్లనే విజయస్తంభాలను యెత్తించడంతోను, శిలాశాసనాలను చెక్కించడంతోను, గుళ్ళు గోపురాలను కట్టించడంతోను, విగ్రహాలను ప్రతిష్ఠాపించడంతోను, నగరాలను నిర్మించడంతోను సంతృప్తి చెందక కవులను దగ్గరికి తీస్తాడు; వారి కృతులను అందుకుంటాడు. ఇట్టి జాగ్రత్తపడబట్టే భోజుని,రాజరాజనరేంద్రుని, మనుమసిద్ధిని, కృష్ణదేవరాయలను మన మిప్పటికీ తలుచుకోవడం; లేకపోతే, వా రెవరో మన మెవరమో! "భోజునివంటి రాజు కలిగితే కాళిదాసువంటి కవి అప్పుడే వుంటాడు" అనడం తప్ప. కాళిదాసు కలిగితేనే భోజుడు వుండడం.

కవికృపను సంపాదించగలిగితే సామ్రాజ్యాధిపులకే కాక, సామాన్యులకైనా అమరత్వం సిద్ధిస్తుంది. ప్రపంచ చరిత్రలో ఇందుకు తార్కాణాలు వందలూ, వేలూ. వీటి అన్నింటిలో పైథియాస్‌కు సంబంధించిన గాథ మహా చక్కనిది. ప్రాచీన కాలంలో ఇతడు ఈజినాకు (గ్రీస్) చెందినవాడు. ఇస్థిమియన్ ఆటలపోటీలలో

జగజ్జెట్టిగా ఎన్నికై, తనను కీర్తిస్తూ ఒక పద్యం వ్రాయడానికి ఎంత చెల్లించ వలసి వుంటుందని అడగడానికి తమ వూరు కవి పిండార్ వద్దకు వెళ్ళాడు. తన కట్నం ఇప్పటి డబ్బు లెక్క ప్రకారం ఇంచుమించు మూడువేల రూపాయలని పిండార్ చెప్పాడు. "అబ్బో అంతే! అంత పెడితే నా కంచు విగ్రహాన్నే పోత పోయించుకోవచ్చు" అని పైథియాన్ పెదవి విరిచాడు. "నిజమే కావచ్చు" అని పిండార్ మందహాసం చేసి మిన్నకున్నాడు. వచ్చిన దారినే ఇంటికి వెళ్ళి బాగా ఆలోచించుకున్న మీదట అడిగిన మొత్తం చెల్లించి ఒక పద్యం వ్రాయించుకోవడమే మంచి దేమోనని పైథియాన్‌కు తోచింది. ఈ నాడు ఈజినాలో కంచు విగ్రహాలు లేవు సరిగదా, ఈజినాయే లేదు. కాని, పైథియాన్ భుజబలాన్ని భూషిస్తూ పిండార్ వ్రాసిన పద్యం మాత్రం చెక్కు చెదరకుండా మిగిలి వున్నది.

అయితే, పైథియాన్ వలె ఏ మూడు, నాలుగువేలో ఖర్చుపోయి ఆచంద్రతారార్క విఖ్యాతి నందగోరితే, అది వ్యర్థప్రయాసే కావచ్చు. అమర కీర్తి రాగల దంటే మూడు, నాలుగువేలు ఖర్చుపోవడం పెద్ద లెక్కలో పని కాకపోవచ్చు. కాని పిండార్ వంటి కవి తటస్థపడాలి కదా? పద్యాలలో పొగడ్తలు మాత్రమే కావాలంటే కవులతో పనే లేదు; అయిదో, పదో చేతిలో పెడితే భట్రాజులు ఎన్ని పద్యాలనైనా గుప్పిస్తారు. మరి కొంచెం పెట్టుబడి పెడితే, పంచరత్నాలు, అష్టకాలు, నవరత్నాలు, నక్షత్రమాలలు సమర్పించే బాలకవులు, ప్రౌఢకవులు, సరసకవులు, సహజకవులు, మధురకవులు, బంధకవులు, వికటకవులు, ఆశుకవులు, జింటకవులు, అష్టావధానులు, శతావధానులు, కవిహంసలు, కవికోకిలలు, కవిసింహాలు, కవిశార్దూలాలు, కవిమత్తేభాలు, కవిరాజులు, కవిసార్వభౌములు కొల్లకొల్లలుగా వున్నారు. మరికాస్త చెయ్యిజారితే కృతి సమర్పణే చేయించుకోవచ్చు. అయితే, వీటిద్వారా వచ్చే కీర్తి సబ్బుబుడగవలె ఈ క్షణం అలరించి, మరుక్షణం "రుప్ప" మనేదే!

కవితద్వారా కలిగే కీర్తి ఎంత గట్టిదో రాజకీయాలద్వారా వచ్చే కీర్తి అంత వోటిది. రాజకీయ పదవిలో వుండగా ఎక్కడికి వెళ్ళినా స్వాగతాలే, సన్మానాలే, పూలమాలలే, విందు భోజనాలే; దర్శనానికి గుంపులకు గుంపులే పడికాపులు కాస్తారు; అది లభిస్తే ధన్యులమైనట్టు సంబరపడతారు. "మాయింటిలో బస" అంటే "మాయింట" అని పోటి పడతారు; ఎవరింటికి వెళ్లితే వారు తమ గృహం పావనమై నట్టు సంతోషిస్తారు. ఆ పదవిలో వుండగా కదిలితే పత్రికలలో వార్త, మెదిలితే మరొక వార్త. బుర్రున చీదితే వార్త; ఖంగున దగ్గితే వార్త.

అయినా, పదవి నుంచి దిగగానే మళ్లీ తలుచుకునే వారే వుండరు. అప్పుడు వారి బ్రతుకు "ఏమి పోలిశెట్టీ" అంటే "ఎప్పటి మొత్తుకోళ్లే" అన్నట్టు తిరిగి తయారౌతుంది. బహుకొద్దిమంది విషయంలో పదవి పోయిన తర్వాతకూడా వారి పేరు తలుచుకొనడం జరిగితే, అది ఒక తరం పాటు, తప్పితే, రెండు తరాలపాటు ఫాక్స్, పిట్, వాల్‌పోల్, గ్లాడ్‌స్టన్ – వీరు నలుగురు తమ జీవితకాలంలో బ్రిటిష్ రాజకీయరంగాన అద్వితీయ రాజకీయవేత్తలు. అయినా, వీరి మంచి చెడ్డలను గురించి బ్రిటిష్‌వారిలోనే ఈనాడు ఎంతమందికి తెలుసు? గ్లాడ్‌స్టన్ అంటే ఆ పేరుతో చెల్లుబాటు అవుతున్న ఒక చేతిసంచిని తొలిగా చేసి అమ్మినవాడని త్వరలోనే పెచ్చుమంది అనుకోగల ప్రమాదం కలదని ఎ.జి.గార్డినర్ ఎక్కడో వ్రాశాడు. ఇది అత్యుక్తికాదు. ఇంత దేనికి? మాంట్‌ఫర్డ్ రిఫారమ్స్ని రోజులలో మన చెన్నరాజధానికి ఎవరెవరు ముఖ్యమంత్రులో, ఎవరి తర్వాత ఎవరి తర్వాత ఎవరో, ఎంతెంత కాలమో ఈనాడు చెప్పగలవారు మనలో ఎంద రున్నారు?

కవివాక్కు పటిమకల దనడంనుంచి, అది అమోఘమైన దనడం ఒక మెట్టు; అది అమోఘమైన దనడంనుంచి, శాపోపసంహరణల శక్తి దానికి కల దనడం మరొక మెట్టు. ఈ మెట్టువరకు కొందరు యెక్కనే యెక్కారు. కవులు పెట్టిన శాపాలను గురించి కథ లనేకం. కవి కోపంవల్లనే "పెద్దాపురం కోట పెద్దమ్మ కిల్లాట" జరిగిందట. వేములవాడ భీమకవి–

గడియలోపల దాడి కడగి ముత్తునియగా
దిట్టిన మేధావి భట్టుకంటె
రెండు గడెల బ్రహ్మదండి ముండ్లన్నియు
డుల్ల దిట్టిన కవిమల్లు భట్టుకంటె
మూడుగడెలకు దా మొనసి యత్తినగండి
పగులదిట్టిన కవిభానుకంటె
అరజాములోపల జెఱువునీళ్ళింకంగ
దిట్టిన బడబాగ్ని భట్టుకంటె
ఉగ్రకోపి నేను నోపుదు శపియింప
గ్రమ్మఱింప శక్తిగలదు నాకు
వట్టిమాన జిగురు పుట్టింప గిట్టింప
బిరుదు వేములాడ భీమకవిని

అని చెప్పకున్నాడట. అయితే, కవుల ప్రతాపం తాళ్ళు, బ్రహ్మదండి ముళ్ళు, గళ్ళు, చెరువునీళ్ళు మొదలైన వాటిపైనే కాబోలని ఎక్కడ నవ్విపోతారోనని కవులైనవారు రెండు చాటుపద్యాలను, వాటిని అతకడానికి ఒక కాకమ్మ కథను వేములవాడ భీమకవికి అంటగట్టారు. యాచనకు - కవులు చెయ్యిజాపితే యాచన అనరాదు. అంటే ముక్కు మెలివేస్తారు. అందువల్ల "ప్రాపుకు" అందాము - కళింగ గంగు ఆస్థానానికి భీమకవి వెళ్ళాడట. ఏమి రాచకార్యంలో మునిగివున్నాడో కాని, ఇప్పుడు కాదు, మరొకసారి రమ్మని ఆ రాజు కాస్త చికాకు వెలిబుచ్చాడట. ఆ మాత్రానికే భీమకవి కాలరుద్రుడై—

వేములవాడ భీమకవి
వేగమె చూచి కళింగగంగు తా
సామము మాని కోపమున
సందడిదీఱిన రమ్ము పొమ్మనెన్
మోమును జూడ దోషమిక
ముప్పదిరెండు దినంబు లావలన్
జామున కర్థమం దతని
సంపద శత్రులపాలు గావుతన్

అని ఒకశాపం తగిలించాడట. కవి శాపం పెట్టడమూ, దానికి తిరుగి ఉండడమూనా? కళింగగంగు గర్భదరిద్రుడై, "పూవు లమ్మినచోట కట్టె లమ్మడమా!" అని ప్రచ్ఛన్న వేషం వేసుకుని, దేశాంతరాలకు పోయి, తిరపమెత్తుతూ పొట్ట పోసుకొంటున్నాడట. ఈ అభాగ్యజీవితాన్ని గడుపుతూ ఒకనాటి రాత్రి చిమ్మ చీకటిలో కన్నుకానక బొక్క బోర్లగా అతడొక గోతిలో పడిపోయి, "అయ్యో! దివ్వెటీకైనా గతిలేక పోయిందే?" అని వాపోయాడట. సరిగా ఆ వేళకు పూల పాలకీ యెక్కి, కళ్లుజిగేలనే దివ్వెటీలతో ఆ దారి పోతున్న భీమకవి "ఎవడవురా నువ్వు?" అని పలకరించాడట. "భీమకవి గారిచే జోగి చేయబడిన వాడను" అని బదులు చెప్పగా, "రాజ కళింగ గంగువా?" అని కవిరాజు మీసం మెలివేస్తూ (రాజసం కలవాడు కనక మీసం ఉండేదనే అనుకుందాము) ప్రశ్నించాడట. ఈ ప్రశ్న వినగానే ముందు తెల్లబోయి, పల్లకీ లోని పరమపురుషుడు భీమకవేనని అల్లంతలో గ్రహించి, శిరస్సువంచి, రెండు చేతులూ జోడించి, "మహాకవీ! నన్ను కరుణించు " మని కళింగగంగు సంప్రార్థనం చేసేసరికి--

వేయి గజంబులుండ బది

వేలు తురంగలములుండ నాజిలో
రాయల గెల్చి సజ్జనగ
రంబున బట్టముగట్టుకో వడిన్
రాయ కళింగగంగు కవి
రాజ భయంకర మూర్తి జూడగా
బోయెను మీ సమాసమున
బున్నమవొయిన షష్ఠి నాటికిన్

అని మరొక ఆశుపద్యం చెప్పాడట. కినిసి పొమ్మన్నంతనే పోయినట్టు, కని కరించి రమ్మనగానే రాజ్యలక్ష్మి కళింగగంగు కాళ్లవద్దకు రానే వచ్చిందట.

భీమకవిని గురించి చెప్పబడే కట్టుకథ ఇదొక్కటేకాదు. గుడిమెట్ట గ్రామంలో తన గుర్రాన్ని సాగి పోతురాజు దొడ్డికి తోలించుకోగా, "నా జయమును, బోతరక్కసుని చావును నేవడనాడు చూడండీ!" అని కవిరాజు పద్యంలో ఒకవిసురు విసిరాడట. అన్నట్టే, ఏడవనాడు సాగి పోతురాజు ఇహలోకం నుంచి సాగిపోయాడట. అయితే, తన గుర్రాన్ని తాను వెంటనే అప్పగింత పెట్టించుకోకుండా భీమకవి వారంరోజులు గడువు పెట్టడంలో అంతరార్థ మేమిటో మనకు తెలియదు. మరొక మారు చాళుక్య చొక్క భూపాలునికి తన మహత్తును ప్రదర్శించి చూపడానికి ఆయన చిత్రకూటం లోని స్తంభాన్ని "ఆనీతాభ్యుపదానశృంఖల కరాభ్యాలంచిత స్తంభమా!" అని సంబోధించి, "నేనే వేములవాడ భీమ కవినేనిన్" అని భీషణ ప్రతిజ్ఞ చేసి, "భూనవ్యావృతవల్ల వోపలతికా పుష్పోప గుచ్ఛంబులన్ నానా పుష్పఫల ప్రదాయినగుమా నా కల్పవృక్షాకృతిన్" అని శాసించేసరికి, చూస్తూ చూస్తూవుండగా ఆ స్తంభం రెమ్మలుసాగి, చిగుళ్ళు వెళ్ళి, మొగ్గతొడిగి, పువ్వుపూచి, కాయలు కాచిందట. స్తంభం ఫలవృక్షమై కూర్చుంటే చిత్రకూటానికి చేటువస్తుందని కాబోలు, "స్తంభము రీతి నీ తనువు దాలిచి యెప్పటియట్ల యుండుమా?" అని తిరిగి ఆజ్ఞాపించేసరికి అది యథారూపం ధరించిందట!

నోరు పెట్టుకు బ్రతకవలసినవారు కాబట్టి, మాట బీరుపోదన్న నమ్మకం కలిగించుకోనిదే కవితావ్యాపారం సాగడం కష్టం కాబట్టి, ఈ కట్టుకథలను కవులు ప్రచారం చేసుకొని వుండాలి. ఈ "క్రేడ్ సీక్రెట్" జోలికి మనం ఇంకా పోవడం న్యాయం కాదేమో!

*

# కాకి, కోయిల

దూరపుకొండ నునుపు కావడం దాని దూరం వల్లనే. దూరాన వున్నం తవరకే అది నీలికొండ. దూరంనుంచి చూచినంతవరకే అది దిశాచక్రాన్ని చుంబిస్తున్నట్టు భ్రమ. దూరాన్ని అధిగమించనంతవరకే దాని అద్దరిని ఏదో కొత్త ప్రపంచం అగాధ రహస్యాలతో, అలౌకిక సౌందర్యంతో చెన్నొందుతున్నదన్న తియ్యని ఆశ, దాన్ని చేరలేనందుకు తరగని ఆవేదన. దగ్గరికి వెడితే అన్ని అందాలు కరిగిపోతాయి; అన్ని భ్రమలు చెదిరిపోతాయి. ఎదట నిలిచేది ఎగుడు దిగుడు రాళ్ళగుట్ట; ఎండ వేడిమిని కక్కే కంకరమిట్ట.

రాజును చూచిన కళ్ళను మగడిని చూస్తే మొట్టబుద్ధి పుట్టడం రాజు నవమన్మథుడు కావడంవల్లనూ కాదు; మగడు పండుకోతి కావడంవల్లనూ కాదు. రాజు పున్నానికో, అమావాస్యకో తప్ప దర్శన మివ్వడు; మగడు మెడలో తాను కట్టిన పుస్తెవలెనే చెంతబాయనివాడు. అందువల్లనే రాజును చూచిన తర్వాత మగడు కంట దూరకపోవడం. పనిమీద అతడే పదిరోజులు పరాయివూరు వెళ్ళివస్తే, రారాజువలె కనబడతాడు.

ఇంతకీ చెప్పవచ్చింది నిరంతరాయ సామీప్యం విసువు నెత్తిస్తుందని; నిరంతర

సాహచర్యం వెగటు పుట్టిస్తుందని. దీన్నే కాస్త ముతకగా చెప్పాలంటే. "చూడగా చూడగా గుర్రం గాడిద అవుతుంది." కాకి చేసుకొన్న పాపం, కోయిల చేసుకున్న పుణ్యం ఇంతలోనే వున్నది.

పొగ కనబడితే నిప్పు రాజుతున్నట్టు తీర్మానించుకోవచ్చు నంటారు. ఇదే విధంగా కాకి కనబడితే చెంతలో ఊరు, పల్లె వున్నవని తీర్మానం చేసుకోవచ్చు నేమో; "ఊరపిచ్చుక", 'ఊరపిల్లి' అన్నట్లు 'ఊరకాకి' అనముగాని, కాకి ఊరును నమ్ముకుని బ్రతికేదే. అడవికుక్క, అడవికోడి, అడవిబీర, అడవిచిక్కుడు, అడవి మల్లె, అడవిమొల్ల-ఇత్యాది బ్రౌణ్యంలో నమోదైవున్నా, "అడవికాకి" కనబడదు. నీరు కాకి, జెముడుకాకి వున్నప్పటికీ, అవి కాకిజాతిలో వేరే తెగలు. మూలకాకి, పీతికాకి, బొంతకాకి ఇవి సాదాకాకివలె, మనతోపాటు మన ఊళ్ళలో, మన పల్లెలలో బ్రతికేవే. మనతోపాటు ఒకేచోట బ్రతకడమే కాక, కాకి మన బ్రతుకులో భాగం పంచుకుంటుంది.

చుట్టపక్కాలు రాకముందే వారి ఆగమనవార్తను కాకమ్మ మనకు గంతువేసి అందిస్తుంది. కాకి కుయ్య నారంభించగానే "ఈ రేషన్ రోజులలో ఎవరిని తెస్తున్నా వమ్మా - నెత్తి నెక్కించడానికి !" అని యిల్లాళ్లు ప్రస్తుతం విసుక్కుంటున్నా రను కోండి. కాని, కాకికూస్తే కొత్తగా కాపురానికి వెళ్ళిన వెళ్ళికూతురు ముఖం ఎంత విప్పారుతుంది! అమ్మ వస్తున్నదో, నాన్న వస్తున్నాడో, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఎవరువస్తున్నారోనని ఎంత సంబరపడుతుంది! క్షణక్షణం పెచ్చు పెరిగే అసహనంతో కళ్ళు కాయలు కాచేటట్టు ఎంతగా ఎదురు తెన్నులు చూస్తుంది! ఆశాభంగమైతే కాకిని తిట్టుకుని నిలువునా ఎన్ని దులిపివేస్తుంది! కన్నవారింటిపై గాలి తిరిగి అక్కడికి వెళ్ళి పదిరోజులున్నా, మళ్ళీ కళ్ళన్నీ కాకమ్మమీదే.

కాకమ్మా, కాకమ్మా, కల్లాలమ్మా!
చుట్టా లొస్తే చూచిపో
పక్కా లొస్తే పారిపో
ఇరుగువా రొస్తే ఇంటిమీదెక్కు
పొరుగువా రొస్తే పొయ్యిమీదెక్కు
మావా రొస్తే ఇటు కాలు తీసి అటు వెయ్యి
నీ కూతురుకి వెన్నముద్ద పెడతా

నీ కాలికి గజ్జీ కడతా

ఇక, ఎంకిని పోలిన విరహిణులైతే "కాకమ్మతో నైన కబురంప డా రాజు!" అని పూర్తిగా కవిత్వధోరణిలోనే పడతారు.

దినవెచ్చా లడిగినా, జీతభత్యా లడగకుండా మనకు కబుర్లు జేరవేసే టపా బంట్రోతుగా పనిచేసి పెట్టడమే కాక, కాకి మనకు శకునాలను కూడా చెబుతుంది. ఇందుకు ఒక శాస్త్రానికి శాస్త్రమే - కాకశాస్త్రం - విపులమైంది వున్నది. ప్రయాణ సందర్భంలో ఊరునుంచో, ఇంటినుంచో కదులుతుండగా కాకులు కుడి నుంచి ఎడమకు వెడితే వెళ్లబోతున్న పని పండు అవుతుంది. ఊరునో, ఇంటినో ప్రవేశిస్తుండగా శుభం కలగాలంటే కాకులు కుడినుంచి ఎడమకు కాక, ఎడమనుంచి కుడికి వెళ్ళాలి. ప్రయాణం, ప్రవేశకాలాలలో తప్ప, మార్గమధ్యంలో కాకుల శకునం పాటించ నక్కరలేదు. (పాటిస్తే ఏ ప్రయాణం సాగదు కాబట్టి) కాకి మొదట కుడినుంచి ఎడమకు వెళ్ళి, వెంటనే ఎడమనుంచి కుడికి వస్తే, చావు తప్పినా కన్ను లొట్ట పోగల కీడు మూడిం దన్నమాటే. ఎడమనుంచి బయల్దేరి ..... ఇక చాలునేమో ఈ శకునాల ప్రసక్తి.

షక్షి పలుకులన్నా, శకునాలన్నా వెర్రినమ్మకాలు లేని వారికైనా, కాకితో పని పడకుండా పోలైనా జరగదు. కూడని వస్తువును "యిస్తారా, ఛస్తారా?" అని పసికూన మారాం చేస్తుంటే, దానిపైనుంచి వాడి మనస్సు మళ్ళించడా నికి కాకమ్మ శరణ్యం కావలసిందే. మెడను వయ్యారంగా ఇటు వంచుతూ, "ఎంగిలి చేతినైనా నాకు విదల్చ రాదా?" అని వగలు చూపుతూ, చూరుపైనో, మదురుపైనో కూర్చున్న దాన్ని "హుష్ కాకి!" అని ఉత్తిచేతి విదిలింపుతో హడ లగొట్టి, పైపెచ్చు దానికి దొంగరికం అంటగట్టాలి. పిల్లవాడు అలిగి, మూతి ముడుచుకుని మూలకు వెళ్ళి కూర్చుంటే, చేతులుజాచి కళ్లు మూసుకున్నట్టు నటనచేస్తూ, "కాకి వస్తుందో, పిచ్చుక వస్తుందో, మా అబ్బాయి వస్తాడో" అంటూ నాటకమాడాలి. మనవడు నిద్రపోవాలంటే తాత అనగ అనగ ఒక కాకి...." అంటూ కాకమ్మ కథ అందుకోవాలి. తింటున్న తాయూన్ని జతపిల్లలకు కాస్త కొరికి పెట్టాలంటే బుడతలు దాన్ని "కాకి ఎంగిలి" చెయ్యాలి. ఇంతగా కాకమ్మ మన బ్రతుకులో భాగం పంచుకుంటున్నా-కాదు, ఇంతగా భాగం పంచు కోబట్టే - దాని పట్ల మనకు నిరసనదృష్టి, న్యూనభావం. ఇందుకు తార్కాణం ముఖ్యంగా మన పలుకుబడులే నుడికారాలే.

ఏదైనా ఎక్కువ నలుపైతే అది "కాకినలుపు." ఎవరైనా ఎక్కువ గోల పెడితే అది "కాకిగోల." అల్లరి చిల్లరి వారు గుంపుగా గుమిగూడితే అది "కాకిమూక." ఇన్నూరు, మున్నూరుమంది బారులు తీర్చి కూర్చుంటే అది "కాకులబడి," హీనపు బ్రతుకు "కాకిబ్రతుకు". ("కాకి చిరకాలమున్ననే కార్య మగును?" అన్నాడు కవిశేఖరు డొకడు.) ఆకస్మికపు చావు "కాకిచావు." ముట్టరాని కూడు "కాకికూడు." కర్ణకఠోర సంగీతం "కాకిసంగీతం." పిల్లజుట్టు "కాకషక్షం". కనిపించినంతనే పొడిచే పగ "కాకిపగ." కుహనాబంగారం "కాకి బంగారం." మామూలు తప్పినవి "కాకిదొండ", "కాకినేరేడు", "కాకిపెసర", "కాకిచెరకు" వగైరా వగైరా. లోకానుభవం లేనివాడు "పిల్లకాకి." ఇతరులతో కలవనివాడు "మూలకాకి". అపురూపమైంది "తెల్లకాకి". నమ్మరానికథ "కాకమ్మ కథ". "కష్టనిష్ఠురాలలో చిక్కుకున్న దౌర్భాగ్యుడు "కంపనపడ్డ కాకి." ఇక లోకు లందరు "పలుగాకులు" చొరరానిది "కాకులు దూరని కారడవి", పనికిమాలిన పనిచెయ్యడం "కాకదంత పరీక్ష. దూష్యమైందని వీధిలో విసురుపుచ్చుకు పార వెయ్యవలసింది "కాకముట్టిన కుండ." ఆకార, అనాకారాలుకు జరిగిన పెళ్ళి "కాకిముక్కు పగడం," లేదా "కాకిముక్కుకు దొండపండు." ఇంత దేనికి? కాకి అంటేనే "అల్పం" అని నిఘంటుకారుడు అర్థం చెబుతున్నాడు.

కాకమ్మకు పచ్చి అన్యాయంచేస్తూ ఎన్నో పలుకుబడులు, నుడికారాలనే కాక, అనేక సామెతలను కూడా మనం సృష్టించుకున్నాము. "కాకి పుట్టే నలుపే, పెరిగే నలుపే". కావచ్చు, కాని, పుట్టిననాటి నలుపు పెరిగేసరికి కోయిలకైనా తగ్గుతుందా? పోనీ, నల్లగా పుట్టిన నరులైనా, ఎంత టాల్కం పౌడర్ కొట్టుకున్నా, తెల్లవారౌతున్నారా? "కాకిపిల్ల కాకికి ముద్దు". నిజమే! ఎవరిపిల్ల ఎవరికి ముద్దు కాదు? "కాకిని తెచ్చి పంజరంలో పెడితే చిలకవలె పలుకుతుందా?" అయితే, చిలకను కోయిలవలె కుయ్యమనండి - తలలో జేజి దిగివచ్చినా అది దాని తర మౌతుందేమో! "గంగలో మునిగినా కాకి హంస అవుతుందా?", కాకపోవచ్చు, కాని, తాను తానుగా వుండక, మరొకటిగా చెల్లుబాటు కావాలన్న ఖర్మ కాకికి ఎందుకు పట్టాలి? "మెతుకులు చల్లితే కాకులకు తక్కువా?". ఊరికే వస్తే మావాడు మరొక డున్నాడని మానవులే గుమిగూడతారు - కాకులు చేరడం ఒక లెక్కా? "కాకి గండాగుండి కాని, కోయిల పిరికే". ఒక్క **కాకిని** మినహాయిస్తే పిరికితనం కూడా మెచ్చుకోదగ్గ గొప్పగుణమే కాబోలు!

ఇంతకూ కాకి "ఛీఛీ", "థూథూ" అనిపించుకోడాని కేమి, కోకిల "వహ్వా,

వహ్వా,"“భేష్‌భేష్” అనిపించుకోడాని కేమి ముఖ్యకారణం, మొదటిది మన మధ్య మనతోపాటు కాలక్షేపం చెయ్యగా, రెండవది ఇటు వచ్చి, అటు పోయి, ఎద టపడీపడకుండా మురిపించడం. కాకికి లేని అందం కోయిల కేమీ వొలికిపోవడం లేదు. కాకి ఎంత నల్లనిదైనా, కోయిలకంటె ఒకటి, రెండు చాయ తెక్కువే కాని తక్కువకాదు. వొళ్ళు నలుపైనా కాకిమెడ అంత నలుపుకాదు. (మాలకాకి మాట ఇక్కడ విడిచి పుచ్చండి.) కోయిల నిలువెల్లా నలుపు. ఏ రంగుకైనా నిగారింపు బాగుంటుంది కాని, నలుపురంగు మాత్రం కాదు. కోకిల నలుపు నిగ నిగ లాడేదే. ఈ సంగతి సందర్భాలన్నీ తెలిసికూడా పెద్దలు “కాకపికన్యాయం” అన్నారు. కాకి నలుపే, కోకిలమూ నలుపే. అయినా, రెండవదాని విషయంలో అందచందాలు లెక్కకు రావట. తేనె లొలికే దాని కంఠం దాని వికారాన్ని కమ్మివేస్తుందట, అసంబద్ధమైన ఈ మాటను పెద్దలు “కాకపికన్యాయం” అనడా నికి మారుగా “కాకపికఅన్యాయం” అంటే సత్యానికి చేరువగా వుండేది. ఏదైనా ఒక్క సలక్షణమే ఎన్ని అవలక్షణాలనైనా కమ్మి వెయ్యగలిగితే, మానవాళితో సత్పురుషులు కానివా రెవ్వరు? సమ్మానార్హులు కాని వారెవ్వరు?

కాకి గొంతు కటు వనడం కా దనరాని మాట. నిస్తబ్ధత గర్భాన్ని చీల్చుకొని “కాకా” రవం వస్తే అది చెవికి రౌరవంగా వుండేమాట కూడా నిజం. కాని, కాకి కూత వినబడినంత చురుకుగా కోయిలపాటకూడా వినవస్తే ముఖం మొత్తడానికి ఏళ్లూ పూళ్ళూ పట్టదు; ఘడియో, అరఘడియో చాలు. ఏ మామిడిగున్న లేజిగుళ్ళ మధ్యనో దాగి “కో” అని కోయిల నాలుగుసార్లు అంటే, మనం ఎదురు నాలుగుసార్లు “కో” అంటాము. అది నలభైసార్లు ‘కో’ అంటే, మరి దాని సంగతే మనం పట్టించుకోము. ఇంకా క్కూస్తే “ఏమిటీ పాదు సాద” అనే మాట రానే వస్తుంది, ఇంకొక విషయం : ఆసమయంలో వినబడినా, కాకి అరుపు చెవికి బాధ కలిగిస్తుందే తప్ప గుండెను తరగదు. సమయంకాని సమయంలో ఈ గుండెకోత కోయిల పాట కున్నది, అందుకనే--

పాడవే కోకిలా!
పాడవే యింపుగా;
ప్రాణముల్ హాయిచే
పరవశ మొందగా!
పాట పాడవె తీయగా,
కోకిలా!
పాట పాడవె తీయగా!

అని అర్థించిన బసవరాజు అప్పారాయకవి మరొక సందర్భంలో తానై–

తీయనీ రాగాలు తీయబోకే,
తీపితో నా మనసు కోయబోకే,
కోయిలా, కోయిలా
కూయబోకే

అని ప్రార్థేయపడవలసి వచ్చింది. "యెంకి దూరానుండె, యేటిదరి నే నుంటి సావాస మింకెవరు, సందడెవరో" అని, "యేటి కడుపున దాగి తోట నిదరోయింది, ఆలనా, నా సొదకు పాలనా" అని నిట్టూరుస్తుండగా కొమ్మలో కోయిల "కో" అనేసరికి నాయుడుబావ కూడా "రాగతనమో యేమొ బాగు వో గెరుగదే" అని విసుగుదల చూపవలసి వచ్చింది.

ఏమైనా కోకిలమ్మ కేమి? – భాగ్యశాలి బ్రతుకు ! ఊడ్చుకో నక్కరలేదు, ఎత్తిపోసుకో నక్కరలేదు, అలికి ముగ్గులు పెట్టుకో నక్కరలేదు. హాయిగా ఏ కొమ్మపైనో "మఠం నిద్ర". వండ నక్కరలేదు, వార్చ నక్కరలేదు, ఇటు పుల్ల అటు పెట్టనక్కరలేదు. సుష్ఠుగా మామిడి చిగుళ్ల "సత్రం భోజనం". కన్నా పెంచనక్కరలేదు. జీతం, నాతం లేకుండా ఆ భారం మొయ్యడానికి, ఆ బాధ్యత వహించడానికి కాకమ్మ వుండనే వున్నది. లేచినమ్మ లేచినట్టు నొవ్వకుండా, నొచ్చ కుండా చక్కగా దిద్దుకొని "ఠింగు రంగా" అంటూ కూర్చోవచ్చు. అయినప్పుడు కోకిల గొంతెత్తి పాడుతుంది, గొప్పగా పాడుతుంది - పాడ కేమి చేస్తుంది? అది వెళ్ళబోస్తున్న వైభోగంలో అరవయ్యారో వంతైనా కాకమ్మ కుంటే దానిదీ కలకంఠమే అయ్యేది!

దాని బ్రతుకే పచ్చిమోసం బ్రతుకైనందున కోకిలమ్మ పాడ నా కెంత మాత్రం గిట్టదు. "కో" అంటూ పట్టరాని పొంగుతో అది కూసిన ప్రతి సారి నాకు టోపీ పెట్టిన ప్రతివాడు నా చాటున ఇలాగే కులుకుతాడేమోనని అనిపిస్తుంది. టోపీ దాసుల చేతిలో నా వలె టోకరాలు తినేవారిపట్ల నాకు సహ జంగానే వుండే సానుభూతిలో కొంతభాగాన్ని కాకమ్మకూడా పంచుకొంటుంది. చితుకు చితుకు చొప్పన యేరుకొని ఏ చెట్టుకొమ్మమీదో కష్టపడి గూడు కట్టు కొని, గుడ్లు పెట్టుకొని, వాటిని పొదుగుతూ వున్న కాకి జంటను కావాలని కోయిల దంపతులు కయ్యానికి కవ్విస్తాయట. రోషంవచ్చి కాకుల వెంటపడగా వాటిని గిరికీలు పెడుతూ గూటినుంచి దూరానికి లాక్కుపోతాయట. అంతట

కయ్యంనుంచి ఆడకోయిల నేర్పుగా తప్పుకొని, కాకిజంట గూటిని చేరి గుడ్లు పెట్టి వేస్తుందట. లెక్కాడొక్కా తెలియని వెర్రిమొగాలు కాబట్టి, తమ గుడ్లే అనుకొని కోయిల గుడ్లను కూడా కాకులు పొదుగుతాయట. అంతేకాదు. తమ బిడ్డలను మించి పరాయి పిల్లలను పోషణ చేస్తాయట! వెర్రి కాకమ్మను ఇంతగా మోసగిస్తుండే కోయిలను మెచ్చుకునే వారందరు నా దృష్టిలో వంచనకు వంద నాలర్పిస్తున్నవారే.

*

# "రిపార్టీ"

ప్రహరి లేనందున ఒకప్పుడు బందరు నేషనల్ కాలేజీ ఆవరణలో గాడ్దెలు హెచ్చుగా తిరుగుతూ వుండేవి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, ఒక వేసవిలో ఆ కాలేజీ హాస్టల్ ఒక మిత్రుని అతిథిగా వున్న నన్ను, ఒక ప్రబుద్ధుడు "ఏమోయ్! మీ కళాశాల గాడ్దెలు యెలా వున్నాయ్? "అంటూ పలకరించాడు. అందుకు నేను చిరునవ్వుతో "నీ కింత బంధుప్రేమ వున్నదని ఇంతకుముందు నాకు తెలియదు సుమా!" అని జవాబిచ్చాను. మావాడి కొంటె ప్రశ్నకు నే నిచ్చిన కొంటె జవాబుకు ఇంగ్లీషులో 'రిపార్టీ' అంటారు. దెబ్బకు దెబ్బ పడితే అది రిపార్టీ కాదు; దెబ్బను మించిన దెబ్బపడాలి, నోరు మూయించగల దెబ్బపడాలి, దెబ్బ తిన్నవాడు చెంప సవరదీసుకుంటూ గుడ్లనీళ్ళు గుడ్ల కుక్కుకున్నా, మిగతావారు మాత్రం పడిన దెబ్బ మహా మజాగా పడిందని మెచ్చుకోవాలి - అట్టిదే రిపార్టీ కాగలదు.

ఎదటివాడు అల్లరిగానో, ఆగడంగానో, ఎకసక్కెంగానో, ఎగతాళిగానో, ఎత్తిపొడుస్తానో, ఏడ్పించాలనో ఏదో కొంటెమాట అనేసరికి తెల్లబోకుండాను, తడు

ముకోకుండాను గొడ్డలిపెట్టు పెట్టినట్టు తపీమని జవాబుచెప్పి నోర మూయించ కలవాడు కాటిలో పెట్టినా లేచి రాగలడు. నిదర్శనానికి లాయడ్ జా[illegible]డండి; పుట్టింది బడిపంతులు కడుపున; తన పసివాడైవుండగానే తండ్రిపో[illegible], పెద్ద చదువులు చదవలేదు. అయినా, గ్రేట్ బ్రిటన్‌కు ప్రధాని కాగలిగాడు; ఒక పట్టులో ప్రపంచం భవిష్యత్తునే తమ చేతిలో పెట్టుకున్న ముగ్గురిలో తా నొక్క డయ్యాడు. లాయడ్‌జార్జి ఇంతగా యెక్కిరావడానికి కారణ మేమంటారు? నన్నడి గితే రిపార్టీ లివ్వడంలో ఆయన సత్తాయే! అంటే, రిపార్టీలను ఎడాపెడా విసరడం వల్లనే ఆయన మొనగాడంటే ఆయన మెదడు కునికిపాట్లు యెరగని దన్నమాట. అట్టివారు కాలానికే ఎదురీదగలుగుతారు.

లాయడ్ జార్జి విసిరిన రిపార్టీలు లెక్కలేనన్ని. మచ్చుకు రెండు, మూడిం టిని మాత్రం ఇక్కడ పేర్కొంటాను; ఒకనాడు ఆయన ఎలక్షన్ మీటింగులో ప్రసంగిస్తున్నాడు. అప్పుడు సభలోనుంచి ఒక అమ్మి తుపానులా లేచి "నేనే నీ పెళ్ళాన్నైతే నీకు తప్పక విష మిచ్చి వుండేదాన్ని" అన్నది. అందుపై ఆయన కొంటె చిరునవ్వుతో "నేనే నీ భర్తనైతే దాన్ని తప్పకుండా పుచ్చేసుకునేవాణ్ణి" అన్నాడు. ఇంకొకసారి ఎలక్షన్ మీటింగులోనే ఒక కొంటె కోణంగి "అయితే మీ తాత గంత గాడిదను తోలుకునేవాడు కాదటయ్యా?" అని వెక్కిరించాడు. దానికి "గంత మాట ఏమో నేను వినలేదుగాని, గాడిద మాత్రం నా యెదుట ప్రత్య క్షంగా వుంది" అని ఆయన జవాబు. వేరొక సందర్భంలో లాయడ్ జార్జి "హోం రూల్" గురించి వేల్స్‌లో ముచ్చటిస్తున్నాడు. "ఐర్లెండుకు హోంరూల్ కావాలి; స్కాట్లెండుకు హోంరూల్ కావాలి; వేల్స్‌కు హోంరూల్ కావాలి. బ్రిటన్ కు ..." మాటకు అడ్డువచ్చి, సభలో వున్న ఒక త్రాగుబోతు "నరకానికో? " అన్నాడు. వెంటనే "వో! నరకానికి కూడా హోంరూల్ కావల్సిందే! స్వదేశం అంటే ఇంత భక్తి చూపిన ఆ పెద్దమనిషి ఎవరో గాని ఆయనకు నా ధన్యవా దాలు" అని లాయడ్ జార్జి దెబ్బతీశాడు.

ఈనాటి రాజకీయవేత్తలలో లాయడ్ జార్జిని రిపార్టీలో మించగల వారే లేరని చెప్పాలి. తాను ఉపన్యసిస్తుండగా కొంటె ప్రశ్నలు పడాలని ఆయన నిజానికి కోరు కునేవాడు. అలా ప్రశ్నలు పడకపోతే ఆయన బుద్ధి ప్రకోపించేది కాదు, ఉపన్యాసం రక్తి కట్టేదీ కాదు. కామన్సులో ఏదైనా తీవ్ర చర్చ జరుగుతున్నప్పుడు దానిలో పాల్గొనడానికి లేచా డనుకోండి. అప్పుడు అడ్డదిడ్డంగా ప్రశ్నలు వేసి, ఆయనకు అడ్డుతగిలారో మాడు పగిలిం దన్నమాటే! అలా కాకుండా చెవు లప్పగించి, మెద

లకుండా కూర్చుంటే పసగల ధోరణిలో పడకుండానే ప్రసంగం ముగిసిపోయేది. లాయడ్‌జార్జి ఈ ప్రవృత్తికి చర్చిల్ మనస్తత్వం పూర్తిగా భిన్నం. ఉపన్యాసం ముందుగా వ్రాసుకొని, దాన్ని కంఠోపాఠం చేసి, ఆ తర్వాతే ఆయన పార్లమెంటుకు వస్తాడు. చాలా సంవత్సరాలక్రితం చర్చిల్ అతిథిగా ఆయన యింట బస చేస్తున్న ఒక పెద్దమనిషి కానేవు గాలిపోసుకు వద్దామని తోటలోకి షికారు వెళ్లగా, ఒక పొదరిల్లు అవతలనుంచి "మిస్టర్ స్పీకర్, సర్, తలవనితలంపుగా ఈ చర్చలో నేను జోక్యం కలిగించుకొనక తప్పలేదు. నేడు ఈ విషయంపై నేను ప్రసగించవలసి వస్తుందని కలలోనైనా అనుకోలేదు. కాని, ఇప్పుడే తన ఉపన్యాసం ముగించి కూర్చున్న నా మిత్రుడు చేసిన కువిమర్శనలను విన్న మీదట...." అంటూ చర్చిల్ కంఠం కంచుగంటవలె మ్రోగుతున్నదట. మరొక గంటకో, రెండుగంటలకో తాను చేయనున్న ప్రసంగాన్ని చర్చిల్ కంఠస్థం చేస్తున్నట్టు చప్పన గ్రహించుకొని తా నప్పుడు కంటపడ్డం బాగుండదని ఆ పెద్దమనిషి పిల్లిఅడుగులు వేసుకుంటూ ఇంటిలోపలికి చక్కా పోయాడట. ఈ విధంగా కంఠస్థం చేసుకువచ్చిన ప్రసంగాన్ని అపవారించకుండా సభ్య లందరూ విన్నారా, తుక్కురేగేటట్టు చర్చిల్ దాన్ని అప్పజెప్పివేస్తాడు; ప్రతిపక్షుల వాదం ఎంత బలంగా వున్నా దాన్ని చీల్చి చెండాడతాడు. అలా కాకుండా ఎక్కడి కక్కడ అడ్డు వచ్చి, మాటను త్రుంచివేస్తే, తికమక పడతాడు, తబ్బిబ్బులౌతాడు. అయితే చర్చిల్‌కైనా రిపార్టీలు విసరగల తాహతు కొంతవరకు లేకపోలేదు. ఇప్పుడు లేదుగాని, చర్చిల్ ఒకప్పుడు మీసాలు పెంచుతూ వుండేవాడు. ఆ కాలంలో ఒకానొక సుందరి "మిమ్ము చూస్తే రెండువిషయాలు నాకు నచ్చవు" అని చర్చిల్‌ను చూచి అన్నదట. అటుపిమ్మట సంభాషణ క్రమ మిది:

"ఏమిటవి"?

"మీ రాజకీయాలూ, మీ మీసాలూ".

"కావచ్చుగాని, ఈ రెండింటిలో దేని స్పర్శా మీకు తగలగల ప్రమాదం లేదు." మీసాలు పెంచడం, తియ్యడం చేసినట్టే, పార్టీల విషయంలో కూడా చర్చిల్ రంగులు ఫిరాయించాడు. టోరీల నుంచి చీలి, లిబరల్స్‌లో ఆయన చేరినప్పుడు ఆక్స్ ఫర్డ్ యూనియన్‌లో ఒక డిబేట్‌లో ఆయన పాల్గొంటున్నాడు. ఎదటి పక్షాన వాదం చేస్తున్న లార్డ్ బర్కెన్‌హెడ్ (అప్పటికి ఆయన లార్డ్ కాలేదు; యఫ్.ఇ.స్మిత్‌గానే వున్నాడు) "లిబరల్స్ నరకంలోనైనా మైనారిటీగానే వుంటారు" అని ఎత్తి పొడిచాడు. అందుపై చర్చిల్ "నరకంలో టోరీలకు ఖచ్చి

తంగామెజారిటీ వున్నట్టు వినడానికి నేను సంతోషిస్తున్నాను" అని మాటకు మాట అసలు ఫాయిదాలతో అప్పగించాడు.

రాజకీయరంగంలోవలె న్యాయస్థానాలలోనూ రాణించడానికి రిపార్టీ ముఖ్యావసరం. సాక్షి కానివ్వండి, యెదటిపక్షం వకీలు కానివ్వండి, చివరకి జడ్జీయే కానివ్వండి- ఏ మాత్రం సవ్యం తప్పి మాట్లాడినా ఫెడీమని నోటిపై కొట్టగలిగితే పంట పండిందన్నమాటే. పేరందిన న్యాయవాదులందరు రిపార్టీలో దిట్టలే. ఈ విద్యలో ఐరిష్ బారిస్టర్ ఫిల్‌పాట్ కుర్రన్‌కు పెట్టింది పేరు. కుర్రన్ ఒకనాడొక జడ్జియెదుట వాదిస్తున్నాడు. ఆ జడ్జికి ఒక పెంపుడు కుక్క వుండేది. దాన్ని తన ఆసనం ప్రక్కనే కూర్చోబెట్టుకునేవాడు. కుర్రన్ ఒక పది నిముషాలపాటు తన వాదం వినిపించాడో, లేదో "సరే, నీసొద నువ్వుకానిచ్చుకో?" అన్నట్టు ముఖంపెట్టి, ఆజడ్జికుక్కమవైపు తిరిగి దాన్ని నిమరడం ప్రారంభిచ్చాడు. కుర్రన్ వెంటనే తన వాదన నిలిపివేశాడు. "ఆగిపోయా రేమిటి కానివ్వండి" అన్నాడు జడ్జీ, తలైనా యెత్తకుండా. "మరేమీ లేదు, స్వామీ! సలహా చేస్తున్నారేమో నని ఆగిపోయాను" అని కుర్రన్ చుర్రున వాత పెట్టాడు. ఈ జడ్జీయే ఇంకొకసారి "మీరు చెబుతున్నదే లా కాగల షక్షంలో నా లాపుస్తకాలను తగలబెట్టుకోవలసిందే" అనగా, "ఆ పనిచెయ్యడం కంటె, వాటిని చదువుకోవడం మేలుకాదా, దేవరా"? అని కుర్రన్ చిన్న చురక తగిలించాడు. లార్డ్ ఎషర్‌కూడా జడ్జీగా ఆజ్‌వాల్డ్ అనే లాయర్ చేతిలో ఇలాంటి దెబ్బే తిన్నాడు. ఆజ్‌వాల్డ్ వాదనకు అడ్డువచ్చి "జడ్జీలకైనా కొంత కామన్‌సెన్స్ వుంటుందని మీరు వొప్పుకోవాలి" అని ఎషర్ అన్నాడు. "చిత్తం, అలా అనుకునే కింది కోర్టులో పొరపడ్డాను" అని ఆజ్‌వాల్డ్ దెబ్బ తీశాడు. సాక్షి నొకనిని క్రాస్‌ఎగ్జామినేషన్ చేస్తూ సర్ ఎడ్వర్ కార్సన్ "నువ్వు తాగుతావా"? అని ప్రశ్నించగా అతడు "అది నా వ్యవహారం- మీకు దేనికి? అని కోపంగా బదు లిచ్చాడు." సరేనయ్యా! ఇదొకటేనా, వేరే వ్యవహారం ఏదైనా కూడా వున్నదా?" అని సర్ ఎడ్వర్డ్ వెంటనే మరొక ప్రశ్న వేశాడు. ఇంకొక కేసులో ఒకానొక సాక్షి సాక్షాత్తు ఆ సత్యహరిశ్చంద్రుడి పోజ్ పెట్టి "నిజానికీ, నాకూ చిన్నతనం నుంచీ లంకె" అన్నాడు. "కావచ్చు నయ్యా! కాని విడాకు లిచ్చుకుని ఎంతకాల మైందనే మా ప్రశ్న" అని ఈ కేసు విచారిస్తున్న జడ్జి, లార్డ్ డార్లింగ్, అతని నోరు మూయించాడు. ఆ జడ్జి పేరుగాని, ఆ లాయరు పేరుగాని మనకు తెలియక పోయినా, కోర్టుకు సంబంధించి కండగల రిపార్టీ మరొకటి వున్నది. జడ్జి తల బిరుసువాడు. కేసు విచారిస్తూ

రెండు కాళ్ళూ ఎత్తి టేబులుపై పెట్టాడు. కేసులో పనిచేస్తున్న లాయర్ గడసరి. చేస్తున్న వాదాన్ని వాక్యం మధ్యలో ఆపివేశాడు. "మరి చెప్పవలసిందే లేదా"? అన్నాడు జడ్జి. "చాలా చాలా వున్నదండి. కాని, తలకు చెప్పాలో, మొలకు చెప్పాలో తెలియక ఆగిపోయాను" అన్నాడు లాయరు. "దేని కైనా సరే" అని రుసరుస లాడాడు జడ్జి. "చిత్తం! తమ తలలో ఎంత లా వున్నదో, మొలలో అంతేలెండి!" అని నషాళానికి అంటే దెబ్బతీశాడు లాయర్.

మన కోర్టులలో కూడా రిపార్టీలు లెక్కలేనన్ని. అలహాబాదు హైకోర్టులో పండిట్ మోతీలాల్ నెహ్రూ ఏదో కేసులో సాక్షిని విచారిస్తుండగా అతడు "నేనేం వెధవ ననుకున్నారా?" అని తీండ్రించాడట. అందుపై మోతీ లాల్ "రామరామ! కలలో నైనా మీరట్టివారని నేననుకోలేదు. కాని నేను పొరబడి వుండవచ్చుగా, స్వామీ", అని మెత్తటి చెప్పతో మెత్తని దెబ్బ కొట్టాడు. సర్ రాసబిహారి ఘోష్ కలకత్తా హైకోర్టులో ఆర్గ్యుమెంట్ చెబుతుండగా జడ్జి "మీరు నాకు లా బోధించలేరు" అని కసురుకున్నాడు. "చిత్తం! తమకు నేను ఏమీ బోధించలేను!" అంటూ, 'ఏమీ' అనే ముక్కను నొక్కిపలికి, "తమరు మూర్ఖశిఖామణులు అన్నట్టు ధ్వనించి, ఆ జడ్జి మళ్ళీ నోరెత్తకుండా చేశాడు. రిపార్టీ లో వీ రిద్దరికంటె ఘనుడు కీర్తిశేషుడైన భాష్యం అయ్యంగార్. ఆయన మద్రాసు హైకోర్టులో వాదిస్తుండగా జడ్జి "మీరు మరి వాదించి లాభం లేదు. ఇక మీ రేమిచెప్పినా, మీ మాటలు ఈ చెవిగుండా లోపలికిపోతే, ఆ చెవి గుండా బయటికి దూసుకుపోతాయి" అన్నాడట. "యస్ మై లార్డ్! ఆ రెండు చెవులమధ్య (మాటను అడ్డడానికి) ఏమైనా వుంటేకదా!" అని భాష్యం అయ్యం గార్ దెబ్బ తీశాడట. స్నేహితుడైన ఒక జడ్జి యింటికి సాయంత్రం పూట ఆయన ఖులాసాగా వెళ్లేసరికి జడ్జిగారి కుక్క "భౌ!భౌ!" అని మొరుగుతూ వైకి దూకబోయిందట. జంకి భాష్యం అయ్యంగార్ ఒక అడుగు వెనక్కువేసేసరికి "మొరిగేకుక్క కరవదని సామెత వున్నది-మీరు వినలేదా?" అని జడ్జి నవ్వా డట. "ఆ సామెత నేను విన్నా ననుకోండి; కాని, మీ కుక్క వినలే దేమోనని సంకోచం" అని అయ్యంగార్ చమత్కరించాడట.

న్యాయస్థానాలవలె విద్యాసంస్థలూ రిపార్టీలకు కేంద్రాలే. కుర్రవాళ్ళు మాష్టర్ల మీద, మాష్టర్లు కుర్రవాళ్ళమీద, విసిరే దెబ్బలను గురించి ఎన్నో కథలు వింటూ వుంటాము. ఒక ఇంగ్లీషుమాష్టరు పాఠం అప్పగించని కుర్రవాడిని బెత్తంతో నిల వేసి "ఈ బెత్తం చివర ఒక ఫూల్ వున్నాడు" అని అతితెలివి ప్రదర్శించాడట.

అమాయకత్వాన్ని నటిస్తూ ఆ కుర్రవాడు "ఏ చివరండీ?" అని ప్రశ్నించాడట. మరొకపంతులు మొద్దబ్బాయిని చూచి "నీ ప్రాయంలో నేను ఇంతకంటె గొట్టు లెక్కలను చులాగ్గా చేసేవాడనురా!" అన్నాడట. "కావచ్చు, సార్! మీకు లెక్కలుచెప్పిన పంతులు మరొకరుగా;" అని వాడు వ్యాఖ్యానించాడట. డాక్టర్ రఘుపతి వెంకటరత్నంనాయుడుగారు బందరు నోబుల్ కాలేజీలో కొంతకాలం లెక్చరర్‌గా పనిచేశారు. అప్పుడు నాయుడుగారు హైస్కూల్ క్లాసులకుకూడా పాఠాలు చెప్పవలసివుండేది. దిద్దిన కాంపోజిషన్ పుస్తకాలను వాపసు చెయ్యడానికి ఒకనాడు వాటిని నాయుడుగారు తీసుకువెడుతున్నారు. అది నలభైమంది క్లాసు నలభై పుస్తకాల పెద్దపొతిక నాయుడుగారి చేతిని క్రుంగదీస్తున్నది. దీన్ని చూచి ఆ క్లాసు కుర్రవాడొకడు అల్లరిగానవ్వుతూ "మాష్టార్‌గారూ! ఒకగాడిద బరువు పైన పడిందే!" అన్నాడు. ఇందుపై నాయుడుగారుకూడా నవ్వుతూనే "అబ్బే! ఒక్కగాడిదబరువు కాదురా! నలభైగాడిదల బరువు!" అని జవాబిచ్చాడు. క్లాస్‌రూమ్‌కు సంబంధించింది కాకపోయినా, ఇటువంటిదే శ్రీ చెరుకువాడ వెంకటనరసింహం పంతులుగారి రిపార్టీ నేను స్వయంగా విన్న దొకటి వున్నది. "ఆంధ్రవాచాల", "ఆంధ్ర భీమాడిండిమ"-ఇత్యాది బిరుదావళిని సంపాదించుకొనకముందు పంతులుగారు కొన్నేళ్ళపాటు కవుతరంలో (కృష్ణాజిల్లా) బడిపంతులుగా పనిచేశారు. అప్పటిలో తమవద్ద చదువుకున్న ఒక శిష్యునియింట పంతులుగారు తర్వాత ఎప్పుడో ఒక పూట బసచెయ్యడం తటస్థించింది. అతడు బహుదుడుకు మనిషి. బడిలోనే పంతులుగారికి యెదురు తిరగినవాడు. పిమ్మట లోకవ్యవహారాలలోనూ యెడ్డెమంటే తెడ్డెమన్నవాడు. శిష్యునియింట పంతులుగారు స్నానసంధ్యాదులు పూర్తిచేసుకునేసరికి అతడు బొట్టుపెట్టె తెచ్చి ముంగిటపెట్టాడు. బొట్టుపెట్టుకునే రివాజు పంతులుగారికి లేదు. అయినా, నాము, తిరుచూర్ణం ఎదట కనబడేసరికి నామాలు పెట్టుకుందామన్న సరదా పుట్టింది. శిష్యుడు కాసేపు కనిపెప్పవాల్చకుండా చూచి, "అలవాటు లేకపోయినా తీర్చి దిద్దినట్టు పంతులుగారు పంగనామాలు పెట్టుకుంటున్నారే!" అని నవ్వాడు. "ఈ భాగ్యానికి అలవాటు కావాలటరా? శిష్యులు పెట్టిననాటి ఆనవాళ్ళు లేవూ?" అని పంతులుగారు అతడి నోటికి తాళంవేశారు.

కవులు కుశాగ్రబుద్ధు లైనందున, పండితులు ప్రజ్ఞానిధు లైనందున, కవిపండితులలో నెక్కుమంది రిపార్టీలో ఆరితేరినవారే. డాక్టర్ శామ్యూల్ జాన్సన్ ఒక మిత్రునితో చాలాసేపు వాదించినమీదట అతడు "మీరెంత వాదించినా మీరు

చెప్పే విషయాన్ని నేను అంగీకరించలేనూ" అన్నాడట. "నిజమే లెండి! నేను మీకు వాదం చెప్పగలనుగాని, దాన్ని అర్థం చేసుకోగల బుద్ధి నివ్వగలనా?" అని మాటకారి జాన్సన్ ప్రత్యర్థిని చిత్తుచేశాడట. మాటకారితనంలో జాన్సన్ తలదన్నినవాడు బెర్నార్డ్ షా. ఒకనాడు నాటక ప్రదర్శనం పూర్తికాగానే నాటకకర్త స్టేజిమీదికి రావాలని ప్రేక్షకులు పట్టుదల చూపగా బెర్నార్డ్‌షా రంగస్థలంపైకి వెళ్ళాడట. వెంటనే ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో నాటకశాల దద్దరిల్లిపోయిందట. "ఊరందరిదీ ఒకదారి, ఉలిపికట్టిది ఒకదారి" అన్నట్టు ప్రేక్షకులలో ఒక్కడెవ్వడో 'బూ' అంటూ షాను వెక్కిరించాడట. (ఇతడు తెలుగువాడైతే "ఆఛ్" అని దొంగతుమ్ము తుమ్మేవాడు) అతడి 'బూ' పూర్తికాకముందే 'బూ' అంటూ షా తానూ అందుకుని "నిజమేనయ్యా! నీతో నే నేకీభవిస్తున్నాను. కాని, ఇంతమంది మాటముందు నీ మాటా, నామాటా ఏమి చెల్లుతుంది?" అని మాడు పగలగొట్టాడు. రిపార్టీలకు షా మొనగాడైనా ఆయన ఇతరుల చేతిలో దెబ్బతిన్న సందర్భాలుకూడా కొన్ని వున్నాయి. దెబ్బతియ్యడానికి వురికేవాడు దెబ్బ తినవలసిరావడంలో అబ్బుర మేమీలేదు. శాకాహారి కనుక విందు భోజనాలకు పిలిస్తే బెర్నార్డ్ షా నూటికీ, కోటికీ తప్ప వెళ్ళేవాడు కాడు. "చచ్చినగొడ్లను పీక్కుతినే మీ మధ్యకు నేనెలావస్తాను?" అని విందు ఆహ్వానాలను తిరగగొట్టి వేస్తుండేవాడు. లేడీ ఆక్స్‌ఫర్డ్ కాబోలు ఒకనాడు విందుకు పిలవగా ఒక పోస్టుకార్టు మీద - బెర్నార్డ్‌షా మన గాంధీజీవలె ఉత్తరప్రత్యుత్తరాలకు కార్డులనే ఎక్కువగా వాడుతూవుండేవాడు - "నా ఆహారనియమాలు జగత్ప్రసిద్ధమై వుండగా, ఈ విధంగా మీరు నన్ను అవమానించడానికి నే నేమి పాపం చేసుకున్నానో ఊహించలేకున్నాను." అని షా బదులు వ్రాశాడట. దీన్ని చూచుకోగానే, ఆమె టెలిగ్రామ్‌ఫారం అందుకుని "మీ ఆహార నియమాలు నాకు తెలియవుగాని, అవి మీ మర్యాదమన్నన లంతటి నికృష్టమైనవి కావనే ఆశిస్తున్నాను." అని బదులు తీర్చింది. ఇంత గట్టి దెబ్బనే బెర్నార్డ్‌షా ఒక పెద్ద ఆర్టిస్ట్ చేతిలో - సి.ఆర్. డబ్లియు. నెవిన్‌సన్ అని జ్ఞాపకం - తిన్నాడు. చిత్రకారులు తమ చిత్రాలకు విపరీతపు వెలలు పెడతారని, అందువల్లనే వాటిని కొనేవా రుండరని, అందరికి అందుబాటులో వుండగల ధరలకు బొమ్మలను అమ్మనంతవరకు ఆర్టిస్టులకు "అమ్మాబువ్వ, అయ్యా బువ్వ" తప్పదని షా నమ్మకం. ఇది వాదప్రతివాదాలకు దారితీసిన సందర్భంలో షావి పాతకాలపు మాటలని ప్రతిషక్షి యెగతాళి చేశాడు. "నేనా పాతకాలపు వాడిని? నా సరసను ఈ ప్రబుద్ధుడు వీధిని నడిస్తే, ఇతడు తాతగా నేను మనమడుగాను లోకం భ్రమపడుతుంది." అని షా తనను

తాను సమర్థించుకోబోయాడు. "అందుకు సందేహమా! షా వాదం అంత పసితనంగానూ వున్నది" అని నెవిన్‌సన్ గుక్కతిరగని దెబ్బకొట్టాడు.

మనదేశం కవిపండితులలో రిపార్టీకి వేలుమడచి ముందుగా చెప్పవలసిన వారిలో ఒకరేమో శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో తెనాలి రామకృష్ణకవి; రెండవవారు అక్బర్‌పాదుషా దర్బారులోని బీర్‌బల్. హంపీ, ఢిల్లీలలోనే కాకుండా ప్రతి రాజా స్థానంలోనూ పూర్వం విదూషకు లుండేవారు. వీరి పని రాజును నవ్వించడమైనా వీరు డొక్కశుద్ధి లేనివారు కారు. వాక్చాతురితోపాటు బహుభాషా పాండిత్యం, వివిధ శాస్త్రాలలో ప్రవేశం, విశేషలోకానుభవం లేకపోతే వీరికి రాణింపు వుండేది కాదు. ఒక్కొక్కప్పుడు వీరు అజ్ఞానాన్ని ప్రదర్శించినా, ఆకతాయతనంగా ప్రవర్తించినా, అది తమ ప్రభువుల మెప్పుకోసమేకాని మూర్ఖత్వంవల్ల కాదు. నేర్పుగా అనగలిగితే చివరికి రాజులనైనా ఎంతమాట పడితే అంతమాట అనడానికి వీరికి స్వేచ్ఛా స్వాతంత్ర్యా లుండేవి. అయినా బహుళప్రచారంలో గల రామలింగం, బీర్‌బల్ రిపార్టీలు తప్ప రాజాస్థాన ఛలోక్తులు మనవరకు రాలేదు. రాజాస్థానాలకు సంబంధించి నేను విన్న రెండు, మూడు రిపార్టీలు విదేశాలకు చెందినవే. వెనకటికి ఒక బ్రిటీష్ యువరాజు తనకు సుపరిచితుడైన టవర్స్, పోర్ట్స్‌మత్‌లో యెదురుపడేసరికి "హలో టవర్స్!పోర్ట్స్‌మత్‌లో నిన్నుమించిన బటాచోర్ లేడంటారు, నిజమేనా?" అని పలకరించాడట. అందుపై టవర్స్ అతి వినయంగా వంగి "దేవరవారు నా ఖ్యాతిని అపహరించడానికి ఇక్కడికి దయచెయ్యలేదు గదా?" అని పల్టీ కొట్టించాడట. విల్క్స్ "గాడ్ సేవ్ ది కింగ్" అని పాడుతుండగా ఈ యువరాజే "అయితే ఎంతకాలంగా పాడుతున్నా వోయి ఈ పాటను ?" అని ప్రశ్నించాడట. ఇందుకు విల్క్స్ జవాబు: "ప్రభువుల వారి పరిచయభాగ్యం అబ్బిన నాటినుంచీ" అని.

అన్నింటిలోకంటె ఎక్కువ లబ్జు చాలా పాతదైన అగస్టస్ చక్రవర్తి కథలోనే వున్నదని చెప్పాలి. ఈ రోమన్ చక్రవర్తి పర్యటనకై బయల్దేరగా అచ్చంగా తననే పోలినవాడొకడుకన్పించాడట. కన్పించడమే తడవుగా చక్రవర్తులకు సహజమైన పరమ అహంకారంతో "మీ అమ్మ ఎన్నడైనా రోం నగరంలో వున్నదట్రా?" అని పృచ్ఛ చేశాడట. చక్రవర్తే కానివ్వండి, అతడి అబ్బే కానివ్వండి, మానం పోయినతర్వాత ప్రాణం దేనికన్న తెగింపుతే ఆ వ్యక్తి "మా అమ్మ రోం నగరాన్ని ఎన్నడూ తొంగైనా చూడలేదుగావి, మా నాన్నమాత్రం అక్కడ చాలాకాలం వున్నా" డని జవాబిచ్చాడట.

అగస్టన్‌కు బుద్ధి చెప్పిన రిపార్టీ దాన్ని విసిరిన సాహసిని కొరతకు పంపిం దేమో మనకు తెలియదు కాని, లార్డ్‌హాలిఫాక్స్ (ఇర్విన్ అవతారంలో ఈయన మన దేశంలో కొంతకాలం బ్రిటిష్ వైస్రాయి) విసిరిన రిపార్టీ ఆయనను కామ న్సుకు పంపగలిగింది. కామన్స్ సభ పూర్తి పేరు "హౌస్ ఆఫ్ కామన్స్" ముక్తసరిగా దాన్ని "హౌస్" అనడం కూడా కద్దు. "హౌస్" అంటే సామా న్యార్థం-ఇల్లు. కామన్సుకు తొలిగా పోటీ చేసినప్పుడు హాలిఫాక్స్ బహు పిన్నవాడు. తెల్లవారితే ఎన్నిక లనగా తన నియోజకవర్గంలో ఆయన కడసారి సభలో ప్రసంగిస్తున్నాడు. అప్పుడు దూరం నుంచి ఎవరోగాని "హౌస్ నుంచి వస్తూ మీ అమ్మకూ చెప్పి వచ్చావా?" అని ప్రశ్నించారు. "ఇంకా తల్లిదండ్రుల చాటున బ్రతకవలసి కుర్రసన్నాసివి నువ్వు" అన్న యెగతాళి ఈ ప్రశ్నలో వున్నదని నేను వివరించనక్కరలే దనుకుంటాను. హఠాత్తుగా తనను ఎగతాళి చేయడం జరిగినా, హాలిఫాక్స్ తెల్లముఖం వెయ్యలేదు. "ఇప్పుడు నేను హౌస్‌నుంచి రావడం మా అమ్మకు తెలియదు గాని, రేపు హౌస్‌లో అడుగు .పెట్టడం మాత్రం తప్పక వింటుంది" అని గడసరి జవా బిచ్చాడు. ఈ జవాబులో మొదటి "హౌస్" యింటికి వర్తించగా, రెండవది కామన్సుకు వర్తిస్తుంది దీన్ని గ్రహించి సభ్యులందరు హర్షించారు. హాలిఫాక్స్‌ను మర్నాటి ఎన్నికలలో గెలిపించారు. అయితే, వారికి రెండు విషయాలు తెలియవు. సభలో హాలిఫాక్స్‌ను యెగతాళి చేసినవాడు వాళ్ళ బట్లర్; అతడు వేసిన ప్రశ్న, దాని కివ్వబడిన ప్రత్యుత్తరం యింటిలో పలు మార్లు రిహార్సల్ జరిగినట్టిది. హాలిఫాక్స్ విషయంలో ఈ యెత్తుపారినా, అందరికీ ఇంత అదృష్టం పట్టకపోవచ్చు. ఆక్స్‌ఫర్డ్ యూనియన్ ప్రెసిడెంట్‌గా వుంటున్న రోజులలో ఫిలప్ గేడలా-చరిత్ర, ముఖ్యంగా జీవితచరిత్ర వ్రాయడంలో ఈయన చేయి తిరిగినవాడు తన మిత్రుడొకనిని సభలో తనకు రెండు అడ్డదిడ్డం ప్రశ్నలు వెయ్యవలసిందిగా నియోగించాడు. మొదటి ప్రశ్నకు గేడలా చెప్పిన జవాబుకు సభ ఘొల్లుమన్నది. రెండవ జవాబుకు ఇంటికప్పే యెగిరిపోయింది. హర్షధ్వనులు కాస్తతగ్గినవో, లేదో, ఆ మిత్రుడికి పురుగు తొలిచి, ఈసారి గంభీరంగా లేచి, ఇలా అడిగాడు:" అయితే , నువ్వు వేయమన్న మూడవ ప్రశ్న ఏమిటి? - గుర్తురావడంలేదు."

*

# ముందిమి

"ఏ ఏరి కోరి వయస్సు మళ్ళినవారినే మీ మంత్రివర్గంలో చేర్చుకొంటు న్నారేమి?" అని ఇండియా ప్రధానిని న్యూఢిల్లీలో పత్రికావిలేఖరులు సూటిప్రశ్న వేశారు. "ఎంత ప్రాయం వస్తే వయస్సు మళ్ళినట్టు?" అని ఎదురుప్రశ్న వేయడానికి వీలున్నా, పండిట్ నెహ్రూ దాన్ని వెయ్యలేదు. అయినా, ఇది మనం ఆలోచించదగిన ప్రశ్నే.

పొద్దు ఎప్పుడు మళ్ళుతుంది? నడినెత్తికి వచ్చినమీదట పడమటికి ఏపాటివా లినా పొద్దు మళ్ళినట్టే. ఇదే విధంగా నడివయస్సు ఏమాత్రం దాటినా వయస్సు మళ్ళినట్టే. అయితే, ఏది నడివయస్సు అనేది ఆయా దేశాలనుబట్టి, ఆయా కాలాలనుబట్టి మారుతూ వుంటుంది. క్రైస్తవ సంప్రదాయం ప్రకారం మానవుడి ఆయుర్దాయం "మూడు ఇరవైలపైన ఒక పది." ఇక, హిందువుల సంప్రదాయం ప్రకారం మానవుడు శతజీవి. వారి దీవనే "శతాయుస్సు అని. ఒకప్పుడు క్రైస్తవదేశాలలో సగటు ఆయుఃపరిమాణం తక్కువై, ఇండియాలో ఎక్కువ కావడంవల్లనే వారికి ఆ సంప్రదాయం ఏర్పడగా, వీరి కిది స్థిరపడి వుండాలి. కాని, ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా తలక్రిందులై పోయాయి. మూడు ఇరవై

లపై పది సంవత్సరాలు మాత్రమేకాక, నాలుగు ఇరవైలపై పదేళ్ళపాటుకూడా యూరప్, అమెరికాలలో ప్రస్తుతం వెక్కుమంది జీవిస్తున్నారు. మన దేశంలో చాలా మందికి నూరులో సగమైనా గడవకముందే నూరేళ్ళు నిండు తున్నవి. సగటు ఆయుర్దాయంలోని ప్రస్తుతపు ఈ భేదంవల్లనే యూరప్, అమెరికాలలో షష్టిపూర్తి తర్వాతకూడా వెక్కుమంది తమకు వయస్సు మళ్ళినట్టే భావిస్తు న్నారు. కాగా, మనదేశంలో నలభైదాటితే చాలు "ఆ! ఇంక మా దేమున్నది! మా రోజులు వెళ్ళిపోయాయి" అని ముసలిముక్కులు ముక్కుతున్న వా రెందరు లేరు? యాభై వెళ్ళి, అరవయ్యోపడిలో పడితేచాలు "కాటికి ఒకకాలు పార జాపి కూర్చున్నాము. ఈ ఘటాలు శాశ్వతాలా!" అని మెట్టవేదాంతం మొద లౌతుంది. అయితే, సిసరో అన్నట్టు, కాటికి రెండు కాళ్ళూ పారజాపినవారికైనా ఇంకొక్క ఏడాది బ్రతక్కపోతామా అనే ఆశ ఏ మూలనో ఒక మూల కొంత దాగేవుంటుంది.

నేటి పాశ్చాత్యదేశాల పరిస్థితులదృష్ట్యాకాక, మనదేశంలోని సగటు పరిమా ణాన్ని బట్టి చూస్తే, మన ప్రధాని ఏరికోరి తన మంత్రివర్గంలో చేర్చుకుం టున్నవారేకాక, ఆయనా వయస్సు మళ్ళినవాడే. అయితే, వయస్సు మళ్ళినంత మాత్రాన బుద్ధి తీక్ష్ణత మందగిస్తుందా? శక్తిసామర్థ్యాలు సన్నగిలిపోగలవా? మరీ వయస్సు పండిన తర్వాత బుద్ధితీక్ష్ణత మందగించడమేకాక, మతిచాంచల్యమే కలగడం కద్దు. శక్తిసామర్థ్యాలు సన్నగిలడమేకాక, అవి చప్పగా ఉడిగిపోయి, కూర్చుంటే లేవలేని స్థితిలో పడిపోవడం కూడా కద్దు. అయితే, ప్రతివారి విష యంలోను ఇది జరగదు. బెర్నార్డ్ షాకు తొంభైదాటిన పిమ్మటనైనా మానసిక పటుత్వం తగ్గలేదు. "హరీ" అనేవరకు ఆయన కొత్తకొత్త రచనలు చేస్తూనే పోయాడు; కొత్తకొత్త చెణుకులు చెణుకుతూనే పోయాడు. కాని, బెర్నార్డ్ షాను పోలినవారు బహు అరుదు. ఏమైనా ప్రస్తుత ప్రసంగవిషయం వయస్సుపండినవారి మాటకాదు; వయస్సు మళ్ళినవారిమాట.

తక్కినవారి నమ్మకం ఏదైనప్పటికీ హిట్లర్ మాత్రం వయస్సు మళ్లితే, బుద్ధి బలం క్షీణిస్తుందని, శక్తిసామర్థ్యాలు సడలిపోగలవని గట్టిగా నమ్మినవాడే. 1939లో యుద్ధప్రారంభానికి అతడు తొందరపడ్డానికి ఆ నమ్మకమే బలీయమైన కారణం. అప్పటి కతని వయస్సు యాభై సంవత్సరాలు. తన లక్ష్యసాధనకు యుద్ధం తప్పదంటే, మరొక అయిదు సంవత్సరాలో, పది సంవత్సరాలో వేచివుండడం కంటే, దాన్ని వెంటనే ప్రారంభించడం వల్ల విజయం పొందగల అవకాశాలు

తనకు ఎక్కువగా వుండగలవని అతడు ఒక సందర్భంలో చెప్పడమూ జరిగింది. అయినా, హిట్లర్‌ను యుద్ధంలో వోడించిన ముగ్గురు ముఖ్యులు స్టాలిన్, చర్చిల్, రూజ్‌వెల్టులు ముగ్గురు-అతని కంటె వయస్సులో పెద్దవారే.

అరవయ్యో పడిలో పడితేనే తన విజయావకాశాలు సన్నగిలి పోగలవని హిట్లర్ భయపడగా తన 83వ ఏట గ్లాడ్‌స్టన్ బ్రిటన్ ప్రధాన మంత్రి పదవిని నిస్సం దేహంగా స్వీకరించాడు. తర్వాత రెండేళ్లకు ఆయన విరమించినా మనస్ఫూర్తిగా కాదు. పదవిని పరిత్యజిస్తూ "అమ్మయ్య! ఎన్నాళ్ల కెన్నాళ్లకు కాస్త విశ్రాంతి" అన్నట్టు ఆయన పోజ్ పెట్టా డనుకోండి. వయస్సు పండిపోయింది, మరి తప్ప కొంటా ననడానికి వోపిక చప్పగా వుడిగిపోలేదట. చెమిటి మేళ మనడానికి, కాస్త బిగ్గరగా మాట్లాడితే ఇంకా మాట వినబడుతూనే వున్నదట. కాగా కంటిచూపు పూర్తిగా మందగించినందునే ఆ వంక చెప్పితాను ప్రజాహిత జీవనంనుంచి తప్ప కోడానికి వీలు చిక్కిందట. ఈ మాటలను గ్లాడ్‌స్టన్ తన డైరీలో వ్రాసుకు న్నాడు. అయినా, కొద్దిరోజులకే ఒక మిత్రుడు "అదృష్టవంతులు - ఇప్పటికైనా కాస్త విశ్రాంతికి నోచుకున్నారు" అనేసరికి "అదృష్టమూ, నా పాడె! మెడపట్టి మన్ను గెంటివేశారు" అని ముసలివాడు కస్సుమన్నాడు! ప్రసిద్ధుడైన మరొక బ్రిటిష్ ప్రధాని పామర్‌స్టన్ కూడా ఈ సందర్భంలో యెన్నదగువాడే. ఆయన మరిపదేళ్లకు పోతాడనగానే ఆయనను గురించి "ఈ ముసలితొక్కు ఇంకా తాను పదహారేళ్ల బాల కుమారుణ్ణి అన్నట్టు నటన చేస్తున్నాడయ్యా!" అనే ధోరణిలో డిజ్‌రేలి మహాకటువుగా విమర్శించాడు. అయినా, జవసత్వాలనుగాని, ధైర్యసాహసా లనుగాని, పేరు ప్రకాస్తులనుగాని కోల్పోకుండా చివరి వరకు గడిపి, యెనభయ్యోయేట ప్రధానిగానే పామర్‌స్టన్ తనువు చాలించాడు. ఆయనపై అక్కసం వెళ్లబోసిన డిజ్‌రేలియే 1878లో "పడుచుతనం పోయిన తర్వాతగాని నాకు పదవి రాలేదు" అని వాపోయాడు. "నేను అడుగుతీసి అడుగు వెడితే సింహాసనాలు, సామ్రాజ్యాలు చలించి పోగలవన్న రోజు లుండేవి. ఇప్పుడవి పోయినవి" అని నిట్టూర్చాడు. చర్చిల్ ఈనాడు వంతు పెట్టుకుంటున్నది డిజ్‌రేలితో కాదు, గ్లాడ్‌స్టన్‌తోను, పామర్‌స్టన్‌తోను, వారితో తనను పోల్చుకునే, ఇంకా యెనభై నిండని తాను తిరిగి ప్రధానమంత్రిని ఎందుకు కారాదని ఆయన ప్రశ్న; కాగలనని ఆయన భరోసా.

పామర్‌స్టన్ విషయంలోవలె మన గాంధీజీ విషయంలో కూడా వయస్సు మళ్ళినా - వృద్ధాప్యమే వచ్చినా - బుద్ధిబలం, కార్యదక్షత తగ్గవలసిన అగత్యం లేనేలేదని, పైపెచ్చు శక్తిదీప్తులు అంతకంతకు పెరగడంకూడా సంభవమని రుజువు

అవుతున్నది. మహాత్ముడు భారత రాజకీయరంగంలో నాయకత్వం స్వీకరించి, సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించింది యాభయ్యోయేట; దానికంటె విస్తృతమైన ఉప్ప సత్యాగ్రహాన్ని నడిపింది అరవయ్యోయేట; తన జీవితంలోనే అపూర్వమైన 'క్విట్ ఇండియా' మహోద్యమాన్ని కొనసాగించింది డెబ్భయ్యోయేట; ఇక, మతవిద్వేష నిర్మూలనకై ఆత్మార్పణచేసి, ఏసుక్రీస్తు, గౌతమబుద్ధుల సరసను స్థానాన్ని పొందింది దాదాపు యెనభై చేకొంటుండగా!

వయస్సు మళ్ళడానికి, మానసికాది పాటవాలకు సంబంధం తక్కువని మహా మహుల జీవితాలు అనేకం నిరూపిస్తున్నా, ప్రతివారి విషయంలోను ఇదే సత్యమ నడానికి వీలులేదు. ఎనభైయేళ్ళు నిండవస్తుండగా కొత్తకొత్త ఫక్కీలలో కవిత్వం వ్రాయడం ఏ ఒక్క టాగోర్‌కో చెల్లింది; ఎనభైయేళ్ళు నిండిన వెనక కొత్తభాషను నేర్చుకోడానికి ఉద్యమించడం ఏ ఒక్క క్యాటోకో (ఈయన క్రీస్తుకు పూర్వం రెండు శతాబ్దాలనాటి రోమన్ రాజకీయవేత్త) చెల్లింది. తక్కిన సామాన్యుల విషయంలో "అరవైయేండ్లయినవి; చదువుకోకుండా మొత్తుకుంటానా?" అనే సామెతలోని ఎత్తి పొడుపు అక్షరాలా నిజమే అవుతుంది.

వయస్సు మీరినకొద్దీ తెలివిమీరేవారు కొందరు కాగా, ఒక వయస్సు వచ్చేసరికి గిడసపారేవారు కొందరు. ఒక్కొక్క యేడు పైబడినకొద్దీ కళలు తగ్గేవారు కొంద రుంటారు. ప్రాయంలో పెద్దతనాన్నిబట్టి బుద్ధిలో పెద్ద అని విధిగా అనుకోడానికి వీలులేదు. ఇక, ప్రాయంలో పిన్నతనాన్నిబట్టి బుద్ధికికూడా తప్పనిసరిగా బుడత అనుకోవడమూ పొరపాటే. కౌరవసభలో ద్రౌపదిని ఘోరావమానానికి పాల్పడజే స్తుండగా కురువృద్ధులు సయితం చూపలేకపోయిన ధర్మజిజ్ఞాసను, న్యాయపక్షపా తాన్ని పసివాడు వికర్ణుడు చూపగలిగాడు. "ఎవ్వరుం బలుకకున్న నే నిందు ధర్మనిర్ణయంబు నేసెద" అని అతడు ధైర్యంగా ఆ నిండోలగంలో నిలబడ్డాడు. "జూదంబును, వేటయు, బానంబును, బహుభక్షణాసక్తియు ననుు నాలుగు దుర్వ్య సనం బులం దగిలిన పురుషుడు ధర్మవుం దప్పి వర్తిల్లు; నట్టివాని కృత్యంబులు సేకొనందగవు. కితవాహూతుండై, వ్యసనవర్తియయి, పరాజితుండయిన పాండ వాగ్రజుండు పాండవుల కందఱకు సాధారణ ధనం బయిన పాంచాలి బణంబు జేసెం గావున, ద్రౌపది యధర్మవిజిత. అక్కొమలి, యేకవస్త్ర, నిట దొడ్కొని తెచ్చుట యన్యాయంబు" అని కేవలం ధర్మదేవతవలె తెగవేసి చెప్పాడు. పెద్దలే మిన్నకుండగా పిన్నవాడు ఇంత నిర్భీకంగా ధర్మనిర్ణయం చేయడానికి కినిసి, "ఎల్ల వారు నెఱుగ నొల్లని ధర్ముంవు బేల నీకు జెప్పనేల వలసె ? జిరుతవాని కింత

తఱుసంటిపలుకులు సన్నె వృద్ధజనము లున్నచోట! " అని కర్ణుడు తన కొమరుని మందలించి వుండవచ్చు. తండ్రిచే ఈ విధంగా తిరస్కృతుడైనా వికర్ణుడు కలకాలానికి జనవంద్యుడే అయినాడు. ఇంతకీ చెప్పవచ్చిందదొక్కటే. వయఃపరిమితికీ, బుద్ధిపరిణతికీ స్థిరమైన సంబంధ మేమీ లేదు.

అయితే, ఒక్కొక్క వయస్సులో ఒక్కొక్క రంగంలో విశేషంగా రాణించడానికి విశేషావకాశాలు కలవని చెప్పవచ్చునేమో! ఉదాహరణకు, ఈడు ముదిరిన తర్వాత కవిగా రాణించడం కష్టం. యౌవనం గడిచిన పిమ్మట కవిత్వాన్ని చెప్పనారంభించి, కీర్తి కెక్కినవారు మచ్చుకైనా లే రనడానికి వీలులే దనుకోండి, కాని, ప్రసిద్ధకవులలో పెక్కుమంది కవితను నవయౌవనంలో ప్రారంభించినవారే. వీరిలో కొందరు బాల్యంలోనే కవితా ధోరణిలో పడ్డారు. పోప్ తాను చిట్టిపొట్టి మాటలతో పాటే పద్యాలల్లడం ప్రారంభించినట్టు చెప్పకున్నాడు, రవీంద్రనాథ్‌టాగోర్ కూడా అయిదవ యేటనో, ఆరవ యేటనో తన తొలిపద్యాన్ని వ్రాశాడట. బడిపంతు లిచ్చిన లెక్కలను చెయ్యలేక గిజగిజ తన్నుకుంటూ, వాటిని ఒక పక్కకు నెట్టివేసి, కొన్నివందల పంక్తుల పద్యాన్ని శ్రీమతి సరోజినీదేవి అల్లిందట. పూర్వాంధ్ర కవులలో శ్రీనాథుడు "చిన్నారి పొన్నారి చిఱుతకూకటినాడు రచియించితిని మరుత్తరాట్ చరిత్ర" అనీ, "నూనూగు మీసాల నూత్నయౌవనమున శాలివాహన సప్తశతి నొడివితి" అనీ చెప్పకున్నాడు. ఇప్పుడేమి, ఇదివఱలో నేమి, ఇకముందేమి బాలకవుల సంఖ్య అధికమే. బాలకవులమని చెప్పకునేవారందరు "బాలా కుమారులు" కా రనుకోండి. వారిలో కొందరు గడ్డాలవారు, మీసాలువారు వుంటా రనుకోండి. అయినా, కవిత్వం వెల్లుబకడం సర్వసాధారణంగా బాల్యంలో జరుగుతుంది కనుకనే, బాలకవుల సంఖ్య విస్తారమని మాత్రం అంగీకరించాలి.

షెల్లీ, కీట్స్, బైరన్: ఈ ముగ్గురు ఇంగ్లీషు కవిశేఖరులు నలభైయేండ్ల లోపునే చిరకీర్తిని గడించడం, కథావశేషులు కావడం - అంతా జరిగిపోయింది. మరీ కీట్స్ ముప్పైనిండకముందే మృత్యుముఖాన పడిపోయాడు.

ముప్పైకి ముందుగా కవి కానివాడు ఆ తర్వాత కవి కావడం నూటికో, కోటికో తప్ప కానరానట్టే ముప్పైకిముందు నాటకకర్తలుగా రాణించిన వారు కూడా బహుఅరుదు. కవితారాధనకు హృదయనైర్మల్యం, కోమలత్వం, ఉద్విగ్నత మొదలైన లక్షణాలు కావాలి. ఇక, నాటక రచనకు విశేషంగా కావలసినట్టిది లోకానుభవం. కనీసం ముప్పైసంవత్సరాలైనా గడవనిదే జీవితాన్ని తిన్నగా చవిచూడ్డమేమి, లోకం పోకడలను గ్రహించడమేమి సామాన్యంగా జరగదు. ప్రపంచ ప్రసిద్ధులైన

నాటక కర్తల జీవితాలను పరిశీలించగా వారు ముప్పై నిండకముందే నాటక రచనకు ఒకవేళ దొరకొన్నా ముప్పైనిండిన తర్వాతనేకాని రాణింపుకు రానట్టు కానవస్తుంది. నిర్ధారణగా చెప్పడానికి ఆధారాలు లేకపోయినా, షేక్స్‌పియర్ నాటకరచనకు తొలి ప్రయత్నాలను చేసింది ఇరవైయేడవ యేడు చేకొనబోతుండగా, కాని నాటకరచనలో ఆయనకు కొంత చెయ్యితిరిగింది ముప్పై ప్రవేశించిన వెనకనే, "హామ్లెట్," "ఒథెల్లో", "మెక్బెత్" మొదలైన తన మహానాటకాలను - విషాదాంత నాటకాలను ఆయన వ్రాయగలిగింది నలభై ప్రాంతాలలోనే. ఇక ప్రౌఢిమకు, పరిపక్వతకు, గాంభీర్యానికి, లాలిత్యానికి ఆయన నాటకాలలో ప్రత్యేకంగా యెన్నవలసిన "టెంపెస్ట్" రచన జరిగింది ఆయన యాభై పద్దును చేరుతుండగా, గ్రీక్ నాటకకర్తల జీవితాలలో కూడా మొత్తంపై ఈ ఫక్కీయే కనబడుతుంది. నాటకకర్త కాగలిగేసరికి ఈస్కిలస్ వయస్సు దాదాపు ముప్పై సంవత్సరాలు. ఆయన నాటకాలలో అతి ప్రసిద్ధిమైనదాని రచన షష్టి పూర్తి చేసుకొననున్న సమయంలో, సాఫోక్లిజ్ పాతికేళ్ళ ఈడుకే తొలినాటకం వ్రాసినా, నాటకకర్తల పోటీలో యురిపిడేజ్‌ను ఓడించగలిగింది తనకు యాభై యెనిమిదవ యేడు జొరబడిన పిమ్మటనే. యురిపిడేజ్ కూడా పాతికేళ్ళకు మొదటి నాటకం వ్రాసినవాడు. అయితే, సమకాలికులలో ఔ ననిపించుకోడానికి మరొక పదిహేను సంవత్సరాలు వేచివుండవలసివచ్చింది. ఆయన తన చిట్టచివరి నాటకం వ్రాసింది డెబ్భైనాల్గవయేట. నవయౌవనం లోనే నాటకకర్తగా జీవితాన్ని ప్రారంభించినా, ఆరిస్టొఫానీజ్ లోకం మెప్పు పొందగలిగింది ముప్పైయేండ్లు నిండిన వెనకనే. ఇక, ప్రపంచప్రసిద్ధ ఫ్రెంచి నాటకకర్త మొల్‌యేర్ రాణలోకి వచ్చింది ముప్పైయేడవయేట. ఇబ్సెన్ తొలినాటకం వెలువడింది ఆయన ఇరవై యెనిమిదవయేట. బెర్నార్డ్‌షా ఓం ప్రథమంగా నాటకం వ్రాయడం ముప్పై అయిదవ యేట. ఇలాగే మరెంద రెందరి వృత్తాంతాలనో చెప్పవచ్చుగాని, మరిఇట్టి దృష్టాంతాలతో పనిలేదు. ప్రసిద్ధ నాటకకర్తలలో బాల్యంలోనే యెన్నదగు రచనలు కొనసాగించిన వారు షిలెర్‌వలె ఏ వొక్కరో, యిద్దరో!

వయస్సు ముదిరితే తప్ప, లోకానుభవంలో పండితే తప్ప, నాటకరచనలో రాణించడం దుస్తరమనేది మన పూర్వులు స్పష్టంగా గుర్తించిన విషయమే. "నాటకాన్తాం కవిత్వమ్" అని, 'నాటకాన్తాం హి సాహిత్యమ్' అని వారు ప్రకటించిన సూత్రాల సారాంశమిదే. మన మహానాటకకర్త కాళిదాసు ముందు కవిగా భాసించి, ఆ పిమ్మటనే నాటకకర్తగా అమరుడైనట్టు తోస్తుంది.

నాటకకర్తగా రాణించడానికి ముప్పై దాటాలంటే, రాజకీయవేత్తగా నెగ్గుకు రావడానికి నలభైనిండక తప్పదేమో! నలభైదాటిన తర్వాత ప్రతివాడు "స్కౌండ్రల్" అని బెర్నార్డ్ షా చెప్పాడు. "స్కౌండ్రల్" కానిదే రాజకీయవేత్తగా రాణించడం ఔను:- నిజంగా చాలా కష్టమే. పిన్నవయస్సులోనే రాజకీయవేత్తగా విఖ్యాతి నందిన వాడు ఇరవై నాల్గవయేట బ్రిటిష్ ప్రధాని కాగలిగిన యంగర్ పిట్ తప్ప మరెవ్వరు లేరేమో!

*

# పేరు, పెన్నిధి

"పే
రులో ఏమి పెన్నిధి వున్నదా?" అని ప్రశ్నించాడు షేక్స్‌పియర్. ఏ పేరు పెట్టి పిలిచినా గులాబి గుబాళించే పరిమళమాధ్యుర్యం తగ్గదు పొమ్మన్నాడు; షేక్స్ పియర్ భక్తుడైన మిస్టర్ గిరీశం ఇందుకు "డిటో" అన్నాడు. గిరీశం దృష్టిలో ఆదర్శ పురుషులిద్దరే. సారస్వతానికి సంబంధించినంతవరకు షేక్స్‌పియర్; రాజకీయాల ప్రసక్తివచ్చేసరికి సురేంద్రనాథ్ బానర్జి. శిష్యుడు వెంక టేశాన్ని ఆప్యాయంగా పిలవాలంటే అతడినోట చప్పనవచ్చే ముక్క: "మైడియర్ షేక్స్‌పియర్". శిష్యుని గొప్ప వాడిని చేస్తానన్నప్పుడు గొప్పకు ఆఖరిమెట్టు: సురేంద్రనాథ్. అయితే, మొత్తంపై తన సాహిత్యాచార్యునిపై కంటె, రాజకీయ గురువుపైనే గౌరవం మెండు. రాజకీయాధి కారంలేని సోషల్ రిఫారమ్ తాడులేని బొంగరం కాగలదన్న నమ్మకమే సోషల్ రిఫార్మర్ మిస్టర్ యన్. గిరీశానికి రాజకీయవేత్తపట్ల అధిక భక్తిప్రపత్తులుండడానికి కారణం కావచ్చు. దీనికేమిగాని, పేరులో పెన్నిధి లేదని షేక్స్‌పియర్ కంటె గట్టిగా బల్లగుద్ది గిరీశం వాదించాడు. "టు మ్యారీ యె విడో, ఆర్ నాట్ టు మ్యారీ, దటీజ్ ది క్వశ్చన్" అంటూ షేక్స్‌పియర్ పడిన అవస్థలో పడి, "తొందరపడి హోజీసాహెబ్ తురకల్లో

కలిసిపోయాడన్నట్టు, నావంటి బుద్ధిమంతుడు యేపనీ తొందరపడి చయ్యకూడదు. దాని లాభనష్టాలు బేరీజూవేసి, జమాఖర్చులు వేసుకుని మరీ డిసై ్యాలి" అనే నిర్ణయానికి వచ్చిన పిమ్మట అతడు తేల్చిన తథ్య మిది: ్ోఅంటే ఏమిటి? ఓ పేరు. ఆ పేరు మనిషి మొహంమ్మీద రాశుందా? మనిషిని ముస్తాబుచేసి యదట నిలబడితే, యిది పునిస్త్రీ, యిది విడో అని చెప్పదగిన పెద్దమనిషి యవడు? ఒహడూ లేడు గనక. విడో అనే, వస్తువు యక్కడుం దయా? వెక్కిరించే వెధవల నోట్లో వుంది." "విడో" అన్న మాటకు విలువ నివ్వ నక్కరలేదని ఇంత గుమ్మైన వాదం చేసిన గిరీశం "వెక్కిరించే వెధవలు" అనే తిట్టు తిట్టి పుటిక్కిన పప్పులో కాలువేశాడు.

పేరేదైనా అయ్యేదీ, పొయ్యేదీ లేదని చెప్పే వా రందరు నా దృష్టిలో పొరబడుతున్నవారే. ఇతరులమాట చెప్పలేను గాని గులాబిని మరొక పేరుపెట్టి పిలిస్తే, దాని గుబాళింపు నాకు తగ్గితీరుతుంది. గులాబి నెత్తావిలోని మెత్తదనం "గులాబి" అనే మాటలోకూడా వున్నది. పెద్దమార్పుతో పనిలేదు- 'గు' ను కాస్త వొత్తి 'ఘులాబి' అనండి, లేదా 'లా' లాలిత్యాన్ని ఖూనీ చేసి, "గుళాబి" అనండి; కాదా, "బి" ని పరుషం చేసి, "గులాభి" అనండి. వెంటనే వొళ్ళు జలదరింపదూ? ఈ అపభ్రంశా లన్నింటిని జతచేర్చి "ఘుళాభి" అనండి. - పైప్రాణం పైనే పోదూ? ఇందువల్ల "గులాబిని మరొక పేరుపెట్టి పిలిస్తే..." అనే సమస్య ఉత్పన్నమే కాదు, ఆ పువ్వుకు ఆ పేరే తగు; ఆ పేరుకు ఆ పువ్వే తగు; అది మనకు విలాయితీ పువ్వు. 'గులాబి' కి పర్షన్‌రూపం "గుల్‌ఆబ్". కొత్తపువ్వు గదా అని మనం దానికి కొత్తపేరు తగలించివుంటే, అతుకు అతుకుగానే వుండేది. కాబట్టి, అసలుమాటనుమరికాస్త సాధువు చేసుకొని "గులాబి" అన్నాము. గులాబికి ఇతర భాషలలో ఇతరపేర్లు వున్నాయనుకోండి.. కాని, అవికూడా ఇంగ్లీషుపేరు "రోజ్" వలె రమ్యమైన పేర్లే కాగల వనడంలో నా కెట్టి సందేహం లేదు.

షేక్స్‌పియర్ చెప్ప నివ్వండి, ఆయనకంటె ఘనుడే చెప్ప నివ్వండి, ఏ పేరైనా ఒక్కటే అనడం అర్థంలేని మాట. వ్యక్తిత్వానికి పేరు ఒక్కటే పునాది కాకపోవచ్చుగాని, అదికూడా ఒక పునాది. సంఘం నుంచి వ్యక్తిని వేరు చేసేది పేరే. వ్యక్తిత్వం మోసు లెత్త నారంభించగానే, అప్పటికి వాడికి మన మొక పేరు పెట్టి వుండకపోతే, పసివాడు తనకు తానై నామకరణం చేసుకుంటాడు. "నీ పే రేమిటిరా, అబ్బాయ్?" అని ముద్దుకొద్ది పలకరిస్తే, 'బాబు', 'బుజ్జి'

'సిన్ని' -ఇలాంటి పేరేదో సగర్వంగా చెప్పకుంటాడు, తర్వాత వాడి కే పేరు పెట్టినా స్వజనానికి సంబంధించినంత వరకు తనకుతానై పెట్టుకున్న తొలిపేరే చెల్లుబాటు కావడంకూడా కద్దు. నేనై పెట్టుకున్నదో, కాదో చెప్పలేను గాని, నా పసితనం పేరు "పాప". ఇప్పటికీ ఆప్త బంధుమిత్రులకు నేను "పాప" నే. పరాకుగా "పాప" అనే పిలుపువింటే నన్నేమోనని ఈ నాటికీ వెనక్కి తిరిగి చూస్తూంటాను. వ్యక్తిత్వం మారాకైనా తొడగక ముందే పేరుతో ఇంతగా పనిపడగా, ఆ తర్వాత తర్వాత అది బ్రతుకుపై ఎంతో ప్రాధాన్యం వహించడం అబ్బురం కాదు.

"పేరు బలం" అనేది ఉత్తమాట కాదు. ఒక్కొక్క పేరు మహాబలం కలదై వుంటుంది. విష్వక్సేనుడు, ధృష్టద్యుమ్నుడు, ధృతరాష్ట్రుడు-ఇట్టిపేర్లు బలమైనవని బడిపంతుళ్ల వెర్రి నమ్మకం. డిక్టేషన్ వ్రాసే బుడతలపై నీటినే వారు బ్రహ్మాస్త్రాలుగా సంధిస్తారు. ఇతరుల కొందరు పేరు ఎంత పొడుగుపాటిదైతే అది అంత బలమైంది కాగలదని భ్రమపడతారు. నా చిన్నతనపు సహాధ్యాయాయులలో ఒకని పేరు-వెంకట వేణు గోపాలకృష్ణ దుర్గా నాగేశ్వర హరి నారాయణ ప్రసాద రావు. మా కంఠనాళాలకు ముప్పుకలుగుతుందేమో నన్న భయంతో అతని పేరును మేము 'ప్రసాద్' అనే మూడక్షరాల మాటకు సంగ్రహ పరిచాము. పేరులోని బలం సంఖ్యాశాస్త్రంపైన, జ్యోతిషసూత్రాలపైన ఆధారపడేదికూడా కాదు. అయితే, దాని బలం ఎక్కడున్నదంటే నిర్ధారణగా చెప్పలేము. కాని, ఒక్కమాట మాత్రం చెప్పవుచ్చు. లెనిన్ అసలుపేరు-వ్లాడమిర్ ఇలియిచ్ యుల్‌యనాఫ్. ఈ పేరుతో ఆయన జగత్ప్రసిద్ధ పురుషుడు కాగలిగే వాడని నే ననుకోను. ఎంత కొట్టుమిట్టాడినా లెనిన్ పదవిలోకి జోసెఫ్ విస్సారి యొనోవిచ్ డిజుగష్‌విలి రాగ లిగేవాడు. కాడు; అమ్మా బాబూ పెట్టిన ఈ లోరుతిఇరగని పేరును స్టాలిన్‌గా మార్చుకున్నందునే లెనిన్ సరసను ఆయన స్థానం సంపాదించుకోగలిగాడు. షికెల్ గ్రబర్ కావలసిన యోగం కొద్దిలో తప్పినందునే హిట్లర్ చిచ్చరపిడుగు కాగలిగాడు. గాంధిగా బూపూజీ మన హృదాయాలపై రాజ్యం చేసినంతగా మోహన్‌దాస్‌గా చెయ్యగలిగేవాడు కాదేమో! అయితే, దీని తాత్పర్యం పొట్టిపేర్లలో ఏదో మహత్తు కలదని కాదు. పొట్టివాడి కడుపులో పుట్టెడు బుద్ధు లుండవచ్చునేమో కాని, పొట్టిపేరులో పుట్టెడు ఖ్యాతిలేదు. రంగడు, సింగడు వగైరా, పొట్టిపేర్లవారెందరు లేరు?

పొట్టివల్లనే పేరుకు బలం రాదుగాని, ప్రసిద్ధనామాలు సర్వసాధారణంగా

పొట్టివి కావడం మాత్రం గమనార్హం. అసలు పేరు పొడుగుపాటిదైనా దాన్ని లోకం పొట్టిచేసి వెయ్యడం తరచు జరుగుతూవుంటుంది. డేవిడ్ లాయడ్ జార్జి "యల్.యల్. జి." అయిపోయాడు; ఏమన్ డెవాలరా డేవ్ అయిపోయాడు. విన్‌స్టన్ స్పెన్సర్ చర్చిల్‌లో స్పెన్సర్ యెగిరిపోయి, విన్‌స్టన్ చర్చిల్ మిగిలింది. జార్జి బెర్నార్డ్ షా "జార్జి" అనే ముక్కపట్ల వెగటుకొద్దీ దాన్ని తనకు తానై కత్తిరించుకున్నాడు. కాని వెంటనే మరొక విషయాన్నికూడా జ్ఞప్తికి తెచ్చుకోవాలి. అక్కసం వెళ్ళబోసుకోవాలన్నా, అల్లరి పెట్టాలన్నా పేరును పొట్టిచేయడంకూడా కద్దు. నాగభూషణంపై కడుపుమంట తీర్చుకోవలంటే, అతడు "నాగ్గాడు" అయి పోతాడు; వీరభద్రరావును అల్లరి పెట్టాలంటే, అతడు "వీరాయ్" అయిపోతాడు.

ఇంతకీ తేలింది - ఎందువల్ల పేరుకు బలం వస్తుందో మనకు కచ్చితంగా తెలియదని. అయినా, పేరుకు బల మనేది వున్న దనడం ఖాయం. అయినా, సంతానానికి నామకరణంలో – అసలే శ్రద్ధ తీసుకో రననుగాని – దూరాలోచన చెయ్యరు. సర్వసాధారణంగా పితామహుని పేరునో, మాతామహుని పేరునో కాలానికి తగినట్టు కొంత సంస్కరణ చేసి తగిలించివేస్తారు. తాత శేషయ్య అయితే, మనమడు శేషగిరిరావు; ఆయన గంగయ్య అయితే, వీడు గంగాధర రావు. (మా తాత వెంకయ్య కాబట్టే నేను వెంకటేశ్వరరావును అయ్యాను.) ఆడపిల్లల విషయంలోనూ ఇంతే జరుగుతుంది. అమ్మమ్మ అచ్చమ్మ, మనమరాలు వద్దకు వచ్చేసరికి అచ్చమాంబగా నవరూపం ధరిస్తుంది; నాయనమ్మ కమలమ్మ, మనమరాలు కమలాకుమారిగా కొత్త అవతార మెత్తుతుంది. పూర్వీకుల పేర్లను కాకపోతే వారు కలలో కనబడ్డారనో, వీరు సోదెలోకి వచ్చారనో ఏవో పేర్లను పెడ తారు. లేకపోతే, తాము మొక్కుకున్న ఇలవేల్పుల పేర్లు పెడతారు. కొందరైతే నామకరణంలో కేవలం ఏదో ఒక పరమ మూఢవిశ్వాసాన్నే ఊతగొంటారు.

కడుపున పుట్టిన బిడ్డలు బ్రతకకుండా పోతుంటే, కొత్తగా కలిగినవాడికి చెడ్డ పేరు పెట్టుకోవాలనేది ఒకమూఢవిశ్వాసం. దానిప్రకారం "అబద్దాలు" అని పేరు పెట్టారనుకోండి. తనపేరే అబద్దాలుకాని, తానుఅబద్దాలకోరునుకానని లోకాన్ని నమ్మించడానికి అతడెన్నితంటాలు పడాలి! మాటలో ఏకాస్త తబాబు వచ్చినా "వాడిపేరే అబద్దాలుకాదూ!"అని అతడిని నిరసించడం ఎంతతేలిక! "అబద్దాలూ! నిజంచెప్పరా!" అంటూ తుంటరివాళ్లు అతడిని లాగూచొక్కాల ఈడునుంచీ వుడి కలించరా? "అబద్దా"లనే కాక, అంతకంటే అధ్వాన్నపు పేరు "పెంటయ్య" అన్నికూడాపెట్టడంకద్దు.బిడ్డకుపుట్టినవెంటనే ముఖానికింతపెంటపులిమి, బ్రతికినంత

కాలం నువ్వు పెంటముఖంతోనే బ్రతకమని చెప్పడం తప్ప ఇది మరొకటి కాదు. జన్మతోనే ఒకసారి ఇలాంటి కఠినశిక్ష వేసిన తర్వాత ఎంత గింజుకున్నా ఆ వ్యక్తి మరిదానినుంచి తప్పించుకు బయటపడ్డం కష్టం. అయిదో, పదో తాలూకా ఆఫీసులో ముడుపు కట్టుకుని, కావాలంటే పేరు మార్పించుకోవచ్చు ననుకోండి. అయినా, "పిల్లపోయినా పురిటికంపు పోలే" దన్నట్టు పాతదాని వాసన వెన్నం టుతూనే వుంటుంది. చిలుం వదిలించుకుని అబద్ధాలు ఏ రామయ్యో అయ్యా డనుకోండి. తర్వాత అతడి పరిచయస్థులందరు అతడిని "అబద్ధాల రామయ్య" అనడం ప్రారంభిస్తారు. పెంటయ్య ఇలాగే ఏ సీతయ్య అవతారమో యెత్తగో రితే, అతడు "పెంట సీతయ్య"గా పరిణమిస్తాడు. (ఈ చివరిమాట వర్ణక్రమాన్ని కొద్దిగా మార్చి 'పరిమళిస్తాడు' అనాలంటే నాకు అభ్యంతరం లేదు.)

హీనపు పేరు బ్రతుకును వెక్కిరించగా, ఘనపు పేరు దాన్ని క్రుంగదీస్తుంది. "నిజ మాడితే నిష్మరం" కనుక, లేనిపోని చిక్కులు కొనితెచ్చుకోరా దంటే, అంద రితో పాటు హరిశ్చంద్ర నామధేయుడుకూడా తెల్లారి లేస్తే, ఏదో చిన్నబొల్లు, పెద్దబొల్లు ఆడక తప్పదు. ఆడింది అబద్ధమని బయటపడితే మాత్రం తక్కినవా రికి అంటే అనృత దోషానికి పదిరెట్లు హరిశ్చంద్ర నామధేయునికి అంటుతుంది. ఇతరు లెవరైనా పిరికికండ చూపితే, అది వారి పుటకతీరు; భీమన్న భయస్థుడైతే మాత్రం అది నవ్వుటాల విషయం. అన్య లన్యాయం చేస్తే అది తప్ప; దాన్నే ధర్మన్న చేస్తే అది తప్పన్నర.

ఘనమైన పేరు పెట్టడంలోని ఈ ప్రమాదాన్ని కానకపోవడం వల్లనే రామ మోహనరాయ్, దయానంద, వివేకనంద, తిలక్‌ల ప్రభ వెలిగిపోతున్న రోజులలో చాలామంది రామమోహన్‌లు, దయానందులు, వివేకానందులు తిలక్‌లు వెలిశారు; ఇప్పుడు గాంధులు, సుభాస్‌లు, జవహరులు వెలుస్తున్నారు. అన్యరాష్ట్రాలవా రైనా, స్వజాతీయులు కాబట్టి ఈ నాయకులపేర్లు అతకనైనా అతుకుతాయి. కాని, తమకు గౌరవభాజను లైనవా రన్న కారణంచేత, ఎంతమాత్రం అత కని విజాతీయప్రముఖుల పేర్లను పెట్టడం కూడా - అరుదుగానే అనుకోండి - జరుగుతూ వుంటుంది. ఎ.ఒ.హ్యూమ్‌పట్ల భక్తిఫలితంగా వచ్చిన ఇట్టి ఒక పేరు "హ్యూంశాస్త్రి"; జిల్లా జడ్జి మిస్టర్ రాన్‌పట్ల ప్రేమాభిమానాలవల్ల వచ్చిన ఇట్టి మరొకపేరు వెంకట శివరామరావ్.

మోక్షసాధనకు సూక్ష్మోపాయంగా నామకరణ మహోత్సవాన్ని సాగించడమూ కద్దు. భగవంతుని తలుచుకున్నా, తలుచుకొనక పోయినా, బిడ్డలకు దేవుళ్ల

పేర్లు పెట్టుకొని, వారిని ఆ పేర్లతో పిలుస్తుంటే, అలా పిలిచిన ప్రతిసారీ మన ఖాతాకు స్వర్గంలో కొంత పుణ్యం జమపడుతూ వుంటుందట. ఒక పరమ పాపిష్టిని యమలోకానికి బడబడ లాక్కుపోవడానికి యమదూతలు రాగా, బొడ్డులోని తాళపుచెవుల గుత్తిని అప్పగింత పెట్టడానికి 'నారాయణా!' అంటూ అతడు కొడుకును పిలిచాడట. అంతట విష్ణుదూతలు పరుగు పరుగున వచ్చి, యమభటులతో బాహాబాహి, ముష్టాముష్టి, హోరాహోరి యుద్ధం చేసి, అతడిని సరాసరి స్వర్గానికి తీసుకువెళ్ళారట, ఇట్టి మూఢనమ్మకాలతోటే దేశం తగలబడి పోతున్నదని చిత్తశుద్ధి పూర్వకంగా నమ్ముతున్న ఒక నాస్తికవాద నాయకుడు తన సంతానానికి "లవణం", "సమరం", "మైత్రి" మొదలైన పేర్లు పెట్టుకున్నాడు. "అయితే పప్పు, బియ్యం, మంచం, కంచం, ఇల్లు, వాకిలి మనకు పేర్లు ఎందుకు కారాదు?" అని ఆయనను చాటున వెక్కిరించే వారున్నారు. నిజమే, ఎందుకు పెట్టుకోరాదు? పెట్టుకుంటూనే వున్నాము కూడా. బియ్యం ఒక మనిషి పేరు కాకపోయినా, దానితో వండే అన్నం ఒకపేరే. మనకొక అన్నమయ్య లేడా? ఇక్కడ నే నుద్దేశిస్తున్నది ప్రఖ్యాతపదకర్త తాళ్లపాక అన్నమాచార్యులను, మంచం ఒక మనిషి పేరు కాదు గాని, ఇల్లు ఒక పేరే. అయితే ఇటుక, అడుసుతో కట్టిన యిల్లు కాదనుకోండి; పుణ్యాత్ములైనవారికి శాశ్వత నివాసంగా చెప్పబడే యిల్లు వైకుంఠం దానిపై వచ్చినపేరే వైకుంఠరావు. "లవణం" వెక్కిరింత పేరు కావడానికి "లావణ్యవతి" ఉప్పునుంచి వచ్చిన పేరే కాదా? తిక్కే మనకు పూజనీయమైన పేరు ('తిక్కన' రూపంలో) కాగా, "మైత్రి" ఎందుకు కాగూడదు? అయితే, వైన చెప్పిన నాస్తికవాదనాయకుని చర్యను సమర్థించడం ఇక్కడ నా పని కాదు. ఆయన పెట్టిన పేర్లు విడ్డూరమైనవైతే, ఆయనను చాటుమాటున వెక్కిరించేవారి పేర్లలోనూ విడ్డూరం లేకపోలేదని చూపించడమే నా వుద్దేశం.

ఈ విధంగా అన్ని రకాలపేర్లలోనూ ఏవో తప్పు లెన్నితే, ఇక ఏవి సరైన పేర్లంటే నేను చెప్పగిలింది లేదు. నా బిడ్డల పేర్ల విషయంలో నేను ఎంతకీ ఒక నిర్ణయానికి రాలేకపోయినందునే నా బంధుమిత్రులు వాళ్ళకు నామకరణం చేశారు. బాగా ఊహ వచ్చిన తర్వాత వాళ్ళు తమ పేర్లను తామే నిర్ణయించి పెట్టుకొని వుంటే నేను ఎక్కువ సంతోషించేవాడినేమో! ఈనాటి మాట తెలియదుగాని, ఇదివరలో సోవియట్ రష్యాలో తల్లిదండ్రులు పెట్టినపేరు బిడ్డకు ఊహ తెలిసేవరకే. ఆ తర్వాత ఆ చిన్నది, లేదా చిన్నవాడు, తను కోరిన పేరు పెట్టుకోవచ్చు. మలయాలో అనుకుంటాను, నన్ను పోలిన ఒక గృహస్థు తన

బిడ్డలను వారు స్వయంగా నామకరణం చేసుకునే వరకు నంబర్ 1, నంబర్2, నంబర్3 - ఈ వరసను పిలవా లనుకున్నాడటగాని, ఆడవాళ్ళు అతడి ఆలోచన సాగనివ్వలేదట.

ఏమైనా, నామకరణ సందర్భంలో పీలైనంతవరకు అది సార్థకనామధేయం కావడానికి ప్రయత్నించాలి. అనాకారికి సుందరరావు అని పేరు పెట్టినా, స్థూల శరీరునికి లలితకుమార్ అని పేరు పెట్టినా, జాలిగుండె వంశంలోనే లేనప్పుడు కరుణాకరమూర్తి అని పేరు పెట్టినా, అది ఇట్టే పట్టిచ్చి వేస్తుంది. కుటుంబంలో చదువుసంధ్యలు శూన్యమైనప్పుడు కమలం, సుబ్రహ్మణ్యం - ఇట్టి పేర్లు పెడితే, అవి "కవళం"గా, "చుబ్రమన్యం"గా అపభ్రంశం కావడం తప్పదు. పేరుకు, ప్రవృత్తికి మధ్య, లేదా పేరుకు, రూపానికిమధ్య, లేదా పేరుకు, పరిస్థితులకు మధ్య కానవచ్చే వైరుధ్యం వింతగానో, వినోదంగానో, విడ్డూరంగానో తోస్తుంది. 'పేరుగొప్ప ఊరుదిబ్బ', 'పేరు గంగానమ్మ, తాగబోతే నీళ్లులేవు', 'పేరు పల్ల కీమీద, కాలు నేలమీద' 'ఇంటిపేరు కస్తూరివారు, ఇంటిలో గబ్బిలాలవాసన' - ఇత్యాది సామెతలు పుట్టడానికి కారణ మిదే. ఈ బాపతు ఒక సామెత హిందీవారికీ వున్నది. అమర్‌నాథ్ మర్‌గయా, లక్ష్మిగోబర్ బేచ్ తీ, ధన్‌పాల్ భీఖ్ మాంగ్ తాహై. దీని అర్థమిది; అమరనాథుడు మరణించాడు, లక్ష్మి పేడ అమ్ముకుంటున్నది, ధనపాలుడు తిరిప మెత్తుకొంటున్నాడు. అయితే, ఇంత వర కిది పూర్వార్ధం మాత్రమే. ఉత్తరార్ధం 'మేరానామ్ తంతన్‌పాల్' అని, అంటే నా పేరు "తంతన్‌పాల్", ఇంత చెప్పిన తర్వాత చివరికి ముక్తాయింపు "బేచారా!" ("పాపం!") అని. పాపమనడం ఎందుకంటే, కనీసం పేరులోనైనా తంతన్‌పాల్‌కు ఘనత లేదని. కాని, నిజానికి జాలిపడవలసింది తంతన్‌పాల్‌ను చూచికాదు, తొలి ముగ్గురిని గురించే. తమ పేరువిన్న ప్రతిసారి - మాటలకు అర్థం తెలిసినవారైతే, సుతిమెత్తని మనస్సు గలవారైతే - అది కేవల మొక వెక్కిరింతగానో, వెటకారంగానో వారిని బాధపెట్టి తీరుతుంది.

*

# దాహం

"ఏనుగుదాహానికి చూరునీళ్ళా?". కాని, కీన్యా ఏనుగులకు ఈమధ్య చూరునీళ్ళు కూడా కరవైపోయినట్టు పత్రికల ద్వారా వింటున్నాను. ఆ తూర్పు ఆఫ్రికా రాజ్యంలో ఈ యేడు వానలు బహుతక్కువట. అక్కడి అడవులపై మరీ చినుకైనా రాలలేదట. మనకు తెలిసిన సంగతే కదండీ! - వానదేవుడు చెడ్డ తిక్కమనిషి. రమ్మన్న చోటుకు రమ్మన్నప్పుడు రాడు; పొమ్మన్నచోటనుంచి పొమ్మన్నప్పుడు పోడు. 'వద్దు మొర్రో!' అనేవారివెంట విడవకుండా పడతాడు; 'కాస్త తొంగైనా చూడరాదటయ్యా, స్వామీ! - నీకు పప్పుబెల్లం పెడతాము.'అని మొత్తుకునేవారిపై తెంపులేని కక్ష కడతాడు. పల్లెటూళ్ళను, పంటచేలను విడ దొక్కుకు వెళ్ళి కొండలు, మిట్టలు యెక్కికూర్చుంటాడు. చెరువులు, దొరువులు నించడానికి మారుగా అడవులపైనో, సముద్రాలపైనో దయచూపుతాడు. ఒక్కొక్క నాడు "నా ప్రతాపం చూపబోతున్నాను - కాచుకోండి" అంటూ తన మబ్బుల సైన్యాలను సమీకరిస్తాడు. చిన్న మబ్బులు, పెద్ద మబ్బులు, లేత మబ్బులు, కారుమబ్బులు, మిసిమిసిలాడే మబ్బులు, బుసబుసపొంగే మబ్బులు, తృళ్లింతలాడే మబ్బులు, తళతళ మెరిసే మబ్బులు - లెక్కలేనన్ని అక్షౌహిణుల సైన్యాన్ని నిలుపుతాడు. ఒక్కొక్క మెరపుతో ఒక్కొక్క "అంత్యసందేశ" మిస్తాడు. "ఉత్తుత్తి బెదిరింపులు కావు సుమీ!" అని హడలగొట్టడానికి గాలిలోకి పిడుగు ఫిరంగులు

వదలుతాడు. ఇంత ఆర్భాటం చేసినవెనక చల్లగా డేరా పీక్కుని కాలికొద్ది పారిపోతాడు. మరొక్కనాడు చడీ చప్పుడు కాకుండా దొంగపోటుగా వచ్చి దబాటుదెబ్బ తీసిపోతాడు. మరీ తిక్కతిరిగితే కుండ పోతపోసి, ఊరూనాడూ ఏకం చేసిపోతాడు. అదీ, ఇదీ కాకపోతే, వడగళ్ళతో తల బొప్పి కట్టిస్తాడు. వానదేవుడు ఇంత చపలచిత్తుడు కాబట్టే 'వాన రాకడ, ప్రాణం పోకడ తెలియ'దన్నారు. చపలచిత్తునికి నీతి నియమం ఏమి వుంటాయి కనుక! మామూలుగా తాను తరచుకాం పెట్టే కీన్యాఅడవులపై ఈ సంవత్సరం బొత్తిగా శీతకన్ను వేసినట్టున్నాడు. దానితో అక్కడి ఏనుగులకు గొంతు తడుపుకోడానికైనా గుక్కెడునీళ్ళు పుట్టకుండా పోయాయట. దాహానికి తాళలేక తమ నెలవులను వదలి అవి మందలుగా మందలుగా నదీనదాలవైపు, జనపదాలవైపు యెగబడుతున్నాయట.

అసలే అడవి ఏనుగులు. పైగా దప్పిగొని వెర్రిగంగుర్లు యెత్తివున్నట్టివి. అవి ఊళ్ళపైకి వచ్చిపడితే ఇళ్ళూ వాకిళ్ళూ విడిచిపెట్టి "బ్రతుకుజీవుడా!" అంటూ ఆబాల గోపాలం పిక్కబలం చూపవలసిందే. ఈ ప్రమాదాన్ని పాటించే జనవాటికల దిశగా మరలుతున్న హస్తితండా లన్నింటిని కాల్చివేయవలసిందిగా కీన్యా ప్రభుత్వం ఉత్తరువు జారీ చేసిందట. అప్పుడే ఒకచోట పదకొండింటిని కాల్చివేశారట కూడా. ఇట్టి ముప్పే చంద్రగుప్త మౌర్య సామ్రాజ్యాన్ని ఎదుర్కొంటే ఇట్టి చర్యనే గైకొని వుండేవారా? ఏమో, నాకు సందేహమే. "ఏనుగును చంపినవారికి మరణదండన విధించాలి" అని కౌటిల్యుని అర్థశాస్త్రం శాసిస్తున్నది. ఏనుగు ప్రాణానికి ఆ కాలంలో ఇంత విలువ నివ్వడానికి కారణ మేమని మనం వెతుక్కో నక్కరలేదు. అర్థశాస్త్రంలో ఏనుగులను గురించి ఒక పూర్తి ప్రకరణానికి ప్రకరణమే కాక, కనీసం మరి మూడుచోట్ల వాటి ప్రసక్తి విస్తృతంగా వున్నది. శత్రువ్యూహాలను చిందరవందర చేయడానికేమి, అరిదుర్గాలను, ఇతర రక్షణ శ్రేణులను నుగ్గునుగ్గు చేయడానికేమి ఏనుగులకు చాలినవి లేవని కౌటిల్యుడు వ్రాశాడు. చతురంగ బలాలలో ఒక భాగ మైనప్పటికీ రణరంగంలో రాజుల జయాపజయాలను ముఖ్యంగా నిర్ణయించేది గజబలమేనని చెప్పాడు ఇందువల్లనే ఏనుగును పొట్టబెట్టుకున్నవాడిని ప్రాణాలతో విడవరాదన్నాడు. నాటి యుద్ధతంత్రం దృష్ట్యా దీన్ని తీవ్రశిక్ష అనలేము. టాంకును ధ్వంసం చేసినవాడికి ఈనాడు సామాన్యపుశిక్ష వేస్తారా? ఈ కాలానికి టాంకు లెంతో, గత కాలానికి ఏనుగు లంతే. కాబట్టి వాటిని ఎలా పట్టుకోవాలి, ఎలా మచ్చిక చేసుకోవాలి, ఎలా మేపాలి, వాటి జాతులేవి, ఏ జాతి ఏ పనికి ఉపయోగం - ఒక్కటేమిటి? - వాటిని గురించిన సమస్తం అర్థశాస్త్రాన్ని పోలిన రాజనీతి గ్రంధంలోకి ఎక్కిపోయింది.

ఆఖరికి వాటిలద్దెల మాటకూడా దానిలో వున్నది. అడవిలో ఏనుగుల జాడ కనిపెట్టాలంటే, వాటిలద్దెలకోసం చూడాలట. రాజ్యాలు నిలవడం, చితికిపోవడం కుంజరయూథాలపై ఇంతగా ఆధారపడిందని నమ్మినవాడు కావడంచేత, దప్పిగొన్న ఏనుగులు ఊళ్ళపై పడితే కౌటిల్యుడు బహుశా ఊళ్ళను ఖాళీ చేయించేవాడు; కొంతమంది చచ్చినాసరే, నూతుల నుంచి నీళ్ళు తోడించి, తొట్లను నింపించి, వాటివద్ద మూగినవాటిలో వీలైనన్ని వేదండాలను పట్టించి కోటలోని చతురానికి (గజశాలకు) తోలించేవాడు.

క్రీస్తుశకానికి పూర్వం మౌర్యసామ్రాజ్య మహామంత్రి కౌటిల్యుడే కాదు, క్రీస్తు శకం పదహారవ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యం మహామాత్యుడు తిమ్మరుసు కూడా బహుశా ఇంతే చేసేవాడు. చంద్రగుప్తమౌర్యుడు రాజ్యానికి రావడానికి ముందే గజబలం కారణంగా అలెగ్జాండర్‌పై యుద్ధంలో పోరస్ (పురుషోత్తమ్) దెబ్బతిన్నా అశ్వారూఢులైన గ్రీక్ ధనుర్ధారుల ధాకకు తాళలేక, పోరస్ సేనల మొగదల వున్న ఏనుగులు చెల్లాచెదరై తమవారినే నుగ్గునుగ్గుగా తొక్కివేశాయి - మన రాజులు ఇటీవలి వరకు పోరులో గెలుపుకు ఏనుగుపై ఏనుగంత ఆశ పెట్టుకునేవారు. హంపీ, విజయనగరం శిధిలాలలో ఇప్పటికీ చెక్కుచెదరకుండా కొట్టవచ్చినట్టు మిగిలివున్నట్టిది ఏనుగుల శాలే.

యుద్ధతంత్రందృష్ట్యా పూర్వపు ప్రాధాన్యాన్ని పూర్తిగా కోల్పోయినందునే కీన్యా ఏనుగులకు ఈనాడు, దప్పితో కాకపోతే తుపాకి గుండుతో చావవలసిన దుర్గతి పట్టింది. అసలు ఏనుగును చూస్తేనే నాకు జాలి ఇంత శరీరాన్ని - పాపం ! - వీరు ఎలా మోస్తారని స్థూలకాయు లందరిపై వుండే జాలే నాకు మత్తేభంపట్లకూడా వున్నది. అది పెంపుడు ఏనుగైతే, "కొండంత ఈ ప్రాణి వేలెడు మావటీడుకు లోకువైపోయింది" అని మరింత జాలి కలుగుతుంది. ఇక అంతప్రాణి గుక్కెడు నీళ్ళు లేక గిజగిజ లాడిపోతున్న దంటే, 'అయ్యో' అనిపిస్తున్నది. 'కాలుట' వ్యుత్పత్తి గాగల 'దాహము', 'దప్పిక'కు పర్యాయపదం కావడం నిర్నిమిత్తంగా జరగలేదు. కీలుకీలును, నరనరాన్ని, అణువణువును దహించి వెయ్యి గలిగిందే దప్పిక బాధ. అనుభవించినవారికి తప్ప దాని తీవ్రత తెలియదు. అది నాకు ఒకసారి అనుభవమైంది నా చిన్నతనంలో, జతపిల్లలు అయిదారుగురితో చేరి ఒక వేసవిలో మా ఊరు పంటకాల్వగట్టుకు - ఆ కాల్వ పేరు కొత్తకోడు సీమ చింతకాయలకోసం బయల్దేరాను. ఊరు దరిదాపులలో సీమచింతలు లేవు. ఒకటి, రెండు వున్నప్పటికి దానికి కాయలు లేవు. అందువల్ల కాల్వగట్టు పుచ్చుకుని

చాలాదూరం నడిచి వెళ్ళాము. హీనపక్షం రెండు పొలిమేరలను దాటినట్టుగుర్తు. కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళగా వెళ్ళగా విరగకాసివున్న కొన్ని చెట్లు కనిపించాయి. వాటిని చూడగానే మా లేతకాళ్ళు నొప్పులన్నీ ఎగిరిపోయాయి; మా ముఖాలు చేటంత అయ్యాయి. సంబరంకొద్దీ మాలో కొందరు చప్పట్లు చరుస్తూ గెంతారు. బాగా ముగ్గి, పొట్ట అరవిచ్చిన సీమచింతకాయలు కొమ్మకొమ్మకు, రెమ్మరెమ్మకు గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. కొన్ని నెలవంకలవంటి కాయలు కాగా, మరికొన్ని చక్కాలావలె మెలికలు తిరిగినవి. తెల్లతెల్లని యెర్రయెర్రని పప్పులనుంచి, ఎబడీ కనబడకుండా నల్లని గింజలు తొంగిచూస్తూ మాకు గిలిగింతలు వెడు తున్నాయి. అయితే, పంటకాల్వగట్టుపై యేపుగా వెరిగివున్న చెట్లేమో వాటి నెక్కడం మా పసిప్రాణాలకు కష్టమైంది. అయినా, మేము పట్టువిడవలేదు. ఇద్దరిని దిగవిడిచి, వాళ్ళచే కాళ్ళకు మెట్లు పెట్టించుకుని ఎలాగో పైకెగబ్రాకి పోయాము. ముళ్ళమేళమైనా సరకు చెయ్యకుండా, చిటారు కొమ్మలవరకు పాకి, కంటికి నదరుగా కనబడిన కాయలన్నీ కోసి కడుపునిండుగా తింటూ, కిందివా రిద్దరినీ ఊరిస్తూ, ఉడికిలిస్తూ, బతిమాలించుకుని వాళ్లకూ మంచిమంచివాటిని జారవిడుస్తూ పోయాము. ఎక్కాతక్కీగా తిన్నా ఇంకా ఆశ తీరక చొక్కాజేబు లను, పంట్లాం జేబులను కాయలతో బిర్రుగా నించుకుని మేము యింటిముఖం పట్టేసరికి మిడసరి లగ్నమైంది. ఎర్రనియెండ కాస్తున్నది. పడమటికాలి నిప్పులు చెరుగుతున్నది. సీమచింతకాయలు వగరుగా వుంటాయేమో, వాటిని మితిలేకుండా తిన్న మా గొంతులు పొడి ఆరినవి. మే మున్నది కాల్వగట్టుపైనే కాని, కాల్వలో నీళ్ళచుక్క లేదు. వెళ్ళిన దారినే తిరిగివస్తే, దారిలోనైనా కాసిని నీళ్ళు దొరికేవి. పైగా, నీడపట్టున నడిచేవాళ్ళం. కాని, డొంకను పడితే తక్కువ దూరమేనని దాని వెంట బయల్దేరాము. సగందూరం వచ్చేసరికి నా నాలుక పిడచకట్టు కుపోయింది. ముక్కుముఖం వెంట వేడిపొగలు వెడుతున్నట్టు అనిపించింది. దూరాన కానవస్తున్న ఎండమావులు తప్ప తాగి, వొళ్ళు తప్పి, మరీ వివరీతంగా గంతులు, చిందులు వేస్తున్నట్టు అనిపించింది. నే నెలా నడుస్తున్నానో నాకే తెలియలేదు. మరి కాస్తదూరం సాగారేసరికి నాలుక పీక్కుపోతున్నట్టు అనిపిం చింది, శరీరమే తడి ఆరిపోతున్నట్టు తోచింది, నరనరం పీకివెయ్యసాగింది, కళ్ళు బైర్లు కమ్ముకుపోయాయి, కాళ్ళు తడబడి తూలిపడబోయాను. నేను జావకా రడం, గుడ్లు తేలవెయ్యడం చూచి నా జతవాళ్ళు నా రెక్కలు తమ భుజాలపై వేసుకునిసగం మోస్తూ,సగంఈడుస్తూగబగబాఊరుదరిదాపులకుచేర్చారు.అక్క డొక ఆసామి తాంబేటి బుర్రలోనుంచి ఇన్ని చల్లని నీళ్ళు నా గొంతులో పోయించారు.

అప్పుడు ఆ పుణ్యాత్ముడు యెదురై వుండకపోతే, ఇప్పుడు నేను ఈ వ్యాసాన్ని వ్రాస్తుండేవాణ్ణికాను!

ముప్పై యేళ్ళపైమాట కాబట్టి దప్పిక బాధను నేను సరిగా వర్ణించి వుండక పోవచ్చు. కాని, అది పగవాడికైనా కూడనిదని మాత్రం గట్టిగా చెప్పగలను. క్షుత్తునైనా సహించవచ్చుగాని తృష్ణను కాదు. వరసగా మూడు రోజులు ఉపవసించిన నా అనుభవంలో మొదటి నలభై యెనిమిది గంటలతర్వాతే మరీ బాధగా వుంటుంది. దాన్ని తట్టుకుంటే మూడవనాటికి చెడ్డ నీరసంతప్ప వేరే పెద్దబాధ ఏదీ వుండదు. జెయిల్‌లో దాదాపు రెండునెలలు నిరాహారదీక్ష సాగించిన నా మిత్రు డొకడు అయిదవ రోజునో, ఆరవ రోజునో తిరిగి ప్రాణాలు తోడివేస్తున్న ట్టుగా వుంటుందని, ఆ పిదప బలవంతగా ఆహారాన్ని యెక్కించడానికి జెయిల్ అధికారులు పెట్టేవే ఎక్కువ బాధలని చెప్పినట్టు జ్ఞాపకం. ఏమైనా, దప్పికబా ధకు ఇట్టి ఆటుపోటులు లేవు. ఒకసారి ప్రారంభించిన తర్వాత క్షణక్షణం అది తీవ్రతరమైపోతుంది. ఏపాటి తీవ్రత తోనో తెలియదుకాని శ్రీనాథుడు దప్పిక బాధను చవిచూచినవాడే. ఇందుకు తార్కాణం--

సిరిగలవానికి జెల్లును
తరుణుల బదియారువేల దగ బెండ్లాడన్
తిరివెమున కిద్దరాండ్రా?
పరమేశా! గంగ విడుము, పార్వతి చాలున్

అని ఆయన చెప్పిన చాటువే.

దాహం ఎంత దుస్సహ మైనదైనా, అంతకంటెకూడా బాధాకరమైనవి ధన, కీర్తి, అధికారాది దాహాలు. మొదటిది శరీరానికే చిచ్చుపెట్టగా, తక్కిన ఈ దాహాలు అంగాంగంతో పాటు మనస్సుకు, ఆత్మకుకూడా అగ్గిపెట్టివేస్తాయి. ఈ దాహపీడితులైనవారు ఆడని అబద్ధం, వేయని నింద, చెయ్యని దుష్కృత్యం, పాల్పడని నైచ్యం, వొడికట్టిని పాపం, ఆర్పని కొంప వుండవనే చెప్పవచ్చు. డబ్బు దప్పిక పుట్టినవాడికి ఇతరుల ప్రాణాలు దుబ్బు చెయ్యవు. "ఆకలికి చస్తున్నాము, బాబయ్య!" అని సాగిలబడినా, "నా వడ్లు బస్తాపై నే నడిగిన ధర పెడితేనే దాన్ని కదలనియ్యడం" అని అతడు మొండి కెత్తుతాడు. ఇవ్వాళ నలుగు రైదు గురు చస్తే, రేపటికి మరింత ధర పలకవచ్చునని ఆగినా ఆగుతాడు. -"నా బిడ్డ ప్రాణం పోతున్నది – మందు కావాలి, బాబూ!"అనికాళ్ళావేళ్ళా పడినా, తాను

కోరిన వెచ్చుధర చెల్లించి తీరాలంటాడు. "నీ కడుపున పుడతాను-నాకొంపలో దీపం నిలుపు" అని వేడుకుంటే "పుట్టక పుట్టక నువ్వే పుట్టాల! పోపో!!" అని విదిలించివేస్తాడు. "శవంమీద కప్పే గుడ్డ పైనా లాభాలు తీస్తావటయ్యా!" అని దుఃఖంలో వున్నవా డెవడైనా ముఖాన అనివేస్తే "వెళ్ళే పీనుగులు తక్కువా?-నువ్వు కాకపోతే నీ అబ్బగాడు వచ్చి కొంటాడు" అని దయమాలి అంటాడు. ధన మోహపీడితునికి సిగ్గుయెగ్గులుకూడా వుండవు. ఒక కాసు కలిసివచ్చేచోట ముఖాన ఉమ్మివేసినా తుడుచుకుంటాడు సరిగదా, "హిహి" అంటూ పళ్ళు యికిలిస్తాడు. "నా గడప తొక్కవద్దు" అని గెంటివేస్తే మర్నాటికే మళ్ళీ తోకాడించుకుంటూ వస్తాడు. లోకులమాట అటుంచి, ఆలుబిడ్డలను సయితం అన్యాయం చేయడా నికి సంకోచించడు. నక్క, తోడేలు, గాడిద , రాబందు - ఈ నాల్గింటి సాంకర్యాన్ని ధనతృష్ణాపీడితునిలో చూడవచ్చు.

ఇంతకంటెకూడా చెడ్డవి కీర్తి, అధికారదాహాలు. మానవ చరిత్ర పుటలను మలినం చేస్తున్న నెత్తురు మాసికలలో ముప్పాతికకు ఇవే మూలం. మొదలుకొని హిట్లర్ వరకు ప్రతి లోకకంటకుని విజృంభణ, నవి కీర్తి, అధికారదాహాలే. శమింపజేసినకొద్ది ఈ తృష్ణల నాటికి తెలిసిన ప్రపంచంలో సగాన్ని పదమూడేళ్ళలో నిండీ నిండకముందే - జయించగలిగినా అలెగ్జాండర్ త్రను విరమించి సట్లెజ్ నదీతీరంనుంచి అ కాదు; మరి ఒక్క అడుగైనా ముందుక రించి నందునే. తీరని తమ తృష్ణకో పచ్చతోరణంగా వుండే ప్రాంతాలను నిండుప్రాణాలనైనా నిలువునా తి

పరిపాలిస్తున్నాడు.

తృష్ణలలో నింద్యం కానిది ఏదంటే, నాకు చప్పన తోస్తున్న దొక్కటే. అది-జ్ఞానతృష్ణ.

*

ఇతరులు
లిగినా,
ఆ రాజు

AOUA 102B124

ప్రతులకు :

న్యూ స్టూడెంట్ బుక్ సెంటర్
ఏలూరురోడ్, విజయవాడ -520 002

రూ. 15/-

## మువ్వ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనావలోకన

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA102B124 |
| పుస్తకం పేరు | కొత్త పాత |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 235 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాకీ పేజీలు | 1, RCJ, 16, ND |
| లేని పేజీలు | |
| తయారు చేసినది | M. Raji. |
| పేజీలు విడదీసినది | M. Raji. |
| స్కాన్ చేసినది | |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |